
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 126

శనివారం 21-1-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




తగ్గేదేలే..!

ధర్నా కొనసాగిస్తున్న రెజ్లర్లు..ఏడుగురు సభ్యులతో ఐవోఏ విచారణ కమిటీ - 13లో



12 వేల ఉద్యోగాలు కట్

గూగుల్ ఉద్యోగులకు సంస్థ సీఈవో సుందర్‌పిచాయ్ ఈ మెయిల్ - 13లో



అలా ఆదేశాలివ్వలేం

కులగణన చేపట్టాలంటూ బిహార్‌లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

వివరాలు 6లో ▸



ఎయిరిండియాకు ఫైన్

విమానంలో మూత్ర విసర్జన ఘటనపై ఎయిరిండియా సంస్థకు డీజీసీఏ రూ.30 లక్షల జరిమానా విధించింది.

వివరాలు 6లో ▸



బీజేపీలో రాకుంటే బుల్డోజర్

'బీజేపీలోకి వచ్చేయండి. లేకపోతే సీఎం రూపంలో ఉండే బుల్డోజర్‌ను ఎదుర్కోవాలి' అని మధ్యప్రదేశ్ మంత్రి సిసోడియా అన్నారు.

వివరాలు 6లో ▸



మోదీకి సునాక్ మద్దతు

గోద్రా అల్లర్లకు మోదీనే ప్రధాన బాధ్యుడని బీబీసీ ప్రసారం చేసిన డాక్యుమెంటరీపై మోదీకి బ్రిటన్ ప్రధాని రిషి మద్దతు పలికారు.

వివరాలు 6లో ▸

ధైర్యాన్నిస్తున్న ధాన్యం

ధాన్యం సేకరణలో ఫలిస్తున్న విప్లవాత్మక మార్పులు

తొలిసారిగా రైతులకు దక్కుతున్న సంపూర్ణ మద్దతు ధర

- మిల్లర్లు, దళారులకు తావు లేకుండా రైతుల నుంచే కొనుగోళ్లు
- గోనె సంచులు, కూలీ, రవాణా చార్జీల బెడద కూడా రైతుకు లేదు
- ఇప్పటికే 4.84 లక్షల మంది రైతుల నుంచి 26.91 లక్షల టన్నుల సేకరణ
- 3,725 ఆర్బీకేల్లో 5వేల మందికి పైగా సేకరణలో భాగస్వామ్యం
- 87 శాతం మందికిపైగా రైతుల ఖాతాల్లో ఇప్పటికే నగదు జమ
- ఇబ్బందులు పెట్టే మిల్లర్లపైనా ప్రభుత్వం కన్నెర్ర; చర్యలు
- రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తుండటంతో దిక్కుతోచని విపక్షాలు
- అక్కడక్కడా టీడీపీ కార్యకర్తలను పెట్టి 'ఈనాడు' దుష్ప్రచారం
- కొనుగోలు కేంద్రాలు మూసేస్తున్నారంటూ రాతలు
- ఎక్కడా కొనుగోలు కేంద్రాలు మూయట్లేదు: పౌరసరఫరాల శాఖ ఎండీ



సాక్షి, అమరావతి: గత ప్రభుత్వం ఐదేళ్లలో సేకరించిన ధాన్యం కన్నా ఎక్కువ మొత్తాన్ని ఈ ప్రభుత్వం మూడున్నరేళ్లలోనే సేకరించింది. అప్పట్లో 2014 నుంచి 2019 వరకు రూ.40,236 కోట్లు వెచ్చించి 2.65 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తే... రైతులకు వేలుపట్టి నడిపించటం తన ప్రధాన బాధ్యతగా భావిస్తున్న వై.ఎస్.జగన్ సర్కారు ఈ మూడున్నరేళ్లలోనే ఏకంగా రూ.54,279 కోట్లు ఖర్చుచేసి 2.88 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించింది. రైతుల కష్టం దళారుల పాలు కాకూడదన్న లక్ష్యంతో ఏకంగా 3,725 రైతు భరోసా కేంద్రాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నేరుగా రైతుల నుంచే ధాన్యం కొంటోంది సర్కారు. చెప్పిన గడువు ప్రకారం వాళ్లకు చెల్లింపులు సైతం జరిగిపోతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఐదారు లక్షల మంది రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్నపుడు.. 3,725 ఆర్బీకేల్లో కొనుగోళ్లు జరుగుతున్నపుడు.. ఎక్కడో ఒకరో ఇద్దరో రైతులకు ఇబ్బందులు ఎదురయ్యి ఉండొచ్చు. అయితే ఇన్ని లక్షల మందికి మేలు జరుగుతున్న విషయాన్ని పక్కన బెట్టి.. ఆ ఒకటి రెండు ఘటనలను చూపుతూ ప్రతిపక్షాలు, వాళ్ల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న ఓ వర్గం మీడియా మొత్తం ధాన్యం సేకరణ ప్రక్రియనే తప్పుబడుతోంది. ఆ ఒకటి రెండు ఘటనల్ని మాత్రమే పతాక శీర్షికల్లో ప్రచురిస్తూ దుష్ప్రచారానికి దిగుతుండటంపై రాష్ట్ర రైతాంగం

మిగతా 2వ పేజీలో ▶

ఆ సంఘం గుర్తింపు రద్దు చేయాలి

- నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి గుర్తింపు
- ఉద్యోగుల్లో అయోమయం సృష్టించేందుకే గవర్నర్‌ను కలిశారు
- ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు ధ్వజం
- అది పబ్లిసిటీ స్టంట్: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి
- ప్రభుత్వాన్ని బెదిరిద్దామనుకుంటే కుదరదు.. చర్చలకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధం: మంత్రి బొత్స



సాక్షి, అమరావతి : ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుర్తింపును రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరతామని ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు చెప్పారు. త్వరలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రం ఇస్తామన్నారు. విజయవాడలోని ఎన్జీఓ భవన్‌లో శుక్రవారం ఆయన సంఘం ప్రధాన కార్యదర్శి శివారెడ్డి ఇతర నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ఆ సంఘానికి గుర్తింపు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ వల్లే ఉద్యోగులకు కష్టాలు మొదలయ్యాయని

మిగతా 10వ పేజీలో ▶



నిర్దేశిత గడువు లోగా

అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం

నిర్మాణ పనులపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్

- అత్యంత నాణ్యతతో నిర్మాణాలు అందంగా ఉండాలి.. పనుల పర్యవేక్షణకు ఉన్నత స్థాయి కమిటీ
- 125 అడుగుల విగ్రహం, పీఠం కలిపి 206 అడుగుల ఎత్తు
- కన్వెన్షన్ హాలు, కారు, బస్ పార్కింగ్, రోడ్ల సుందరీకరణ
- మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.268 కోట్లు

సాక్షి, అమరావతి: అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అంబేడ్కర్ జయంతి అయిన ఏప్రిల్ 14 నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని చెప్పారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో 125 అడుగుల ఎత్తుండే అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం నిర్మాణ పనుల పురోగతిపై శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. విగ్రహం తయారీ, దాని చుట్టూ సివిల్ వర్క్స్, సుందరీకరణ, మైదానాన్ని ప్రధాన రహదారితో

మిగతా 2వ పేజీలో ▶



సచివాలయాల్లోనే 'స్థానికత' సర్టిఫికెట్లు


- శుక్రవారం నుంచి ప్రారంభం
- తెలంగాణ నుంచి రాష్ట్రానికి నివాసం మార్చుకున్న వారికి స్థానికత సర్టిఫికెట్లు జారీ
- ఈ సర్టిఫికెట్ల జారీకి 2024 జూన్ 1 వరకు గడువు పొడిగించిన ప్రభుత్వం
- దరఖాస్తు చేసిన వారం రోజుల్లో సర్టిఫికెట్

10 లో

మే మొదటి వారంలో పది ఫలితాలు!

పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 18 వరకు..

- ప్రశ్నపత్రాల మూల్యాంకనం అదే నెల 19 నుంచి 26 వరకు
- ఒకే విడతలో ముగించేలా చర్యలు
- ఏజెన్సీ జిల్లాలు మినహా కొత్త జిల్లాల్లోనూ మూల్యాంకన కేంద్రాలు
- ఈ ఏడాది కూడా ఆరు పేపర్లలోనే పరీక్షలు
- భౌతిక, రసాయన శాస్త్రాలు, జీవశాస్త్రానికి కలిపి ఒకే పేపర్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను సజావుగా ముగించడంతోపాటు ఫలితాలను కూడా సాధ్యమైనంత త్వరగా విడుదల చేసేందుకు విద్యా శాఖ కార్యాచరణ చేపట్టింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 26 నాటికి మూల్యాంకనాన్ని ముగించడానికి ఏర్పాట్లు చేస్తోంది. మే మొదటి వారానికల్లా ఫలితాలను విడుదల చేయాలనే కృతనిశ్చయంతో ఉంది. పదో తరగతి తర్వాత విద్యార్థులు పై తరగతుల్లోకి వెళ్లేందుకు ఆలస్యం కాకుండా ఫలితాలను వీలైనంత త్వరగా విడుదల చేయడానికి ఏర్పాట్లు చేపట్టింది.

ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పరీక్షలు..

పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ఏప్రిల్ 3 నుంచి 18 వరకు నిర్వహించనున్నారు. గతంలో 11 పేపర్లుగా ఈ పరీక్షలను నిర్వహించేవారు. కరోనా సమయంలో వీటిని ఏడింటికి తగ్గించారు. 2021-22లో సైన్స్ సబ్జెక్టులోని భౌతిక, రసాయన శాస్త్రాలు (పీఎస్), జీవశాస్త్రం (ఎన్ఎస్)లకు వేర్వేరుగా కాకుండా ఒకే పేపర్, ఒకే పరీక్షగా మార్పు చేశారు. దీంతో పదో తరగతిలో పబ్లిక్ పరీక్షల పేపర్ల సంఖ్య ఆరుకు తగ్గింది. ఈ ఏడాది (2022-23) కూడా ఆరు పేపర్లలోనే పరీక్షలు నిర్వహించనున్నారు. అయితే సైన్స్ సబ్జెక్టులో పీఎస్, ఎన్ఎస్ పేపర్‌ను రెండు భాగాలుగా విభజించి ఇస్తారు. రెండు బుక్‌లెట్లలో వీటికి సమాధానాలు రాయాలి. ముందుగా భౌతిక, రసాయన శాస్త్రాల ప్రశ్నలకు సమాధానాలు

మిగతా 14వ పేజీలో ▶



సముద్ర జలాల్లో 'జీన్స్' కాలుష్యం

- ఫ్యాషన్ ప్రపంచంలో ఈ దుస్తులకున్న క్రేజే వేరు
- కానీ, అదే ఇప్పుడు పర్యావరణ హానికి కారణమవుతోంది
- ఒక జత జీన్స్ తయారీకి 7,500 లీటర్ల నీరు వినియోగం
- ఇది సగటున ఒక వ్యక్తి ఏడేళ్లు తాగే నీటికి సమానం
- ఏటా 93 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని వినియోగిస్తున్న ఫ్యాషన్ పరిశ్రమ
- ఈ నీటితో ఐదు లక్షల మంది జీవితకాల దాహార్తిని తీర్చవచ్చు
- విమాన, సముద్ర రవాణాతో వెలువడే ఉద్గారాల కంటే ఫ్యాషన్ పరిశ్రమ కాలుష్యమే ఎక్కువ

2 లో

పేద గుండెకు పునర్జన్మ

విశాఖలో బ్రెయిన్ డెడ్ అయిన మహిళ గుండె ఓ బాలుడికి దానం

- ప్రత్యేక విమానంలో హుటాహుటిన గ్రీన్‌ఛానెల్ ద్వారా తిరుపతికి తరలింపు
- టీటీడీ శ్రీ పద్మావతి చిన్నపిల్లల గుండె చికిత్సాలయంలో విజయవంతంగా తొలి గుండెమార్పిడి శస్త్రచికిత్స
- ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి ఉచితంగా ఆపరేషన్

10 లో



రేణిగుంట విమానాశ్రయం నుంచి శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్‌కు గుండె తీసుకొస్తున్న అంబులెన్స్


■ జీవితాంతం కన్నబిడ్డల బాగోగుల కోసం పరితపించిన ఆ తల్లి 'హృదయం' తన చివరి క్షణాల్లో మరో పేద బిడ్డను బతికించేందుకు రెక్కలు కట్టుకుని వాలింది. ఎక్కడ విశాఖపట్నం.. ఎక్కడ తిరుపతి.. ఏకంగా 607 కి.మీ.. విమానంలో గమ్యాన్ని చేరుకుంది. ఆ తల్లి కుటుంబ సభ్యులతో పాటు డాక్టర్లు, వైద్య సిబ్బంది, పోలీసులు, వైమానిక సిబ్బంది, నగర పౌరులు.. ఇలా ప్రతి ఒక్కరూ ఆ మాతృమూర్తి గుండె తరలింపులో సహకరించి మానవత్వానికి అర్థం చెప్పారు. ఈ కార్యానికి తిరుపతిలోని శ్రీ పద్మావతి చిన్నపిల్లల గుండె చికిత్సాలయం వేదికైంది.

జీవో–1పై 23న హైకోర్టు సీజే విచారించాలి

- ఏపీ హైకోర్టుకు సుప్రీంకోర్టు ఆదేశం
- కేసు మెరిట్స్‌లోకి వెళ్లడంలేదని తెలిపిన సీజేఐ ధర్మాసనం.. ఏపీ తరఫున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వాదనలు
- తనకు లేని పరిధిలో హైకోర్టు వెకేషన్ బెంచ్ తీర్పు చెప్పింది
- ప్రతివాదుల వాదనలు వినకుండానే కేసు మెన్షన్ చేసిన రోజే తీర్పిచ్చేసినట్లు వెల్లడి.. ఏపీ వాదనను రికార్డు చేసిన సుప్రీం కోర్టు ధర్మాసనం

10 లో

ఇదండీ సంగతి



నిజమే..! అంత సెన్సిటివ్‌గా ఉంటే పాలిటిక్స్‌కు పనికిరారు!

'ఐటీ' కెరటం విశాఖపట్నం

ఇన్ఫినిటీ సమ్మిట్‌లో కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ప్రశంసలు

పెద్ద ఎత్తున నిపుణులతోపాటు నగరంలో అద్భుతమైన ఎకో సిస్టమ్

న్యూ టెక్నాలజీ గ్లోబల్ లీడర్‌గా భారత్ అడుగులు

విశాఖలో ఘనంగా ప్రారంభమైన ఇన్ఫినిటీ సమ్మిట్ 2023

సాక్షి, విశాఖపట్నం: దిగ్గజ ఐటీ సంస్థలను రప్పించేందుకు విశాఖలో శుక్రవారం ప్రారంభమైన ఇన్ఫినిటీ వైజాగ్ సమ్మిట్ 2023 సదస్సు తొలిరోజు విజయవంతమైంది. ఐటీ, ఐటీ అధారిత రంగాలకు ఉన్న అపార అవకాశాలను అంతర్జాతీయ సంస్థలకు వివరించడంలో అధికారులు, ఐటీ అసోసియేషన్ ప్రతినిధులు సఫలీకృతమయ్యారు. హోటల్ మారియట్‌లో ఇన్ఫినిటీ వైజాగ్ సమ్మిట్‌ను కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి అల్కేష్‌కుమార్‌శర్మ, ఎస్‌టీపీఐ డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్, రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, సెయింట్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఐటాప్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు, ఎంపీ జీవీఎల్ నరసింహరావు సంయుక్తంగా ప్రారంభించారు. తొలి రోజు మైక్రోసాఫ్ట్, సీమెన్స్, జాన్సన్ అండ్ జాన్సన్, సెయింట్, బాష్, టెక్ మహీంద్రా, సైబర్ సెక్యూరిటీ, ఐశాట్ తదితర 60 సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. 12 సంస్థలు స్టాల్స్ ఏర్పాటు చేశాయి. ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు ఎలాంటి సాయం అవసరమైనా కేంద్రం ముందుంటుందని, విస్తరణ దిశగా అడుగులు వేయాలని

మిగతా 10వ పేజీలో ▶



ఇన్ఫినిటీ వైజాగ్ సమ్మిట్-2023ను ప్రారంభిస్తున్న కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి అల్కేష్‌కుమార్ శర్మ, సెయింట్ వ్యవస్థాపక చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఐటాప్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు



వేగవంతమైన అభివృద్ధి ఉపాధిని సృష్టిస్తోంది

- ప్రతిభ, సామర్థ్యమున్న వారినే ఉద్యోగాలకు ఎంపికచేశాం
- మా ప్రభుత్వ పనితీరుకు రోజ్‌గార్ మేళానే నిదర్శనం
- గత ఎనిమిదేళ్లలో మౌలికాభివృద్ధి రంగంలో లక్షల మందికి ఉపాధి
- 71 వేల మందికి నియామక పత్రాలిస్తూ ప్రధాని మోదీ వ్యాఖ్య

6 లో

క్లుప్తంగా...

సీఎం వైఎస్ జగన్‌తో జోయాలుక్కాస్ చైర్మన్ భేటీ



సాక్షి,అమరావతి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ చైర్మన్ అండ్ ఎండీ ఆలుక్కాస్ వర్గీస్ జాయ్ మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఈ భేటీ జరిగింది. రాష్ట్రంలో పెట్టుబడులు, అవకాశాలపై ఇద్దరూ చర్చించుకున్నారు. ఎలాంటి సహాయ సహకారాలు అందించడానికైనా సిద్ధంగా ఉన్నామని సీఎం జగన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికంగా అనుసరిస్తున్న పారదర్శక విధానాలను సీఎం వివరించారు. సుశిక్షితులైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సమావేశంలో జోయాలుక్కాస్ సీవోవో హెన్రీ జార్జ్, రవిశంకర్ గ్రూప్ చైర్మన్ కంది రవిశంకర్ పాల్గొన్నారు.

టీటీడీ ధార్మిక సలహాదారుగా చాగంటి కోటేశ్వరరావు

హెచ్‌డీపీపీ, ఎస్వీబీసీ కార్యనిర్వాహక సమావేశంలో నిర్ణయం



తిరుపతి అలిపిరి : టీటీడీ ధార్మిక కార్యక్రమాల సలహాదారుగా ప్రముఖ ప్రవచనకర్త, పండితుడు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును నియమిస్తూ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహక కమిటీ నిర్ణయం తీసుకుందని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో శుక్రవారం హెచ్‌డీపీపీ, ఎస్వీబీసీ కార్యనిర్వాహక కమిటీ సమావేశాలు జరిగాయి. అనంతరం టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలిసి ఆయా సమావేశాల్లో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలను చైర్మన్ సుబ్బారెడ్డి మీడియాకు వెల్లడించారు. గ్రామీణ యువత భాగస్వామ్యంతో మారుమూల గ్రామాల్లో హిందూ ధర్మ ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రామస్తులకు భజన, కోలాటం సామగ్రి అందించాలని, మానవాళి శ్రేయస్సుకు యాగాలు, హోమాలు నిర్వహించాలని, ఎస్వీబీసీ తెలుగు, తమిళ చానళ్ల తరహాలో కన్నడ, హిందీ చానళ్ల ప్రాచుర్యం పొందేందుకు ప్రత్యేక కార్యక్రమాలను ప్రసారం చేయాలని నిర్ణయించినట్లు వివరించారు.

టీడీపీ నేత చింతకాయల విజయ్‌కు సీఐడీ నోటీసులు



విజయ్ తల్లి పద్మావతికి నోటీసు ఇస్తున్న సీఐడీ పోలీసులు

సాక్షి, అమరావతి/ నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా): సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం కేసులో టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్‌కు సీఐడీ అధికారులు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. ఐటీ చట్టంలోని 41ఏ ప్రకారం జారీ చేసిన ఆ నోటీసుల్లో ఈ నెల 27న మంగళగిరిలోని సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని పేర్కొన్నారు. 'భారతి పే' పేరిట సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన అభియోగాలపై చింతకాయల విజయ్‌పై సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నది. ఆ కేసు దర్యాప్తులో భాగంగా అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని అయ్యన్నపాత్రుని నివాసానికి సీఐడీ అధికారులు శుక్రవారం వెళ్లగా విజయ్ అందుబాటులో లేరు. దాంతో ఆయన తల్లికి నోటీసులు అందించారు. కాగా, ఈ కేసుకు సంబంధించి హైదరాబాద్‌లోని విజయ్ నివాసంలో ఇదివరకే నోటీసు ఇవ్వటం జరిగిందని, విచారణకు రానందున మరోసారి 41 ఏ నోటీసు ఇచ్చామని సీఐడీ పోలీసులు ఈ సందర్భంగా చెప్పారు.

సముద్ర జలాల్లో 'జీన్స్' కాలుష్యం

ఫ్యాషన్ ప్రపంచంలో ఈ దుస్తులకున్న క్రేజే వేరు





సాక్షి, అమరావతి : జీన్స్ పరిశ్రమ కారణంగా మహా సముద్రాలు సైతం కలుషితమవుతున్నాయి. దాదాపు అర మిలియన్ టన్నుల మైక్రోఫైబర్లు (మూడు మిలియన్ బ్యారెళ్ల చమురుకు సమానం) ఏటా సముద్రాల్లోకి చేరుతున్నాయి. ఫలితంగా సాగర జలాలు విషపూరితంగా మారుతున్నాయి. ఇటీవల కాలంలో దుస్తుల్లో ఎక్కువగా వాడుతున్న సింథటిక్ పాలిస్టర్, నైలాన్, యాక్రిలిక్ (పాలిమర్ రంగులు)లను నీటిలో కడగడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇవి నీటిలో కుళ్లి నాశనం అవడానికి 200 ఏళ్లు పడుతుంది. దీనివల్ల జీన్స్‌లోని ప్లాస్టిక్ మైక్రోఫైబర్‌లు సముద్ర జలాలను కప్పేసినట్లు గుర్తించారు. యూఎన్ నివేదికల ప్రకారం ఫ్యాషన్ పరిశ్రమ 20 శాతం కలుషిత నీరు, 10 శాతం కర్బన ఉద్గారాలను ఉత్పత్తి చేస్తోంది. ఇది విమానాలు, సముద్ర రవాణా ద్వారా వెలువడే ఉద్గారాల (గ్రీన్ హౌస్ వాయువులు) కంటే ఎక్కువగా ఉంటోంది. దేశంలోని భారతియార్ విశ్వవిద్యాలయంలో టెక్స్‌టైల్స్, దుస్తుల డిజైన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అముత కరుప్పచామి విశ్లేషణ ప్రకారం.. పత్తిని అధికంగా ఉత్పత్తి చేసే చైనా, భారత్‌తో పాటు, అమెరికాలో కూడా రసాయనాలను విరివిగా వినియోగించడం కూడా నీటి కాలుష్యాన్ని పెంచుతోందని చెబుతున్నారు.

ఒక జత జీన్స్ తయారీకి 7,500 లీటర్ల నీరు

సాధారణంగా.. దుస్తులన్నింటికీ అద్దకం, ఇతర ప్రక్రియల కోసం భారీగా మంచినీటిని ఉపయోగిస్తారు. ప్రతి టన్ను వస్త్రానికి రంగు వేయడానికి దాదాపు 200 టన్నుల మంచినీరు అవసరం. ఇందులో ఒక జత బ్లూజీన్స్ తయారీకి 7,500 లీటర్ల నీటిని వినియోగిస్తున్నారు. ఇది సగటు వ్యక్తికి ఏడేళ్లపాటు అవసరమయ్యే తాగునీటితో సమానం. అలాగే, యూఎన్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రకారం ఫ్యాషన్ పరిశ్రమ ఏటా 93 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని ఉపయోగిస్తుంది. ఈ నీటితో ఐదు లక్షల మంది జీవితకాల దాహార్తిని తీర్చవచ్చు. మరోవైపు.. దుస్తుల వినియోగంలోనూ మానవుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది.

కొద్దికాలానికే వాడిపడేస్తూ..:

ప్రపంచవ్యాప్తంగా ఒక ఏడాదిలో 5,300 మిలియన్ టన్నుల నూలు తయారవుతోంది. దీంతో ఏటా 80 బిలియన్ల కొత్త దుస్తులు ఉత్పత్తి అవుతున్నాయి. అయితే యూఎన్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ భాగస్వామి అయిన ఎల్లెన్ మకార్తుర్ ఫౌండేషన్ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి సెకనుకు ఒక ట్రక్కులోడు వస్త్రాలను చెత్తలో పడేస్తున్నారు లేదా కాల్చేస్తున్నారు. నిపుణుల అంచనా ప్రకారం గడిచిన దశాబ్దంలో దుస్తుల ఉత్పత్తి రెట్టింపు అయింది. కానీ, వీటిలో 70 శాతం దుస్తులను ప్రజలు కొద్దిరోజులకే వాడిపడేస్తున్నారు. సగటున పాశ్చాత్య దేశాల్లో ఏడుసార్లు మాత్రమే ధరించి పడేస్తున్నారు. అదే ఇక్కడ ఒక కుటుంబం ఏటా 30 కిలోల దుస్తులను పడేస్తోంది. కొలరాడో పరిశోధన విశ్వవిద్యాలయం ప్రకారం.. కేవలం 15 శాతం దుస్తులను మాత్రమే రీసైకిల్ లేదా విరాళంగా అందిస్తున్నారు. ఇది మరింతగా పెరిగితే ఫ్యాషన్ పరిశ్రమ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

స్లో అండ్ సస్టైనబుల్ ఫ్యాషన్..

కోవిడ్-19 తర్వాత ప్రజల దృక్పథంలో మార్పు వస్తోంది. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఫ్యాషన్ పరిశ్రమ స్లో అండ్ సస్టైనబుల్ ఫ్యాషన్ ట్రెండ్ వైపు మళ్లుతోంది. ఇటువంటి సస్టైనబుల్ బ్రాండ్లు డజన్ల కొద్దీ మార్కెట్‌లోకి వచ్చాయి. ఇవి బట్టల తయారీకి ఆర్గానిక్ మెటీరియల్స్‌ను ఉపయోగిస్తున్నాయి. అయితే, ఇవి ఖరీదైనవిగా ఉన్నాయి. ఇందులో దుస్తులకు ఆర్గానిక్ రంగులనే వాడుతున్నారు. ప్రజల్లోనూ రీసైక్లింగ్ క్రేజ్ క్రమంగా పెరుగుతోంది. దుస్తుల్ని వివిధ దశల్లో చాలాసార్లు ఉపయోగించేలా అవగాహన వస్తోంది.

ఫ్యాషన్ ప్రపంచంలో 'జీన్స్'కు ఉన్న క్రేజే వేరు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ వీటిని ధరించడానికి ఎంతో ఇష్టపడతారు. అబ్బాయిలు, అమ్మాయిలు అయితే సరేసరి. పాశ్చాత్య దేశాల్లో వీటి హవా అంతాఇంతా కాదు. ఈ కారణంగానే ఏటా ప్రపంచవ్యాప్తంగా రెండు బిలియన్ల కంటే ఎక్కువ జతల జీన్స్ అమ్ముడవుతున్నాయి. ప్రతి సెకనుకు 73 యూనిట్ల విక్రయాలు జరుగుతున్నాయంటే మాటలు కాదు. మార్కెట్‌లో కొత్త పోకడలు, చౌక ధరల కారణంగా వీటి వినియోగం ఇంత ఎక్కువగా ఉంటోంది. అయితే, ప్రజల మనసులను దోచుకోవడంలోనే కాదు.. వాతావరణ కాలుష్యంలోనూ జీన్స్ పరిశ్రమ తీసిపోవడంలేదు.

మన దేశంలో ఇలా..

ఇక వివిధ మార్కెట్ అధ్యయనాల ప్రకారం భారతీయ డెనిమ్ (జీన్స్) మార్కెట్ కొన్నేళ్లుగా వార్షిక వృద్ధి రేటు సగటున 8–9 శాతం వరకు కొనసాగిస్తోంది. ఇది 2028 నాటికి రూ.91,894 కోట్లకు చేరుకుంటుందని అంచనా. మరోవైపు.. పాశ్చాత్య దేశాల మాదిరిగా కాకుండా, భారత్‌లో ప్రతి వ్యక్తికి సగటు జీన్స్ వినియోగం చాలా తక్కువగా ఉంది. ఇక్కడ ప్రస్తుతం సగటున ఒక వ్యక్తికి 0.5 జీన్స్ మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతి వ్యక్తికి ఒక జత జీన్స్ ఉండాలంటే సంవత్సరానికి మరో 700 మిలియన్ జతల జీన్స్ అవసరమని అంచనా. అలాగే, ఓ సర్వే ప్రకారం 2023లో 59 శాతం మంది భారతీయులు గత సంవత్సరం కంటే ఎక్కువ జీన్స్ కొనుగోలు చేయాలని ప్లాన్ చేస్తున్నారు.

బీఎస్ఎన్ఎల్ నుంచి ఐపీ టీవీ సేవలు

- లాంఛనంగా ప్రారంభించిన బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ వివేక్ బంజాల్
- రూ.130 నుంచి రూ.329 మధ్య ఐదు ప్యాకేజీలు
- వెయ్యికి పైగా చానల్స్ వీక్షించే అవకాశం

సాక్షి, అమరావతి: ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ తన ఫైబర్ బ్రాడ్ బ్యాండ్ కస్టమర్లకు ఐపీ (ఇంటర్నెట్ ప్రొటోకాల్) టీవీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. విజయవాడలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఐపీ టీవీ సేవలను బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ వివేక్ బంజాల్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాడ్ బ్యాండ్ వినియోగదారులకు కొత్త సేవలను అందించాలనే లక్ష్యంలో భాగంగా బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్... ఉత్కల్ టీవీ పేరుతో ఐపీ టీవీ సేవలను అందిస్తున్న సిటీ ఆన్‌లైన్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకుందని చెప్పారు. ఎటువంటి సెట్ టాప్ బాక్స్‌లు, యాంటీనాలు అవసరం లేకుండా నేరుగా 4కే టెక్నాలజీతో టీవీ ప్రసారాలను పొందవచ్చని తెలిపారు. బీఎస్ఎన్ఎల్ ఖాతాదారులకు 1,000కి పైగా చానల్స్‌ను రూ.130 నుంచి రూ.329 మధ్య ఐదు రకాల ప్యాకేజీల్లో ఉత్కల్ టీవీ అందిస్తుందని వివరించారు. దేశంలో ఫైబర్ బ్రాడ్ బ్యాండ్ వినియోగం భారీగా పెరుగుతోందని, 2016లో 3 లక్షలుగా ఉన్న ఖాతాదారుల సంఖ్య, ఇప్పుడు 28లక్షలకు చేరిందని, భవిష్యత్‌లో మరింత భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు. బీఎస్ఎన్ఎల్ దేశవ్యాప్తంగా 4జీ సేవలను విస్తరించిందని, త్వరలోనే 5జీ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ సురేష్‌కృష్ణ, ఉత్కల్ టీవీ డైరెక్టర్ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ధైర్యాన్నిస్తున్న ధాన్యం

మొదటి పేజీ తరువాయి

మండిపడుతోంది. చరిత్రలో ఎన్నడూ లేనట్టుగా మిల్లర్లు, మధ్య దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వమే తమ వద్ద ధాన్యాన్ని కొంటోందని, రవాణా, కూలీ, గన్నీ బ్యాగుల వంటి అంశాలను ఆర్‌బీకేలే చూసుకుంటున్నాయని, షెడ్యూలు ప్రకారం చెల్లింపులు సైతం జరిగిపోతున్నాయని, మద్దతు ధర చెల్లించటంతో రైతులుగా తమకు పూర్తి న్యాయం జరుగుతోందని వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతులే కాదు... 'ఈనాడు' పత్రిక పనిగట్టుకుని చేస్తున్న దుష్ప్రచారాన్ని పౌరసరఫరాల సంస్థ ఎండీ జి.వీరపాండియన్ కూడా ఖండించారు.

దళారుల తొలగింపే ఓ చరిత్ర...

రైతుకు, ప్రభుత్వానికి మధ్య దళారులను తొలగించటమనేదే ఓ చరిత్ర. అంతేకాకుండా తన పంటను విక్రయించుకోవాలనుకున్న ప్రతి రైతు నుంచీ.. మద్దతు ధర చెల్లించి ఈ–క్రాప్ డేటా ఆధారంగా పంటను కొనుగోలు చేయటం మరో చరిత్ర. ఎందుకంటే గతంలో చంద్రబాబు నాయుడి హయాంలో గన్నీ బ్యాగులు, కూలీ, రవాణా రైతుల నెత్తిమీదే పడేది. పైపెచ్చు సకాలంలో రైతులకు చెల్లింపులూ జరిగేవి కావు. ఆయన ఓడిపోయి వెళ్లిపోతూ రైతులకు చెల్లించకుండా వదిలేసిన రూ.980 కోట్ల బకాయిలే ఇందుకు సాక్ష్యం. ఇలాంటివన్నిటినీ సమూలంగా ప్రక్షాళన చేసి.. రైతులను ముందుకు తీసుకెళుతున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా... అక్కడక్కడ ఒకరిద్దరు తెలుగుదేశం కార్యకర్తలను రైతులుగా నిలబెట్టి వారివద్ద మైకు పెట్టి మొత్తం ప్రక్రియనే విమర్శించటమనేది 'ఈనాడు', ప్రతిపక్షాలు అమలు చేస్తున్న వ్యూహం. నిజానికి గ్రామస్థాయిలో ఆర్‌బీకేలు వచ్చాక... ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఏటికేడాది ఇంకా మెరుగుపడుతోంది. వేగం అందుకుంటోంది. ఈ సానుకూలతను ప్రతిపక్ష మీడియా మరుగునపరుస్తున్నా... రైతులు మాత్రం ప్రశంసిస్తూనే ఉన్నారు.

కలెక్టర్ నుంచి..

దశాబ్దాలుగా రైతుల గిట్టుబాటు ధరను దోచుకుంటున్న మిల్లర్లు, దళారులకు తొలిసారిగా ప్రభుత్వం చెక్‌పెట్టింది. కల్లంలో ఆర్బీకే సిబ్బంది ధాన్యం తూకం వేసి, ఎఫ్‌టీవో (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్) జనరేట్ చేసిన తర్వాత మద్దతు ధర ఒక్క రూపాయి కూడా తగ్గకుండా రైతుల ఖాతాల్లో జమయ్యేలా చర్యలు చేపడుతోంది. మిల్లుకు ధాన్యాన్ని చేర్చడంతో పాటు మిల్లరు అభ్యంతరాలు వ్యక్తం చేసినా.. రైతులతో సంబంధం లేకుండానే వాటిని పరిష్కరించేలా ప్రత్యేక యంత్రాంగాన్ని నెలకొల్పింది. ఫలితంగా ఆర్బీకేలో ఖరారైన తేమ శాతానికి, తూకానికి మిల్లరు కట్టుబడాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రతి జిల్లాలో కలెక్టర్లు, జేసీలు, రెవెన్యూ, పౌరసరఫరాలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పీఏసీఎస్ సిబ్బంది వరకు ధాన్యం సేకరణలో భాగస్వాములయ్యారు. ధాన్యం అమ్మటానికి వచ్చిన రైతుకు ఏ స్థాయిలో ఇబ్బంది కలిగినా సర్కారు వేగంగా స్పందిస్తోంది. కొంత మంది మిల్లర్లు తేమ శాతం ఎక్కువ ఉందని రైతుల నుంచి అక్రమంగా వసూలు చేసిన డబ్బులను సైతం ఆయా జిల్లా కలెక్టర్లు తిరిగి వెనక్కి ఇప్పించిన దాఖలాలున్నాయంటే ప్రభుత్వ చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ఆర్బీకే ద్వారా ఎఫ్‌టీవో పొందాక రైతు మిల్లుకు వెళ్లాల్సిన అవసరం లేదని వారికి అవగాహన కల్పిస్తున్నారు. మిల్లర్లు తరుగు కింద ధాన్యం తగ్గించినా, రైతు నుంచి డబ్బు డిమాండ్ చేసినా, ఇతర విషయాలపై ఫిర్యాదు చేసేందుకు వీలుగా టోల్ ఫ్రీ నెంబర్ 1967 వివరాలను ఎఫ్‌టీవో రశీదుపై ప్రభుత్వం ముద్రిస్తోంది కూడా.

ఇప్పటి వరకూ...

ప్రభుత్వం రాష్ట్రంలో ఇప్పటి వరకు 4.84 లక్షల మంది రైతుల నుంచి రూ.5,609 కోట్ల విలువైన 26.91 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించింది. ఇందులో 4.48లక్షల మంది రైతులకు రూ.4,743 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసింది. ఇక్కడ దాదాపు 87 శాతం మందికి చెల్లింపులు జరిపింది. గతంలో ఎన్నడూ లేని విధంగా 21 రోజుల్లోపే మద్దతు ధర రైతుల ఖాతాల్లో జమవుతోంది. పైగా ప్రస్తుత సేకరణలో గోనె సంచులు, హమాలి, రవాణా చార్జీల కింద రూ.65.01 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.26.28 కోట్లు రైతులకు అందాయి.

పక్కాగా నిబంధనలు అమలు..

మిల్లర్ల దందాను అరికట్టే క్రమంలో ప్రభుత్వం లక్ష్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న మిల్లర్లెవ్వరినీ ఉపేక్షించట్లేదు. ఈ క్రమంలోనే రైతులను మిల్లులకు పిలిచి ఇబ్బంది పెడుతున్న మిల్లర్లపై పౌరసరఫరాల శాఖ కొరడా ఝుళిపించింది. విజయనగరం, తూర్పుగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి జిల్లాల్లో 23 మిల్లులపై కఠిన చర్యలకు ఆదేశించింది. మరోవైపు ధాన్యం సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 8 మంది టెక్నికల్ అసిస్టెంట్స్, 7 మంది పీఏసీఎస్ సిబ్బందిలో పౌరసరఫరాల శాఖ ఒకరిని తొలగించడంతో పాటు, మిగిలిన వారిని సస్పెండ్ చేయటం, షోకాజ్ నోటీసులివ్వటం చేసింది.

రైతులకు సమాచారం ఇచ్చాకే...

కృష్ణా, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల్లో ఇప్పుడే నూర్పులు చేపట్టడం, సంక్రాంతి కావడంతో కొనుగోళ్లు నెమ్మదించాయి. ఈ జిల్లాల్లో కొనుగోళ్లు పూర్తయితే మొత్తం లక్ష్యం 35 లక్షల టన్నులు ముగుస్తుంది. ప్రభుత్వం ఎక్కడైతే పూర్తి స్థాయిలో కొనుగోళ్లు ముగిశాయో అక్కడ క్షేత్ర స్థాయిలో రైతుల నుంచి ధాన్యం లేదని నిర్ధారించుకున్న తర్వాతే ప్రక్రియను ముగించేలా ప్రణాళిక రూపొందించింది. ఇందులో ఆర్బీకే సిబ్బంది, తహసీల్దార్, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారుల ద్వారా ఆమోదం పొందిన తర్వాతే.. రైతులకు సమాచారం ఇచ్చాకే ధాన్యం సేకరణ కేంద్రాన్ని మూసివేస్తారు. రైతులకు పూర్తి మద్దతు ధర వస్తుండటంతో ప్రభుత్వం ద్వారా విక్రయించేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, ఎన్టీఆర్ జిల్లాలకు బ్యాంకు గ్యారెంటీల శాతాన్ని పెంచడంతో జిల్లాలకు ధాన్యం సేకరణ కేటాయింపు కూడా పెరిగింది.

జియో లొకేషన్ ట్యాగింగ్‌తో..

రాష్ట్రంలో ఎక్కడా ధాన్యం కొనుగోలు మూసి వేయట్లేదు. తాత్కాలిక అంచనాలు ప్రకారం ఆర్బీకేలకు ధాన్యం కొనుగోళ్లకు అనుమతులు ఇచ్చాం. చాలా వరకు ఆర్బీకేలు ఈ లక్ష్యాన్ని చేరుకున్నాయి. ఇప్పుడు ఇంకా క్షేత్ర స్థాయిలో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న ధాన్యం డేటాను సేకరిస్తున్నాం. ఇందులో అక్రమంగా బయటి ధాన్యం చొరబడకుండా జియో లొకేషన్ ట్యాగ్ చేస్తూ సేకరించాల్సిన ధాన్యం వివరాలను ఫొటోల రూపంలో ప్రత్యేక యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తున్నాం. కొందరు దళారులు రైతుల నుంచి ముందుగానే తక్కువ రేటుకు ధాన్యం కొని ఇప్పుడు అదే రైతుల పేరుతో అమ్మాలని చూస్తున్నారు. దీనిని అరికట్టేందుకే జియో ట్యాగ్ చేస్తున్నాం. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లో పండుగ సందర్భంగా కొనుగోళ్లు నెమ్మదించాయి తప్ప.. నిలిపివేయలేదు. జనవరి 13 నుంచి 19వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1.17లక్షల టన్నులు సేకరించాం. – జి.వీరపాండియన్, పౌరసరఫరాల సంస్థ ఎండీ

ఐదు రోజుల్లో నగదు జమ అయింది



నేను ఖరీఫ్‌లో ఐదు ఎకరాల్లో వరి సాగు చేశాను. 110 క్వింటాలను రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసింది. డిసెంబర్ 9న ధాన్యం ఇస్తే.. డిసెంబర్ 14న రూ.2,24,400 నా ఖాతాలో పడ్డాయి. 5 రోజుల్లో ధాన్యం డబ్బు జమ కావడం గతంలో ఎప్పుడూ చూడలేదు. వరి పంట సాగు చేస్తున్న రైతుకి ప్రతి సంవత్సరం ఏదో కారణంగా తీవ్ర నష్టం వచ్చేది. ఈ సారి ఆ కష్టాలను అధిగమించాం. మంచి మద్దతు ధర కూడా దక్కింది. – కుమరాపు శ్రీనివాసరావు, దీఆర్‌వలస, జి.సిగడాం మండలం, శ్రీకాకుళం జిల్లా

రవాణా ఖర్చులు కూడా దక్కాయి



నాకు మూడు ఎకరాలు, నా కుమారుడికి ఒక ఎకరా చొప్పున పల్లం భూమి ఉంది. ఈ ఏడాది ఎకరాకు 30 బస్తాలు చొప్పున పంట దిగుబడి వచ్చింది. డిసెంబర్ 25వ తేదీన కొప్పర వలస రైతు భరోసా కేంద్రం ద్వారా 120 బస్తాల ధాన్యం విక్రయించాను. మూడు రోజులు కిందట మా ఖాతాలకు రూ.1.95 లక్షలు జమ అయ్యింది. దీనికి తోడు లోడింగ్, రవాణా ఖర్చులు కూడా పడ్డాయి. – యలకల జనార్ధన నాయుడు, వంగర మండలం, రుషింగి గ్రామం, విజయనగరం జిల్లా

ధాన్యం సేకరణ నాడు-నేడు

సీజన్	సేకరణ (టన్నులు)	విలువ (రూ.కోట్లు)
2014-15	40,62,188	5,583.03
2015-16	64,72,204	9,238.41
2016-17	55,57,513	8,261.40
2017-18	59,72,947	9,352.26
2018-19	44,45,895	7,801.81
మొత్తం	2,65,10,747	40,236.91

సీజన్	సేకరణ (టన్నులు)	విలువ (రూ.కోట్లు)
2018-19 (రబీ మాత్రమే)	27,52,747	4,838.03
2019-20	82,57,174	15,037.12
2020-21	84,56,200	15,841.41
2021-22	66,59,625	12,954.39
2022-23 (ఇప్పటి వరకు)	26,91,395	5,609.00
మొత్తం	2,88,17,141	54,279.95

నిర్దేశిత గడువులోగా అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం



తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

మొదటి పేజీ తరువాయి

అనుసంధానం చేసే అంశాలపై అధికారులతో చర్చించారు. అత్యంత నాణ్యతతో అందంగా నిర్మాణాలు ఉండాలని, పనుల పర్యవేక్షణకు ఉన్నత స్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 125 అడుగుల ఎత్తుండే విగ్రహంతో పాటు పీఠంతో కలిపి మొత్తంగా 206 అడుగుల ఎత్తు వస్తుందని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. పీఠం భాగంలో జీ ప్లస్ టూ నిర్మాణం ఉంటుందన్నారు. ఈ ప్రాంగణంలో 2 వేల మంది పట్టేలా కన్వెన్షన్ సెంటర్‌ను కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. అంబేడ్కర్ స్మృతివనం ప్రాజెక్టు వ్యయం రూ.268 కోట్లు అని, విగ్రహ నిర్మాణంలో 352 మెట్రిక్ టన్నుల ఉక్కు, 112 మెట్రిక్ టన్నుల ఇత్తడిని వినియోగిస్తున్నామని చెప్పారు. అంబేడ్కర్ విగ్రహానికి సంబంధించిన కొన్ని భాగాలను ఇప్పటికే తరలించామని.. కారు, బస్ పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయిస్తున్నామని వివరించారు. మీ (సీఎం) ఆదేశాల మేరకు స్మృతివనం వరకు రోడ్లను సుందరీకరిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి జయలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, ఏపీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.సృజన, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పోరాటాలు లేకుండానే మా ఆశయం నెరవేర్చారు

- సీఎం జగన్‌కు సీపీఎం దిగ్గజ నేత, మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య ప్రశంసలు
- మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని అభినందనలు
- మీలాంటి మనసున్న సీఎం ఆనాడు ఉంటే తన తల్లి బతికుండేదని వెల్లడి
- 2024లో అధికారంలోకి వచ్చాక పేదలకు భూములు పంచాలని వినతి
- క్యాంపు కార్యాలయంలో సీఎంతో భేటీ



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీపీఎం కురువృద్ధుడు, కృష్ణా జిల్లా నిడుమోలు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్‌తో భేటీ అయ్యారు. పేదల శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన రామయ్య నిస్వార్థపరుడు, నిరాడంబరుడు, రైతు బాంధవుడు, భూపోరాట యోధుడుగా పేరు పొందారు. ఉద్యమాలే ఊపిరిగా బతికిన ఆయన ప్రస్తుతం వృద్ధాశ్రమంలో ఉంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన రామయ్య సీఎంను కలిశారు. సీఎం జగన్ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఉద్యమాలు, పోరాటాలు లేకుండా 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి, పక్కా ఇళ్లు నిర్మిస్తున్న సీఎంను రామయ్య అభినందించారు. తమ ఆశయాన్ని నెరవేర్చారని ప్రశంసించారు. 2024లో మళ్లీ అధికారంలోకి రాగానే పేదలకు వ్యవసాయ భూములు పంపిణీ చేయాలని సీఎంను కోరారు.

ప్రజల గుండెల్లో ఉంటారు

పేద, మధ్య తరగతి కుటుంబాల జీవితాలను మెరుగు పరిచేందుకు విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వటం చాలా గొప్ప విషయమని రామయ్య అన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం లాంటి సాహసోపేతమైన కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా వైఎస్ జగన్ నేడు మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. తాను జన్మించిన కొన్ని ఘడియలకే పోషకాహార లోపంతో తన తల్లి కన్నుమూసిందని తెలిపారు. 'మీ లాంటి మనసున్న మహారాజు ఆనాడు ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే, ప్రభుత్వమే పోషకాహారం అందజేసి ఉంటే తన తల్లి బతికి ఉండేది' అంటూ రామయ్య గద్గద స్వరంతో అన్నారు. పేదల గురించి ఇంతలా ఆలోచించటం చాలా గొప్ప విషయమని, ఇదే దృక్పథం కొనసాగించాలని సీఎం జగన్‌కు సూచించారు.

సీఎంను ప్రశంసించాలనే వచ్చా

సీఎంతో భేటీ అనంతరం రామయ్య మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగన్‌ను కలవటంలో ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదన్నారు. ఎలాంటి కోర్కెలు, అవసరాల కోసం కలవలేదన్నారు. సీఎం జగన్ చేపట్టిన కార్యక్రమాలు చాలా బాగున్నాయని ప్రశంసించడానికే వచ్చానని తెలిపారు. ఊహ తెలిసినప్పటి నుంచి సీపీఎం ఆశయాలకు కట్టుబడి పని చేశానని, తుది శ్వాస వరకు అలాగే ఉంటానని అన్నారు. పేదల కోసం ఎన్నో పోరాటాలు చేసి లాఠీ దెబ్బలు తిన్నానని, జైలు జీవితం కూడా అనుభవించానని చెప్పారు.

అదుపు తప్పిన బైక్.. రాత్రంతా లోయలోనే..


క్షతగాత్రుడిని లోయలో నుంచి బయటకు తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది.


లోయలో పడిపోయిన దేవా

బైక్ అదుపుతప్పి సుమారు 65 అడుగుల లోయలోకి పడిపోయిన వ్యక్తి తీవ్ర గాయాల పాలై 24 గంటల పాటు బిక్కుబిక్కుమంటూ గడిపాడు. లోయలోనుంచి ఆర్తనాదాలు విన్న విద్యుత్ శాఖ ఏఈ స్పందించిన అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు సుమారు 5 గంటలపాటు శ్రమించి క్షతగాత్రుడికి ప్రాణాలతో బయటికి తీశారు.

కేవీబీపురం(తిరుపతి జిల్లా): కేవీబీ పురం మండల కేంద్రానికి చెందిన దేవ (34) స్థానిక రైస్‌మిల్లులో పనిచేసేవాడు. రామాపురంలోని సోదరి ఇంటికెళ్లి గురువారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై కేవీబీ పురానికి బయల్దేరాడు. మార్గమధ్యంలో బైక్ అదుపు తప్పి రామాపురం డ్యాం లోయలో పడిపోయాడు. కాళ్లు విరిగిపోయి, తలకు దెబ్బ తగలడంతో స్పృహ కోల్పోయాడు. కొన్ని గంటల తరువాత స్పృహ వచ్చింది. అయితే అప్పటికే చీకటిపడిపోవడం, తాను కదల్లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ అక్కడే రాత్రంతా ఉండిపోయాడు. శుక్రవారం ఉదయం అటుగా వెళుతున్న వాహనాల శబ్దాలు విని కాపాడండి అంటూ కేకలు వేశాడు. లోయ పైనున్న గుట్ట ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న ఏఈ వెంకీ ఆర్తనాదాలు విని, బాధితుడి వద్దకు చేరుకున్నాడు. నీటిని తాగించి, వెంటనే 108 సిబ్బందికి, అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. శ్రీకాళహస్తి ఏడీఎఫ్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీనియర్ ఎల్‌ఎఫ్ నాగార్జున్‌రెడ్డి, ఎల్‌ఎఫ్ సునీల్‌కుమార్, డీపీఓ ధనశేఖర్, ఎఫ్‌ఎంలు శివయ్య, ఎఫ్‌ఎం రాజా వెంటనే అక్కడికి చేరుకున్నారు. అతికష్టం మీద సుమారు 5 గంటలపాటు శ్రమించి అతన్ని ప్రాణాలతోనే లోయలో నుంచి బయటకు తీసుకొచ్చారు. 108 సిబ్బంది అక్కడే ప్రథమ చికిత్స అందించి, శ్రీకాళహస్తి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దారుకు జీవం.. శిలకు ప్రాణం

దేవుడే దిగివచ్చాడా..తనకు తానే ఈ బొమ్మల్లో ఒదిగిపోయి ఊపిరి పోసుకున్నాడా అనిపిస్తుంది ఆ దారు శిల్పాల హస్తకళా చాతుర్యాన్ని తిలకిస్తే. దేనికదే దివ్యకళా దృష్టితో దర్శనమిస్తాయి. నాట్యగణపతి.. శ్రీవేంకటేశ్వరస్వామి, దశావతారాలు.. అష్టలక్ష్ములు.. సకల దేవతాస్వరూపాలు..గృహోపకరణాల కళాకృతులు ఒకదానికి మరొకటి జీవం పోసుకుంటూ సృష్టికి ప్రతిసృష్టి చేస్తోంది తొర్రూరు.

- దారు కళల కాణాచి తొర్రూరు
- కొయ్యకు ప్రాణాపోసే కళాకారులు
- అద్భుత కళాకండాల సృష్టికి గని ఆ పల్లె







పుత్తూరు రూరల్(తిరుపతి జిల్లా): దారు(చెక్క) శిల్పాల కళాఖాండాల కాణాచిగా తొరూరు గ్రామం గుర్తింపు పొందింది. పుత్తూరు పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. గ్రామంలోని వారంతా వ్యవసాయం,కూలి పనుల మీదే ఆధారపడి జీవిస్తున్నారు. సుమారు 40 కుటుంబాలు దారు బొమ్మల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రసిద్ధి చెందిన ఆలయాల నుంచి గ్రామ స్థాయి ఆలయాల్లోని దేవతామూర్తుల కళాకృతులు ఈ కళాకారుల చేతుల్లో ఒదిగి పోతాయి. ఆరు దశాబ్దాల క్రితం ఇదే గ్రామానికి చెందిన ఎం.రామలింగం దారు బొమ్మలు చెక్కడంపై చూపించిన చొరవ గ్రామానికే కీర్తిని తెచ్చి పెట్టింది. తాను నేర్చుకున్న కళ తనతోనే అంతరించి పోకుండా మరి కొందరికి బొమ్మలు చెక్కడంపై ఆయన శిక్షణ ఇచ్చాడు. దీంతో పలు కుటుంబాలకు బొమ్మల తయారీ జీవనాధారమైంది. తొలుత చిన్న చిన్న బొమ్మలను మాత్రమే తయారు చేసేవారు. వీటిని అమ్ముకోవడం పెద్ద సమస్యగా ఉండేది. దీంతో రామలింగం మద్రాసుకు వెళ్లి వాటిని అమ్ముకొని వచ్చేవారు. క్రమేపీ కళాకృతులను హైదరాబాద్, బెంగుళూరు, విజయవాడ, ఢిల్లీ, ముంబయి వంటి పట్టణాలకు తీసుకెళ్లి అమ్మకాలు చేస్తుండడంతో వ్యాపారాలు ఆశాజనకంగా ఉన్నాట్లు కళాకారులు చెబుతున్నారు.

ఒకదానికి మించి మరొకటి..

ప్రస్తుతం ఆరడుగుల నిలువెత్తు శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణ సత్యభామ, గణపతి వంటి బొమ్మలతో పాటు గృహోపకరణాలకు సంబంధించి ఏనుగు తల, గుర్రం, దశావతారం, తోరణాలు వంటి కళాకృతులు తయారు చేస్తున్నారు. ప్రస్తుతం వీటిని నెల నెలా నగరాల్లో నిర్వహించే ఎగ్జిబిషన్లలో పెట్టి అమ్మకాలు జరుపుతున్నారు. వీరికి చేయూతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎగ్జిబిషన్స్‌లో పెట్టే స్టాల్స్‌ను ఉచితంగా ఇవ్వడంతో పాటు వీరికి ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తోంది.



15 ఏళ్లుగా ఇదే వృత్తి

పదిహేనేళ్లుగా బొమ్మల తయారీ పనిచేస్తున్నా. గ్రామంలో సుమారు 40 కుటుంబాలు ఈ బొమ్మల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. బొమ్మల తయారీలో ఓపిక, సహనం అవసరం. ఏమాత్రం పొరబాటు జరిగినా మొత్తం చెక్కను పడేయాల్సిందే. మా కూలి ప్రస్తుత ధరలకు సరిపోవడం లేదు. ప్రభుత్వం మాలాంటి కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలి. పెట్టుబడికి ప్రభుత్వం సాయం చేస్తే ఎంతో మంది ఇలాంటి చేతి వృత్తుల పట్ల ఆసక్తి చూపుతారు.

– మాధవయ్య, కళాకారుడు, తొరూరు, పుత్తూరు మండలం

చేయూత ఇస్తే అద్భుతాలు సృష్టిస్తాం

మా తండ్రి రామలింగం అందించిన బొమ్మల తయారీని వృత్తిగా కొనసాగిస్తున్నా. ప్రస్తుతం 20 మందికి పనికల్పిస్తున్నా. ప్రభుత్వం తక్కువ వడ్డీతో ఆర్థిక సాయం చేస్తే మేలైన కళాకండాలను అందిస్తాం. ప్రస్తుతం కొయ్యల ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఢిల్లీ, ముంబాయి, బెంగుళూరు, చెన్నై వంటి నగరాల్లో ఎగ్జిబిషన్స్‌లో అమ్మకాలు జరపాలంటే పెద్ద మొత్తంలో పెట్టుబడులు అవసరం. ఇందుకు ప్రభుత్వ పరంగా చేయూత అవసరం. మా ప్రతిభ తగిన గుర్తింపు వస్తే అంతకుమించింది ఏమీ లేదు.



– ఎం.వెంకటేష్, బొమ్మల తయారీదారుడు, తొరూరు, పుత్తూరు మండలం.

చివరి మజిలీ.. 'స్వర్గధామం'


శ్మశాన వాటికలో ఏర్పాటు చేసిన శివుని ప్రతిమ

ఆధునిక హంగులతో శ్మశానవాటిక

- ఏడు ఎకరాల్లో నిర్మాణం
- దాతలతో పాటు మున్సిపాలిటీ సహకారం
- ప్రభుత్వం తరపున రూ.95లక్షలతో ఎల్‌పీజీ దహన వాటిక
- ఉచితంగానే అంతిమ సంస్కారాలు


నంద్యాల శివారులోని పీవీనగర్ వద్ద నిర్మించిన స్వర్గధామం

మూఢనమ్మకాలను దాటుకొని..

అంత్యక్రియలను ఎంతో పవిత్రంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించాలనే శివకుమార్‌రెడ్డి సంకల్పానికి మొదట్లో ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయి. అప్పటికే శ్మశాన వాటికను అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చిన ఇద్దరు దాతలు అకాల మృత్యువాత పడటం చూసి శ్మశానాలు అభివృద్ధి చేస్తే ప్రాణాలు పోతాయనే మూఢనమ్మకంలో ఉండిపోయారు. వాళ్ల ఆలోచనలో మార్పు తీసుకొచ్చేందుకు తనే ముందడుగు వేశారు. మూఢనమ్మకాలను చెల్లాచెదురు చేశారు. నవ నిర్మాణ సమితిగా ఏర్పాటై నిర్మించిన స్వర్గధామం ప్రస్తుతం అభివృద్ధి చెందిన శ్మశాన వాటికల్లో రాష్ట్రంలోనే రెండవదిగా నిలిచింది.

బొమ్మలసత్రం:

నంద్యాల పట్టణానికి చెందిన శివకుమార్‌రెడ్డి ప్రభుత్వ అధికారి. 2008లో కర్నూలు, అనంతపురం జిల్లాలకు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌గా సేవలందించారు. తన స్నేహితుడి తండ్రి మృతిచెందటంతో అంత్యక్రియల కోసం ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న కొండయ్య హిందూ శ్మశాన వాటికకు వెళ్లారు. అక్కడ బురదలో నడుచుకుంటూ వెళ్లి పందులు సంచరిస్తున్న ప్రదేశంలో మృతదేహాన్ని టైర్లతో కాల్చడం చూసి ఆయన మనసు చలించింది. తన స్నేహితుడి తండ్రి సమాజంలో ఎంతో ఉన్నతంగా బతికిన వ్యక్తి.. మరణానంతరం ఇంతటి దుర్భరమైన ప్రదేశంలో అంత్యక్రియలు జరగడాన్ని జీర్ణించుకోలేకపోయారు. ఆ బాధలో నుంచి పుట్టుకొచ్చిందే 'స్వర్గధామం'. ఈయనకు పట్టణంలోని వైద్యుడు డాక్టర్ మధుసూదన్‌రావు ప్రతి అడుగులో తోడుగా నిలిచారు. ఇద్దరూ కలిసి మరికొంత మందితో నవ నిర్మాణ సమితిని ఏర్పాటు చేశారు.

ఇప్పటి వరకు 202 అంతిమ సంస్కారాలు

స్వర్గధామం శ్మశాన వాటిక 2020 డిసెంబర్‌లో ప్రారంభమైంది. ఇప్పటి వరకు 202 అంతిమ సంస్కారాలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. వైకుంఠ రథాలు మొదలుకొని, అంత్యక్రియలు పూర్తయ్యే వరకు.. ఇంత ధర అని ఖరారు చేయలేదన్నారు. ఎవరినీ డబ్బు అడగమని, అయితే ఉన్న వాళ్లు మనస్ఫూర్తిగా ఎంత ఇచ్చినా తీసుకొని శ్మశాన వాటిక అభివృద్ధికి వినియోగిస్తామన్నారు.

ప్రభుత్వ చేయూత

స్వర్గధామంలో ప్రభుత్వం రూ.95 లక్షలతో ఎల్‌పీజీ దహన వాటిక నిర్మాణానికి చర్యలు చేపట్టింది. పనులు పూర్తి దశకు చేరుకోవటంతో మరికొన్ని రోజుల్లో అందుబాటులోకి రానుంది. గ్యాస్ ద్వారా దహన కార్యక్రమాలు చేయటం వల్ల శ్మశానవాటికలో ఉపయోగించే విద్యుత్, కర్రల వినియోగం పూర్తిగా తగ్గుతుంది. దాతల సహకారంతో పాటు నంద్యాల మున్సిపాలిటీ నిధుల నుంచి రూ.2 కోట్ల మేర పలు అభివృద్ధి పనులు చేపట్టారు. రోడ్లతో పాటు డ్రైనేజీ కాలువల నిర్మాణం చేశారు.

గతంలో ఇలా..

నంద్యాల జిల్లా కేంద్రంలో ఐదు హిందూ శ్మశాన వాటికలు ఉండగా, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కొండయ్య హిందూ శ్మశాన వాటిక అందులో ఒకటి. ఇక్కడ అంత్యక్రియలు నిర్వహించడం అంటే ప్రత్యక్ష నరకమే. బురదలో అడుగు తీసి అడుగు వేయడం కూడా కష్టమే. పందులు, కుక్కలతో నిండి ఉంటుంది. చుట్టుపక్క జులాయిలు కొందరు సమాధులపై కూర్చొని మద్యం సేవిస్తూ పేకాట ఆడటం జరుగుతుండేది. ఇక సారా విక్రయాలు కూడా చేసేవారు. రాత్రిళ్లు వ్యభిచారం జరుగుతుండగా లెక్కలేనని సార్లు పోలీసులు దాడులు జరిగాయి. మృతదేహాన్ని పూడ్చిన కొద్ది గంటలకే జంతువులు తవ్వి బయటకు తీయడం.. అస్తికలు చెల్లాచెదురుగా పడి ఉండటం చూస్తే ప్రాణం చచ్చిపోతుంది. మరీ దారుణం ఏమిటంటే.. దహనం చేయడానికి కాటికాపరులు టైర్లు, కిరోసిన్ వినియోగించడం. అంత్యక్రియలకు వెళ్లిన వాళ్లు కనీసం అక్కడ 10 నిముషాలు కూడా ఉండలేని పరిస్థితి.

ఇప్పుడు ఇలా..

బతికినప్పుడు ఎలా ఉన్నా.. చనిపోయిన తర్వాత అయినా గౌరవప్రదంగా సాగనంపాలనే తలంపుతో పట్టణానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి, స్థానిక వైద్యులు ఒక అడుగు ముందుకేశారు. స్థానిక పీవీనగర్ వద్దనున్న 7 ఎకరాల మున్సిపల్ స్థలంలో అత్యాధునిక వసతులతో శ్మశాన వాటిక నిర్మాణం తలపెట్టారు. మొదట రూ.కోటి అంచనా వేసి వారి వద్దనున్న కొంత డబ్బుతో పాటు దాతల సహకారం తీసుకున్నారు. అది నేడు రూ.5 కోట్ల వరకూ చేరి పట్టణంలో స్వర్గధామంగా రూపుదిద్దుకుంది. ఇక్కడ అడుగడుగునా ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తుంది. ఆధ్యాత్మిక చిత్రాలు మనసును కట్టిపడేస్తాయి. అధునాతన యంత్రాలు, అత్యాధునిక పద్ధతిలో నిర్మించిన శ్మశాన వాటికలో సాంప్రదాయ పద్ధతుల నడుమ అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. సమీపంలోని పీవీ నగర్ గుడిసెవాసులకు ఈ స్వర్గధామం నుంచే ప్రతి రోజు మినరల్ వాటర్‌ను ఉచితంగా అందిస్తుండటం విశేషం.

'స్వర్గధామం' ప్రత్యేకతలు..

- శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మాణం.
- మొక్కల పెంపకంతో ఆహ్లాదకర వాతావరణం.
- మృతదేహాలను ఇంటి నుంచి తరలించేందుకు రెండు వైకుంఠ రథాలు.
- అంత్యక్రియలు సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల వస్తువులు అక్కడే అందుబాటులో ఉంచారు.
- దహన సంస్కారాలకు కర్రలు, నెయ్యి, కర్పూరం వినియోగం.
- అత్యాధునిక కరెంట్ దహన వాటికలు.
- అంత్యక్రియల కోసం వచ్చిన బంధువులు, కుటుంబ సభ్యులు కూర్చునేందుకు వీలుగా విజిటర్స్ గది నిర్మాణం.
- అంత్యక్రియలకు రాలేని వారి కోసం ఇంటర్‌నెట్ సహాయంతో అత్యాధునిక కెమెరాల ద్వారా లైవ్‌లో వీక్షించే వెసలుబాటు.
- హరిశ్చంద్ర ఘాట్‌లో సాంప్రదాయ పద్ధతిలో కార్యక్రమాల నిర్వహణ.
- అంత్యక్రియల తర్వాత అక్కడే స్నానం చేసేందుకు పురుషులకు, మహిళలకు వేరువేరుగా టాయ్‌లెట్లు.
- పిండప్రదానం, హోమాల నిర్వహణకు ఒక భవనం.
- అస్తికలు భద్రపరుకునేందుకు ప్రత్యేకంగా లాకర్లు.
- తాగునీటి సౌకర్యానికి ప్రత్యేకంగా మినరల్ వాటర్ ప్లాంట్.

గౌరవప్రదంగా సాగనంపాలి



కుటుంబంలోని వ్యక్తి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయే సమయంలో ఎంతో గౌరవప్రదంగా సాగనంపాలి. బిడ్డ పుట్టినప్పుడు ఎంత సంతోషంగా ప్రేమ, ఆప్యాయతలు చూపుతామో.. చనిపోయినప్పుడు కూడా అలాంటి వాతావరణమే ఉండాలి. స్వర్గధామం నిర్మాణంలో దాతల చేయూత మరువలేనిది. ఇక్కడి కల్పించిన సౌకర్యాలు ఎంతో ఆహ్లాదకరంగా ఉండటం ఆనందాన్నిస్తోంది.

– డాక్టర్ మధుసుదన్‌రావు, మధుమణి హాస్పిటల్స్ నిర్వాహకులు

శ్మశానాలు దేవాలయాలతో సమానం

బతికి ఉన్నప్పుడు ఎంత గొప్పగా జీవించారో, చనిపోయిన తర్వాత అంతే గొప్పగా అంత్యక్రియలు జరపటం వారి సంతతి బాధ్యత. అందుకోసమే స్వర్గధామం ఏర్పాటుకు కృషి చేశాం. శ్మశాన వాటికలంటే తమ పెద్దలు నివసించే దేవాలయాలుగా భావించారు. అక్కడ పరిశుభ్రత, ఆధ్యాత్మికత, ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొన్నప్పుడే ప్రశాంతంగా సాగనంపినట్లు అవుతుంది.

– శివకుమార్‌రెడ్డి, నంద్యాల నవనిర్మాణ సమితి అధ్యక్షులు

పది లక్షల ఉద్యోగాల కల్పనే మోదీ లక్ష్యం


మాట్లాడుతున్న కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్

తాటిచెట్లపాలెం: దేశంలోని యువతకు ప్రభుత్వ రంగ సంస్థల్లో 10 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ తెలిపారు. రోజ్‌గార్‌మేళాలో భాగంగా విశాఖపట్నం పోర్ట్ కళావాణి ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన నియామకపత్రాల అందజేత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కపిల్ హాజరయ్యారు. దేశంలోని యువతకు 10 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా మోదీ పనిచేస్తున్నారని, రోజ్‌గార్ మేళాలో భాగంగా మొదటి దశలో 75 వేలు, రెండో దశలో 77 వేలు ఉద్యోగాలు కల్పించారన్నారు. మూడో దశలో భాగంగా నేడు దేశ వ్యాప్తంగా సుమారు 71 వేల మందికి నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఆకలితో ఉన్నవారికి ఆహారం, అలసిన వారికి విశ్రాంతి అవసరమని, ధనార్జనలో ధర్మం అవసరమన్నారు. కాబట్టి నూతనంగా ఉద్యోగాలు సాధించిన వారు నిజాయతీగా, నమ్మకంగా పనిచేస్తూ దేశానికి, పనిచేసే సంస్థకు మంచి పేరు తేవాలన్నారు. విశాఖపట్నంలో సుమారు 260 మందికి నియామక పత్రాలు అందజేశారు. చీఫ్ కమిషనర్ కస్టమ్స్ అండ్ సీజీఎస్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ కె.ఇంజినీర్, డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


చంద్రంపాలెం హైస్కూల్‌లో టాపర్స్‌ను అభినందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మధురవాడ(భీమిలి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆకాంక్షించారు. చంద్రంపాలెం ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. సమ్మెటివ్-1(ఎస్ఏ) పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల్లో వెనకబడడం అంటూ ఏమీ ఉండదని, బాగా కృషి చేస్తే విజయం సాధించవచ్చునని చెప్పారు. ఏకాగ్రతతో చదివి 10వ తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. ఇటీవల కర్ణాటకలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కల్చరల్ ఫెస్టివల్‌లో పాల్గొన్న స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లను కలెక్టర్ అభినందించారు. డీఈవో ఎల్.చంద్రకళ, డిప్యూటీ డీఈవో గౌరీశంకర్, ప్రధానోపాధ్యాయులు ఎం.రాజబాబు, జయప్రద, పాఠశాల కమిటీ సభ్యులు పిళ్లా సూరిబాబు, జ్యోతిష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

గోపాలపట్నం: ప్రధాని మోదీ పాలన అభివృద్ధి, సంక్షేమంతో సాగుతోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధి గౌరీనగర్, గణేష్‌నగర్ ప్రాంతాల్లో శుక్రవారం పట్టభద్రులను కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి.. పి.వి.ఎన్ మాధవ్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం బుచ్చిరాజుపాలెంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి.. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి దాడి పురుషోత్తమ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాధవ్, రాష్ట్ర సభ్యత్వ ప్రముఖ్ జీసీ నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగేంద్ర విజయానందరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎం.రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాల పరిరక్షణలో కళల పాత్ర కీలకం

దొండపర్తి(విశాఖ దక్షిణ): భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించడంలో కళలు కీలక పాత్ర పోషిస్తాయని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. విశాఖపట్నం సీజీఎస్టీ జోన్ ఆధ్వర్యంలో ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం కల్చరల్ మీట్ నిర్వహించారు. ఇందులో దక్షిణాది నుంచి ఏపీ, తెలంగాణ, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, గోవా తదితర రాష్ట్రాలకు చెందిన ఆదాయ పన్ను, కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్, సీజీఎస్టీ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వీసీ ప్రసాదరెడ్డి ముందుగా విశాఖ సీజీఎస్టీ కమిషనర్ ఎం.ఆర్.ఆర్.రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి మీట్‌ను ప్రారంభించారు. జాతీయ వారసత్వం, ప్రాంతీయ సంస్కృతుల విశిష్టతలు, పాత్రను వివరించారు.

అండమాన్ నుంచి షిప్ వచ్చిందోచ్...



సాక్షి, విశాఖపట్నం : అండమాన్ దీవులకు విశాఖ నుంచి వెళ్లే రోజులు మళ్లీ వచ్చాయి. కోవిడ్ తర్వాత.. రెండు నెలల పాటు సర్వీసులు నిర్వహించిన అనంతరం.. మళ్లీ అండమాన్–విశాఖ షిప్ సర్వీసుకు బ్రేక్ పడింది. మళ్లీ నెలల తర్వాత.. సాగర జలాల్లో పయనానికి తెరతీసింది. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌సీఐ)కు చెందిన పాసింజర్ షిప్ ఎంవీ సింధు అండమాన్ నికోబార్‌దీవుల నుంచి 276 మంది ప్రయాణికులతో విశాఖపట్నం పోర్టుకు చేరుకుంది. పోర్టు అథారిటీ అధికారులు షిప్‌కు స్వాగతం పలికారు. భవిష్యత్తులో పాసింజర్ షిప్‌ల రాకపోకలకు ఎంవీ సింధు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని పోర్టు అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

> సత్వగుణమువారు స్వర్గాది లోకములను, రజోగుణము వారు మధ్యమమగు మనుష్య లోకమును పొందుచున్నారు. తమోగుణము వారు అధోలోకమున అనగా మనుష్యులలో హీనులుగా, పశుపక్ష్యాదులుగా జన్మించుచున్నారు.
>
> – హైందవ ధర్మం

సాక్షి

శనివారం, జనవరి, 21

జసిండా అసాధారణ ఒరవడి

కాదు పొమ్మని ప్రజలు తీర్పిచ్చినా అధికారం కోసం ఎంతకైనా తెగించే డోనాల్డ్ ట్రంప్, బోల్సెనారో వంటివారిని చూసి విస్తుపోయిన ప్రపంచాన్ని న్యూజిలాండ్ ప్రధాని జసిండా ఆర్డెన్ తాజా నిర్ణయం ఆశ్చర్యపరిచి ఉండొచ్చు. పదవీకాలం ముగియడానికి పది నెలల ముందే ప్రధాని పదవి నుంచి తప్పుకొంటున్నట్టు ఆమె ప్రకటించటం ఆ దేశ ప్రజలకే కాదు... అంతర్జాతీయ సమాజానికి కూడా ఊహకందనిది. రెండేళ్ల క్రితం అమెరికాలో ట్రంప్, మొన్నటికి మొన్న బ్రెజిల్‌లో బోల్సెనారో ఏం చేశారో అందరూ చూశారు. జనం అధికారం ఇవ్వలేదని తెలిసి కూడా దాన్ని ప్రత్యర్థుల నుంచి బల ప్రయోగంతో కాజేయడానికి ప్రయత్నించారు. కానీ జసిండా వీరికి భిన్నం. సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించటం అసాధ్యమనుకున్న వెంటనే ఆమె రాజీనామా చేశారు. ఇప్పటికీ అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా ముందంజలో ఉన్న ఆమె ఇలా ఆలోచించటం ఊహాతీతం.

పదవీకాలం ముగియడానికి ముందే తప్పుకోవటం న్యూజిలాండ్‌కు కొత్తగాదు. ఆమెకు ముందు పనిచేసిన నేషనల్ పార్టీ నేత జాన్ కీ కూడా 2017 వరకూ పదవీకాలం ఉన్నా ఏడాది ముందే వైదొలగి డిప్యూటీ ప్రధాని బిల్ ఇంగ్లిష్‌కు బాధ్యతలు అప్పజెప్పారు. అయితే సంక్లిష్ట సమస్యలు ఎదురైనప్పుడు ఆయన వ్యవహారశైలికీ, జసిండా తీరుకూ చాలా వ్యత్యాసముంది. జాన్ కీ అప్పట్లో అన్నిటా వైఫల్యాలు చవిచూసి పార్టీలో ఒత్తిళ్లు పెరిగి తప్పనిసరై తప్పుకోవాల్సి వచ్చింది. కానీ జసిండా అలా కాదు. పార్టీలో ఆమె పట్ల సానుకూలత చెక్కుచెదరలేదు. సంక్షోభ సమయాల్లో ఆమె దృఢంగా ఉండటమే, సమస్యలను అధిగమించటమే అందుకు కారణం. కరోనా విజృంభిస్తున్నప్పుడు అన్ని దేశాలూ లాక్‌డౌన్‌తో సహా అనేక ఆంక్షలు విధించి పౌర జీవనాన్ని స్తంభింపజేస్తే ఆమె మాత్రం నిబ్బరంగా ఎదుర్కొన్నారు. పరిమిత ప్రాంతాల్లో మాత్రమే స్వల్ప స్థాయి ఆంక్షలు విధించారు. చైనానుంచి స్వదేశానికి పోయిన ఫిలిప్పీన్స్ పౌరుడొకరు 2020 ఫిబ్రవరి 2న కరోనా వైరస్ బారినపడి మరణించినట్టు వార్త రాగానే చైనానుంచి రాకపోకలు నిలిపేస్తున్నట్టు ఆమె ప్రకటించారు. యూరప్ దేశాల్లో కరోనా మరణాలు నమోదు కావడం మొదలుకాగానే అక్కడి నుంచి కూడా విమానాలు నిలిపివేశారు. ఈ ఆంక్షలపై ఇంటా, బయటా విమర్శలొస్తున్నా లెక్క జేయలేదు. అయితే ఆమె తక్షణ స్పందనవల్ల ప్రపంచ దేశాల్లో వేలాదిమంది కరోనా బారినపడిన తరుణంలో న్యూజిలాండ్‌లో కేవలం రెండే కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత సైతం రెండంకెల సంఖ్యకు మించి కరోనా కేసులు లేవు. పౌరుల సాధారణ జీవనానికి అంతరాయం కలగలేదు. ప్రజలను భయభ్రాంతులను చేయడంకాక వారు అప్రమత్తంగా ఉండేలా, ఆత్మవిశ్వాసంతో మెలిగేలా సూచనలు చేయడంవల్లే ఈ విజయం సాధ్యమైందని ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం జసిండాను ప్రశంసించింది. కరోనా సంబంధ కేసుల సమాచారాన్ని తొక్కిపట్టివుంచటం కాక పారదర్శకంగా వ్యవహరించటం ఆ మహమ్మారిని సునాయాసంగా ఎదుర్కొనడానికి దోహదపడింది.

అయితే జసిండా పాలనపై ప్రజానీకంలో ఇటీవల కొంత అసంతృప్తి ఏర్పడిన మాట వాస్తవం. సర్వేల్లో విపక్ష నేషనల్ పార్టీ ముందంజలో ఉంది. అయితే ప్రధాని పదవికి అర్హులని భావిస్తున్న నేతల్లో ఇప్పటికీ ఆమే అందరికన్నా ముందున్నారు. కరోనా అనంతర పరిస్థితులు, ఉక్రెయిన్‌లో రష్యా దురాక్రమణ యుద్ధం న్యూజిలాండ్‌ను కూడా సంక్షోభంలోకి నెట్టాయి. ఉపాధి కల్పనలో పురోగతి లేదు. ద్రవ్యోల్బణం పెరిగింది. ఈ పరిణామాలన్నీ పౌరులకు ఆందోళన కలిగిస్తున్నాయి. దీంతోపాటు 2019లో క్రైస్ట్ చర్చి నగరంలో రెండు మసీదుల్లోకి చొరబడి ఒక దుండగుడు 51 మందిని పొట్టనబెట్టుకున్న ఉదంతాన్ని జనం ఇప్పటికీ మరిచిపోలేకపోతున్నారు. ప్రపంచంలో ఐస్‌లాండ్ తర్వాత అత్యంత శాంతియుత దేశంగా ఎప్పుడూ రెండో స్థానంలో ఉండే న్యూజిలాండ్‌కు ఈ ఉదంతాలు ఊహకందనివి. అయితే ఆ సమయంలో జసిండా వ్యవహరించిన తీరు ఆదర్శప్రాయమైనది. వెనువెంటనే దేశ ప్రజలనుద్దేశించి ఆమె చేసిన ప్రసంగం, బాధితులపట్ల ఆమె చూపిన దయార్ద్రత అందరినీ చలింపజేసింది. ఆ తర్వాత మారణాయుధాల విషయంలో ఉదారంగా ఉండే దేశ చట్టాలను ఆమె సవరించారు. ఈ క్రమంలో పెద్దయెత్తున వ్యతిరేకత వచ్చినా లెక్కజేయలేదు. దృఢంగా వ్యవహరించటమంటే నిరంకుశంగా పాలించటం కాదని సమస్యలపై సకాలంలో స్పందించి, అవసరమైతే కఠినమైన నిర్ణయాలు తీసుకోవటమని తన ఆరేళ్ల పాలనలో జసిండా నిరూపించారు. ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న లేబర్ పార్టీ సామ్యవాద విధానాలు ఆమెకు ప్రజాదరణ తెచ్చిపెట్టి ఉండొచ్చు. కానీ దేశం ఎదుర్కొంటున్న సమస్యల విషయంలో ఒక మహిళగా మనసుపెట్టి ఆలోచించిన తీరు, తీసుకున్న సృజనాత్మక నిర్ణయాలు ఆమెను విలక్షణ నేతగా నిలిపాయి. ముఖ్యంగా నవజాత శిశువులున్న కుటుంబాలకు 2018లో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించటం, తాజాగా ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనేందుకు ఆ కుటుంబాలకు నెలనెలా అదనపు ఆర్థిక సాయం అందించటం అందరినీ ఆకట్టుకుంది. వేతనాల్లో లింగ వివక్షను నిషేధించి, సమాన పనికి సమాన వేతనం లభించేలా తీసుకొచ్చిన చట్టం కూడా ప్రశంసలు పొందింది. అధికారమే పరమావధవుతున్న వర్తమానంలో జసిండా వంటి వారు చాలా అరుదు. వచ్చే అక్టోబర్ ఎన్నికల్లో విజేతలెవరో కచ్చితంగా ఎవరూ చెప్పలేకపోయినా ఆమెకు సాటిరాగల నేతలు పాలక, ప్రతిపక్షాల్లో ఎవరూ లేరన్నది వాస్తవం. ఎందుకంటే ఆమె నెలకొల్పిన పాలనా ప్రమాణాలు అటువంటివి.

మారువేషంలో కొలీజియంలోకా?

విశ్లేషణ



ఇందిరా జైసింగ్

అసలంటూ ప్రస్తుతం ఉనికిలోనే లేని 'శోధన, మూల్యాంకన కమిటీ'లో ప్రభుత్వ ప్రతినిధులు కూడా ఉండాలన్న కేంద్ర న్యాయమంత్రి సూచన తీవ్రమైనది! కేవలం న్యాయమూర్తులను మాత్రమే కలిగి ఉన్న కొలీజియంలో ప్రవేశించడానికి ప్రభుత్వం తెలివిగా మారువేషంలో వేస్తున్న తొలి అడుగుగా దీన్ని భావించాలి. న్యాయమూర్తుల ఎంపిక కమిటీలో ప్రభుత్వ ప్రాతినిధ్యం న్యాయవ్యవస్థ స్వతంత్రతను ధ్వంసం చేస్తుందని న్యాయమూర్తుల నియామక కమిటీ చట్టం కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు పేర్కొంది. న్యాయమంత్రి సూచన ఆ తీర్పును తోసిపుచ్చే ప్రయత్నమే. అలాగని హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల ప్రాతిపదికలో ఎలాంటి తప్పూ లేదని సూచించడం లేదు. ఇక్కడే శోధన ప్రారంభం కావలసి ఉంది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నియామకాల కోసం 'శోధన, మూల్యాంకన కమిటీ' (సెర్చ్ కమ్ ఎవాల్యుయేషన్ కమిటీ)ని నియమించాలంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌కు కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు లేఖ రాసినట్టు తెలిసింది. ఈ విషయాన్ని చర్చించేముందుగా మంత్రి సూచించిన శోధన, మూల్యాంకన కమిటీ అనేది ఉనికిలో లేదని గమనించాలి. ప్రస్తుతం ఉనికిలో ఉన్న చట్టం ప్రకారం ప్రధాన న్యాయమూర్తి, ఇద్దరు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులతో కూడిన కొలీజియం... హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను నియమిస్తూ ఉంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించినంతవరకూ ప్రధాన న్యాయమూర్తి, నలుగురు అత్యంత సీనియర్ న్యాయమూర్తులతో కూడిన కొలీజియం సిఫార్సు చేస్తుంది.

శోధన, మూల్యాంకన కమిటీ అవసరం ఇప్పుడు ఉందా? సమాధానం నిశ్చయాత్మకంగా అవును అన్నట్లయితే, అలాంటి కమిటీ పొందిక ఎలా ఉండాలి అనేది మరో ప్రశ్న. హైకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించడం సంప్రదాయంగా వస్తోంది. అయితే తాను పనిచేసే హైకోర్టులో ఆయన్ని ప్రధాన న్యాయమూర్తిగా నియమించరు. అలాగే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించే సందర్భంలోనే సుప్రీంకోర్టులో రాష్ట్రాల భౌగోళిక ప్రాతినిధ్యాన్ని లెక్కిస్తారు. కాబట్టి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించిన ప్రాతిపదిక ఇప్పటికే స్పష్టంగా ఉంది. కాబట్టి, కొత్తగా శోధన, మూల్యాంకన కమిటీ అవసరం లేదని తెలుస్తున్నది. దీనికి బదులుగా సీనియారిటీ నిబంధనను పక్కన పెట్టి చేసే నియామకాలకు ప్రాతిపదిక అవసరం.

పరిధి ప్రాతిపదికను పరిగణించే అవకాశం పైన చెప్పినట్టుగా పరిమితం. కాబట్టి కేంద్ర మంత్రి సూచించిన శోధన, మూల్యాంకన కమిటీ ఈ సంప్రదాయానికి చేసే జోడింపు పెద్దగా లేదనే చెప్పాలి. ఇక జడ్జీల పనితీరు మూల్యాంకనం కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల విధి. సుప్రీంకోర్టుకు నియమించాల్సిన న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పుల బాగోగులను సుప్రీంకోర్టు న్యాయమూర్తులే చక్కగా మూల్యాంకన చేయగలరు. దీన్ని పక్కనబెడితే, న్యాయ నిర్ణయాలు చాలా తరచుగా సుప్రసిద్ధ న్యాయ పత్రికల్లో తీవ్రమైన విద్యాత్మక విమర్శలకు గురవుతుంటాయి. న్యాయమూర్తుల మూల్యాంకనకు ఇది సుపరిచితమైన పద్ధతి. ఇలాంటి పరిస్థితుల్లో శోధన, మూల్యాంకన కమిటీలో ప్రభుత్వ ప్రతినిధులు కూడా ఉండాలన్న కేంద్ర న్యాయ మంత్రి సూచన తీవ్రమైనది! కేవలం న్యాయమూర్తులను మాత్రమే కలిగి ఉన్న కొలీజియంలో ప్రవేశించడానికి ప్రభుత్వం తెలివిగా మారువేషంలో వేస్తున్న తొలి అడుగుగా దీన్ని భావించాలి.



స్పష్టంగా చెప్పాలంటే, భారత రాజ్యాంగం నిర్దేశించిన అధికారాల విభజన సూత్రాన్ని న్యాయమంత్రి తాజా సూచన ధ్వంసం చేస్తుంది. ఈ అధికారాల విభజన రాజ్యాంగ ప్రాథమిక లక్షణాల్లో ఒకటి. అన్ని రాజ్యాంగ బద్ధ సంస్థల్లో న్యాయవ్యవస్థ మాత్రమే, ప్రభుత్వాన్ని ఎన్నుకున్న మెజారిటీ ప్రజాభిప్రాయానికి ప్రతితులనాత్మకంగా ప్రభుత్వ పనితీరు పట్ల నిరోధ సమతౌల్యాన్ని అందించగలదు. ప్రభుత్వ పనితీరుకు నిరోధ సమతౌల్యంగా ఉండాల్సిన న్యాయమూర్తుల నియామక కమిటీలో అదే ప్రభుత్వం భాగమైతే, ప్రభుత్వ ఇతర విభాగాలను తనిఖీ చేసే కోర్టు విధిని అది ధ్వంసం చేస్తుంది. ఇది 'కోళ్ళగూటిలోకి నక్కను స్వయంగా ఆహ్వానించడమే' అవుతుంది.

న్యాయమూర్తుల ఎంపిక కమిటీలో ప్రభుత్వ ప్రాతినిధ్యం అనేది న్యాయవ్యవస్థ స్వతంత్రతను ధ్వంసం చేస్తుందని న్యాయమూర్తుల నియామక కమిటీ చట్టం కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో న్యాయ మంత్రి సూచన ఆ తీర్పును తోసిపుచ్చే ప్రయత్నమే.

సుప్రీంకోర్టు ద్వారా ప్రకటితమైన చట్టాన్ని మార్చడానికి రెండు సుపరిచిత మార్గాలు ఉన్నాయి. మొదటిది, సముచితమైన శాసనం ద్వారా న్యాయస్థానం అన్వయించిన తీర్పు ప్రాతిపదికనే మార్చివేయడం. రెండో మార్గం ఏమిటంటే, విస్తృత ధర్మాసనం ద్వారా ఆ తీర్పును తోసిపుచ్చడానికి ప్రయత్నించడం. ప్రభుత్వం ఈ రెండింటిలో ఏ ఒక్కదానికీ పూనుకోలేదు. బదులుగా, భారత ఉపరాష్ట్రపతి, న్యాయమంత్రి వంటి అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారే న్యాయస్థానం తీర్పునకు భిన్నంగా ప్రకటనలు చేస్తూ వచ్చారు. న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే ప్రయత్నంలో, మొత్తంగా న్యాయవ్యవస్థ చట్టబద్ధతనే రద్దుపరిచే ప్రయత్నంలో భాగంగా ఇదంతా జరుగుతూండటం గమనార్హం.

న్యాయమూర్తుల నియామక విధానాన్ని మార్చాలని ప్రభుత్వం తీవ్రంగా భావిస్తూ ఉన్నట్లయితే, న్యాయమూర్తుల నియామక చట్టాన్ని తోసిపుచ్చిన తర్వాత ఒక కొత్త చట్టాన్ని తీసుకురాకుండా దాన్ని ఏదీ అడ్డుకోలేదు. అయితే ఈ మార్గాన్ని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే చేపట్టడం లేదు. అసలు అలాంటి చట్టాన్ని రూపొందించే అవసరాన్నే ప్రభుత్వం పరిగణించలేదు. ఎందుకంటే, ప్రభుత్వంతో సంప్రదింపుల తర్వాతే నియామకాలను చేపడుతున్న పక్షంలో అలాంటి న్యాయమూర్తులతో ప్రభుత్వం ఎంతో సౌకర్యవంతంగా ఉంటూ వస్తోంది. రాష్ట్రపతి ఆదేశంతో నిమిత్తం లేకుండా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని గానీ, న్యాయమూర్తులను గానీ కొలీజియం సిఫార్సు చేసిన సందర్భం ఒక్కటి కూడా లేదు. అలాగే కొలీజియం చేసిన ఏ సిఫారసు అయినా ప్రభుత్వానికి అసౌకర్యంగా మారి వ్యతిరేకించిన పక్షంలో అలాంటి సూచనలను న్యాయవ్యవస్థ వెనక్కు తీసుకోవడం కూడా జరిగేది కాదు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎన్నికైన జస్టిస్ ఎన్వీ రమణ యూపీఏ ప్రభుత్వ హయాంలో ఎంపికైన చివరి న్యాయమూర్తి కావడం తెలిసిందే. ఆ తర్వాత వచ్చిన ప్రధాన న్యాయమూర్తులు ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే నియమితులవుతూ వచ్చారు.

అలాగని హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల ఎంపిక ప్రాతిపదికలో ఎలాంటి తప్పూ లేదని ఇక్కడ సూచించడం లేదు. ఇక్కడే శోధన ప్రారంభం కావలసి ఉంది. ముఖ్యంగా, హైకోర్టుల నియామకాల కోసం ప్రాతిపదిక గురించి న్యాయ మంత్రి తాజా లేఖ పేర్కొనడం లేదు. సమస్య ఇక్కడే ఉందని నేను నమ్ముతున్నాను. న్యాయమూర్తులను నియమించే దశలోనే శోధన, మూల్యాంకనకు ప్రాధాన్యత ఉంటుంది. అయితే న్యాయమూర్తులతో కూడిన కమిటీనే దాన్ని చేపట్టాలి. న్యాయమూర్తుల నియామకాలకు నిర్దిష్ట ప్రాతిపదిక ఉండాలి. ఆ ప్రాతిపదికను ముందుగానే ప్రకటించి ప్రచురించాలి.

అందుబాటులో ఉన్న ఉత్తమ అభ్యర్థిని న్యాయమూర్తిగా ఎంపిక చేయడానికి సరైన మార్గం ఏదంటే, ప్రస్తుతం లోపభూయిష్టంగా ఉంటున్న న్యాయమూర్తుల నియామక వ్యవస్థను అధిగమించడం. దానికిగానూ సంబంధిత అభ్యర్థులు తమ ఆసక్తిని వ్యక్తపర్చడానికీ, స్వయంగా నామినేషన్ దాఖలు చేయడానికీ అనుమతించాలి. అప్పుడు మాత్రమే జడ్జీల నియామకానికి చెందిన పరిగణన పరిధి విస్తృతం అవుతుంది. ప్రజలకు బహిరంగంగా తెలుస్తుంది కూడా. స్వీయ నామినేషన్ వ్యవస్థ మాత్రమే వర్గం, కులం, జాతి, లైంగిక ధోరణికి సంబంధించిన వైవిధ్యతకు హామీ ఇస్తుంది. ధర్మాసనంలో మనం చూడవలసిన బహుళత్వం, వైవిధ్యం గురించి అర్థం చేసుకోవడానికి అది వీలు కలిగిస్తుంది.

వ్యాసకర్త సీనియర్ న్యాయవాది, భారత మాజీ అదనపు సొలిసిటర్ జనరల్
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మరెందుకు కోపం?



తమ అత్యున్నత నాయకుడి పాలనలో మైనారిటీల పట్ల అమానవీయంగా ప్రవర్తించారని చెప్పే 'బీబీసీ డాక్యుమెంటరీ' మీద భక్తులు ఎందుకు కోపంగా ఉన్నారో అర్థం చేసుకోవడం కష్టంగా ఉంది. సరిగ్గా ఆ కారణంగానే కదా వాళ్లు ఆయనకు ఓట్లేస్తారు!

– పునీత్ పానియా, స్టాండప్ కమెడియన్

తరమడం నిజం



జనవరి 19న కశ్మీరీ హిందువుల మారణహోమ దినం. అవును, అది మారణహోమమే. ఇస్లామిస్టు తీవ్రవాదులు బలవంతంగా తరిమేయడం వల్ల మూడు నెలల లోపే హిందూ మైనారిటీలు అంటూ దాదాపుగా లేకుండా కశ్మీర్ ఖాళీ అయింది. ఇప్పుడు లక్ష రూకల ప్రశ్న: గత ముప్పై ఏళ్లలో ఇస్లామిస్ట్ మైండ్‌సెట్ ఏమైనా మారిందా?

– జావేద్ బేగ్, మాజీ సీఎం పీఆర్‌ఓ

అభ్యంతరం మీద అభ్యంతరం



న్యాయమూర్తి అభ్యర్థుల పట్ల ప్రభుత్వ అభ్యంతరాలను బహిరంగ పరచాలన్న సుప్రీంకోర్టు నిర్ణయం వివాదాన్ని పెంచుతుంది. న్యాయమూర్తులు తమ బహిర్గత రాజకీయ అభిప్రాయాలు, లింగ స్థితిని బెంచ్‌కు మోసుకెళ్ల కూడదనీ, అవి వారి తీర్పులను ప్రభావితం చేస్తాయనీ అభ్యంతరం వ్యక్తం చేసిన ప్రభుత్వం మీద కన్నెర్ర చేసే ప్రయత్నం తగదు.

– కన్వల్ సిబల్, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి

ప్రతిష్ఠ కొనుగోలు



దావోస్ పోవడానికి భారతీయ వ్యాపారవేత్తలు రూ.1.7 కోట్లు (ప్రవేశ రుసుము) ఎందుకు ఖర్చు చేస్తారో ఒక లోపలి కోణం: వాళ్లు దావోస్ పోయారని అందరికీ తెలియాలి– అది గొప్ప స్టేటస్ సింబల్; వచ్చే రాజకీయ నాయకులతో ప్రైవేటుగా మాట్లాడే అవకాశం; జర్నలిస్టులకు ఇంటర్వ్యూలు ఇవ్వడం.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

నగదు బదిలీతో ఆర్థిక వ్యవస్థకు మేలే!

అభిప్రాయం



మాకా రాజేంద్రన్

ఏపీలో ఇప్పుడున్న పాలక పక్షానికి (వైఎస్సార్‌సీపీ) గత మూడున్నర ఏళ్ల క్రితం ఏకాఏకిన 151 అసెంబ్లీ సీట్లను ప్రజలు కట్టబెట్టారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వైసీపీ ప్రభుత్వం – నూతన పరిపాలనా సంస్కరణలతో, తాను చేసిన వాగ్దానాల మేరకు... సంక్షేమ పథకాలు, ఉద్యోగకల్పన, పరిపాలనా వికేంద్రీకరణతో శరవేగంగా దూసుకపోతూ వచ్చింది. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన అన్ని పథకాల్లోకెల్లా బాగా ప్రాచుర్యం పొందినవి రెండు – ఒకటి యువతకు భారీ ఉద్యోగ కల్పన. రెండు – నగదు బదిలీ పథకం.

నగదు బదిలీ పథకం విషయంలో 'పేదల్ని కూర్చోబెట్టి పోషిస్తున్నా' రంటూ అనేకమంది అక్కసు వెళ్ళగక్కుతూ వస్తున్నారు. వాస్తవానికి ప్రజలకు చేస్తున్న ఈ నగదు బదిలీ వల్ల ఖజానాకు ఒక్క పైసా నష్టం రాకపోగా; నగదు బదిలీ జరిగిన మరుసటి వారంలోపే దానిలో అత్యధిక భాగం తిరిగి చిల్లర వ్యాపారులకు – తద్వారా రాష్ట్ర ఖజానాకే చేరుతుంది ఆ డబ్బంతా! ఈ ద్రవ్య సంచయం వల్లనే రాష్ట్ర ఖజానాకు నిత్యం ఆదాయం వస్తూనే ఉంటుంది. నగదు బదిలీ పథకం వల్ల ప్రజలకు కొత్తగా తెలిసిందేమంటే – ఇంత భారీగా ప్రజలకు ఇవ్వగలిగిన సొమ్ము – ఇప్పటి వరకు గత పాలకులు తమకు దక్కకుండా చేశారనే విషయం.

ఇక ఉద్యోగ కల్పన విషయానికి వస్తే... గత ప్రభుత్వాలు యువతకు ఉద్యోగాలు కల్పించకపోగా; ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతుల్లో ఉద్యోగ నియామకాలు చేసి, దళారీల దోపిడీకి తలుపులు బార్లా తెరిచాయి. ఇంతే కాదు, ఇలాంటి అస్థిర ఉద్యోగాల వల్ల అటువంటి ఉద్యోగులు – ఎప్పుడు ఊడిపోతుందో తెలియని ఉద్యోగాలతో రాజీ పడలేక, నాణ్యమైన సేవలు అందించలేక అస్థిర జీవనం కొనసాగించే వారు. అలాంటి తరుణంలో – వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన భారీ ఉదార ఉద్యోగ కల్పన వల్ల కొన్ని లక్షల మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ ఉద్యోగాల కల్పన వల్ల యువతకు సుస్థిర జీవనం సాగించే అవకాశంతో పాటు; తమ మీద తమకు ఆత్మ విశ్వాసం పెరిగింది. వీరికిచ్చే జీతాల వల్ల రాష్ట్ర ఖజానాపై పెను భారం పడుతుందన్న ప్రతిపక్షాల చీకటి ప్రచారాలు కూడా సరైన వాదనకు నిలబడేవి కావు. కారణం – ఇన్ని లక్షల మందికి చెల్లించే వందల కోట్ల జీతాల మొత్తాలు మరుసటి రోజే మార్కెట్‌లోకి వెళ్ళిపోతున్నాయి ఖర్చుల రూపంలో. ఖర్చులోనే ఆదాయముంటుందన్న ఆర్థిక సూత్రం మేరకు మళ్ళీ వీరి ఖర్చు ప్రభుత్వ ఖజానాలకు ఆదాయంగా మారుతోంది. అందువల్ల వీరి జీతాలను ఖర్చుగా భావించనక్కర్లేదు. పైపెచ్చు ఈ భారీ ఉద్యోగిత వల్ల పాలనా, సేవా సౌకర్యాలు అత్యంత సామాన్యుని ఇంటి ముంగిట వరకు చేరటంతో – పౌర సమాజానికి సమయం, డబ్బు ఆదా అవుతోంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మానవ వనరుల అభివృద్ధికి తొలి ప్రాధాన్యత నిచ్చి, ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు చదువుకొనే విద్యార్థులకు అనేక ఫీజు రాయితీలు కల్పిస్తూ; ప్రభుత్వ రంగ విద్యా సంస్థల్లోని సౌకర్యాలను మెరుగుపరుస్తూ గ్రామీణ నిరుపేద విద్యార్థులకు విద్యను అందుబాటులోకి తేవటం వల్ల... సమీప భవిష్యత్తులో నాణ్యమైన ప్రమాణాలు కల విద్యార్థి సమూహం సమాజంలోకి ధీమాగా అడుగు పెడుతుంది.



ఇక వైద్య రంగాన్ని గమనిస్తే – వైద్య, ఆరోగ్య రంగాలలో భారీ ఉద్యోగితను కల్పించటం; ప్రభుత్వ రంగ వైద్య ఆరోగ్య సంస్థలను అభివృద్ధి పరచడం... తద్వారా అందని ద్రాక్షగా తయారైన వైద్యాన్ని సామాన్యుని ముంగిటకు తెచ్చినట్టయింది.


రాష్ట్ర విభజన సందర్భంగా తలెత్తిన సమస్యలూ, గత ప్రభుత్వం చేసిన నిర్వాకాలు ఫలితంగా మిగిలిన అప్పులూ... వెరసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంక్షేమ కార్యక్రమాల నిర్వహణను భారం చేశాయి.

అంతకు ముందు ఐదేళ్లల్లో ఏనాడూ ప్రజా సంక్షేమాన్ని అంతగా పట్టించుకోని చంద్రబాబు ఎన్నికల సంవత్సరంలో మాత్రం ఎడాపెడా రాష్ట్రమంతటా రోడ్లు వేయించ పూనుకున్నాడు. వేగుల ద్వారా – ప్రభుత్వంపై ఉన్న తారాస్థాయి అసంతృప్తి సమాచారాన్ని తెలుసుకొన్న తాను దోమలపై దండయాత్ర అంటూ, పంచాయితీలకు ఎన్నికల సంవత్సరం మాత్రం ఇబ్బడి ముబ్బడిగా నిధులిచ్చాడు. ఈ 'ఆఖరు క్షణం ఖర్చుల' వల్ల రాష్ట్రానికి మూడు విధాల నష్టం వాటిల్లింది. కాంట్రాక్టర్లు, స్థానిక నాయకులతో చేతులు కలిపి భారీగా అవినీతికి పాల్పడటం మొదటిది కాగా; ఈ అవినీతి వల్ల పనుల్లో నాణ్యత తగ్గటం రెండోది. ఈ పర్యవసానాల వల్ల రాష్ట్ర బొక్కసం మొత్తం ఖాళీ అవ్వడం మూడోది. ఫలితంగా జగన్ తన పాలనను 'మైనస్ జీరో బడ్జెట్' నుండి మొదలు పెట్టాడని చెప్పాలి. ఎందుకంటే – అప్పటికే రాష్ట్రానికి ఉన్న అప్పు – 2 లక్షల 64 వేల, 451 కోట్లు కాగా, చేతిలో చిల్లిగవ్వ లేకుండా రాష్ట్ర బొక్కసం మొత్తం ఖాళీ కావటం వల్ల వైఎస్ జగన్ ప్రభుత్వానికి తొలిరోజు నుండే ఆర్థిక ఇబ్బందులు తప్పలేదు. గత ప్రభుత్వం చేసిన అప్పులపై కనీసంగా వెయ్యి కోట్ల రూపాయిలు వడ్డీ ప్రతి నెలా చెల్లించాల్సి వస్తోంది. అయినా కూడా పేదల కోసం మొదలెట్టిన నగదు బదిలీ పథకం అప్రతిహతంగా కొనసాగించే విషయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అభినందించాల్సిందే!

వ్యాసకర్త సామాజిక విశ్లేషకుడు
మొబైల్: 94 9151 8909

గా వయ్యి యాడ దొరుక్తది జెర జెప్పండ్రి

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దుగాల ఛాయ్ దాక్కుంట గూసున్న. యాద్గిరి మామొచ్చిండు.

''ఊళ్లె అందరు బాగుండ్రానె.''

''అందరెట్ల బాగుంటరురా? కొంత మందే బాగున్నరు. (మామ రాజకీయాలు మాట్లాడుడు షురువు జేసిండని మనసుల అనుకున్న.) మన ఊల్లె ఏంది. దేసంలనే పది మంది కోట్లు కమాయించి మజా జేస్తుంటె కద్మ జెనం ఆకలితోని సస్తున్నరు'' అని అన్నడు.

''సంటర్ సర్కార్ బీదోల్లకు ఐదు కిలల వొంతున బియ్యం ఫిరీగ ఇస్తున్నది. ఇంకేం జెయ్యాలెనే?''

''బియ్యం ఫిరీగ ఇయ్యంగనే అయిపాయెనా? గ్యాసు బండ దర మూడింతలు బెర్గె. సంక్రాంతి పండ్గ దినాన వందే బారత్ రేల్ గాడిని షురువు జేసింద్రు. లష్కర్ కెల్లి ఎన్మిదిన్నర గంటలల్ల విశాకపట్నం బోతది. గని గాడి ఛార్జిలే మొగులు మీదున్నయి. ఎగ్జిక్యూటివ్ కిలాస్ టికిట్ దర 3,170 రూపాయలు. గని గాలి మోటర్ టికిట్ దర 3,900. గాల్లు, గీల్లతో పండ్గ నాడు సీట్లు నిండినయి. ఆవలి దినం కెల్లి సగం కన్న ఎక్వ సీట్లు కాలిగున్నయి. ఒక్క దినం యేసానికి మూతి మీసం గొరిగిచ్చుకున్న తీర్గున్నది గీ రేల్ గాడి సంగతి.''



''మామా రాహుల్ గాంది పెండ్లెందుకు జేస్కోలేదే?''

''నెహ్రూ ప్రతాని అయినప్పుడు గాయిన పెండ్లాం లేదు. ఇందిరా గాంది ప్రతాని కుర్సి మీద గూసున్నప్పుడు గామె మొగడు లేడు. మొరార్జి దేశాయ్ ప్రతాని అయినప్పుడు గాయిన పెండ్లాం లేదు. గదే తీర్గ పీవీ నరసింహారావు ప్రతాని కుర్సి మీద గూసున్నప్పుడు గాయిన పెండ్లాం లేదు. వాజపేయి అయితే పెండ్లే జేస్కోలేదు. మోదీకి పెండ్లాం ఉన్నా లేనట్టే లెక్క. పెండ్లాం లేకుంటనే ప్రతాని అయ్యేటి మోక దొర్కుతదని రాహుల్ గాంది పెండ్లి జేస్కోలేదు. పెండ్లాం లేకుంటె ఎంత లాబమో ఒకపారి వాజపేయి జెప్పిండు.

రొండు దినాలల్ల పోఖ్రాన్ అను పరీచ్చ జేస్తరనంగ అబ్దుల్ కలాం అప్పటి ప్రతాని వాజపేయి దగ్గరకు బోయిండు. అనుపరీచ్చ జేస్తమన్న సంగతిని మనద్దరికె తప్పిడ్సి ఎవ్వల్కి ఎర్క గాకుంట సూడుండ్రి అన్నడు. మీకు పెండ్లాం లేదు, నాకు పెండ్లాం లేదు. గసువంటప్పుడు గీ సంగతి మనిద్దరికె దప్పిడ్సి కడ్మోల్లకు ఎట్ల ఎర్కైతది వయా అని వాజపేయి అన్నడు.''

''కేసీఆర్ సంగతేంది మామా?''

''కమ్మంల కేసీఆర్ బీఆర్ఎస్ పుట్టుక సబ బెట్టిండు. నగరమంత గులాబి జెండలు ఎగిరేసింద్రు. సబకొచ్చిన లీడర్ల కోసం అర్వై మూడు తీర్ల తెలంగాన వొంటకాలను జేపిచ్చింద్రు. నాటుకోడి కూర, బొమ్మిడాయిల పుల్సు, కొర్రమీను కూర, రొయ్యల ఫ్రై, బిర్యాని అసుంటియి గూడ ఉన్నాయి. ఏడు తీర్ల స్వీట్లను గుడ్క జేపిచ్చింద్రు. సబకు వొచ్చినోల్ల గురించి ఎన్మిది లచ్చల మంచినీల్ల సీసలు బెట్టింద్రు. నూట నల్వయి ఫీట్ల పొడ్గు, అర్వై ఫీట్ల ఎడల్పుతోని పెద్ద స్టేజి గట్టింద్రు. కేరల ముక్యమంత్రి విజయన్, డిల్లీ ముక్యమంత్రి కేజ్రీవాల్, పంజాబ్ ముక్యమంత్రి బగవంత్ మాన్, యుపి మాజీ సీఎం అకిలేశ్ యాదవ్, సీపీఐ జాతీయ ప్రతాన కార్యదర్శి డి. రాజా గీ సబకొచ్చింద్రు. విజయన్, డి.రాజా అంగ్రేజీల స్పీచ్ గొడ్తె కడ్మోల్లు హిందిల మాట్లాడింద్రు. గాల్ల మాటలు అర్తం గాక జెనం లొల్లి బెట్టింద్రు. గిప్పుడు మనది జాతీయ పార్టీ, ఏ బాస ఎవ్వలు మాట్లాడినా లొల్లి బెట్టకుంట ఇనాలె అని కేసీఆర్ అన్నడు.''

''కేసీఆర్ ఏమని స్పీచ్ గొట్టిండే?''

''వొచ్చేటి లోకసబ ఎలచ్చన్ల మోదీ ఇంటికి బోతడు. మనం డిల్లికి బోతం. దేసమంత రైతు బందు, దలిత బందు పద్కాలు బెడ్తం. 70 వేల టీఎంసీల నీల్లు దొర్కుతున్నా 20 వేల టీఎంసీల నీల్లు వాడుతున్నం. కాలేశ్వరం అసువంటి ప్రాజెక్టులు లేకపోయె బట్కె దేసంల 50 వేల టీఎంసీల నీల్లు వుజూల్ల బోతున్నది. బీఆర్ఎస్ సర్కారొస్తె దేసమంతట కాలేశ్వరం అసువంటి ప్రాజెక్టులు గట్టిపిస్తది అన్కుంట కేసీఆర్ స్పీచ్‌గొట్టిండు. చింతకాని మండలంల వందనం అనేటి ఊరున్నది. గా ఊరుకు బోరుతోని నీల్లు ఇస్తున్నరు. బోరు నడ్సెతందుకు వాడేటి కరెంటును బీఆర్ఎస్ పుట్టుక సబకు మల్పింద్రు. దాంతోని తాగెతందుకు నీల్లు లేక వందనం ఊరోల్లు తిప్పలబడ్డరు. యాడాదిల ప్రతాని అవుడెట్ల అనేటి వయ్యి గురించి కేసీఆర్ ఒక్క తీర్గ లెంకుతున్నడు. వొస్తరా'' అన్కుంట మా యాద్గిరి మామ బోయిండు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 99591 50491

గ్రహం అనుగ్రహం శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: అమావాస్య రా.3.21 వరకు, తదుపరి మాఘ శు.పాడ్యమి, నక్షత్రం: పూర్వాషాఢ ఉ.9.40 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: సా.5.06 నుండి 6.34 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.38 నుండి 8.07 వరకు, అమృతఘడియలు: రా.2.03 నుండి 3.44 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.45

బుల్లిపిట్ట.. ప్రపంచ రికార్డు

అలాస్కా తీరం నుంచి ఆస్ట్రేలియా తీరం వరకూ..
నాన్‌స్టాప్‌గా 13,560 కిలోమీటర్లు ప్రయాణం




ఒక బుల్లి వలస పిట్ట 13,560 కిలోమీటర్లు ఏకబిగిన ప్రయాణించి ప్రపంచ రికార్డు సృష్టించింది. విశ్రాంతి, ఆహారం లేకుండా నాన్‌స్టాప్‌గా 11 రోజులు ప్రయాణించి శాస్త్రవేత్తలను సైతం ఆశ్చర్యపరిచింది. లిమోసా ల్యాపోనికా జాతికి చెందిన బార్ టెయిల్డ్ గాడ్‌విట్ అనే చిన్న పక్షి అమెరికాలోని అలాస్కా వద్ద నోమ్ తీరం నుంచి గతేడాది అక్టోబర్ 13న బయలుదేరి ఆస్ట్రేలియాలోని టాస్మేనియా వద్ద ఆన్‌సాన్స్ తీరం వరకు ప్రయాణించి ఈ రికార్డు సాధించింది. – సాక్షి, అమరావతి

బీ6 ప్రయాణమిలా..



- ఇది తొలుత హవాయికి పశ్చిమ దిశగా ఎగరడం ప్రారంభించింది.
- అక్టోబర్ 19న పసిఫిక్ ద్వీప దేశమైన కిరిబాటి మీదుగా ప్రయాణించింది.
- దాదాపు రెండు రోజుల తర్వాత సిడ్నీకి దగ్గరగా ఎగిరింది.
- న్యూజిలాండ్ మీదుగా అక్టోబర్ 25న టాస్మానియా తీరానికి చేరింది.
- గంటకు 50 కిలోమీటర్ల వేగంతో ఇది ప్రయాణించింది.
- అంతదూరం ఈ చిన్న పక్షి ఒంటరిగా ప్రయాణించిందా లేదా అనే దానిపై స్పష్టత రాలేదు.
- అవిశ్రాంత ప్రయాణం కారణంగా పక్షి సగం బరువు కోల్పోయి ఉంటుందని అంచనా వేస్తున్నారు.
- ఒక వయసుకు రాగానే సాధారణంగా ఈ జాతి పక్షులు గుంపుగా బయలుదేరి న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వైపుకు వలస వెళుతుంటాయి.
- కానీ ఇప్పుడు తక్కువ వయసున్న పక్షులు పెద్ద పక్షుల నుంచి విడిపోయి దక్షిణ దిశగా సుదూరంగా ప్రయాణించాయి.
- 2020లో ఇదే జాతికి చెందిన ఓ పక్షి అలస్కా నుంచి న్యూజిలాండ్ వరకు 12,200 కి.మీ. ప్రయాణించి రికార్డు నెలకొల్పింది.

బహుదూరపు ప్రయాణానికి సిద్ధమైందిలా..



అలాస్కాలో బార్ టెయిల్డ్ గాడ్‌విట్ జాతికి చెందిన వలస పక్షులు (చిన్న వాటికి) మూడింటికి గతేడాది అక్టోబర్‌లో మాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఆర్నిథాలజీ సైంటిస్టులు తమ బర్డ్ ట్రాకింగ్ ప్రాజెక్టులో భాగంగా 5 గ్రాముల బరువుండే సోలార్ శాటిలైట్ ట్రాన్స్‌మిటర్లను అమర్చారు. ఐదు నెలల వయసున్న బీ6 (పక్షికి సైంటిస్టులు పెట్టిన పేరు) కూడా అందులో ఉంది. అయితే వలస వెళ్లిన మిగిలిన రెండు పక్షుల జాడ తెలియలేదు. కాగా, వలసకు సమయం ఆసన్నమైన తరుణంలో ఆ పక్షులు తమ శరీరాన్ని ప్రయాణానికి సిద్ధం చేసుకోవడం ప్రారంభించాయి. అనవసరమైన బరువును తగ్గించేందుకు జీర్ణ వ్యవస్థ సహా కొన్ని అవయవాలను కుదించుకున్నాయి. శక్తిని ఆదా చేసేందుకు తక్కువ పీడనం ఉండి ఎగరడానికి అనుకూలంగా ఉన్న గాలులు వీచే వరకు ఎదురు చూశాయి. అన్నీ అనుకూలంగా మారిన తర్వాత ఎగరడం ప్రారంభించాయి.

ఆడ పక్షులే పెద్దవి..

- బార్ టెయిల్డ్ గాడ్‌విట్‌ల రెక్కలు పెద్దగా విప్పి ఎగురుతాయి.
- నీటిపై తేలేందుకు వీలుగా వీటి శరీర అమరిక ఉండదు కాబట్టి సముద్రంలో విశ్రాంతి కోసం ఆగలేవు.
- ఈ పక్షులు 37 నుంచి 41 సెంటీమీటర్ల పొడవుంటాయి.
- మగ పక్షుల కంటే ఆడ పక్షులు పెద్దవిగా ఉంటాయి. మగవి 190 నుంచి 400 గ్రాములు, ఆడవి 260 నుంచి 630 గ్రాముల వరకు బరువు ఉంటాయి.
- ఇవి సముద్ర తీర ప్రాంతాలు, చిత్తడి ప్రాంతాల్లో వేట సాగిస్తూ.. నీటి పురుగులు, నత్తల వంటి జీవులను ఆహారంగా తీసుకుంటాయి.



నెల్లూరులో మినరల్ వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

వాటర్ ప్లాంట్లపై విజిలెన్స్ తనిఖీలు

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో మినరల్ వాటర్ ప్లాంట్లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మొత్తం 81 వాటర్ ప్లాంట్లను తనిఖీ చేయగా, వాటిలో 52 ప్లాంట్లు నిబంధనలను పాటించడం లేదని గుర్తించారు. నిర్ణీత కాలవ్యవధిలో భూగర్భ జలాలకు పరీక్షలు నిర్వహించకపోవడం, తగిన ల్యాబ్ పరికరాలు అందుబాటులో లేకపోవడం, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రమాణాలను పాటించకపోవడం, ట్రేడ్ లైసెన్సులు లేకపోవడం గుర్తించారు. నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్లపై తగిన చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నారు.

రేపే పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష

- 997 కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేసిన పోలీస్ నియామక మండలి
- అభ్యర్థులకు తగిన సూచనలతో నోట్ విడుదల
- నిమిషం ఆలస్యమైనా అనుమతించరు!

సాక్షి, అమరావతి: పోలీసు కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఉద్దేశించిన ప్రిలిమినరీ పరీక్షకు సమయపాలనను కచ్చితంగా పాటించాలని పోలీసు నియామక మండలి నిర్ణయించింది. నిర్ణీత సమయానికి కంటే ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకేంద్రంలోకి అనుమతించరనే విషయాన్ని అభ్యర్థులు గుర్తుంచుకోవాలని స్పష్టం చేసింది. రాష్ట్రంలో 6,100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు మొత్తం 5.03 లక్షలమంది దరఖాస్తు చేశారు. ఈ పోస్టుల భర్తీకి ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా 997 కేంద్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ఈ పరీక్షకు పోలీసు నియామక మండలి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసింది. పరీక్ష సజావుగా నిర్వహించేందుకు అభ్యర్థులకు కొన్ని సూచనలు చేసింది. అవి..

- అభ్యర్థులు ఒకరోజు ముందుగానే తమ పరీక్షకేంద్రాన్ని సందర్శించి నిర్ధారించుకోవాలి.
- అభ్యర్థులను ఆదివారం ఉదయం 9 గంటల నుంచి పరీక్షకేంద్రంలోకి అనుమతిస్తారు.
- ఉదయం 10 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్షకేంద్రంలోకి అనుమతించరు.
- మొబైల్ ఫోన్/సెల్యూలార్ ఫోన్, ట్యాబ్/ల్యాప్‌టాప్, పెన్‌డ్రైవ్, బ్లూటూత్ పరికరాలు/రికార్డింగ్ పరికరాలు, కాలిక్యులేటర్, లాగ్ టేబుళ్లు, వాలెట్, పర్సు, నోట్స్, చార్టులు, పేపర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షకేంద్రంలోకి అనుమతించరు. వాటిని పరీక్షకేంద్రం వద్దకు తీసుకురాకూడదు. వాటిని భద్రపరిచేందుకు పరీక్షకేంద్రం వద్ద ఎలాంటి ఏర్పాట్లు ఉండవు.
- అభ్యర్థులు ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు కార్డు, రేషన్ కార్డు వంటి ఏదైనా ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకురావాలి.
- హాల్‌టికెట్, బ్లూ/బ్లాక్ బాల్‌పాయింట్ పెన్ తీసుకురావాలి.

ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్‌గా విజయకుమార్

నూజివీడు: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) వైస్ చాన్సలర్‌గా ఆచార్య ఎం.విజయకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురంలోని జేఎన్‌టీయూలో ట్రిపుల్ ఈ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న విజయకుమార్‌ను ప్రభుత్వం వైస్ చాన్సలర్‌గా నియమించింది. దీంతో ఆయన ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. మూడేళ్లుగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు నిర్వహించారు. నూతన బాధ్యతలు స్వీకరించిన విజయకుమార్‌ను నూజివీడు డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, ప్రొఫెసర్ ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అదానీ కృష్ణపట్నం పోర్టుకు ఈహెచ్‌ఎస్ అవార్డు

ముత్తుకూరు: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలోని అదానీ కృష్ణపట్నం పోర్టుకు శుక్రవారం గ్రీన్‌టెక్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ ఎన్విరాన్‌మెంట్, హెల్త్ అండ్ సేఫ్టీ (ఈహెచ్‌ఎస్) 2023–అవార్డు లభించింది. గోవాలో నిర్వహించిన గ్రీన్‌టెక్ ఫౌండేషన్ సదస్సులో పోర్టు ఎన్విరాన్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జ్యోతి, ఈహెచ్‌ఎస్ అసోసియేట్ జనరల్ మేనేజర్ వేణుగోపాలరెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, భద్రత, తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని పోర్టుకు ఈ అవార్డును ప్రకటించారు. పోర్టుకు ప్రతిష్టాత్మకమైన అవార్డు రావడంపై సీఈవో జీజే రావు తదితర ఉన్నతాధికారులు సంతోషం వెలిబుచ్చారు.

గవర్నర్‌కు ఫిర్యాదు రాజకీయ ప్రేరేపిత చర్యే

ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ గవర్నర్‌ను కలిసి ప్రభుత్వం మీద ఫిర్యాదు చేయడం రాజకీయ ప్రేరేపిత చర్య అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 'రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పట్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తోంది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందరితో చర్చించి పీఆర్సీని అమలు చేసింది. మిగిలిన అంశాలను దశలవారీగా పరిష్కరించడం కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. వారితో సమావేశాలు నిర్వహిస్తూ పరిష్కారమార్గాలు వెదుకుతోంది. అట్టడుగు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడానికి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్న తరుణంలో కొన్ని అంశాల మీద నిర్ణయాలు ఆలస్యమైనంత మాత్రాన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేయడం ముమ్మాటికీ రాజకీయ ప్రేరేపిత చర్యే..' అని ఆమె పేర్కొన్నారు.

త్వరలోనే కార్యనిర్వాహక రాజధానిగా విశాఖ

- వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి వైజాగ్ ఎంతో అనుకూలం
- పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు
- వైజాగ్‌పట్నం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ మీట్‌లో కలెక్టర్ మల్లికార్జున



సాక్షి, విశాఖపట్నం: త్వరలోనే విశాఖపట్నం కార్యనిర్వాహక రాజధాని అవుతుందని విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. దీనిపై మరో నాలుగైదు నెలల్లో ప్రకటన వెలువడే అవకాశం ఉందన్నారు. శుక్రవారం విశాఖలో వైజాగ్‌పట్నం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (వీసీసీఐ).. 'ఫ్యూచర్ ఆఫ్ వైజాగ్ గ్రోత్ అండ్ ఆపర్చ్యునిటీస్' అనే అంశంపై సమావేశం నిర్వహించింది. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ వాణిజ్య, పారిశ్రామిక పరంగా అభివృద్ధి చెందడానికి అవసరమైన వనరులు, మౌలిక సదుపాయాలన్నీ విశాఖలో పుష్కలంగా ఉన్నాయన్నారు. వీటిని మరింత విస్తృతం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఇప్పటికే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని గుర్తు చేశారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులను ప్రభుత్వం సత్వరమే జారీ చేస్తోందన్నారు. ఫలితంగా విశాఖలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు వీలు ఉందని తెలిపారు. విశాఖలో ఉన్న రెండు భారీ పోర్టుల్లో సరకు రవాణా, ఎగుమతుల సౌకర్యం ఉందన్నారు. మార్చిలో ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు, జీ–20 దేశాల సమావేశం జరుగుతాయని చెప్పారు. వీటితో విశాఖకు మరింత అంతర్జాతీయ ఖ్యాతి లభిస్తుందన్నారు. ముంబైతో సమానంగా అభివృద్ధిలో విశాఖ పోటీ పడుతోందని వివరించారు. గత మూడేళ్లలో విశాఖ ఎంతగానో అభివృద్ధి చెందిందని.. ఎన్నో పరిశ్రమలు వచ్చాయని గుర్తు చేశారు. త్వరలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి, అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపనలు జరుగుతాయన్నారు. ఆనందపురం–అనకాపల్లి హైవే త్వరలోనే అందుబాటులోకి వస్తుందని వివరించారు. రూ.121 కోట్లు వెచ్చించి విశాఖలో రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. అలాగే విశాఖ నగర పరిధిలో 12 ఫ్లైఓవర్ల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. మెట్రో రైలు కూడా వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. వీసీసీఐ అధ్యక్షుడు కె.సతీష్ మాట్లాడుతూ పరిశ్రమలు, ఐటీ సంస్థల ఏర్పాటుకు విశాఖ ఎంతో అనువుగా ఉందన్నారు. అందువల్లే తాము విశాఖలో వాటి ఏర్పాటుకు ముందుకొచ్చామని ఎన్ఆర్ఐలు రాజశేఖర్, వీవీఎస్ ప్రభాకర్ తెలిపారు. ఈ సమావేశంలో వీసీసీఐ గౌరవ కార్యదర్శి రోలండ్ విలియమ్స్, మాజీ అధ్యక్షుడు డీవీ రాజు, మహిళా విభాగం కార్యదర్శి అనిల నార్ల తదితరులు పాల్గొన్నారు.

ఒక్కో నగరం.. ఒక్కో హబ్‌గా

- 'సాక్షి'తో రాష్ట్ర ఐటీశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్
- దేశంలో డ్రోన్ల వినియోగం ఏపీలోనే ఎక్కువ
- విశాఖలో 2.50 లక్షల చ.అడుగుల బిల్టప్ ఏరియా
- రాష్ట్రంలో మరిన్ని యాపిల్ ఉత్పత్తులు
- పెట్టుబడుల్ని ఆకర్షించేలా ప్రత్యేక పాలసీలు రూపొందిస్తాం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలోని ప్రధాన నగరాలను ఒక్కో హబ్‌గా తీర్చిదిద్దేలా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్ తెలిపారు. అన్ని రంగాల్లో పెట్టుబడులను ఆహ్వానిస్తూ కొత్త పాలసీలతో ప్రతి పరిశ్రమకు అవసరమైన మానవ వనరులను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇన్ఫినిటీ సమ్మిట్–2023లో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన ఆయన సాక్షి ప్రతినిధితో పలు అంశాలపై మాట్లాడారు.

- తిరుపతిని ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా, అనంతపురం డ్రోన్ హబ్‌గా, విశాఖను ఐటీ, స్టార్టప్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం. విశాఖలో ఫైబర్ టెర్మినేషన్ స్టేషన్లు ఏర్పాటయ్యాయి. రానున్న ఐదేళ్లలో దేశంలో 2 గిగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు కానుండగా 15 నుంచి 20 శాతం ఏపీలో ఏర్పాటు కావాలన్నది సీఎం జగన్ యోచన. దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లోనే డ్రోన్ల వినియోగం అధికం. అనంతపురాన్ని డ్రోన్ హబ్‌గా మారుస్తాం.
- ఇంటిగ్రేటెడ్ చిప్స్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రానిక్స్ వాల్యూ చైన్ అభివృద్ధిని ప్రోత్సహించాలన్న కేంద్ర ప్రభుత్వం విధానాలకు అనుగుణంగా సెమి కండక్టర్ పాలసీని రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలో తొలిసారిగా ఈ రంగంలో పెట్టుబడులు రానున్నాయి. వాటిని ఏపీకి మళ్లించేందుకు అనుగుణంగా సెమీ కండక్టర్ పాలసీని త్వరలోనే ప్రకటిస్తాం.
- దేశంలో 20 ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్స్(ఈఎంసీ) ఉండగా నాలుగు ఏపీలోనే ఉన్నాయి. అతిపెద్ద సీసీ టీవీ తయారీల కంపెనీ డిక్సన్ కొప్పర్తిలో ఏర్పాటైంది. యాపిల్ సంస్థకు సంబంధించిన కెమేరా మాడ్యూల్స్, ఉపకరణాల కంపెనీలు, చైనాకు చెందిన విన్‌టెక్ సంస్థ ఏపీకి వచ్చాయి. త్వరలోనే యాపిల్ ఉత్పత్తులు మరిన్ని ఏపీలో తయారవుతాయని ఆశిస్తున్నాం.
- రాష్ట్రానికి పలు సంస్థలు క్యూ కడుతున్న నేపథ్యంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు సమకూర్చేలా సీఎం జగన్ చర్యలు చేపట్టారు. 175 నియోజకవర్గాలకు గానూ 111 చోట్ల ఇప్పటికే స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌లు నెలకొల్పి యువతకు శిక్షణ అందిస్తున్నారు. మొత్తంగా 72 వేల మందిని ఆయా పరిశ్రమలకు అవసరమైన నిపుణులుగా తీర్చిదిద్దుతాం.

ఇన్నోవేషన్ హబ్‌గా విశాఖ

విశాఖను ఐటీ, ఐటీ ఆధారిత రంగాల్లో, ఇన్నోవేషన్ హబ్‌గా మార్చాలన్నది రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం. ఇప్పటికే ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ ప్రధాన కార్యాలయాన్ని విశాఖకు తరలించాం. ఆర్నెళ్లలో 41 స్టార్టప్‌లకు స్థలం కేటాయించాం. స్టార్టప్‌లను విశాఖలోనే రిజిస్టర్ చేసుకుని కేంద్రం నుంచి సీడ్ ఫండింగ్, స్కేల్ ఫండింగ్ లభించేలా చర్యలు చేపట్టాం. ప్రస్తుతం విశాఖలో 2.50 లక్షల బిల్టప్ స్పేస్ అందుబాటులో ఉంది. ఇది సరిపోవడం లేదు. కొన్ని సంస్థలు ఇంకా స్థలం కావాలని కోరడంతో అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వమే అభివృద్ధి చేయాలా? పీపీపీ పద్ధతిలో చేపట్టాలా? అనే అంశంపై చర్చలు జరుగుతున్నాయి. విశాఖ ఐటీ హిల్స్‌లో 24 వేల మంది ఐటీ ఉద్యోగులు పని చేస్తున్నారు. త్వరలోనే ఇది 50 వేలకు చేరుకునే దిశగా అడుగులు వేస్తున్నాం. ఐటీ ఎగుమతుల్ని మరింత పెంచే దిశగా కృషి చేస్తున్నాం. ఏపీకి వచ్చేందుకు పలు సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి.

డ్రోన్ షాట్ల దారుణమే!

- ఇరుకు కూడలిలో టీడీపీ బహిరంగ సభ
- ఆపై భారీగా ఫ్లెక్సీలు, వాహనాల పార్కింగ్‌తో తొక్కిసలాట
- కందుకూరు ఘటనపై ప్రత్యక్ష సాక్షులు, బాధిత కుటుంబాల వాంగ్మూలం

కందుకూరు: డ్రోన్ షాట్ల కోసం ఇరుకు కూడలిలో టీడీపీ బహిరంగ సభను నిర్వహించడంతోపాటు భారీగా ఫ్లెక్సీలు, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌తో తోపులాట చోటు చేసుకుని తొక్కిసలాట జరిగినట్లు కందుకూరు ఘటనలో ప్రత్యక్ష సాక్షులు, బాధిత కుటుంబాలు విచారణ కమిషన్ ఎదుట వాంగ్మూలం ఇచ్చాయి. గత నెల 28వ తేదీన 'ఇదేం కర్మ'లో భాగంగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరు ఎన్టీఆర్ సర్కిల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తొక్కిసలాట జరిగి 8 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోగా మరో 8 మంది తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై విచారణకు ఏర్పాటైన హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి నేతృత్వంలోని కమిషన్ శుక్రవారం సంఘటనా స్థలాన్ని సందర్శించి పలువురి నుంచి వాంగ్మూలం సేకరించింది. తొక్కిసలాట ఎలా జరిగింది? ఆ సమయంలో ఎంత మంది ఉన్నారు? అనే అంశాలపై ఆరా తీసింది.

వాహనం ఎక్కడ నిలిపారు?

తొలుత ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో అధికారుల నుంచి వివరాలు సేకరించిన అనంతరం కమిషన్ ఎన్టీఆర్ సర్కిల్‌ను పరిశీలించింది. బహిరంగ సభకు ఎక్కడ అనుమతి ఇచ్చారు? చంద్రబాబు వాహనం ఎక్కడ నిలిపారు? అనే అంశాలతోపాటు ప్రమాదం జరిగిన గుండంకట్ట రోడ్డును క్షుణ్నంగా పరిశీలించింది. ఇరువైపులా ఉన్న రెండు డ్రైనేజీలను పరిశీలించింది. కందుకూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రకటించిన పరిహారం అందలేదని బాధిత కుటుంబాలు కమిషన్ దృష్టికి తెచ్చాయి. దాదాపు 27 మంది నుంచి కమిషన్ వాంగ్మూలం నమోదు చేసింది.

ఏపీ ట్రాన్స్‌కోకు రెండు 'స్కోచ్' అవార్డులు

సాక్షి, అమరావతి : ఏపీ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్(ఏపీ ట్రాన్స్‌కో)కు 2022కు సంబంధించి రెండు స్కోచ్ అవార్డులు లభించాయి. పవర్, ఎనర్జీ విభాగంలో నెట్‌వర్క్ మెయింటెనెన్స్, మానిటరింగ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌కు స్కోచ్ అవార్డ్–గోల్డ్, పవర్ డిమాండ్ అంచనా కోసం రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌కు స్కోచ్ అవార్డు–సిల్వర్ లభించాయి. వర్చ్యువల్ విధానంలో శుక్రవారం జరిగిన ఈ అవార్డుల ప్రకటన సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్, జేఎండీ ఐ.పృథ్వీతేజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం ఎస్పీ మలికా గర్గ్‌కు జాతీయ స్థాయి అవార్డులు



ఒంగోలు టౌన్: ప్రకాశం జిల్లా ఎస్పీ మలికా గర్గ్‌కు జాతీయ స్థాయిలో రెండు అవార్డులు లభించాయి. పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ శాఖాపరంగా మార్పులు తీసుకువస్తున్న ఉత్తమ పోలీసు అధికారులకు ఇచ్చే ప్రతిష్టాత్మకమైన స్కోచ్ అవార్డులను ఎస్పీ సొంతం చేసుకున్నారు. మహిళల భద్రత పెంపొందించేలా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దిశ ఎస్‌వోఎస్ యాప్ మాస్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించినందుకు జాతీయ స్థాయి 88వ స్కోచ్ సమ్మిట్‌లో 2022 సంవత్సరానికి గానూ మలికా గర్గ్‌కు ప్రతిష్టాత్మకమైన స్కోచ్ సిల్వర్ అవార్డు లభించింది. మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్‌కు స్కోచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డు వరించింది. మహిళలకు భద్రత, భరోసా కల్పించే లక్ష్యంతో దిశ యాప్ లక్కీ డ్రా కాంటెస్ట్, బెస్ట్ మహిళా పోలీస్ ఆఫ్ ది వీక్, దిశా అంబాసిడర్స్ వంటి అనేక వినూత్న కార్యక్రమాలను మలికా గర్గ్ చేపట్టారు. తద్వారా దిశ యాప్‌ను లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకునేలా కృషిచేశారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకోవడం, చోరీకి గురికావడం వల్ల ప్రజలుపడే ఇబ్బందులు గుర్తించిన ఆమె బాధితుల కోసం అన్ని పోలీసు స్టేషన్లలో తక్షణమే ఫిర్యాదు స్వీకరించేలా, దర్యాప్తు చేపట్టేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేశారు. జాతీయ స్థాయి అవార్డులు రావడంపై ఎస్పీ సంతోషం వ్యక్తంచేశారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 24 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 67,511 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 26,948 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.33 కోట్లు వేశారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 16 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అమరావతి ఎవరి కోసం?

845వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: అమరావతి రాజధాని ఎవరి ప్రయోజనాల కోసం నిర్మించేందుకు పూనుకున్నాడో చంద్రబాబు తేల్చి చెప్పాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ప్రశ్నించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 845వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం రూ.7,500 కోట్లు కేటాయిస్తే 5 సంవత్సరాల్లో రూ.5,750 కోట్లు ఖర్చుపెట్టిన చంద్రబాబు.. అమరావతి పేరుతో రూ.3.50 లక్షల కోట్లు దోపిడీ చేశాడన్నారు. బాబు నిజంగా ఇక్కడ అభివృద్ధి చేసి ఉంటే మంగళగిరి, తాడికొండలో ఎందుకు ఓడిపోయాడో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్నది లేనట్లు సృష్టిస్తూ మాట్లాడుతున్న చంద్రబాబు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని సూట్ కేసులిచ్చి అన్ని పార్టీలను తన గుప్పెట్లో పెట్టుకుని అధికారం కోసం పాకులాడుతుండడం సిగ్గుచేటన్నారు. బాబుపై సీబీఐ విచారణ వేసి జైల్లో బంధించాలని డిమాండ్ చేశారు. పవన్‌తో చేతులు కలిపి ఆశల పల్లకీలో ఊరేగుతున్న బాబుకు భంగపాటు తప్పదని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లంటే ఎందుకంత భయం?

- ప్రజలకు సేవలందించే ఈ వ్యవస్థపై ఈనాడు తప్పుడు కథనం సిగ్గుచేటు
- సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కొనే దమ్ములేకే విష ప్రచారం
- గతంలో జన్మభూమి కమిటీలు చేసిన అక్రమాల మాటేంటి?
- దమ్ముంటే ఈ వ్యవస్థను తీసివేస్తామని టీడీపీ మేనిఫెస్టోలో పెట్టాలి
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, మంత్రి మేరుగు, మాజీ మంత్రులు కన్నబాబు, ధర్మాన కృష్ణదాస్ ధ్వజం



కోలగట్ల వీరభద్ర స్వామి



మేరుగు నాగార్జున



ధర్మాన కృష్ణదాస్



కన్నబాబు

విజయనగరం/సాక్షి, అమరావతి/ శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/కాకినాడ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసి, చంద్రబాబుకు లబ్ధి చేకూర్చాలన్న దురుద్దేశంతోనే 'ఈనాడు' తప్పుడు రాతలు రాస్తోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, మాజీ మంత్రులు కన్నబాబు, ధర్మాన కృష్ణదాస్ మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్‌ను నేరుగా ఎదుర్కొనే దమ్ము లేకే చంద్రబాబు తన అనుకూల మీడియా ద్వారా విష ప్రచారం చేయిస్తున్నారని నిప్పులు చెరిగారు. శుక్రవారం వారు వేర్వేరు చోట్ల మీడియాతో మాట్లాడారు. ఈనాడు పత్రిక టీడీపీ కరపత్రిక అని అందరికీ తెలుసని చెప్పారు. వాస్తవాలు రాస్తేనే ప్రజలు నమ్ముతారని, లేదంటే విశ్వసనీయత కోల్పోవడం ఖాయమన్నారు. వారు ఇంకా ఏమన్నారంటే..

మంచి పేరొస్తోంటే అక్కసు

- వలంటీర్లు గౌరవ వేతనం తీసుకుంటూ ప్రభుత్వం తరఫున సేవలందిస్తున్నారే తప్ప.. మిగిలిన సమయాల్లో వారి వారి పనులు చేసుకునేందుకు హక్కు కలిగి ఉన్నారన్న విషయాన్ని గుర్తించాలి. ఈ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారడంతో చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నారు. కోవిడ్ సమయంలో ప్రజలకు అందిన సేవలు ఎవరూ మరచిపోరు.
- చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు చేసిన అక్రమాలను ఈనాడు ఎందుకు ప్రశ్నించలేదు? నాడు ప్రతి సంక్షేమ పథకానికి రేటు కట్టి ప్రజలను దోచుకోవడం నిజం కాదా? అప్పట్లో పింఛన్లు కావాలంటే ముందుగా మూడు నెలల పింఛన్, ఇల్లు మంజూరుకు రూ.20 వేలు, లోను మంజూరుకు రూ.10 వేలు, మరుగుదొడ్డికి రూ.1500 లంచంగా తీసుకోవడం నిజం కాదా?
- చంద్రబాబు వలంటీర్లుగా వ్యవహరిస్తున్న రామోజీరావు, రాధాకృష్ణలకు ఈ వ్యవస్థపై మాట్లాడే హక్కులేదు. వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు సన్నిహితులుగా మెలుగుతుంటే ఓర్వలేకపోతుండటం నిజం కాదా? ఎన్ని తప్పుడు రాతలు రాసినా వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఎవరూ ఏమీ చేయలేరు. మీకు దమ్ము, ధైర్యం ఉంటే నేరుగా ప్రజల్లోకి వెళ్లి సంక్షేమ కార్యక్రమాల అమల్లో వలంటీర్లు ఎక్కడైనా రూపాయి లంచం అడిగారేమో తేల్చండి.
- వలంటీర్లు కులం, మతం, పార్టీలను చూడకుండా దళారీ వ్యవస్థకు దూరంగా అర్హత ఉన్న వారికే అన్ని పథకాలు అందేలా చూస్తున్నారు. సేవే పరమావధిగా పని చేస్తుండటంతో పచ్చనేతలు తట్టుకోలేకపోతున్నారు. చంద్రబాబుకు దమ్ముంటే తాము అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను తీసేస్తామని మేనిఫెస్టోలో పెట్టాలి. చంద్రబాబు వాయిస్‌ను ఎల్లో మీడియా టేకోవర్ చేయడం ఇప్పటికైనా మానుకోవాలి.

క్లుప్తంగా

కులగణనను ఆపాలంటూ ఆదేశాలివ్వలేం

న్యూఢిల్లీ: రాష్ట్రంలో కులగణన చేపట్టాలంటూ బిహార్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. సర్వేను ఆపాలంటూ వేసిన పిటిషన్‌లు విచారణార్హమైనవి కాదంటూ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్ సేథ్‌ల ధర్మాసనం పేర్కొంది. పిటిషన్ దారులు సంబంధిత హైకోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. 'ఇవి ప్రచారం కోసం వేసిన పిటిషన్లు. ఫలానా కులానికి రిజర్వేషన్ ఇంతే ఇవ్వాలని మేమెలా చెప్పగలం? ఎవరికి ఎంత రిజర్వేషన్ ఇవ్వాలో రాష్ట్ర ప్రభుత్వం ఎలా నిర్ణయిస్తుంది. ఈ విషయంలో ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేం. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టలేం' అని పేర్కొంది. పిటిషన్లను ఉపసంహరించుకుని, ఈ అంశంపై తగు నిర్ణయం కోసం పట్నా హైకోర్టుకు వెళ్లేందుకు పిటిషన్ దారులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది.

తెలుగులోనూ నాన్ టెక్నికల్ ఎస్ఎస్‌సీ పరీక్ష

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం నిర్వహించే మల్టీటాస్కింగ్ (నాన్ టెక్నికల్) స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)–2022ను తెలుగు సహా 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. భాష అవరోధం కారణంగా ఎవరూ అవకాశాలు కోల్పోకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. త్వరలోనే రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో పేర్కొన్న అన్ని భాషలను చేర్చడానికి ప్రయత్నాలు చేస్తున్నామని జితేంద్ర సింగ్ తెలిపారు.

చార్జిషీట్‌ను బహిర్గతం చేయలేం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: క్రిమినల్ కేసుల్లో దర్యాప్తు సంస్థలు సమర్పించే చార్జిషీట్‌ను అందరికీ అందుబాటులో ఉండేలా బహిర్గతం చేయలేమని సుప్రీంకోర్టు తెలిపింది. అలా చేయడం నిందితులు, బాధితుల హక్కులకు భంగం కలిగించడమే అవుతుందని పేర్కొంది. చార్జిషీట్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలంటూ దాఖలైన పిల్‌ను జస్టిస్ షా, జస్టిస్ రవికుమార్‌ల ధర్మాసనం కొట్టివేసింది. పిటిషన్‌పై ఈ నెల 9న విచారణ ముగించిన ధర్మాసనం తీర్పును శుక్రవారం వెలువరించింది. ఎఫ్ఐఆర్‌లను వెబ్‌సైట్‌లో ఉంచినట్లే చార్జిషీట్లను సంబంధిత పత్రాలతో రాష్ట్ర ప్రభుత్వాల వెబ్‌సైట్‌లలో ఉంచలేమని పేర్కొంది. చార్జిషీట్‌ను బహిరంగపరిస్తే కేసుతో సంబంధం లేని ఎన్‌జీవోలు, ఇతరులు అందులోని అంశాలను దుర్వినియోగపరిచే ప్రమాదముందని పేర్కొంది. అంతిమంగా నిందితులు, బాధితుల హక్కులకు భంగం కలుగుతుందని వివరించింది.

ఓటు వలస వెళుతుందా?

- రిమోట్ ఓటింగ్‌పై పెరుగుతున్న రాజకీయ వేడి
- ఈవీఎం లోపాలు పరిష్కరించకుండా ఆర్‌వీఎంలు ఎందుకు?
- నిలదీస్తున్న విపక్షాలు
- అడుగు ముందుకేనంటున్న సీఈసీ



ఓటు. ప్రజాస్వామ్యం మనకిచ్చిన శక్తిమంతమైన ఆయుధం. అయినా దానిని వినియోగించుకోవడంలో ఏదో తెలీని ఉదాసీనత కనిపిస్తోంది. ముఖ్యంగా ఉపాధి కోసం వేరే ఊళ్లు వెళ్లే వలసదారులు ఓటు వెయ్యడానికి సుముఖత చూపించడం లేదు. అందుకే దేశంలో ఎక్కడ నుంచైనా ఓటు వెయ్యడానికి వీలు కల్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం విప్లవాత్మక మార్పులకి శ్రీకారం చుట్టింది. అవే రిమోట్ ఓటింగ్ మెషీన్లు(ఆర్‌వీఎం). ఈ ఓటింగ్ మెషీన్ల ద్వారా సొంతూరుకి వెళ్లకుండా తాముండే ప్రాంతం నుంచి తమ నియోజకవర్గం అభ్యర్థిని ఎన్నుకునే అవకాశం లభిస్తుంది. ఈ నమూనా ఆర్‌వీఎంలను ప్రదర్శించడం కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 16న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ సహా 13 పార్టీలు వీటిని తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇప్పటికే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై విశ్వాసమే లేకుండా ఉన్న ఈ సమయంలో ఈ కొత్త ప్రక్రియకు తెరతీసి ఓటింగ్ వ్యవస్థను గందరగోళం చెయ్యడమెందుకనే చర్చ మొదలైంది. కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఆమ్ ఆద్మీ పార్టీ, జనతా దళ్ (యూ), శివసేన (ఉద్ధవ్ వర్గం), ఎన్‌సీపీ, సీపీఎం వ్యతిరేకంగా ఉండడంతో నమూనా ఆర్‌వీఎంల ప్రదర్శన జరగకుండానే సమావేశం ముగిసింది. అయితే వలస ఓటర్ల ఓటింగ్ శాతం పెంపు లక్ష్యంగా తాము చేస్తున్న ప్రయత్నాలను ముందుకు తీసుకువెళ్లడానికి సీఈసీ రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకోవడానికి ఫిబ్రవరి 28 వరకు గడువు పెంచింది.

ఎందుకీ ఆర్‌వీఎంలు ?

వలస ఓటర్లలో మూడో వంతు మంది ఎన్నికల్లో తమ ఓటు హక్కుని వినియోగించుకోవడం లేదు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 67.4శాతం మాత్రమే ఓటింగ్ నమోదైంది. దాదాపుగా 30 కోట్ల మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఉన్న చోటు నుంచి సొంతూరికి వెళ్లే అవకాశం లేకపోవడం, ఓటర్ల జాబితాలో పేరు లేకపోవడం వంటి ఎన్నో కారణాలతో వారు ఓటు వెయ్యడం లేదు. భారత ప్రధాన ఎన్నికల అధికారిగా రాజీవ్ కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత వలస ఓటర్లపై దృష్టి కేంద్రీకరించి రిమోట్ ఓటింగ్ ప్రక్రియకు తెరతీశారు.

ఆర్‌వీఎంలు ఎలా పని చేస్తాయి ?

ప్రస్తుతం ఎన్నికల్లో వినియోగిస్తున్న ఎలక్ట్రానింగ్ ఓటింగ్ మెషీన్లకు (ఈవీఎం) ఇది సవరించిన వెర్షన్. ఇతర ప్రాంతాల్లో ఉన్న వలస ఓటర్లు తమ నియోజకవర్గంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత తాము ఏ ప్రాంతం నుంచి ఓటు హక్కు వినియోగించుకుంటారో రిజిస్టర్ చేసుకోవాలి. అలా రిజిస్టర్ చేసుకున్న వారిని రిమోట్ ఓటర్లు అని పిలుస్తారు. తమ ప్రాంతంలో ఉన్న రిమోట్ పోలింగ్ బూత్‌కు వెళితే ఆ ఓటరు నియోజకవర్గం వివరాలను కానిస్టిట్యూయెన్సీ కార్డ్ రీడర్ (సీసీఆర్) ద్వారా స్కాన్ చేసి గుర్తిస్తారు. అప్పుడు ఆర్‌వీఎం మెషీన్లపై ఆ నియోజకవర్గానికి సంబంధించిన బ్యాలెట్ పత్రం డిస్‌ప్లే అవుతుంది. తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేస్తే రాష్ట్రం కోడ్, నియోజకవర్గం, అభ్యర్థుల నెంబర్ వివరాలన్నీ రిమోట్ కంట్రోల్ యూనిట్‌లో రికార్డు అవుతాయి. ఓటు నమోదైనట్టుగా వీవీప్యాట్ స్లిప్ వస్తుంది. ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తయారు చేసిన ఆర్‌వీఎంలు ఇంటర్నెట్ అవసరం లేకుండా పని చేస్తాయి.

ప్రతిపక్షాల అభ్యంతరాలు ఇవీ

- సీఈసీ ప్రతిపాదనలేవీ సమగ్రంగా లేవు. ఆర్‌వీఎంల వ్యవస్థ పైపైన రూపొందించినట్టుగా ఉంది.
- ఈవీఎంల పని తీరుపైనే సవాలక్ష సందేహాలున్న ప్రస్తుత పరిస్థితుల్లో అదే నమూనాలో రూపొందించిన ఆర్‌వీఎంలతో ఒనగూరే ప్రయోజనం ఉండదు.
- ప్రాంతీయ పార్టీలకు, చిన్న పార్టీలకు ఈ వ్యవస్థ ఏ మాత్రం అనుకూలం కాదు. దేశవ్యాప్తంగా ఏర్పాటయ్యే వివిధ పోలింగ్ బూత్‌లలో వారు తమ ఏజెంట్లను ఏర్పాటు చేసుకునే వనరులు ఆ పార్టీలకు ఉండవు.
- ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నప్పుడు వేరే రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమల్లో ఉండకపోవడం వల్ల అక్కడ ఉండే వలస ఓటర్లని రాజకీయ పార్టీలు సులభంగా ప్రలోభ పెట్టొచ్చు
- ఓటరు స్థానికంగా నివాసం లేకపోతే రాజకీయ పార్టీలపై ఏర్పరచుకునే అభిప్రాయాలు, ఓటు వేయడంలో వారు తీసుకునే నిర్ణయాల్లో తప్పిదాలు జరిగే అవకాశం ఉంటుంది.
- దేశంలో ఒక చోట ఎన్నికలు జరుగుతూ ఉంటే, మరెక్కడి నుంచో ఓటు వేసే వ్యక్తి అసలు సిసలు ఓటరేనని ఎలా నమ్మాలి. ఓటింగ్‌లో జరిగే అక్రమాలు ఇకపై వివిధ నియోజకవర్గాలకు విస్తరిస్తాయి.

ఈసీ ఎదుట ఉన్న సవాళ్లు

- అసలు వలస ఓటర్లు అంటే ఎవరు ? వారిని ఎలా గుర్తించాలి. వలస ఓటర్లను గుర్తించడంలో ఏర్పడే న్యాయపరమైన చిక్కుల్ని ఎదుర్కోవడం
- ఈవీఎంలకు సవరించిన వెర్షన్‌గా రూపొందించిన ఆర్‌వీఎంలలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలకు పరిష్కారం కనుగొనడం
- ఎన్నికల్లో ఎన్ని రిమోట్ ఓటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న దానిపై స్పష్టమైన అవగాహన ఏర్పరచుకోవడం
- ఒక రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతూ ఉంటే వలస ఓట్లు ఉండే అన్ని ప్రాంతాల్లోనూ ఎన్నికల నియమావళిని అమలు చేయడానికి ఎలాంటి కసరత్తు చేయాలి.

ఇలాంటి సవాళ్లను అధిగమించడానికే ఎన్నికల సంఘం రాజకీయ పార్టీల అభిప్రాయాలను కోరుతోంది. **- సాక్షి, నేషనల్ డెస్క్**

> రిమోట్ ఓటింగ్ అనేది ఎన్నికల ప్రకియలో ఒక విప్లవాత్మకమైన మార్పు. పట్టణ ప్రాంతాల్లో, యువతలోనూ ఓటుపై ఆసక్తి పెంచడమే ధ్యేయంగా పని చేస్తున్నాం. కానీ దీని అమలులో ఎన్నో సవాళ్లున్నాయి. ఇది అంత సులభంగా జరిగేది కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిర్ణయాలు తీసుకోవడానికి సమయం పడుతుంది. మేం వేసే ప్రతీ అడుగు ముందడుగానే ఉంటుంది.
> **రాజీవ్ కుమార్, సీఈసీ**
>
> ధనిక పార్టీ అయిన బీజేపీకి ఇలాంటి ప్రక్రియలు అనుకూలంగా ఉంటాయి. ప్రాంతీయ పార్టీల ఆందోళనలో అర్థం ఉంది. రిమోట్ బూత్‌లున్న ప్రతిచోటా పోలింగ్ ఏజెంట్లను తెచ్చిపెట్టుకునే సామర్థ్యం వారికి ఉండదు. ఎన్నికల బరిలో ఉన్న పార్టీలకు చెందిన పోలింగ్ ఏజెంట్లు లేకుండా రిమోట్ ఓటింగ్ ప్రక్రియను నిర్వహించడం సరి కాదు.
> **జగ్‌దీప్ చొకార్, అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ సహ వ్యవస్థాపకుడు**
>
> ఇటీవల జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో చివరి గంటలో 10 నుంచి 12% ఓట్లు పోలయినట్టు గుర్తించాం. అంటే ప్రతీ 25–30 సెకండ్లకి ఒక ఓటు పోలయినట్టు లెక్క. అదెలా సాధ్యం. ఒక ఓటు నమోదు కావడానికి కనీసం 60 సెకండ్ల సమయం పడుతుంది. ఈవీఎంలలో కళ్లకు కట్టినట్టు ఇన్ని దారుణాలు జరుగుతూ ఉంటే ఆర్‌వీఎం అవసరం ఏమొచ్చింది..?
> **జైరామ్ రమేష్, కాంగ్రెస్ ఎంపీ**

కారును ఢీకొట్టి బాయ్‌నెట్‌పై వేలాడుతున్నా ఆపకుండా..

బెంగళూరులో వెలుగుచూసిన అమానుష ఘటన

బనశంకరి: కర్ణాటక రాజధాని బెంగళూరులో మూడు రోజుల క్రితం ఓ వృద్ధుడిని స్కూటరిస్టు నిర్దాక్షిణ్యంగా ఈడ్చుకెళ్లిన ఘటన మరువక ముందే మరో అమానుష ఘటన వెలుగుచూసింది. ఓ మహిళ తన కారుతో యువకుడిని ఢీకొట్టి బాయ్‌నెట్‌పై వేలాడుతున్నా ఆపకుండా కిలోమీటరు దూరం వరకు వెళ్లారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ప్రియాంక అనే మహిళ కారు నడుపుకుంటూ భర్తతో కలిసి జ్ఞానభారతి నగర్ మీదుగా ఉల్లాళ రోడ్డులో వెళుతున్నారు. ఉల్లాల జంక్షన్‌లో దర్శన్ అనే యువకుడు నడుపుతున్న కారును ఆమె స్వల్పంగా ఢీకొట్టారు. అనంతరం అసహ్యకరంగా సంజ్ఞలు చేసుకుంటూ కారు ఆపకుండా వెళ్తున్న ప్రియాంకను దర్శన్ వెంబడించాడు. మంగళూరు పీయూ కాలేజీ వద్ద అడ్డుకున్నాడు. ప్రియాంక ముందుకు వెళ్లేందుకు యత్నించగా దర్శన్ తనను తాను రక్షించుకునేందుకు ఆమె కారు బానెట్‌పైకి ఎక్కాడు. ప్రియాంక కారును ఒక కిలోమీటరు వరకు అలాగే డ్రైవ్ చేసుకుంటూ వెళ్లారు. ఈలోగా దర్శన్ సంబంధీకులు వచ్చి ప్రియాంక కారును అడ్డుకుని అద్దాలు పగలగొట్టారు. అనంతరం ఇరు వర్గాల వారు జ్ఞానభారతి పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ప్రియాంకపై సెక్షన్ 307 కింద హత్యాయత్నం కేసు.. దర్శన్, అతడి స్నేహితులపై సెక్షన్ 354 కింద మహిళ గౌరవానికి భంగం కలిగించిన ఆరోపణలపై కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ డీసీపీ చెప్పారు.

గోడపై మూత్రం పోస్తే చింది మీదనే పడుతుంది

బహిరంగ ప్రదేశాల్లో పని కానిచ్చే వారికి లండన్ యంత్రాంగం విరుగుడు

లండన్: బహిరంగ మూత్ర విసర్జన ప్రపంచవ్యాప్తంగా ప్రబలంగా ఉన్న దురలవాటు. దీని కారణంగా పరిసరాలు దుర్గంధంతో నిండి అందరూ ఇబ్బందులు పడుతున్నారు. లండన్ యంత్రాంగం దీనికి ఓ విరుగుడును కనిపెట్టింది. గోడలపై పోసే మూత్రం చింది తిరిగి వారిపైనే పడితే..? ఆ పాడు పనిని మానుకుంటారేమో. పారదర్శక వాటర్ రిపెల్లెంట్ రసాయనాన్ని అందుబాటులోకి తెచ్చింది. దీనిని గోడలపై స్ప్రే చేస్తే పోసిన వ్యక్తి పైనే మూత్రం చింది పడుతుంది. దుస్తులు తడిచిపోతాయి. వారికి ఇదే తగిన శిక్ష అవుతుంది. లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ సిటీ కౌన్సిల్ ఇందుకోసం



సోహో ప్రాంతాన్ని ఎంచుకుంది. సోహోలో 24 గంటలూ నడిచే బార్లు, రెస్టారెంట్లు, థియేటర్లు, ఇతర వినోద ప్రాంతాలతోపాటు నివాస ప్రాంతాలూ ఉన్నాయి. సుమారు 0.6 చదరపు కిలోమీటర్ విస్తీర్ణంలోని సోహోలో 400కు పైగా ప్రాంతాల్లో మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. పబ్లిక్ టాయిలెట్లు చాలినన్ని లేకపోవడంతో జనం రోడ్డు పక్కన గోడలపైనే మూత్రం పోసేస్తున్నారు. వీధులు దుర్గంధంతో నిండిపోతుండటంతో జనం గగ్గోలు పెడుతున్నారు. దీంతో వీధులను శుభ్రంగా ఉంచేందుకు లండన్ యంత్రాంగం ఏటా రూ.10.26 కోట్లు వెచ్చిస్తోంది. అయినా ఫలితం లేకపోవడంతో తాజాగా కొత్త ఆలోచనను కార్యరూపంలోకి తెచ్చింది. ముందుగా సమస్య తీవ్రంగా ఉన్న 12 ప్రాంతాల్లోని గోడలపై ఈ ద్రావకాన్ని స్ప్రే చేయించింది. ఆయా ప్రాంతాల్లో ఇది మూత్రం పోసే గోడ కాదు (దిస్ వాల్ ఈజ్ నాట్ ఫర్ యూరినల్) అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఇదే ప్రయోగాన్ని మరో ప్రాంతంతోపాటు జర్మనీలోనూ ప్రయోగాత్మకంగా చేసి, మంచి ఫలితం సాధించారు. ఆరునెలల్లోనే మంచి ఫలితం కనిపిస్తుందని స్థానిక అధికారి ఒకరు చెప్పారు.

నూతన భవనంలోనే బడ్జెట్ సమావేశాలు!

- సాంకేతిక సమస్యలు తలెత్తిన పక్షంలో ప్రత్యామ్నాయ ప్రణాళిక
- తొలి విడత పాత భవనంలో, మలి విడత కొత్త భవనంలో సమావేశాలు జరిపేందుకు ఏర్పాట్లు





సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత ఏడాది బడ్జెట్ సమావేశాలు పార్లమెంట్ నూతన భవనంలో జరిగే అవకాశాలున్నాయని కేంద్ర ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది. నూతన భవన నిర్మాణ పనులు దాదాపు ముగింపుకు వచ్చాయని, ఈ నెలాఖరుకు పూర్తి స్థాయిలో సిద్ధమయ్యేలా యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. 2023–24 ఆర్థిక బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త భవనంలోనే ప్రవేశపెడతారని, ఇందుకు సంబంధించి సన్నాహాలు జరుగుతున్నాయని చెబుతున్నాయి. 65 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న పార్లమెంట్ నూతన భవనంలో విశాలమైన హాళ్లు, ఆధునిక లైబ్రరీ, అత్యాధునిక రాజ్యాంగ హాలు, ఆధునిక సాంకేతికతతో కూడిన కార్యాలయాలు, కమిటీ గదులు ఉన్నాయి. కొత్త భవనంలోని లోక్‌సభలో 888 సీట్ల అమరిక నెమలి ఆకారాన్ని స్ఫూరించేలా, రాజ్యసభ హాలులో కమలం పువ్వును గుర్తుకు తెచ్చేలా 384 సీట్ల అమరిక ఉంటుంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పార్లమెంట్ పాత భవనంలోనే రాబోయే బడ్జెట్ సెషన్‌లో ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి జనవరి 31న ప్రసంగిస్తారని స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం వెల్లడించారు. మరోవైపు లోక్‌సభ సెక్రటేరియట్ పార్లమెంటు కొత్త భవనాన్ని యాక్సెస్ చేయడానికి ఎంపీల కోసం కొత్త గుర్తింపు కార్డులను సిద్ధం చేస్తున్నారు. కొత్త భవనంలో వినియోగించే ఆడియో విజువల్ పరికరాలపై ఎంపీలకు శిక్షణ ఇస్తున్నారు. ఒకవేళ కొత్త భవనంలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తిన పక్షంలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 14 వరకు జరిగే తొలి విడత సమావేశాలను పాత భవనంలో, మార్చి 13 నుంచి జరిగే రెండో విడత సమావేశాలను కొత్త భవనంలో నిర్వహించే అవకాశాలున్నాయని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ వర్గాలు వెల్లడించాయి.

నిర్లక్ష్యానికి శిక్షగా మున్సిపాలిటీని రద్దుచేస్తాం!

అహ్మదాబాద్: మోర్బీ మున్సిపాలిటీ తీవ్ర నిర్లక్ష్యం కారణంగానే మోర్బీ తీగల వంతెన దుర్ఘటన చోటుచేసుకుందని గుజరాత్ రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ఆరోపించింది. 'మీ నిర్లక్ష్యానికి శిక్షగా మున్సిపాలిటీ పాలకమండలిని రద్దుచేద్దామనుకుంటున్నాం. అలా ఎందుకు చేయకూడదో సర్వసభ్య సమావేశం తీర్మానం రూపంలో లిఖితపూర్వక సమగ్ర సంజాయిషీ ఇవ్వండి' అని పట్టణాభివృద్ధి శాఖ నోటీసులు పంపించింది. ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణలో తేలిన వాస్తవాలు ఇవీ అంటూ ఆరోపణలు గుప్పించింది. 'తీగల వంతెన బాధ్యతలు చూసిన ఒరేవా గ్రూప్ నిర్వహణ ఒప్పందం 2017లోనే ముగిసింది. ఆ తర్వాత 2018–2020 కాలంలో వంతెన అధ్వానంగా తయారైందని, కూలే ప్రమాదముందని మున్సిపాలిటీకి ఒరేవా గ్రూప్ చాలా సార్లు ఉత్తరాలు రాసి హెచ్చరించింది. అయినా మున్సిపాలిటీ పెడచెవిన పెట్టింది. ఒప్పందం ముగిసినా వంతెనను తమ అధీనంలోకి తీసుకోలేదు' అని పేర్కొంది. కాగా, ఒరేవా సంస్థనూ పట్టణాభివృద్ధి శాఖ తలంటింది. 'తమ పని పూర్తయ్యాక అధీకృత విభాగానికి వంతెన నిర్వహణ బాధ్యతలను తిరిగి అప్పజెప్పలేదు. నిపుణులను సంప్రదించకుండానే రిపేర్లు పూర్తిచేశారు. అధిక బరువుతో పెద్దస్థాయిలో జనం ఒకేసారి వంతెనపై వెళ్తున్నా పట్టించుకోలేదు. పరిమితికి మించి టికెట్లు అమ్ముతున్నా మిన్నకుండిపోయారు' అని ఒరేవానుద్దేశిస్తూ నోటీసులో పేర్కొంది. గత ఏడాది అక్టోబర్ 30న మోర్బీ పట్టణంలో మచ్చూ నదిపై నిర్మించిన ప్రసిద్ధ తీగల వంతెన భారీ సంఖ్యలో వచ్చిన సందర్శకుల అధిక బరువుతో నదిలో కూలడంతో 135 మంది జలసమాధి అయిన విషయం విదితమే.

జోడో యాత్రలో సంజయ్ రౌత్



కథువా: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సారథ్యంలో కొనసాగుతున్న దేశవ్యాప్త భారత్ జోడో యాత్ర శుక్రవారం జమ్మూకశ్మీర్ సరిహద్దు జిల్లా కథువాలోని హట్లీ మోర్హ్ నుంచి ప్రారంభమైంది. ఉదయం నుంచి వర్షం కురుస్తుండటంతో రాహుల్ రెయిన్ కోటు ధరించారు. ఇప్పటి వరకు తీవ్ర శీతల వాతావరణంలోనూ రాహుల్ ప్యాంట్, టీ–షర్ట్‌తోనే యాత్రలో పాల్గొన్న విషయం తెలిసిందే. శుక్రవారం యాత్రలో శివసేన ఉద్ధవ్ బాల్ ఠాక్రే వర్గం నేత సంజయ్ రౌత్ పాలుపంచుకున్నారు. 'మా పార్టీ తరఫున జోడో యాత్రలో పాల్గొనేందుకు ఇక్కడికి వచ్చాను. దేశంలో పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయి. వాస్తవ సమస్యలపై పోరాడుతున్న నేత రాహుల్ గాంధీ. ప్రజానాయకుడు కాబట్టే ఆయన బయటకు వచ్చారు. ప్రజలు స్వచ్ఛందంగా ఈ యాత్రలో పాల్గొని మమేకమవుతున్నారు. తమ నాయకుడిని ప్రజలే నిర్ణయించుకుంటారు' అని రౌత్ ఈ సందర్భంగా చెప్పారు. సీఆర్‌పీఎఫ్ జవాన్ల భారీ భద్రత నడుమ యాత్ర సాగుతోంది. యాత్ర 25 కిలోమీటర్ల మేర సాగి శుక్రవారం రాత్రి కథువా జిల్లా చంద్వాల్‌లో బస చేసింది. శనివారం యాత్రకు విరామం.

డేరా బాబాకు 40 రోజుల పెరోల్



చండీగఢ్: డేరా సచా సౌదా చీఫ్ గుర్మీత్ రాంరహీమ్ సింగ్ అలియాస్ డేరా బాబా(55)కు కోర్టు 40 రోజుల పెరోల్ మంజూరు చేసింది. ఇద్దరు శిష్యురాళ్లపై అత్యాచారానికి పాల్పడిన కేసులో గుర్మీత్ 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే. గతంలోనూ అంటే గత ఏడాది అక్టోబర్ 14వ తేదీన కోర్టు ఇతడికి పెరోల్ మంజూరు చేసింది. జైలు నుంచి బయటకు వచ్చిన ఈయన యూపీలోని బర్నావా ఆశ్రమానికి వెళ్లిపోయారు. అక్కడి నుంచే ఆన్‌లైన్ ద్వారా పలు సత్సంగ్‌లు నిర్వహించారు. వీటికి కొందరు హరియాణా బీజేపీ నేతలు సైతం హాజరయ్యారు. తాజా పెరోల్ సమయంలో ఈ నెల 25న జరగనున్న డేరా మాజీ చీఫ్ షా సత్నామ్ సింగ్ జయంత్యుత్సవాల్లో పాల్గొంటారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

ఎయిరిండియాకు షాక్

న్యూఢిల్లీ: న్యూయార్క్–ఢిల్లీ ఎయిరిండియా విమానంలో తప్పతాగిన వ్యక్తి తోటి ప్రయాణికురాలిపై మూత్రం పోసిన ఘటనపై డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) చర్యలు ప్రకటించింది. టాటా యాజమాన్యంలోని ఎయిరిండియా సంస్థకు రూ.30 లక్షల జరిమానా విధించింది. సదరు విమానం పైలట్–ఇన్–కమాండ్ లైసెన్సుపై మూడు నెలలపాటు సస్పెన్షన్ విధించింది. నాటి ఘటనపై స్పందించడంలో విఫలమైన ఎయిరిండియా డైరెక్టర్ ఇన్ ఫ్లయిట్‌కు రూ.3 లక్షల జరిమానా విధిస్తున్నట్లు తెలిపింది. గత ఏడాది నవంబర్ 26వ తేదీన ఈ ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ప్రయాణికురాలి పట్ల అమర్యాదకరంగా వ్యవహరించిన ఆరోపణలపై ఒక విమానయాన సంస్థకు డీజీసీఏ జరిమానా విధించడం ఇదే మొదటిసారి. డీజీసీఏ ఉత్తర్వులను పరిశీలిస్తున్నట్లు ఎయిరిండియా ప్రతినిధి ఒకరు తెలిపారు. 'అమర్యాదకరంగా ప్రయాణికులు వ్యవహరించిన సందర్భాల్లో నిబంధనల మేరకు స్పందించేందుకు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం'అని ఆయన అన్నారు.

బహు భార్యత్వం, నిఖా హలాలాపై సుప్రీం బెంచ్

న్యూఢిల్లీ: ముస్లింలు పాటిస్తున్న బహు భార్యత్వం, నిఖా హలాలా ఆచారాల రాజ్యాంగ చట్టబద్ధతను తేల్చేందుకు త్వరలో ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని పునరుద్ధరిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. బహు భార్యత్వం, నిఖా హలాలాలను చట్టవ్యతిరేకమైనవిగా ప్రకటించాలంటూ న్యాయవాది అశ్వనీకుమార్ ఉపాధ్యాయ్ వేసిన పిల్‌నుద్దేశిస్తూ కోర్టు ఈ విషయాన్ని తెలిపింది. 'బహు భార్యత్వం సహా పలు కీలకాంశాలు గతంలోనే ఏర్పాటైన సంబంధిత ఐదుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం ముందు ఉన్నాయి. అయితే ఈ బెంచ్‌లోని ఇద్దరు జడ్జీలు రిటైర్ అవడంతో కొత్త వారితో బెంచ్‌ను ఏర్పాటుచేయాల్సి ఉంది. త్వరలోనే ఈ పని పూర్తిచేస్తాం' అని సీజేఐ అన్నారు. బహు భార్యత్వం ప్రకారం భారత్‌లోని ఒక ముస్లిం పురుషుడు నలుగురు భార్యలను కల్గిఉండొచ్చు. కాగా, మాజీ భర్తను పెళ్లాడాలంటే ఒక ముస్లిం మహిళ.. మరొకరిని పెళ్లాడి, విడాకులు ఇవ్వాలి. ఆ తర్వాతే మాజీ భర్తను పెళ్లిచేసుకోవచ్చు.

బీబీసీ ఉదంతంలో మోదీకి సునాక్ మద్దతు

లండన్: ప్రధాని నరేంద్ర మోదీ గతంలో గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో చెలరేగిన గోధ్రా అల్లర్ల ఘటనకు ఆయనే ప్రధాన బాధ్యుడు అని బీబీసీ వార్తసంస్థ ప్రసారంచేసిన డాక్యుమెంటరీ వివాదమైన నేపథ్యంలో మోదీకి బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ మద్దతు పలికారు. గోధ్రా అల్లర్లకు మోదీని బాధ్యుడు అని మీరు భావిస్తున్నారా ? అని బ్రిటన్ పార్లమెంట్‌లో విపక్ష లేబర్ పార్టీ సభ్యుడు, పాక్ మూలాలున్న ఇమ్రాన్ హుస్సేన్.. సునాక్‌ను ప్రశ్నించారు. దీనికి సునాక్ సమాధానమిచ్చారు. 'ప్రధాని మోదీని ఇమ్రాన్ అభివర్ణించిన రీతిని నేను అంగీకరించను. భారత్ విషయంలో బ్రిటన్ వైఖరి శాశ్వతంగా ఒకేలా ఉంటుంది. అది ఏమాత్రం మారదు' అని సునాక్ వ్యాఖ్యానించారు. కాగా, గోధ్రా అల్లర్లకు మోదీనే బాధ్యుడు అంటూ ప్రసారమైన డాక్యుమెంటరీని బీబీసీ సమర్థించుకుంది. 'అవిశ్రాంతంగా చేసిన పరిశోధన, అత్యున్నత ఎడిటోరియల్ ప్రమాణాల ఫలితమే ఈ డాక్యుమెంటరీ' అని పేర్కొంది.

వేగవంత అభివృద్ధి ఉపాధిని సృష్టిస్తోంది

71 వేల మందికి నియామక పత్రాలిస్తూ ప్రధాని మోదీ వ్యాఖ్య



న్యూఢిల్లీ: మౌలిక, అనుబంధ రంగాల్లో వడివడిగా అభివృద్ధి అడుగులు పడుతుండటం వల్లే దేశంలో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు పుట్టుకొస్తున్నాయని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాలు, శాఖల్లో కొత్తగా ఉద్యోగాలు పొందిన 71,426 మందికి శుక్రవారం నియామక పత్రాలను ప్రధాని మోదీ ఎలక్ట్రానిక్ పద్ధతిలో అందజేశారు. రోజ్‌గార్ మేళాలో భాగంగా శుక్రవారం ఢిల్లీలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొత్తగా ఎంపికైన సిబ్బందితో మోదీ కొద్దిసేపు మాట్లాడారు. 'నియామక ప్రక్రియలో పూర్తి పారదర్శకత, వేగం తెస్తూ కచ్చితమైన కాలవధితో రిక్రూట్‌మెంట్ చేస్తున్నాం. కొత్తగా వేలాది మందికి ఉద్యోగాలతో కొనసాగుతున్న ఈ రోజ్‌గార్ మేళానే మా ప్రభుత్వ పనితీరుకు చక్కని నిదర్శనం' అని వ్యాఖ్యానించారు.

విధిలో బాధ్యతగా మెలగండి

నూతన ఉద్యోగాల్లో కొలువుదీరే సిబ్బందిని ఉద్దేశించి మోదీ కొన్ని సూచనలు చేశారు. 'వ్యాపారి తన వినియోగదారుడికి అత్యంత ప్రాధాన్యతనిస్తాడు. ఇదే మంత్రం మీ మదిలో ప్రతిధ్వనించాలి. ప్రజాసేవకు అంకితం కావాలి. కార్యనిర్వహణలో పౌరుడి సేవే ప్రథమ కర్తవ్యంగా ఉండాలి. ప్రజాసేవే ముఖ్యం' అని సూచించారు. 'ప్రతీ గ్రామం భారత్‌నెట్ ప్రాజెక్టులో భాగస్వామి అయిననాడు అక్కడ ఉపాధి కల్పన ఎక్కువ అవుతుంది. టెక్నాలజీని అంతగా అర్థంచేసుకోలేని వారు ఉండేచోట వారికి ఆన్‌లైన్ సేవలు అందిస్తూ కొత్త వ్యాపారం ప్రారంభించేందుకు అవకాశం చిక్కుతుంది. ఇలాంటి కొత్త వ్యాపారాలు చేసేందుకు రెండో శ్రేణి, మూడో శ్రేణి పట్టణాలు అక్కడి అవకాశాలను అందిపుచ్చుకునే నిరుద్యోగ యువతకు నూతన గుర్తింపును తీసుకొస్తున్నాయి' అని అన్నారు. 'భవిష్యత్తులో దేశంలో వివిధ రంగాల్లో మరింతగా ఉపాధి కల్పనకు రోజ్‌గార్ మేళా ఒక ఉత్ప్రేరకంగా పనిచేయగలదు. దేశాభివృద్ధిలో భాగస్వాములయ్యే యువతకు సరైన ఉపాధి అవకాశాలు దక్కాలి' అని ఈ సందర్భంగా ప్రధాని కార్యాలయం పేర్కొంది.

బీజేపీలోకి రండి లేదంటే బుల్డోజర్ రెడీ

గుణ/భోపాల్: బీజేపీ పార్టీలోకి వచ్చేయండి లేదంటే ముఖ్యమంత్రి రూపంలో ఉండే బుల్డోజర్‌ను మీరు ఎదుర్కోవాల్సి ఉంటుందని మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి, బీజేపీ నేత మహేంద్ర సింగ్ సిసోడియా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహేంద్ర ప్రస్తుతం ఆ రాష్ట్ర పంచాయతీ వ్యవహారాల మంత్రిగా ఉన్నారు. రాష్ట్రంలోని రుఠియాయీ పట్టణంలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి మాట్లాడిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు విస్తృతంగా షేర్ అవుతోంది. 'కాంగ్రెస్ సభ్యులారా.. మా వైపు(బీజేపీ పార్టీలోకి)కు వచ్చేయండి. ఈసారీ మేమే ప్రభుత్వం ఏర్పాటుచేస్తాం. మీరు ఇటు వైపు రాలేదంటే మీ కోసం ముఖ్యమంత్రి బుల్డోజర్ సిద్ధంగా ఉంటుంది' అని మంత్రి హెచ్చరించారు. ముఖ్యమంత్రి చౌహాన్.. వేర్వేరు నేరాల్లో నిందితులుగా ఉన్న వారి ఇళ్లను బుల్డోజర్లతో కూల్చి స్థానికంగా 'మామా'గా పేరుతెచ్చుకున్నారని మంత్రి చెప్పారు. మంత్రి వ్యాఖ్యలను కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ తీవ్రంగా తప్పుబట్టారు.

కిలో మల్లి రూ. 2,500

తిరువొత్తియూరు: కోయంబేడు మార్కెట్‌లో మల్లిపూల ధరలు అమాంతం పెరిగాయి. పూల మార్కెట్‌లో కిలో రూ. 2,500 పలుకుతోంది. శనివారం తై అమావాస్య కావడంతో డిమాండ్ ఏర్పడింది. సన్న జాజులు రూ. 1,200, జాజి మల్లెలు రూ. 1,200, కనకాంబరాలు రూ. 600, అడవి మల్లెలు రూ. 1,500లకు విక్రయిస్తున్నారు. సంపంగి రూ. 1500, పన్నీర్ రోస్ రూ. 160, చాక్లెట్ రోస్ రూ. 180, చామంతి రూ. 100 పలుకుతోంది. దీని గురించి కోయంబేడు మార్కెట్ నిర్వాహక కమిటీ అధ్యక్షుడు ముత్తురాజ్ మాట్లాడుతూ.. శనివారం తై అమావాస్య కావడంతో పూల ధరలు రెండింతలు పెరిగాయని తెలిపారు.

న్యూస్‌రీల్


తమిళం అన్వేషణకు రామన్న

- చెన్నై టూ మదురై వరకు పయనం


రాందాసు

సాక్షి, చెన్నై: మాతృ భాష పరిరక్షణ లక్ష్యంగా తమిళం అన్వేషణ నినాదంతో పీఎంకే వ్యవస్థాపకుడు రాందాసు రాష్ట్ర పర్యటనకు సిద్ధమయ్యారు. చెన్నై నుంచి మదురై వరకు ఆయన పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించిన పర్యటన వివరాలను రాందాసు శుక్రవారం ప్రకటించారు. మాతృభాష పరిరక్షణ పేరిట ఓ ఇయక్కంను పీఎంకే నేతృత్వంలో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. భాషా పరిరక్షణ, తమిళుల ఆత్మ గౌరవాన్ని కాపాడడం, అన్ని పాఠశాలల్లో తమిళం తప్పనిసరి నినాదాలతో 8 రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించేందుకు రాందాసు నిర్ణయించారు. ఫిబ్రవరి 21న చెన్నై వళ్లువర్ కోట్టెలో పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు. మధురాంతకం, దిండివనం, పుదుచ్చేరి, కడలూరు, చిదంబరం, మైలాడుదురై, కుంభకోణం, తంజావూరు, తిరుచ్చి, దిండుగల్ మీదుగా మదురై వరకు ఆయన పర్యటించనున్నారు. ఈ పర్యటన ముగింపు రోజున ఫిబ్రవరి 28వ తేదీ మదురైలో బ్రహ్మాండ బహిరంగసభకు నిర్ణయించారు.

శేషవాహనంపై విహరించిన వీరరాఘవుడు



తిరువళ్లూరు: వైద్య వీరరాఘవుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు శుక్రవారం ఉదయం స్వామివారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తిరువళ్లూరు వైద్య వీరరాఘవుడి తైమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఏడు గంటలకు స్వామివారు శేషవాహనంపై భక్తులను కటాక్షించారు. అనంతరం పది గంటలకు తిరుమంజనం, రాత్రి ఏడు గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారు విహరించారు.

సాంకేతికత పురోగతిపై సమీక్ష అవసరం



సాక్షి, చెన్నై: అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడమే కాదు, వాటి పురోగతిపై సమీక్ష అవసరమ ని వక్తలు వ్యాఖ్యానించారు. శుక్రవారం స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్, హ్యుమానిటీస్ ఆధ్వర్యంలో ఐసీఏఎస్‌హెచ్‌టీ–2023 సదస్సు చెన్నైలో జరిగింది. ఇందులో ఫిజిక్స్ విభాగం శాస్త్రవేత్తలను ఏకం చేసే ప్రయత్నంలో భాగంగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. కేరళ, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన 200 మంది ప్రతినిధులు పరిశోధన పత్రాలను అందజేశారు. ఇందులో 148 పత్రాలను ఎంపిక చేశారు. రెండు రోజులపాటు జరగనున్న సదస్సులో పలువురు వక్తలు అత్యాధునిక సాంకేతిక అంశాలను విశదీకరించారు. సిమాట్స్ వర్సిటీ వీసీ డాక్టర్ చదరం శివాజీ, ప్రిన్సిపల్ శ్రీనివాసన్ పాల్గొన్నారు.


ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న ఈరోడ్ కలెక్టర్ కృష్ణన్ ఉన్ని


అన్నాడీఎంకే సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి తంగమణి

రంగంలోకి పళని

- బీజేపీ మద్దతుకు ప్రయత్నాలు
- రెండాకుల కోసం ఢిల్లీకి బృందం
- పోటీ నుంచి తప్పుకున్న వాసన్
- ఆసక్తికరంగా ఈరోడ్ ఉపఎన్నిక
- కాంగ్రెస్‌తో కయ్యానికి అన్నాడీఎంకే రెడీ
- పన్నీరు మంతనాలు


పళనిస్వామి, పన్నీరుసెల్వం, అన్నామలై, జీకే వాసన్

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకేలో ఆసక్తికర పరిణామాలు ముున్ముందు చోటుచేసుకోనున్నాయి. ఈరోడ్ తూర్పు నియోజకవర్గం ఉప ఎన్నికల వేదికగా తన సత్తా చాటుకునేందుకు ఆ పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళనిస్వామి వ్యూహాలకు పదునుపెట్టారు. తాము పోటీలో లేమని మిత్రపక్షం వాసన్ నేతృత్వంలోని తమిళ మానిల కాంగ్రెస్ ప్రకటించింది. దీంతో పన్నీరుసెల్వంకు చెక్‌పెట్టే విధంగా, రెండాకులు కైవసం చేసుకునేందుకు పళని సిద్ధమయ్యారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అన్నాడీఎంకే ఢీకొట్టనుండడంతో ఉపసమరం ఆసక్తికరంగా మారింది.

కాంగ్రెస్–డీఎంకే ఉమ్మడి అభ్యర్థి

ఈరోడ్ తూర్పు నియోజకవర్గానికి ఫిబ్రవరి 27న ఉపఎన్నిక జరగనున్న విషయం తెలిసిందే. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తిరుమగన్ ఈవేరాను అన్నాడీఎంకే కూటమిలోని తమిళ మానిల కాంగ్రెస్ అభ్యర్థి యువరాజ్‌తో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుత ఉప ఎన్నికలో ఆ సీటు మళ్లీ కాంగ్రెస్‌కే డీఎంకే కూటమి కేటాయించింది. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రత్యేక ఇన్‌చార్జ్‌ల బృందాన్ని శుక్రవారం డీఎంకే రంగంలోకి దించింది. గత ఎన్నికలలో ఓటమి పాలైన యువరాజ్ మళ్లీ పోటీకి సిద్ధమయ్యారు.

పళని వ్యూహాలు..

అన్నాడీఎంకేలో చీలికలు, విభేదాలను గాడిలో పెట్టేందుకు ఈ ఎన్నికను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ఆ పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళనిస్వామి శిబిరం సిద్ధమైంది. అన్నాడీఎంకే సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరుసెల్వం శిబిరానికి చెక్ పెట్టే విధంగా వ్యూహాలకు పదును పెట్టి కార్యరూపంలోకి తెచ్చే పనిలోపడ్డారు.

వాసన్ దూరం..

గురువారం పళనిస్వామి తరఫున బృందం తమిళ మానిల కాంగ్రెస్ నేత జీకే వాసన్‌తో భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో మళ్లీ వాసన్ అభ్యర్థి యువరాజ్ పోటీ చేస్తారని సర్వత్రా భావించారు. అయితే, ఈ ఎన్నికల నుంచి తాము తప్పుకుంటున్నామని, కూటమి ధర్మం, విజ్ఞప్తి మేరకు అన్నాడీఎంకేకు అప్పగిస్తున్నామని శుక్రవారం వాసన్ మీడియా ముందు ప్రకటించారు. దీంతో ఉపసమరంలో కాంగ్రెస్‌ను ఢీ కొట్టేందుకు అన్నాడీఎంకే సిద్ధం కావడంతో ఈరోడ్ తూర్పు రాజకీయం ఆసక్తికరంగా మారింది. ఇదే అదనుగా ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టు ఓ వైపు పన్నీరుసెల్వంకు చెక్ పెట్టి తన బలాన్ని చాటుకోవడం, మరోవైపు ఈ ఎన్నిక వేదికగా రెండాకుల చిహ్నం కైవసం చేసుకుని అన్నాడీఎంకేకు తానే సుప్రీం అని చాటుకునేందుకు పళనిస్వామి సిద్ధం కావడం గమనార్హం.

ఢిల్లీకి బృందం..

ఈ ఎన్నికలలో తమకు మద్దతు ఇవ్వాలని బీజేపీని కలిసి విజ్ఞప్తి చేయడానికి పళని బృందం సిద్ధమైంది. శనివారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైతో భేటీ కానుంది. అదేసమయంలో బీజేపీ నేతృత్వంలో ఈరోడ్ తూర్పు నియోజకవర్గంలో సర్వే జరిపి ఉండడం గమనార్హం. ఈ భేటీ తర్వాత రెండాకుల చిహ్నం కైవసం చేసుకునేందుకు పళని స్వామి శిబిరం ఢిల్లీ పయనం కానుండడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అన్నాడీఎంకే అభ్యర్థిగా మాజీ మంత్రి రామలింగం పోటీలో ఉండవచ్చని తెలిసింది. పళని వ్యూహాలకు క్లోం వేయడానికి పన్నీరుసెల్వం రంగంలోకి దిగారు. తన అభ్యర్థిని నిలబెట్టి అన్నాడీఎంకే ఓట్లను చీల్చేందుకు సిద్ధమవుతుండడం గమనార్హం. ఈనెల 23న తన మద్దతు నేతలతో సమావేశానికి పన్నీరుసెల్వం నిర్ణయించారు. తమ అభ్యర్థిని సైతం రంగంలోకి దించేందుకు అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం నేత దినకరన్ నిర్ణయించినట్టు సమాచారం. ఈనెల 27న ప్రకటిస్తామని తెలిపారు. డీఎండీకే నేత విజయకాంత్, మక్కల్ నీది మయ్యం నేత కమలహాసన్ కూడా ఈనెల 23న తమ నిర్ణయాన్ని ప్రకటించబోతున్నారు.

చెన్నై రోడ్లకు రూ.500 కోట్లు

- మంత్రి కేఎన్ నెహ్రూ



సాక్షి, చెన్నై: వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణకు రూ.500 కోట్లను సీఎం స్టాలిన్ కేటాయించారని నగరాభివృద్ధిశాఖ మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. చెన్నై వ్యాసార్పాడిలోని డాక్టర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల రోడ్డులోని ఆరోగ్యకేంద్రంలో రూ.1.36 కోట్లతో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ గత ఏడాది చెన్నైలో రూ.1000 కోట్లతో వర్షపు నీటి కాలువల పనులు చేపట్టామని గుర్తు చేశారు. కొన్నేళ్లగా ఉన్న మురుగునీటి పైప్‌లైన్లను మార్చేందుకు నిర్ణయించామని తెలిపారు. 17 లక్షల గృహాలకు సురక్షిత నీటిని అందించేందుకు మరింత విస్తృతంగా చర్యలు తీసుకోనున్నామన్నారు. చెన్నైలో రోజుకు 1000 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. మరో 30 ఏళ్లలో ఎదురయ్యే పరిస్థితులను ముందుగా పరిగణనలోకి తీసుకుని ముందు జాగ్రత్తలు విస్తృతం చేయనున్నామని వివరించారు. మరికొన్ని నెలల్లో రోజుకు నిర్లవణీకరణ పథకం ద్వారా 150 మిలియన్ లీటర్ల నీటి శుద్ధీకరణకు చర్యలు చేపట్టామన్నారు. క్లీన్ సిటీలో భాగంగా నగరంలో 372 చోట్ల ఆధునిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు.

నేటి నుంచి వజ్రాల ప్రదర్శన

వేలూరు: వినూత్న, అత్యాధునిక డిజైన్లతో వేలూరు వేదికగా ఈ నెల 21, 22 తేదీల్లో బంగారు, వజ్రాల ప్రదర్శనను ఏర్పాటు చేశామని ఉమ్మిడి బంగారు జ్యువెలర్స్ మేనేజింగ్ పార్టనర్ అమరేంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలూరు కొసపేట లయ హాల్‌లో ఈ ఎగ్జిబిషన్ జరుగుతుందన్నారు. ఇక్కడ పల్లవ, చోళ, నాయక, మరాఠా, ఆర్కాట్ నవాబు, బీజాపూర్ సుల్తాన్‌ల కాలం నాటి, అత్యాధునిక డిజైన్లతో కూడిన ఆభరణాలు కొలువు దీర్చనున్నామని పేర్కొన్నారు.

తిరుచెందూరు నుంచి అన్నామలై పాదయాత్ర

- ఏప్రిల్ 14వ తేదీ నుంచి ప్రారంభం
- బీజేపీ ఎగ్జిక్యూటివ్ కమిటీ తీర్మానం
- పార్టీ బలోపేతంపై చర్చ


అన్నామలై, నయనార్ నాగేంద్రన్‌లను సత్కరిస్తున్న సుధాకర్‌రెడ్డి

సాక్షి, చెన్నై: పార్టీ బలోపేతమే లక్ష్యంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై రాష్ట్రంలో పాదయాత్రకు ముహూర్తం ఖరారైంది. ఏప్రిల్ 14వ తేదీ తిరుచెందూర్ నుంచి ఈ యాత్ర మొదలెట్టే విధంగా ఆ పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో తీర్మానించారు. శుక్రవారం కడలూరులో బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, జాతీయ కో ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, బీజేపీ శాసన సభాపక్ష నేత నయనార్‌నాగేంద్రన్, సీనియర్ నేతలు సీపీ రాధాకృష్ణన్, పొన్ రాధాకృష్ణన్, ఏ. రాజా తదితరులు హాజరయ్యారు. ఇందులో పొంగులేటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ నినాదానికి బలం చేకూర్చే విధంగా కార్యక్రమాలు విస్తృతం చేయనున్నామన్నారు. పీఎం మోదీ పాలనలోని ప్రగతి పథకాలు, తమిళనాడు ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నామని వివరించారు. ప్రజా సమస్యలు, భవిష్యత్తు కార్యక్రమాల గురించి చర్చించారు. పార్టీ బలోపేతం లక్ష్యంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, లోక్ సభ నియోజకవర్గాల వారీగా పరిస్థితులను సమీక్షించారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో ఈ సారి కనీస స్థానాలను దక్కించుకోవడమే ధ్యేయంగా తీర్మానాలు చేశారు. జిల్లా, మండల, నగర, బూత్ కమిటీలను బలోపేతం చేయనున్నారు. ఇందులో భాగంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పాదయాత్రకు నిర్ణయించారు. ఏప్రిల్ 14వ తేదీ తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్‌లో తన పాదయాత్రను అన్నామలై చేపట్టనున్నారు. త్వరలో ఈ పాదయాత్ర రూట్ మ్యాప్ ప్రకటించనున్నారు. చివరగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, శాసన సభా పక్ష నేత నయనార్ నాగేంద్రన్‌లను సుధాకర్ రెడ్డి సత్కరించారు.

వివాహిత ఆత్మహత్య

బిడ్డల మృతితో మనస్తాపం

తిరువొత్తియూరు: పుట్టిన ఇద్దరు బిడ్డలు నెలల వ్యవధిలోనే మృతిచెందడంతో మనస్తాపం చెందిన మహిళ ఆత్మహత చేసుకుంది. ఈ ఘటన చెన్నై పాత పల్లావరంలో చోటుచేసుకుంది. వివరాలు.. రాజీవ్ గాంధీనగర్‌కు చెందిన మనీషా (20)కు వేలూరు జిల్లాకు చెందిన టీనుతో మూడేళ్ల క్రితం వివాహమైంది. భర్తతో కలిసి వేలూరులో ఉంటోంది. వీరికి రెండేళ్ల క్రితం ఆడ బిడ్డ పుట్టింది. అయితే పుట్టిన కొద్ది రోజులకే అనారోగ్యంతో మృతిచెందింది. గత ఏడాది రెండోసారి శిశువు జన్మించింది. 5 నెలలకే ఆ శిశువుకు కూడా అనారోగ్యంతో మృతిచెందడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. గురువారం పుట్టింట్లో ఉన్న మనిషా ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పల్లావరం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఆయుర్వేద వైద్యానికి ప్రాధాన్యం


వర్చువల్ ద్వారా భవనాలను ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్


నియామక పత్రాన్ని అందజేస్తున్న సీఎం

- సీఎం ఎంకే స్టాలిన్
- 130 మందికి నియామక పత్రాలు అందజేత

సాక్షి, చెన్నై: సిద్ధ, ఆయుర్వేదం, హోమియోపతి వైద్యానికి ప్రాధాన్యతను పెంచనున్నామని సీఎం స్టాలిన్ తెలిపారు. ఈ విభాగాల్లో 130 మంది వైద్యాధికారుల పోస్టులను భర్తీ చేస్తూ శుక్రవారం నియామక పత్రాలను సీఎం అందజేశారు. తమిళనాడు వ్యాప్తంగా 1,541 సిద్ధ, ఆయుర్వేద, హోమియోపతి, యునాని, యోగా సీట్లు ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ విభాగాలు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాయని వివరించారు. కరోనా మహమ్మారి కాలంలో మరింత విస్తృతంగా వైద్య సేవలు అందించారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిద్ధ, ఆయుర్వేద, హోమియోపతి వైద్య విధానాలను మరింత ప్రోత్సహించేందుకు నిర్ణయించామని వెల్లడించారు. ఇందులో భాగంగా అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఎంపికైన 130 మంది సిద్ధ, ఆయుర్వేద , హోమియోపతి వైద్యులకు నియామక పత్రాలను సచివాలయంలో సీఎం స్టాలిన్ అందజేశారు. అనంతరం ఉన్నత విద్యా శాఖ నేతృత్వంలో రూ. 202 కోట్లతో నిర్మించిన పలు కళాశాల భవనాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం స్టాలిన్ ప్రారంభించారు. ఇందులో చెన్నై, తిరువళ్లూరు, నీలగిరి, సేలం, నామక్కల్, కరూర్, పుదుకోట్టై, కడలూరు, తిరువారూర్, విల్లుపురం, వేలూరు, తిరుప్పూర్, కోయంబత్తూరు, తంజావూరు, దిండుగల్, తిరునల్వేలి, రామనాథపురం జిల్లాల్లోని ప్రభుత్వ కళాశాలలకు అదనపు తరగతులు, హాస్టల్ గదులు, ఆడిటోరియం, సాంకేతిక పరిశోధన కేంద్రాలు, తదితర నిర్మాణాలు ఉన్నాయి. కార్యక్రమంలో మంత్రులు దురై మురుగన్, పొన్ముడి, ఎం సుబ్రమణియన్, సీఎస్ ఇరైఅన్బు, ఆరోగ్య కార్యదర్శి సెంథిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అజిత్ అభిమాని ఆత్మహత్య


వీరబాహు (ఫైల్)

తమిళసినిమా: నటులపై హద్దులు మీరిన అభిమానం ప్రాణాలను బలిగొంటోంది. పొంగల్ సందర్భంగా విజయ్ నటించిన వారిసు, అజిత్ నటించిన తుణివు చిత్రాలు ఒకేసారి విడుదలైన విషయం తెలిసిందే. అవి ఆ హీరోల అభిమానుల్లో పోటీ తత్వాన్ని పెంచేశాయి. దీంతో ఆ చిత్రాలు విడుదలైన థియేటర్ల వద్ద తోపులాటలు, వాగ్వాదాలు, గొడవలు అంటూ రచ్చరచ్చ చేశారు. భరత్ అనే అజిత్ అభిమాని ఒకరు లారీపైకి ఎక్కి దాన్స్ చేస్తూ కిందపడి ప్రాణాలు పోగొట్టుకున్న విషయం తెలిసిందే. ఆ దుర్ఘటన జరిగిన కొద్ది రోజులకే మరో విషాదం చోటుచేసుకుంది. తాజాగా మరో అభిమాని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు చూస్తే తూత్తుక్కుడికి చెందిన వీరబాహు అనే వ్యక్తి అజిత్ వీరాభిమాని. ఇతను గురువారం తుణివు చిత్రాన్ని తన కుటుంబసభ్యులతో కలిసి చూడడానికి థియేటర్‌కు వెళ్లాడు. అయితే ఇతను మద్యం తాగి ఉండటంతో థియేటర్ సిబ్బంది అతన్ని థియేటర్లోకి అనుమతించలేదు. మద్యం తాగాడని అవమానకరంగా మాట్లాడి కుటుంబసభ్యులను మాత్రమే థియేటర్‌లోకి అనుమతించారు. తనను చిత్రాన్ని చూడడానికి అనుమతించకపోగా తన కుటుంబసభ్యుల ముందే అవమానించడాన్ని భరించలేక వీరబాహు ఇంటికి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

50 శాతం సబ్సిడీతో వరినారు


నారును పరిశీలిస్తున్న జిల్లా మానిటరింగ్ అధికారి రాజారామన్, కలెక్టర్

తిరువళ్లూరు: రైతులకు సబ్సిడీతో అందించే వరినారు నాణ్యతగా ఉండేలా చూడాలని జిల్లా మానిటరింగ్ అధికారి రాజారామన్ అధికారులను ఆదేశించారు. తిరువళ్లూరు జిల్లాలోని వరిధాన్యాల గోడౌన్‌లు, వరినారు కేంద్రాలను కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. నిల్వ, నాణ్యత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పున్నపాక్కం గ్రామంలోని ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. సబ్సిడీ ద్వారా రైతులు పొందుతున్న లబ్ధి వివరాలపై ఆరా తీశారు. రాజారామన్ మాట్లాడుతూ.. రైతులు ప్రైవేటు దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అలాంటి దుకాణాలపై అధికారులు తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఎరువులు, విత్తనాల్లో కల్తీ ఉంటే దుకాణానికి సీల్ వేయాలన్నారు. ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాల్లో వరినారు నాణ్యతగా ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో వరినారు అందజేస్తోందని తెలిపారు. సబ్ కలెక్టర్ మహాభారతి, వ్యవసాయశాఖ అధికారులు సురేష్, ఎబినేజర్, జబకుమారి, సర్పంచ్ సుందరమూర్తి ఉన్నారు.

రిహార్సల్స్ అదుర్స్!

- విమానాశ్రయంలో భద్రత కట్టుదిట్టం
- సందర్శకులకు అనుమతి రద్దు
- ఆ ప్రతినిధులే జెండా ఎగురవేయాలి..
- కలెక్టర్లకు సీఎస్ ఆదేశం



రిహార్సల్స్ చేస్తున్న పోలీసులు

సాక్షి, చెన్నై : గణతంత్ర వేడుకల రిహార్సల్స్ శుక్రవారం అదరహో అనిపించే రీతిలో జరిగాయి. రిపబ్లిక్ డే భద్రతను కట్టుదిట్టం చేస్తూ విమానాశ్రయాలను నిఘా వలయంలోకి తీసుకొచ్చారు.

74వ గణతంత్ర దినోత్సవానికి రాష్ట్రంలో ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. కరోనా ఆంక్షలన్నీ ప్రస్తుతం ఎత్తి వేసిన నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు, కార్యాలయాలు, విద్యాసంస్థల్లో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. చెన్నై మెరీనా తీరంలో వేడుకల ఏర్పాట్లపై అధికారులు దృష్టిపెట్టారు. గాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండాను గవర్నర్ ఎగురవేయడం ఆనవాయితీగా వస్తున్నది. ప్రస్తుతం అక్కడ మెట్రో పనులు జరుగుతుండడంతో వేదికను మెరీనా తీరంలోని శ్రామిక విగ్రహం వద్దకు మార్చారు. వేడుకల్లో భాగంగా గౌరవ వందనం సమర్పించే రీతిలో తమిళ సంస్కృతి, సంప్రదాయాల్ని చాటే విధంగా కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ రిహార్సల్స్ శుక్రవారం అదరహో అనిపించాయి. త్రివర్ణ దళాలు, పోలీసు విభాగంలోని పలు బృందాలు, అశ్వదళాలు, బ్యాండ్ వాయిద్య బృందాలు, మహిళా ఫోర్స్ బృందాలు రిహార్సల్స్‌తో ముందుకుసాగాయి.

నిఘా కట్టుదిట్టం..

మెరీనాతీరం పరిసరాలతో పాటు చెన్నై, మదురై, తిరుచ్చి, కోయంబత్తూరు విమానాశ్రయాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రస్తుతం మూడు అంచెల భద్రత కల్పించగా, 24 ,25, 26 తేదీల్లో ఏడు అంచెల భద్రతకు చర్యలు తీసుకున్నారు. విమానాశ్రయాల్లో సందర్శకులకు నిషేధం విధించారు. రైల్వే స్టేషన్‌లలోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు.

సీఎస్ ఆదేశాలు..

రాష్ట్రంలో కొన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు జాతీయ జెండాలను ఎగరవేయలేని పరిస్థితి ఉంది. అక్కడ అగ్రవర్ణాలు రాజ్యమేలుతుండడంమే ఇందుకు కారణం. రాష్ట్రంలో వెనుకబడిన సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు అధ్యక్షులుగా ఉన్నా, ఉపాధ్యక్షులుగా ఉన్న ఇతర సామాజిక వర్గం ఆధిక్యమే కొనసాగుతోంది. ఇందుకు అద్దంపట్టే విధంగా సీఎస్ ఇరైఅన్బుకు ఫిర్యాదులు అందాయి. రాష్ట్రంలోని 15 స్థానిక సంస్థల్లో అక్కడి అధ్యక్షులు జెండా ఎగురవేయలేని పరిస్థితి నెలకొందని వచ్చిన ఫిర్యాదుపై సీఎస్ స్పందించారు. తక్షణం జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. అలాగే, అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడెక్కడ వెనుక బడిన సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు అధ్యక్షులుగా ఉన్నారో, వారితో జెండా ఎగురవేయించేందుకు ఆయా స్థానిక సంస్థల్లో చర్యలు తీసుకోవాలని, కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

తూటా దూసుకెళ్లి యువకుడికి గాయాలు

- పోలీసుల విచారణ

సాక్షి, చెన్నై : సీఐఎస్ఎఫ్ బృందం శిక్షణ సమయంలో ఓ తూటా సమీపంలోని ఓ ఇంటి వైపు దూసుకెళ్లింది. అక్కడ పనుల్లో ఉన్న యువకుడిని తూటా తాకింది. గాయపడిన యువకుడు చికిత్స పొందుతున్నాడు. బీహార్‌కు చెందిన అన్సర్ ఆలం (27) పల్లావరం సమీపంలోని త్రిశూలం పెరియార్ నగర మెయిన్ రోడ్డులో నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతంలో శంకర్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం పనుల్లో ఫెన్సింగ్ వర్క్‌ను ఆలం చేస్తున్నాడు. శుక్రవారం రెండో అంతస్తులో పనుల్లో ఉండగా ఎక్కడి నుంచో వచ్చిన ఓ తూటా అతడ్ని తాకింది. కింద పడ్డ అతడిని సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అతడి కుడి కాలు తొడ భాగంలో ఉన్న తూటాను వైద్యులు తొలగించారు. విషయం తెలిసి పోలీసులు విచారణ చేపట్టారు. శంకర్ ఇంటికి సమీపంలోని మైదానంలో సీఐఎస్ఎఫ్ బృందం తుపాకీ కాల్పుల శిక్షణలో నిమగ్నమైనట్టు తెలిసింది. ఈ సమయంలో ఓ తుపాకీ నుంచి తూటా మైదానాన్ని దాటి వచ్చి ఆలంను తాకినట్టు విచారణలో నిర్ధారణ అయ్యింది.

క్లుప్తంగా

ఖైదీలకు వితరణగా 15 వేల పుస్తకాలు

తిరువొత్తియూరు: చెన్నై నందనంలోని వైఎంసీఏ మైదానంలో 46వ పుస్తక ప్రదర్శన జరుగుతోంది. జైళ్లశాఖ తరపున స్టాల్‌ను ఏర్పాటు చేశారు. జైళ్లలోని ఖైదీలకు పుస్తకాలను వితరణగా ఇవ్వదలచిన వారు 9941265748 అనే నంబర్‌కు ఫోన్‌చేస్తే ఇంటికి వచ్చి జైళ్ల శాఖ సిబ్బంది పుస్తకాలు స్వీకరిస్తారు. ఇప్పటివరకు ఖైదీల కోసం 15 వేల పుస్తకాలను దాతలు వితరణగా ఇచ్చినట్లు డీఐజీ మురుగేషన్ తెలిపారు. శాంతిభద్రతలు, కోర్టులు, జైళ్ల శాఖ మంత్రి ఎస్ రఘుపతి పుస్తక ప్రదర్శనకు వెళ్లి పరిశీలించి 100 పుస్తకాలను వితరణగా జైలు ఖైదీలకు అందజేశారు.

షూ కంపెనీలో ఐటీ దాడులు

వేలూరు: తిరుపత్తూరు జిల్లా ఆంబూరు సమీపంలోని కోమేశ్వరం, ఆంబూరు టౌన్‌లోని ఏకస్పా ప్రాంతంలో ఓ ప్రైవేటు షూ కంపెనీ ఉంది. ఈ కంపెనీలో 5వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం 7 గంటల సమయంలో చెన్నై ఐటీ అధికారి సంతోష్ ఆధ్వర్యంలో 15 మందికి పైగా అధికారులు షూ కంపెనీలోకి వెళ్లారు. అనంతరం పరిశ్రమ గేటు తాళాలు వేసుకుని కార్యాలయంలోకి వెళ్లి యజమాని, మేనేజర్ సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయంలో జామర్‌లను ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం వరకు కూడా తనఖీలు కొనసాగిస్తూనే ఉన్నారు. పూర్తి వివరాలను అధికారులు చెప్పడానికి నిరాకరించారు. ఇదిలాఉండగా ఐదు నెలల క్రితం ఆంబూరులోని 15 షూ కంపెనీల్లో ఐటీ అధికారులు ఆరు రోజుల పాటు తనఖీలు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మరో షూకంపెనీలో తనఖీలు చేయడం కలకలం రేపింది.

రియల్ ఎస్టేట్ వ్యాపారి కిడ్నాప్

- ఆరుగురి అరెస్ట్

అన్నానగర్: చెన్నై అంబత్తూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారి కిడ్నాప్‌నకు గురయ్యాడు. పోలీసులు సకాలంలో స్పందించి 3 గంటల్లోనే అతన్ని రక్షించారు. అత్తిపట్టుకు చెందిన జయరామన్ రియల్టర్. గురువారం రాత్రి ఆరుగురు వ్యక్తులు ఇతనితో మాట్లాడడానికి వచ్చారు. ఈక్రమంలో జయరామన్‌ను కత్తితో బెదిరించి కిడ్నాప్ చేశారు. కొద్దిసేపటి తరువాత జయరామన్ భార్యకు ఫోన్ చేసి భర్తను కిడ్నాప్ చేశామని చెప్పారు. విడిచిపెట్టాలంటే రూ.5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో ఆమె అంబత్తూరు ఎస్టేట్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా మూడు గంటల్లోనే మైలాపూరులో కిడ్నాప్‌నకు గురైన జయరామన్‌ను పోలీసులు గుర్తించారు. అతన్ని రక్షించి పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

వేలూరు: డీఎంకే ప్రభుత్వంలోనే విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు డీఎంకే జిల్లా కార్యదర్శి, అనకట్టు ఎమ్మెల్యే నందకుమార్ అన్నారు. వేలూరు తొర్రపాడిలోని తందైపెరియార్ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో రూ.77 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు గదులను ముఖ్యమంత్రి స్టాలిన్ చెన్నై సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ నేపథ్యంలో వేలూరులోని కళాశాలలో కలెక్టర్ కుమరవేల్ పాండియన్, ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రతిఒక్కరిని విద్యావేత్తలుగా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని వాటి ద్వారా అభివృద్ధి చెందాలన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమరవేల్, ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్

అనంతరం నూతనంగా నిర్మించిన అదనపు గదులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అరుల్ అరసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరికొత్త ఎలివేటర్ ఆవిష్కరణ

సాక్షి, చెన్నై: వైర్‌లెస్ న్యూ మాటిక్ హోమ్ ఎలివేటర్‌ను ప్రప్రథమంగా నిబావ్ లిఫ్ట్ ఆవిష్కరించింది. స్థానికంగా శుక్రవారం ఈ ఆవిష్కరణ గురించి నిబావ్ ప్రతినిధులు వివరించారు. లిఫ్ట్‌ల ఉత్పత్తిలో స్వదేశీ సాంకేతికత, దేశీయ డిజైన్లపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. తాడు, బెల్ట్, వైర్లు లేకుండా పూర్తిగా గాలితో పనిచేసే విధంగా వైర్‌లెస్ న్యూమాటిక్ హోం ఎలివేటర్‌ను రూపొందించామని వివరించారు. సిరీస్ 3 పేరిట విద్యుత్‌సరఫరా ఆగినా, బ్యాటరీ బ్యాకప్ లేకున్నా, ఇంట్లో గొయ్య తవ్వాల్సిన అవసరం కూడా లేకుండా స్వీయ మద్దతుతో ఈ ఎలివేటర్‌ను సిద్ధం చేశామని తెలిపారు.

కాక్లియర్ ఇంప్లాంట్‌పై అవగాహన అవసరం



చిన్నారులతో ఎంపీ డాక్టర్ కళానిధి వీరాస్వామి, ఉప కులపతి విజయరాఘవన్

కొరుక్కుపేట: కాక్లియర్ ఇంప్లాంట్‌పై అవగాహన కల్పించాలని ఎంపీ డాక్టర్ కళానిధి వీరాస్వామి అన్నారు. శ్రీరామచంద్రా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌లో శుక్రవారం క్లిప్స్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. 17 సంవత్సరాల క్రితం జరిగిన మొదటి శస్త్రచికిత్సకు గుర్తుగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పూర్తిగా ఈ శస్త్రచికిత్స చేయించుకున్న పిల్లలు పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. వారిలో చాలా మంది తిరుక్కురల్ పఠించారు. కొందరు నృత్యం చేశారు. మరికొందరు ప్రసంగాలతో తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఎంపీ డాక్టర్ కళానిధి మాట్లాడుతూ చాలా మంది పిల్లలు అనర్గళంగా మాట్లాడుతున్నారని, సాధారణ పిల్లల్లాగే అందంగా కనిపిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఇన్‌స్టిట్యూట్ ఉపకులపతి డా.పి.వి. విజయరాఘవన్ మాట్లాడుతూ దేశంలోని అన్ని వైద్య కళాశాలల్లో స్పీచ్, లాంగ్వేజ్, వినికిడి శాస్త్రాల విభాగం ఉండాలని, తద్వారా ఈఎన్‌టీ విభాగం ద్వారా కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ ప్రయోజనం పూర్తిగా నెరవేరుతుందని అన్నారు. ఈఎన్‌టీ హెడ్, నెక్ సర్జరీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్.ఎల్.సోము, శ్రీరామచంద్ర ఫ్యాకల్టీ ఆఫ్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రకాష్ భూమినాథన్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు ఇద్దరే రైతులు

- అధికారులు 30 మంది



అగ్రి గ్రీవెన్స్ సమావేశంలో అధికారులు

తిరుత్తణి: తిరుత్తణిలో శుక్రవారం నిర్వహించిన అగ్రి గ్రీవెన్స్‌లో ఇద్దరు రైతులు పాల్గొనగా 30 మంది అధికారులు హాజరయ్యారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రతినెలా అగ్రి గ్రీవెన్స్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తుంటారు. అయితే జిల్లాలోని రైతులు కలెక్టరేట్‌కు రావడం కష్టంగా మారడంతో రైతుల శ్రేయస్సు కోసం డివిజన్ స్థాయిలో గ్రీవెన్స్‌కు కలెక్టర్ ఆదేశించారు. దీంతో తిరుత్తణి డివిజన్ స్థాయి అగ్రి గ్రీవెన్స్ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. ఆర్డీఓ హస్తత్‌భేగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఇద్దరు రైతులు మాత్రమే హాజరయ్యారు. అదేసమయంలో వివిధ శాఖల నుంచి 30 మంది అధికారులు పాల్గొన్నారు. గ్రీవెన్స్‌లో పాల్గొన్న జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్‌రాజు మాట్లాడుతూ గ్రీవెన్స్‌కు సంబంధించి అధికారులు రైతులకు సమాచారం ఇవ్వడం లేదు. ప్రతి శాఖ ద్వారా రైతులకు అగ్రి గ్రీవెన్స్‌కు ముందస్తుగా సమాచారం అందిస్తే పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో రైతులకు సమాచారం చేరవేసి గ్రీవెన్స్ నిర్వహించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నేత్రదానానికి యువత ముందుకురావాలి



వైద్య పరికరాన్ని ప్రారంభిస్తున్న మేయర్ ప్రియ, ఎమ్మెల్యే గణపతి

కొరుక్కుపేట: నేత్రదానం చేసేందుకు యువత ముందుకు రావాలని ఎమ్మెల్యే కారపాక్కం గణపతి పిలుపునిచ్చారు. ఈమేరకు చెన్నై పోరూర్‌లో అధునాతన రెటినల్ ఇమేజింగ్ టెక్నాలజీతో డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, గౌరవ అతిథిగా మధురవాయల్ ఎమ్మెల్యే కారంబాక్కం కె.గణపతి పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. డాక్టర్ అగర్వాల్స్ గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ అతియా అగర్వాల్, ఆస్పత్రి పోరూర్ జోనల్ హెడ్ – క్లినికల్ సర్వీసెస్ డాక్టర్ కళాదేవి సతీష్ పాల్గొన్నారు. ప్రారంభ వేడుకల్లో భాగంగా కొత్త ఆస్పత్రిలో ఈనెల 31 వరకు కన్సల్టేషన్ ఫీజులేదని నిర్వాహకులు తెలిపారు.

మృతదేహంతో రాస్తారోకో



మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

తిరువణ్ణామలై(వేలూరు): రోడ్డు ప్రమాదానికి కారణమైన నిందితులను అరెస్ట్ చేయాలని బాధిత కుటుంబసభ్యులు మృతదేహంతో రాస్తారోకో చేశారు. తిరువణ్ణామలై జిల్లా కలశపాక్కం తాలుకా కోటరామ్‌పాళ్యం గ్రామానికి చెందిన పెరుమాల్ భార్య శాంతి(56). ఈమె గురువారం రాత్రి ఇంటి నుంచి ఆదమంగళం గ్రామానికి రోడ్డుపై నడిచి వెళ్లింది. ఆ సమయంలో వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం శాంతిని ఢీకొనడంతో ఆమె మృతిచెందింది. శుక్రవారం మధ్యాహ్నం పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతదేహాన్ని తీసుకుని బంధువులు కడలాడి పోలీస్‌స్టేషన్ ఎదుట నిందితులను అరెస్ట్ చేయాలని, కుటుంబసభ్యులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో చేశారు. పోలీసులు గ్రామస్తులతో చర్చలు జరిపి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో బంధువులు మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు.

గవర్నర్ తీరును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ధర్నా



పళ్లిపట్టులో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

పళ్లిపట్టు: రాష్ట్ర గవర్నర్ తీరుకు నిరసనగా పళ్లిపట్టులో కాంగ్రెస్ శ్రేణులు గురువారం ధర్నా చేశారు. తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి తమిళనాడును తమిళం అని వ్యాఖ్యానించడం పట్ల డీఎంకే మిత్రపక్షాలు భగ్గుమంటున్నాయి. ఈక్రమంలో తిరుత్తణి నియోజకవర్గ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పళ్లిపట్టు మాజీ మండల చైర్మన్ వెంకటరాజు ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం ఎదురుగా ధర్నా చేశారు. ఇందులో తిరుత్తణి నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. నేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సుందరవేలు ధర్నాలో ప్రసంగించారు. తమిళనాడు పట్ల ఏ మాత్రం విలువ లేని రాష్ట్ర గవర్నర్‌గా విధులు నిర్వహించే నైతిక హక్కు రవి కోల్పోయారని వెంటనే గవర్నర్‌ను రీకాల్ చేయాలని నినాదాలు చేశారు. పట్టణ అధ్యక్షుడు శివకుమార్, నేతలు బాబునాయుడు, త్యాగరాజన్, రాజీవ్‌గాంధీ, పొన్నురంగం, కృష్ణమనాయుడు, వేలు, భరతకుమార్ పాల్గొన్నారు.

సరికొత్త బాణీలతో రీమిక్స్

తమిళసినిమా: ప్రస్తుత కాలంలో ప్రైవేట్ మ్యూజిక్ ఆల్బమ్‌లు విశేష ఆదరణ పొందుతున్నాయి. అంతేకాకుండా ప్రైవేట్ మ్యూజిక్ ఆల్బమ్‌లు కొత్త పుంతలు తొక్కుతున్నాయనే చెప్పవచ్చు. దీంతో ఈతరం సంగీత దర్శకులు ఇలాంటి మ్యూజిక్ ఆల్బమ్‌తో వినూత్న ప్రయోగాలు చేసి సక్సెస్ అవుతున్నారు. ఆ వరుసలో సంగీత దర్శకుడు శ్యామలాంగన్ చేరుతారు. దీని గురించి చెప్పాలంటే



రాసాతియే పాట రూపకర్తలు

ఆస్ట్రియాలో నివసిస్తున్న శ్రీలంకకు చెందిన సంగీత కళాకారుడు. అక్కడ సమాచార సాంకేతిక రంగంలో పనిచేస్తూనే తన సంగీత పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నారు. హిందుస్థానీ, కర్ణాటక సంగీతంతో పాటు పాశ్చాత్య సంగీతాన్ని నేర్చుకున్న ఈయన అవకాశం వచ్చినప్పుడు అల్లా సినీ పాటలు పాడడం సంగీతంలో భాగం పంచుకోవడం, ప్రైవేట్ మ్యూజిక్ ఆల్బమ్లు రూపొందించడం వంటివి చేస్తున్నారు. అలా ఇంతకుముందు రజనీకాంత్ కథానాయకుడు నటించిన కబాలి చిత్ర సంగీతంలో పాలుపంచుకున్నారు. అదేవిధంగా నటి జ్యోతిక నటించిన 36 వయదినిలే, నటుడు మాధవన్ నటించిన ఇరుదుచుట్రు చిత్రాల్లో పాటలు పాడారు. తాజాగా రాసాతియే అని పల్లవితో సాగే ప్రైవేట్ మ్యూజికల్ ఆల్బంను రూపొందించారు. విశేషమేంటంటే 2012లో ఈ పాటను శ్రీలంకకు చెందిన రెట్టై పాదై శేఖర్, దివంగత గీత రచయిత నా ముత్తుకుమార్ కలిసి రాశారు. అళగియ తెండ్రలే అని పల్లవితో సాగే ఆ పాట పెద్దగా సామాజిక మాధ్యమాలు లేని ఆ రోజుల్లోనే విశేష ఆదరణ పొందింది. కాగా అదే పాటను ఇప్పుడు సంగీత దర్శకుడు శ్యామలాంగన్ సరికొత్త బాణీలతో రీమిక్స్ చేశారు. ఈ పాటను ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్, పాప్ సింగర్ రత్యా కలిసి పాడారు. ఈ మ్యూజిక్ ఆల్బమ్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో విడుదలై సంగీత ప్రియులను విశేషంగా అలరిస్తోంది.

కోలీవుడ్ టాక్స్

కథానాయకుడిగా

గౌండ్రమణి రీఎంట్రీ

తమిళసినిమా: సీనియర్ గౌండ్రమణి గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. సామాజికపరమైన అంశాలను జోడించి హాస్యాన్ని పండించడంలో ఈయన దిట్ట. కొన్ని చిత్రాల్లో కథానాయకుడుగా నటించిన గౌండ్రమణి కొంత గ్యాప్ తర్వాత మళ్లీ కథానాయకుడిగా నటించడానికి సిద్ధమయ్యారు. ఈయన నటిస్తున్న చిత్రానికి పళనిస్వామి వాద్దియార్ అనే టైటిల్‌ను నిర్ణయించారు. దీన్ని ఎలామాల్ సినీ క్రియేషన్స్ పతాకంపై మదురై సెల్వం భారీ బడ్జెట్లో నిర్మిస్తున్నారు. ఈ పతాకంపై నిర్మిస్తున్న రెండవ చిత్రం ఇది. దీనికి పీఆర్‌ఓ మానవ భువన్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. కథ, కథనం, మాటలు, దర్శకత్వం బాధ్యతలను ఫిలిం ఇన్‌స్టిట్యూట్ విద్యార్థి సెల్వ అన్బరసన్ నిర్వహిస్తున్నారు. యోగిబాబు, గంజా కరుప్పు ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఇందులో రాధారవి, టి.శివ, చిత్రాలక్ష్మణ్, మనోబాల, జేఎస్కే సతీష్‌కుమార్, నందగోపాల్, ఆర్కే సురేష్, మదురై డాక్టర్ శరవణన్, మంగై అరిరాజన్, తిరుచ్చి సురేంద్రన్, శాంతకుమార్ 11 మంది నిర్మాతలు ఈ చిత్రంలో ముఖ్యపాత్ర పోషించనున్నారు. అదేవిధంగా ఒక ప్రముఖ హీరోను అతిథిపాత్రలో నటింపచేయడానికి ప్రయత్నిస్తున్నట్టు నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రం శుక్రవారం ఉదయం చెన్నైలో పూజ కార్యక్రమాలతో ప్రారంభమైంది. వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను నిర్వహించినట్లు దర్శకుడు తెలిపారు. దీనికి వైట్ యాంగిల్ రవిశంకర్ చాయాగ్రహణం, వైరముత్తు పాటలను కె.సంగీతాన్ని అందిస్తున్నారు.



పళనిస్వామి వాద్దియార్ చిత్ర ప్రారంభోత్సవం



సాయిపల్లవి

రెయిడ్‌లో విక్రమ్‌ప్రభు

తమిళసినిమా: వైవిద్య భరిత కథా చిత్రాల కోసం తపించే నటుడు విక్రమ్ ప్రభు. ఈయన నటించిన టానాక్కారన్ చిత్రం గత ఏడాది విడుదలై మంచి విజయం సాధించింది. అంతేకాకుండా విక్రమ్‌ప్రభు తన నటనకు సినీ పరిశ్రమ నుంచి ప్రశంసలు అందుకున్నారు. తాజాగా ఈయన కథానాయకుడుగా నటిస్తున్న చిత్రానికి రెయిడ్ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈయనకు జంటగా నటి శ్రీదివ్య, అనంతిక నటిస్తున్నారు. దీన్ని ఓపెన్ స్క్రీన్ పిక్చర్స్, జీ పిక్చర్స్ సంస్థల అధినేతలు ఎస్.కె కనిష్క్, జీకే జి.మణికన్నన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దర్శకుడు ముత్తయ్య మాటలను, ఆయన శిష్యుడు కార్తీ దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. చిత్ర వివరాలను నిర్మాతలు తెలుపుతూ డగరు అనే కన్నడ చిత్రాన్ని చూసినప్పుడు తమకు విపరీతంగా నచ్చేసింది అన్నారు. దాన్ని తమిళంలోకి రీమేక్ చేద్దామని భావించినప్పుడు ఆ చిత్ర హక్కులను దర్శకుడు ముత్తయ్య పొందినట్లు తెలిసిందన్నారు. దీంతో తాము ఆయన్ని సంప్రదించగా ఆ సమయంలో విరుమాన్ చిత్ర షూటింగ్‌లో బిజీగా ఉన్నారన్నారు. దీంతో ఆయన వెంటనే దర్శకత్వం వహించే పరిస్థితి లేకపోవడంతో ఆయన శిష్యుడు కార్తీకి అవకాశం ఇవ్వమని చెప్పారన్నారు. కార్తీ చూడడానికి కుర్రాడులా అనిపించినా ఈ చిత్ర కథనాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. విక్రమ్‌ప్రభుకు ఈ చిత్రం కచ్చితంగా మంచి పేరు తెచ్చిపెడుతుందని, ఆయన ఇంతకుముందు యాక్షన్ కథా చిత్రాల్లో నటించినా, వాటికి పూర్తి భిన్నంగా ఈ రెయిడ్ చిత్రం ఉంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీనికి శ్యామ్ సీఎస్ సంగీతాన్ని, కదిరవన్ చాయాగ్రహణం అందిస్తున్నారు.



రెయిడ్ చిత్రంలో ఓ సన్నివేశం

నిర్మాతల లాభాలపైనే నా పారితోషికం



రన్ బేబీ రన్ చిత్ర యూనిట్

తమిళసినిమా: నటుడు కార్తీ కథానాయకుడిగా సర్దార్ శశికుమార్ హీరోగా కారి వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలను నిర్మించిన ప్రిన్స్ పిక్చర్స్ సంస్థ అధినేతలు ఏ.లక్ష్మణన్, వెంకట్ ప్రస్తుతం వరుసగా పలు చిత్రాలను నిర్మిస్తున్నారు. అందులో ఒకటి రన్ బేబీ రన్. నటుడు దర్శకుడు ఆర్జే బాలాజి కథానాయకుడిగా నటించిన ఇందులో నటి ఐశ్వర్యరాజేష్ కథానాయకిగా నటించారు. నటి రితిక, వివేక్ ప్రసన్న, విశ్వ, రాజా అయ్యప్ప ప్రధాని పాత్రలు పోషించిన ఈ చిత్రానికి యువ చాయాగ్రహణం, శ్యాంసిఎస్ సంగీతాన్ని అందించారు. మలయాళ దర్శకుడు జయన్ కృష్ణకుమార్ ఈ చిత్రం ద్వారా కోలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ చిత్రం ఫిబ్రవరి 3వ తేదీన విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర ఆడియో కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం స్థానిక టీనగర్‌లోని ఒక నక్షత్ర హోటల్లో నిర్వహించారు. ఈ వేదికపై దర్శకుడు జయన్ కృష్ణకుమార్ మాట్లాడుతూ తాను మలయాళంలో పలు చిత్రాలకు దర్శకత్వం వహించానని చెప్పారు. ఇప్పుడు తమిళంలో చిత్రం చేయడం కొత్త అనుభవంగా పేర్కొన్నారు. ఈ కథను లక్ష్మణన్‌కు చెప్పగా ఆయనే నటుడు ఆర్జే బాలాజీని హీరోగా సూచించారన్నారు. కథ వినగానే బాగా నచ్చిందని అంతగా దర్శకుడు కథను పకడ్బందీగా తయారు చేశారని నిర్మాత లక్ష్మణన్ పేర్కొన్నారు. నటుడు ఆర్జే బాలాజి మాట్లాడుతూ దర్శకుడు జయన్ కృష్ణకుమార్ తనను కలిసి చిరునవ్వుతోనే కథలు చెప్పారన్నారు. అంద 7 నాట్కళ్ చిత్రం కె..భాగ్యరాజ్‌కు మరుజన్మే ఈ దర్శకుడని పేర్కొన్నారు. ఈయన ప్రతిభావంతులైన టీమ్‌ను నియమించుకున్నారన్నారు. నిర్మాత లక్ష్మణన్ ఖర్చుకు వెనకాడకుండా ప్రముఖ సాంకేతిక నిపుణులతో చిత్రాన్ని భారీగా నిర్మించారన్నారని తెలిపారు. తన పారితోషికం గురించి అడుగుతున్నారని, అది నిర్మాతల లాభాలను బట్టి ఉంటుందని ఆర్జే బాలాజి పేర్కొన్నారు.

అజిత్ భామ ఎవరు?

తమిళసినిమా: నటుడు అజిత్ తన వయసుకు దగ్గ పాత్రలో నటించడం ప్రారంభించి చాలా కాలమైంది. ఆయనకు జతగా నటించే హీరోయిన్ల విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ఆమధ్య వివేకం చిత్రంలో కాజల్ అగర్వాల్, విశ్వాసం చిత్రంలో నయనతార, వలిమై చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ హూమా ఖురేషి అజిత్ సరసన నటించారు. తాజాగా విడుదలైన తుణివు చిత్రంలో మలయాళ భామ మంజువారియర్ నటించారు. వీళ్లందరూ వయసులో సీనియర్ నటీమణులే అనేది గమనార్హం. కాగా తుణివు చిత్ర విజయం ఇచ్చిన ఉత్సాహంతో అజిత్ ఇప్పుడు తన 62వ చిత్రానికి సిద్ధమవుతున్నారు. నయనతార భర్త, దర్శకుడు విఘ్నేష్‌శివన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతాన్ని అందిస్తున్నారు. చిత్రం షూటింగ్ వచ్చే నెల ప్రారంభం కానున్నట్లు తాజా సమాచారం. అయితే ఇందులో అజిత్ సరసన నటించే హీరోయిన్ ఎవరనేది ఆసక్తిగా మారింది. కారణం పలువురు ప్రముఖ హీరోయిన్ల పేర్లు ప్రచారంలో ఉండడమే. ముందుగా నయనతార నటించనున్నట్లు ప్రచారం జరిగింది. అయితే చిత్రంలో హీరోయిన్ పాత్ర ఆమె స్థాయికి తగ్గట్టుగా లేకపోవడంతో ఆమె నటించడం లేదని ప్రచారం జరిగింది. ఆ తర్వాత త్రిష తెరపైకి వచ్చింది. ఇప్పుడు ఆమె కూడా ఇందులో నటించడం లేదని సమాచారం. అదేవిధంగా ఇటీవల నటి ఐశ్వర్యరాయ్ అజిత్ సరసన నటించనున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే తాజాగా నటి సాయిపల్లవి పేరు వినిపిస్తోంది. విషయం ఏమిటంటే వీరిలో ఏ ఒక్కరి పేరు ఇప్పటివరకు చిత్ర వర్గాలు ప్రకటించలేదు. చిత్రం షూటింగ్ దగ్గర పడుతుండడంతో చిత్ర వర్గాలు అసలు హీరోయిన్ ఎంపిక చేశారా, చేస్తే ఆ విషయాన్ని సస్పెన్స్‌గా ఉంచారా అనే చర్చ కోలీవుడ్లో జరుగుతోంది.



నటి ఐశ్వర్యరాయ్

క్లుప్తంగా

లారీ ఢీకొని మహిళ దుర్మరణం

తిరువొత్తియూరు: లారీ ఢీకొని ఓ మహిళ దుర్మరణం చెందింది. ఈ ఘటన చెన్నై వానగరంలో చోటుచేసుకుంది. చెన్నై చేట్‌పట్ భూపతి నగర్‌కు చెందిన విజయ (57). ఈమె చేపలు కొనేందుకు వానగరానికి గురువారం బస్సులో వెళ్లింది. బస్సు దిగి నడిచి వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ విజయను వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఆమెను కీల్పాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. ఆవడి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి లారీడ్రైవర్ జయచంద్రన్ (22)ను అరెస్టు చేశారు.

తేనెటీగల దాడిలో మహిళ మృతి

అన్నానగర్: తేనెటీగల దాడిలో ఓ మహిళ మృతిచెందింది. నామక్కల్ జిల్లా కందంపాళయం సమీపంలోని జమీన్ ఇళముప్పిళ్లైకరట్టు పాళయానికి చెందిన సరస్వతి (60). ఈమె గురువారం తోటలో కొబ్బరిమట్టలు తీసేందుకు వెళ్లింది. ఆమె కొబ్బరి మట్టలు తీస్తుండగా తేనెటీగలు ఒక్కసారిగా ఆమెపై దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన సరస్వతిని స్థానికులు ఈరోడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సేలం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది.

ఏనుగు దాడిలో వ్యక్తి ..

అన్నానగర్: అడవి ఏనుగు దాడిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కోయంబత్తూరు సమీపంలో చోటుచేసుకుంది. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మైలుస్వామి (65) మేకల మేత కోసం పెరియనాయకన్ పాళయం, గోవనూరు లోయకు వెళ్లాడు. ఆ సమయంలో ఒక అడవి ఏనుగు రావడంతో మైలుస్వామి పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఏనుగు అతడిని వెంబడించి దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసి అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని విద్యార్థిని..

తిరువొత్తియూరు: రైలు ఢీకొని ఓ విద్యార్థిని మృతిచెందింది. ఈ ఘటన వండలూరు సమీపం సింగపెరుమాల్ కోయిల్ సమీపంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. చెంగల్పట్టు జిల్లా సింగపెరుమాల్ కోవిల్ సమీపం, వెంకటాపురానికి చెందిన సైమన్ ప్రైవేటు సంస్థలో సెక్యూరిటీ గార్డు. ఇతని కుమార్తె షెర్లి (15). ఈమె సింగ పెరుమాళ్ ప్రాంతంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. గురువారం సాయంత్రం షెర్లి పాఠశాల నుంచి ఇంటికి వెళుతూ రైలు పట్టాలు దాటుతుండగా ఎగ్మూర్ నుంచి కన్యాకుమారి వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ షెర్లీని ఢీకొంది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందింది. చెంగల్పట్టు రైల్వే పోలీసులు మృతదేహాన్ని చెంగల్పట్టు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కర్ణాటక మహిళను రక్షించిన పోలీసులు

అన్నానగర్: కర్ణాటక రాష్ట్రం దేవంగారే ప్రాంతానికి చెందిన మహయ్య భాను (35) నాలుగేళ్ల క్రితం ఇల్లు వదలి చెన్నై వచ్చింది. మానసిక వ్యాధితో బాధపడుతున్న ఆమెను ఈస్ట్‌కోస్టు రోడ్డులోని ఆశ్రమంలో ఉంచారు. ఆమెను తన కుటుంబ చెంతకు చేర్చేందుకు ఎస్‌సీఆర్‌పీ డివిజనల్ పోలీసు ఇన్‌స్పెక్టర్ తాగిరా చర్యలు తీసుకున్నారు. మానసిక పరిస్థితి మెరుగుపడడంతో మహయ్య భానుతో మాట్లాడి కుటుంబం వివరాలు తెలుసుకున్నారు. శుక్రవారం బంధువులకు అప్పగించారు.

దాడి కేసులో వ్యక్తి అరెస్ట్

తిరుత్తణి: సినిమా థియటర్ క్యాంటిన్ సిబ్బందిపై దాడిచేసి వస్తువులను ధ్వంసం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుత్తణి బస్టాండు సమీపంలోని గోల్డెన్ సినిమా థియేటర్ క్యాంటిన్‌లో త్యాగేంద్రన్(42) పనిచేస్తున్నాడు. బుధవారం థియేటర్‌లో క్యాంటిన్ వద్ద అనుమతి లేకుండా వస్తువులు తీసుకున్న వ్యక్తిని ప్రశ్నించిన సిబ్బందిపై దాడి చేసినట్లు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు తిరుత్తణి ఎస్ఐ రాఖీకుమారి కేసు నమోదు చేసి తిరుత్తణి కాశినాథపురానికి చెందిన తమిళయగన్ (26) అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు.

హోటల్‌లో నాగుపాము హల్‌చల్



నాగుపామును పట్టుకున్న అగ్నిమాపక సిబ్బంది

తిరుత్తణి: తిరుత్తణి బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్ వంట గదిలో శుక్రవారం ఉదయం పాము ప్రవేశించింది. నాగుపామును గుర్తించిన సిబ్బంది, కస్టమర్లు భయంతో హోటల్ నుంచి బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు హోటల్‌లోని పామును పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

పందెం కోళ్ల కోలాహలం

- తిరువళ్లూరులో కోడిపందేల సందడి
- కోర్టు అనుమతితో పోటీలు ప్రారంభం
- నాలుగు రాష్ట్రాలకు చెందిన పందెంరాయుళ్ల రాక



పందెం కోళ్లతో వచ్చిన యువకులు

తిరువళ్లూరు: సంక్రాంతిని పురస్కరించుకుని తిరువళ్లూరు జిల్లా తంగానూర్ గ్రామంలో కోడిపందేల కోలాహలం మొదలైంది. కోర్టు అనుమతితో శుక్రవారం నుంచి పోటీలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో పాల్గొనడానికి నాలుగు రాష్ట్రాలకు చెందిన కోళ్లు, పందెంరాయుళ్లు రావడంతో సందడిగా మారింది. ఏటా సంక్రాంతిని పురస్కరించుకుని తిరువళ్లూరు జిల్లా తంగానూర్‌లో కోడిపందేలు నిర్వహించడం ఆనవాయితీ. అయితే కరోనా తరువాత పోటీలను నిర్వహించడానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించి కోడిపందెం నిర్వహించడానికి అనుమతి పొందారు. బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ కరుణాకరన్, అతిథులు శుక్రవారం ఉదయం పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో వేర్వేరు జిల్లాలకు చెందిన క్రీడాకారులు పందెం కోళ్లతో హాజరయ్యారు. దీంతో పోటీలు నిర్వహిస్తున్న ప్రాంతం సందడిగా మారింది. పోటీల్లో విజయం సాధించే వారికి బంగారు కాయిన్, రెండు ద్విచక్ర వాహనాలను బహుమతిగా ఇవ్వనున్నారు. కాగా పోటీల్లో పాల్గొనే కోళ్లను వెటర్నరీ డాక్టర్లు పరిశీలించిన తరువాతే అనుమతించారు. కోర్టు అనుమతితో కోళ్లకు కత్తికట్టడం, మద్యం పోయడం లాంటి వాటిని నిషేధించారు. కాగా పోటీలు జరిగే ప్రాంతంలో అవాంఛనీయ సంఘటనలు ఎదురుకాకుండా అదనపు ఎస్పీ వివేకానంద శుక్లా నేతృత్వంలో ప్రత్యేకంగా బందోబస్తును ఏర్పాటు చేశారు. కాగా పోటీల్లో సూరీ, ఖాదర్, జావా, యాకూత్, గిరి, బీలాక్లిక్ తదితర రకాలకు చెందిన కోళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా కోడిపందెంను చూడడానికి వేలాది మంది తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది.

ఉద్యోగం పేరుతో రూ.19 లక్షల మోసం

అన్నానగర్: విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.19 లక్షలు మోసం చేసిన ఓ ప్రైవేటు కంపెనీ డైరెక్టర్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కోయంబత్తూరు ఇరుకూర్ సమీపంలోని ఏజీ పుత్తూరుకు చెందిన చంద్రమోహన్ (33) బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో పట్టభద్రుడు. కొన్నేళ్ల కిందట ఇంగ్లండ్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. ఇతను 2021లో కోయంబత్తూరుకు వచ్చాడు. తిరిగి చంద్రమోహన్ మళ్లీ విదేశాలకు వెళ్లాలనుకున్నాడు. కోయంబత్తూరులోని ఆర్ఎస్ పురంలో నివాసముంటున్న అరుణ్ (40), భార్య హేమలత (36) విదేశాలకు పంపే కంపెనీలో డైరెక్టర్లు. దీంతో చంద్రమోహన్ వారిని సంప్రదించి విదేశాల్లో ఉద్యోగం ఇప్పించాలని కోరాడు. పోలెండ్ దేశంలో ఉద్యోగం తీసిస్తానని రూ.నాలుగున్నర లక్షలు ఖర్చువుతుందని చెప్పారు. దీనికి చంద్రమోహన్ అడ్వాన్స్‌గా రూ.2లక్షలు తీసుకున్నారు. రెండేళ్లు గడిచినా ఉద్యోగం రాలేదు. దీంతో చంద్రమోహన్ ఫిర్యాదు మేరకు కోయంబత్తూరు క్రైం బ్రాంచ్ పోలీసులు అరుణ్‌ను శుక్రవారం అరెస్టు చేశారు. హేమలత కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఏడుగురి నుంచి రూ.19 లక్షలు అరుణ్, హేమలత మోసగించినట్లు విచారణలో తేలింది.

తల్లి మందలించిందని విద్యార్థి బలవన్మరణం

తిరువొత్తియూరు: సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుతున్నాడని తల్లి మందలించడంతో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పెరంబలూరు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పెరంబలూరు జిల్లా ఆలత్తూర్ తాలూకా నక్కసేలం అరవింద నగర్‌కు చెందిన అన్బళగన్ కుమారుడు బాలకుమార్ (18). ఇతను తిరుచ్చి జిల్లా సమయపురం సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పొంగల్ సెలవులకు ఇంటికి వచ్చిన బాలకుమార్ ఎప్పుడూ సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడేవాడు. ఇదిచూసిన తల్లి అంబిక మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన బాలకుమార్ గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన తాత వెల్‌లెయియన్ బాలకుమార్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. పెరంబలూరు జిల్లా పాడలూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులకు షీల్డ్‌లను అందజేస్తున్న అతిథులు

కొరుక్కుపేట: ప్రతి విద్యార్థి సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రణాళికతో ముందుకెళితే విజయం సొంతమవుతుందని ఎస్.ఎం సిల్క్స్ కాంచీపురం మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.మనోహరన్ నాయుడు అన్నారు. ఎస్‌కేపీడీ అండ్ చారిటీస్ నిర్వహణలో సాగుతున్న కేటీసీటీ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనికి స్థానిక జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి కన్వెన్షన్ సెంటర్ వేదికైంది. పాఠశాలల కరస్పాండెంట్ దేసు లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.అనిల వార్షిక నివేదికను చదివి వినిపించారు. ముఖ్య అతిథిగా ఎస్.మనోహరన్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల, గురువులను గౌరవించాలన్నారు. ఎస్‌కేపీడీ చారిటీస్ చేస్తున్న సేవలు ప్రసంశనీయమన్నారు. అనంతరం పబ్లిక్ పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన ప్రత్యూష (10వ తరగతి), నందిని (ప్లస్ టూ)లకు బహుమతులు అందించారు. అలాగే వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్‌కేపీడీ పాలక మండలి సభ్యులు ఊరా ఆంజనేయులు, నాళం శ్రీకాంత్, ఊటుకూరు శరత్‌కుమార్, హెచ్‌ఎం రేవతి, సరళ, సుజాత పాల్గొన్నారు.

చిన్నారికి లైంగిక వేధింపులు

- వృద్ధుడికి యావజ్జీవం

అన్నానగర్: చిన్నారిని లైంగికంగా వేధించిన వృద్ధుడికి యావజ్జీవ శిక్ష విధిస్తూ తిరుచ్చి మహిళా కోర్టు తీర్పునిచ్చింది. వివరాలు.. తిరుచ్చిలోని ఊరయూరుకు చెందిన దురై (70) 2019 అక్టోబరు 7వ తేదీ అదే ప్రాంతానికి చెందిన మూడేళ్ల చిన్నారిని రహస్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగికంగా వేధించాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శ్రీరంగం మహిళా పోలీసులు కేసు నమోదు చేసి దురైను అరెస్టు చేశారు. ఈ కేసు తిరుచ్చి మహిళా కోర్టులో విచారణ సాగింది. నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, బాధిత బాలికకు తమిళనాడు ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం అందించాలని న్యాయమూర్తి శ్రీవత్సన్ శుక్రవారం తీర్పు ఇచ్చారు.


పాఠశాల వ్యాన్ ఢీకొని చిన్నారి మృతి

తిరువణ్ణామలై(వేలూరు): పాఠశాల వ్యాన్ ఢీకొని చిన్నారి మృతిచెందిన ఘటన తిరువణ్ణామలైలో జరిగింది. బూదమంగళం పంచాయతీ గొరకందాంగల్ గ్రామానికి చెందిన మాసిలామణి కూలీ. భార్య కల్పన, కుమార్తెలు ప్రిసిక(4), జయశ్రీ(2) ఉన్నారు. ప్రిసిక దేవికాపురంలోని ప్రైవేటు పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లి సాయంత్రం వ్యాన్‌లో ఇంటికి వచ్చింది. ఇంటి సమీపంలో వ్యాన్ నిలిచిన వెంటనే తల్లి కల్పన ప్రిసికను తీసుకొచ్చేందుకు వెళ్లింది. అదే సమయంలో తన అక్కను చూసేందుకు తల్లితో పాటు జయశ్రీ కూడా వెనుక వైపున వచ్చింది. కల్పన వెనుక వైపునకు వెళ్లి ప్రిసికను దింపింది. జయశ్రీ వ్యాన్ ముందు నుంచి తల్లి వద్దకు వెళుతుండగా గమనించని డ్రైవర్ వాహనాన్ని ముందుకు పోనిచ్చాడు. వ్యాన్ కింద పడి చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన తల్లి కల్పన, బంధువులు వ్యాన్ డ్రైవర్ పెరుమాల్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మంగళం పోలీసులు కేసు నమోదు చేసి వ్యాన్ డ్రైవర్‌ను అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

25 సవర్ల నగలు దోపిడీ

అన్నానగర్: చోళవందాన్ సమీపంలో శుక్రవారం స్కూటీపై వెళుతున్న మహిళను ముగ్గురు దుండగులు కిందపడేసి 25 సవర్ల నగలు దోచుకెళ్లారు. మదురై జిల్లా చోళవందాన్‌కు చెందిన రీగన్ భార్య గాయత్రి అలియాస్ సోఫియా (33). ఈమె రిటైర్డ్ డీఎస్పీ సురులియాండి కుమార్తె. ఈ నేపథ్యంలో గాయత్రి గురువారం స్కూటీలో కుమారుడిని రాయపురంలోని పాఠశాల వద్ద వదలి చోళవందాన్ వైపు వెళుతోంది. తిరుమలనాథం సమీపంలో వెళుతుండగా ద్విచక్రవాహనంలో ముగ్గురు ఆమెను వెంబడించి గాయత్రి స్కూటీని తన్ని కిందకు తోశారు. దీంతో గాయత్రి అదుపుతప్పి పక్కనే వున్న ముళ్లచెట్లపై పడింది. అనంతరం ఆమె ధరించి ఉన్న 25 సవర్ల నగలను లాక్కొని పరారయ్యారు. ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతంలోని నిఘా కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను కూడా పోలీసులు పరిశీలించారు. ద్విచక్రవాహనంలో ముఖానికి ముసుగేసుకుని ముగ్గురు వ్యక్తులు వెళుతున్నట్టు తెలిసింది. పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు.

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు అభినందనలు



శ్యామ్‌సుందర్‌ను అభినందిస్తున్న పోలీస్ కమిషనర్

కొరుక్కుపేట: ఒక్క రోజులో 269 ట్రాఫిక్ ఉల్లంఘన కేసుల్లో జరిమానా బకాయిలు రూ.96వేలను వసూలు చేసిన ట్రాఫిక్ సీఐను చెన్నై మెట్రోపాలిటన్ పోలీస్ కమిషనర్ అభినందించారు. సెయింట్ థామస్ మౌంట్ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న 269 ట్రాఫిక్ ఉల్లంఘన కేసుల జరిమానాను ఒక్కరోజులోనే రూ.96వేలు వసూలు చేసిన ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న ట్రాఫిక్ సీఐ ఆర్ శ్యామ్‌సుందర్‌ను శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ స్వయంగా ఆహ్వానించి అతనికి ప్రశంసాపత్రం అందజేశారు.

రూ.100 తిరిగి ఇవ్వని బ్యాంకు..

- బాధితుడికి నష్టపరిహారంగా రూ.65 వేలు
- వినియోగదారుల ఫోరం కోర్టు ఆదేశం

తిరువొత్తియూరు: వినియోగదారుడికి రూ.100 తిరిగి ఇవ్వని బ్యాంకు నష్టపరిహారంగా రూ. 65 వేలు అందజేయాలని వినియోగదారుల ఫోరంను కోర్టు ఆదేశించింది. చెంగల్పట్టు జిల్లా మధురాంతకంకు చెందిన నిర్మల్ కుమార్ చెన్నై సౌకార్‌పేట గోవిందప్పనాయకన్ వీధిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 2018 జూలై 24న స్నేహితుడు అకౌంట్లో నగదు డిపాజిట్ చేశాడు. ఆ సమయంలో రూ. 900కు గాను రెండు 500 రూపాయల నోటును బ్యాంకు సిబ్బందికి ఇచ్చాడు. చలానాలో రెండు 500 నోట్లు ఇస్తున్నట్లు పేర్కొన్నాడు. బ్యాంక్ క్యాషియర్ రూ. 900 లకు బదులుగా నిర్మల్ కుమార్ స్నేహితుడి ఎకౌంట్‌కు వెయ్యి రూపాయలు పంపించేశాడు. దీంతో నిర్మల్ కుమారు బ్యాంకు క్యాషియర్ వద్ద మిగిలిన రూ. 100 ఇవ్వమని కోరాడు. ఈ వ్యవహారాన్ని నిర్మల్ కుమార్ బ్యాంకు మేనేజర్ దృష్టికి తీసుకెళ్లాడు. అతను ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీని తరువాత ముంబైలో ఉన్న ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వారు కూడా చర్యలు తీసుకోలేదు. చివరిగా చెంగల్పట్టు వినియోగదారుల ఫోరం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసును పరిశీలించిన వినియోగదారుల ఫోరం కోర్టు న్యాయమూర్తి బాధితుడికి నష్టపరిహారంగా రూ. 50 వేలు, కేసు దాఖలు చేయడానికి అయిన ఖర్చు రూ. 15 వేలు కలిపి మొత్తం రూ. 65 వేలు అందజేయాలని సంబంధిత అధికారికి ఆదేశాలు జారీ చేశారు.

సమాజ సేవలోనే ఆత్మసంతృప్తి



లబ్ధిదారులకు కంటి అద్దాలను అందజేస్తున్న సీఎంకే రెడ్డి

కొరుక్కుపేట: సేవలోనే ఆత్మసంతృప్తి లభిస్తుందని, సమాజానికి నిరంతర సేవాలందించడమే నమోగాడ్ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని అఖిల భారత తెలుగు సమాఖ్య, తమిళనాడు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సీఎంకే రెడ్డి అన్నారు. ఈ మేరకు స్థానిక కొరట్టూర్‌లోని మోహన్ గార్డెన్‌లో శుక్రవారం 150 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. త్వరలో ట్రస్ట్ తరపున ఉచితంగా కృత్రిమ అవయవాలను అందించే కార్యక్రమం చేపట్టనున్నట్టు సీఎంకే రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అంబత్తూర్ అసిస్టెంట్ పోలీసు కమిషనర్ కనకరాజ్, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కిషోర్, ట్రస్టీలు ఆర్ నందగోపాల్, ఎస్.నాగభూషణం, కమిటీ సభ్యులు ఎం మోహన్‌నాయుడు, లయన్ జి.మురళి, తమిళ మానిల కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జవహర్ బాబు, కౌన్సిలర్ ఉషా, ఎంటీఆర్ నాగరాజ్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కృష్ణమూర్తి, నటుడు మేర్కురి సత్య పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నారాయణవనం: స్థానిక కనకవల్లీ, వేదవల్లీ సమేత వీరరాఘవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గురువారం సాయంత్రం గణపతి పూజతో మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం సాయంత్రం స్వామివారి కల్యాణం, రాత్రి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. శనివారం సాయంత్రం గరుడసేవ, ఆదివారం ఉదయం హనుమంత వాహన సేవ, రాత్రి చక్రస్నానంతో ఉత్సవాలు పరిసమాప్తవుతాయని దేవస్థానం ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో చలువ పందిళ్లు వేసి, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న మహిళలకు పసుపు, కుంకుమలను అందజేశారు.

నిజాయితీ చాటుకున్న టాస్మాక్ ఉద్యోగి

అన్నానగర్: రోడ్డుపై దొరికిన బంగారు నగలను పోలీసులకు అప్పగించి ఓ టాస్మాక్ ఉద్యోగి తన నిజాయితీ చాటుకున్నాడు. దిండుగల్ జిల్లా పాత వత్తలగుండుకు చెందిన కార్తీక్ (48) టాస్మాక్ దుకాణంలో సేల్స్‌మన్. గురువారం రాత్రి వత్తలగుండులో విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో పాత వత్తలగుండులో ఉన్న ఇంటికి బయలుదేరాడు. ఆసమయంలో ఆర్టిస్ట్ కాలనీ సమీపంలో రోడ్డుపై ఓ బ్యాగ్ కనిపించింది. అందులో కొత్తగా కొనుగోలు చేసిన 12 సవర్ల నగలు ఉండడంచూసి దిగ్భ్రాంతి చెందాడు. అందులో మదురై జిల్లా చోళవందాన్‌లోని నగల దుకాణం రసీదు ఉంది. కార్తీక్ నగలను వత్తలగుండు పోలీసుస్టేషన్‌లో అప్పగించాడు. అనంతరం జ్యువెలరీ షాపు రసీదుతో పోలీసులు విచారణ చేపట్టారు. కట్టకమాన్ పట్టికి చెందిన గౌతమ్ ఆ నగలను కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఎస్పీ భాస్కరన్ ఆ నగలను గౌతమ్‌కు తిరిగి అప్పగించారు. కార్తీక్‌ను పోలీసులు అభినందించారు.

బాణసంచా విక్రయం కేసులో వ్యక్తి అరెస్ట్



బాణసంచా దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుత్తణి: బాణసంచా నిల్వవుంచి అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరువలంగాడు ప్రాంతానికి చెందిన జ్ఞానేశ్వరన్(36) అదే ప్రాంతంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. అదే దుకాణంలో అనుమతిలేకుండా బాణసంచా భారీగా నిల్వవుంచి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు అందింది. ఫిర్యాదు మేరకు సీఐ అన్నాదురై సిబ్బందితో కలిసి దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రూ.2లక్షలు బాణసంచా నిల్వ వుంచినట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు జ్ఞానేశ్వరన్‌ను అరెస్ట్ చేసి తిరుత్తణి సబ్ జైలుకు తరలించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

అన్నానగర్: వివాహేతర ప్రియుడు తన నగలను తీసుకుని తిరిగి ఇవ్వకపోవడంతో మహిళ ఆత్మహత్యకు యత్నించింది. వివరాలు..

ఆవడి సమీపంలోని తిరునింద్రవూరుకు చెందిన విశ్వనాథన్ (41) ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం చెన్నైలోని నుంగంబాక్కంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న సమయంలో ఓటేరి పట్టాలంకు చెందిన శశికళ (37) అనే మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఆమెకు అప్పటికే వివాహమై భర్త నుంచి దూరంగా ఉంటోంది. ఇద్దరూ దంపతులుగా సహజీవనం సాగిస్తున్నారు. ఇదిలాఉండగా కొద్ది నెలల క్రితం విశ్వనాథన్ శశికళ నుంచి ఏడు సవర్ల నగలను తాకట్టు పెట్టి భార్య విజయలక్ష్మి బ్యాంకు ఖాతాలో జమచేశాడు. తరువాత శశికళ తన బంగారాన్ని తిరిగి ఇవ్వాలని అడిగినా ఇవ్వకుండా కాలం గడుపుతూ వచ్చాడు. దీంతో శుక్రవారం శశికళ పులియాంతోపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు వద్ద ఫిర్యాదు చేసింది. పోలీసులు విశ్వనాథన్, శశికళను పోలీసుస్టేషన్‌కు పిలిపించి విచారించారు. పోలీసుస్టేషన్ నుంచి బయటకు వచ్చిన శశికళ తన నగలను ఇప్పించకుంటే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటానని పురుగుల మందు తాగింది. వెంటనే పోలీసులు శశికళను కీల్పాక్కం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విశ్వనాథన్‌ను పోలీసులు అరెస్టు చేశారు.



రథసప్తమికి ఏర్పాట్లు ముమ్మరం

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 28న రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నారు. ఒక్కరోజు పండగ కోసం ఇప్పటికే ఏర్పాట్లు ముమ్మరంగా చేశారు. ఆలయంలోని నాలుగు మాడ వీధుల్లో రంగుల ముగ్గులు వేస్తున్నారు. - తిరుమల



ఆలయం నాలుగు మాడ వీధుల్లో రంగులు దిద్దుతున్న కార్మికులు


అనంతపురం 42వ డివిజన్‌లో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


శ్రీకాకుళం జిల్లా చీమలవలసలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వతప్రసాద్


కృష్ణా జిల్లా సీతనపల్లి దళితవాడలో మహిళను సమస్యల గురించి అడిగి తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

క్లుప్తంగా...

డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు

సాక్షి, అమరావతి: ఇటీవల పదోన్నతి పొందిన 55 మంది డిప్యూటీ కలెక్టర్లకు ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. వారిలో చంద్రముని రణాల్‌ను సూళ్లూరుపేట ఆర్డీవోగా, కె.రాజ్యలక్ష్మిని మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా, కిల్లి రాజగోపాలరావును టీటీడీ డిప్యూటీ ఈవోగా, పి.కృష్ణమూర్తిని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పీఏస్‌గా, మారం రామకృష్ణను పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఓఎస్డీగా నియమించింది. ఈ మేరకు సీఎస్ జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

దృష్టిలోపం ఉన్న ఉద్యోగులకు ముఖ ఆధారిత హాజరు మినహాయింపు

సాక్షి, అమరావతి: దృష్టిలోపం ఉన్న ఉద్యోగులకు ముఖ ఆధారిత హాజరు(ఎఫ్ఆర్‌బీఏఎస్) నుంచి రాష్ట్ర ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర సచివాలయ విభాగాలకు, జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల, గ్రామ, వార్డు స్థాయి, స్థానిక సంస్థల అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకుడు చేసిన ప్రతిపాదనను పరిశీలించిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోను ముఖ ఆధారిత హాజరు నుంచి దృష్టిలోపం ఉన్న ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జాతీయ అంధుల సమాఖ్య హర్షం

దృష్టిలోపం ఉన్నవారికి ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయింపునిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంపై జాతీయ అంధుల సమాఖ్య రాష్ట్ర శాఖ హర్షం వ్యక్తంచేసింది. ఈ మేరకు జాతీయ అంధుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోపూరి రామసుబ్బయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. తమ సమస్యను అర్థం చేసుకుని సత్వరమే పరిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

'ఉరుసు' లో చాదర్ సమర్పించనున్న ప్రభుత్వం


చాదర్‌ను ప్రదర్శిస్తున్న ఖాదర్‌బాషా, ఇంతియాజ్ తదితరులు

సాక్షి, అమరావతి: సూఫీ మహాత్ముల బాట అనుసరణీయమని, సూఫీ మహాత్ములు హజరత్ ఖాజా గరీబ్ నవాజ్‌పై ఉన్న అభిమానంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చాదర్ సమర్పించనుందని మైనారిటీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ వి.ఖాదర్‌బాషా తెలిపారు. ఈ విషయమై విజయవాడలోని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సూఫీ మహాత్ములు హజరత్ ఖాజా గరీబ్ నవాజ్ ఉరుసు మహోత్సవంలో అందజేయనున్న ప్రత్యేక చాదర్‌ను వారు మీడియాకు చూపించారు. ఇంతియాజ్, ఖాదర్‌బాషా మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చాదర్‌ను రూపొందించినట్లు చెప్పారు. అజ్మీర్ షరీఫ్‌లో జరిగే 811వ ఉరుసు గంధ మహోత్సవం కోసం అత్యంత అరుదైన అపురూపమైన చాదర్‌ను వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో సమర్పిస్తామన్నారు. వక్ఫ్ బోర్డు అధికారులు, ముస్లిం ప్రముఖుల బృందం ఈ నెల 22న విజయవాడ నుంచి అజ్మీర్ షరీఫ్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున చాదర్ తీసుకెళ్లి భక్తిప్రపత్తులతో అలంకరిస్తామన్నారు.

జాతీయస్థాయిలో సత్తాచాటిన ఏపీ వైద్య ఆరోగ్యశాఖ

రాష్ట్రీయ కిశోర స్వాస్థ్య కార్యక్రమంలో రెండు అవార్డులు

సాక్షి అమరావతి: రాష్ట్రీయ కిశోర స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా జాతీయ ఆరోగ్య మిషన్ నిర్వహించిన రెండో జాతీయ స్కూల్ హెల్త్ ప్రోగ్రాం కింద అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖకు రెండు అవార్డులు లభించాయి. రక్తహీనత నివారణ కోసం డబ్ల్యూఐఎఫ్ఎస్, స్కూల్ హెల్త్ ప్రోగ్రాం సమర్థంగా నిర్వహించినందుకు ఈ అవార్డులు దక్కాయి. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డులను ఏపీ వైద్య ఆరోగ్యశాఖ తరఫున రాష్ట్రీయ కిశోర స్వాస్థ్య ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నిర్మలా గ్లోరీ, స్టేట్ కన్సల్టెంట్ డాక్టర్ కిరణ్‌నాయక్ అందుకున్నారు. వారిని శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.టి.కృష్ణబాబు అభినందించారు.

పేద గుండెకు పునర్జన్మ


ఆర్గాన్‌ను విమానం ఎక్కించేందుకు సిద్ధంగా..


బ్రెయిన్ డెడ్ అయిన సన్యాసమ్మతో భర్త ఆనందరావు (ఫైల్)


శ్రీపద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్‌కు గుండె తీసుకొస్తున్న వైద్య సిబ్బంది

తిరుపతి తుడా/అక్కిరెడ్డిపాలెం (గాజువాక) : విశాఖపట్నానికి చెందిన ఓ మహిళకు బ్రెయిన్ డెడ్ కావటంతో కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకొచ్చారు. దీంతో ఆమె గుండెను శుక్రవారం ప్రత్యేక విమానంలో తిరుపతికి తీసుకొచ్చి గుండెజబ్బుతో బాధపడుతున్న 15ఏళ్ల బాలుడికి ఆరోగ్యశ్రీ కింద శ్రీ పద్మావతి చిన్నపిల్లల గుండె చికిత్సాలయంలో పూర్తి ఉచితంగా శస్త్రచికిత్స చేసి అమర్చారు. నిజానికి.. 2021 అక్టోబర్ 11న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ చికిత్సాలయాన్ని ప్రజలకు అంకితం చేశారు. ఈ నేపథ్యంలో.. తొలిసారి ఇక్కడి వైద్యులు గుండెమార్పిడి చేశారు. ఈ యజ్ఞం పూర్వాపరాలు ఇవిగో..

పేద రైతుకు పెద్ద కష్టం..

అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ రైతుకూలీ నెలరోజుల క్రితం అనారోగ్యంతో ఉన్న తన పదిహేనేళ్ల కుమారుణ్ణి పద్మావతి ఆస్పత్రికి తీసుకొచ్చాడు. వైద్యులు అతని గుండెకు తీవ్ర ఇన్ఫెక్షన్ సోకినట్లు నిర్ధారించి మార్పిడి అనివార్యమని తేల్చిచెప్పారు. జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసి చికిత్స అందిస్తూ వస్తున్నారు. వారం క్రితం ఆ బాలుడి పరిస్థితి మరింత విషమించింది.

విశాఖపట్నంలో మహిళకు బ్రెయిన్ డెడ్

ఇంతలో.. విశాఖపట్నంలోని భెల్ (హెచ్‌పీవీపీ)లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న జంజూరు ఆనందరావు భార్య సన్యాసమ్మ (48) టౌన్‌షిప్‌లో ఉంటున్నారు. వీరి ఇద్దరి కుమారులూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే. సంక్రాంతి సందర్భంగా సన్యాసమ్మ పెందుర్తి సమీప గ్రామంలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ నెల 17న తన కుమారుడితో బైక్‌పై తిరిగి వస్తుండగా కళ్లు తిరిగి పడిపోయింది. దీంతో ఆమె తలకు బలమైన గాయమవడంతో షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. ఆమెకు బ్రెయిన్ డెడ్ అయినట్లు శుక్రవారం ఉదయం వైద్యులు చెప్పారు. కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించటంతో వైద్యులు జీవన్‌దాన్ సైట్‌కు సమాచారమిచ్చారు.

స్పందించిన సీఎంఓ..

సన్యాసమ్మ గుండె తిరుపతి పద్మావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడికి అమర్చే అవకాశముందన్న సమాచారం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయం రెండు జిల్లాల ఎస్పీలు, కలెక్టర్లు, వైద్యులను అప్రమత్తం చేసింది. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ గ్రీన్ ఛానల్ ద్వారా ప్రత్యేక విమానంలో గుండెను తరలించేందుకు ఏర్పాట్లుచేసింది.

ఆగమేఘాలపై గుండె తరలింపు

మరోవైపు.. తిరుపతి నుంచి ముగ్గురు వైద్యులతో కూడిన బృందం విశాఖకు వెళ్లి సన్యాసమ్మ గుండెను వేరుచేసి ప్రత్యేక బాక్సులో భద్రపరిచారు. దాన్ని శరవేగంగా తిరుపతి తరలించేందుకు అన్ని ఏర్పాట్లుచేశారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు డీసీపీ ఆనంద్‌కుమార్, ట్రాఫిక్ ఏడీసీపీ శ్రావణ్‌కుమార్, నలుగురు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, 33 మంది సిబ్బంది భద్రతా, ట్రాఫిక్ ఆంక్షలను పర్యవేక్షించారు. షీలానగర్ ఆస్పత్రి నుంచి ఎయిర్‌పోర్టు వరకు నాలుగు కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ నియంత్రించారు. ఆ తర్వాత..

- **9.18 గంటలకు :** ఆస్పత్రిలో అంబులెన్స్ బయల్దేరింది.
- **9.20 :** ఎయిర్‌పోర్టుకు చేరుకుంది.
- **10.05 :** అప్పటికే సిద్ధంగా ఉన్న ఇండిగో విమానం గుండెను తీసుకుని బయల్దేరింది.
- **11.31 :** రేణిగుంట విమానాశ్రయంలో విమానం ల్యాండ్ అయింది.
- **11.35 :** విమానాశ్రయం నుంచి బాక్సును బయటకు తీసుకొచ్చారు.
- **11.56 :** టీటీడీ అంబులెన్స్‌లో 21.5 కి.మీ. దూరాన్ని 21 నిమిషాల్లో తిరుపతిలోని శ్రీపద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్‌కు తీసుకొచ్చారు.
- **11.57 :** ఒక నిమిషంలోనే ఆస్పత్రిలోకి గుండెను చేర్చారు.
- ▲ అప్పటికే ఆపరేషన్‌కు అవసరమైన ఏర్పాట్లను ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి పర్యవేక్షణలో సిద్ధంచేసి ఉంచారు.
- ▲ ఆరుగురు డాక్టర్లతో కూడిన వైద్య బృందం 4.15 గంటలపాటు శ్రమించి గుండె మార్పిడి శస్త్రచికిత్సను దిగ్విజయంగా పూర్తిచేసింది.

అందరి సహకారంతోనే..

దాత కుటుంబ సభ్యులు, ప్రభుత్వం, ప్రభుత్వ విభాగాలు, వైద్యుల ఉమ్మడి కృషితోనే ఇది సాధ్యమైంది. గుండెను తగిన జాగ్రత్తలతో భద్రపరిస్తే ఆరు గంటల వరకు పనిచేస్తుంది. సన్యాసమ్మ గుండెను మూడు గంటల్లోపే తిరుపతి ఆసుపత్రికి తరలించారు. అమర్చిన గుండె పూర్తి సామర్థ్యంతో పనిచేసి బాలుడు కోలుకునేందుకు వారం రోజులు పడుతుంది. – డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

ఆమెలేని జీవితాన్ని ఊహించుకోలేకపోతున్నా

సన్యాసమ్మ లేని జీవితాన్ని ఊహించుకోలేకపోతున్నా. ఇప్పటివరకు నేను, పెద్దబ్బాయి చైతన్య, చిన్నబాబు జయప్రకాష్‌లు తేరుకోలేదు. ఇద్దరు కుమారులను కంటికి రెప్పలా చూసుకుని మురిసిపోయేది. వారికి ఏది కావాలన్నా నాతో గొడవపడి మరీ సాధించేది.
– జంజూరు ఆనందరావు, సన్యాసమ్మ భర్త, భెల్ ఉద్యోగి

'ఐటీ' కెరటం విశాఖపట్నం

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు.

ఐటీ కొత్త డెస్టినేషన్ విశాఖ



స్టార్టప్‌లు, డీప్‌టెక్‌కు అపార భవిష్యత్తు ఉంది. సరికొత్త ఆవిష్కరణలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతునిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానంగా విశాఖ సరికొత్త ఐటీ డెస్టినేషన్‌గా ఆవిర్భవిస్తోంది. ఇక్కడ పెద్ద ఎత్తున నిపుణులతోపాటు అద్భుతమైన ఎకో సిస్టమ్ ఉంది. రాబోయే సంవత్సరాల్లో జీడీపీ వృద్ధి రేటు 20 శాతానికి చేరుతుందని అంచనా వేస్తున్నాం. ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమల్లో భారత్ ప్రపంచంలో మూడు లేదా నాలుగో స్థానంలో ఉంటుందని భావిస్తున్నాం. వచ్చే మూడేళ్లలో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఐటీ, ఐటీఈఎస్, మాన్యుఫ్యాక్చరింగ్, ఆన్‌లైన్ సొల్యూషన్స్ తదితర రంగాల నుంచి 1 ట్రిలియన్ డాలర్లు రాబట్టగలమని కేంద్రం అంచనా వేస్తోంది.
– అల్కేష్‌కుమార్ శర్మ, కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి

పెట్టుబడులకు అదే ప్రధాన మార్గం..



అమెరికాలో 638 యూనికార్న్ కంపెనీలు ఉండగా 80 శాతం కంపెనీలకు వ్యవస్థాపకులు, సీనియర్ ప్రతినిధులు, చైర్మన్లుగా వలసదారులే ఉన్నారు. నైపుణ్యాలను గుర్తించి మౌలిక వసతులు, వనరులను అమెరికా కల్పిస్తోంది. పెట్టుబడులకు అదే ప్రధాన మార్గం. ప్రతి పరిశ్రమ టెక్నాలజీపైనే ఆధారపడి నడుస్తోంది. వినియోగదారులు సైతం టెక్నాలజీని ఆకళింపు చేసుకుంటున్నారనడానికి వాట్సాప్ ఒక ఉదాహరణ. స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ సిస్టమ్స్, సుస్థిరతకు మంచి భవిష్యత్తు ఉంటుంది.
– బీవీఆర్ మోహన్‌రెడ్డి, సెయింట్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్

విశాఖకు అపార అవకాశాలు



ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమల హబ్‌గా అభివృద్ధి చెందేందుకు విశాఖకు అపార అవకాశాలున్నాయి. విశాఖ డైనమిక్ సిటీ. కాస్త ప్రోత్సాహకాలు అందిస్తే ఐటీ రంగం మొత్తం విశాఖ వైపు పరుగులు తీస్తుంది. చైనా, జపాన్ పోటీని తట్టుకోవాలంటే వైజాగ్ లాంటి నగరాలను ఎంపిక చేసుకోవాల్సిందే.
– అరవింద్‌కుమార్, ఎస్‌టీపీఐ డైరెక్టర్ జనరల్

విశాఖ వైపు బీపీవోలు..



దేశవ్యాప్తంగా బీపీవో సీట్స్‌లో ఏపీ వాటా 27 శాతం కాగా విశాఖ వాటా 20 శాతం ఉండటం గమనార్హం. ఇది ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల వల్లే సాధ్యమైంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఐటీ ఎగుమతులు సుమారు రూ.5 నుంచి రూ.6 వేల కోట్లు జరుగుతున్నాయి. ఇవి గణనీయంగా పెరగనున్నాయి.
– శ్రీధర్ కొసరాజు, ఐటాప్ రాష్ట్ర అధ్యక్షుడు

20 సంస్థలకు ఎస్‌టీపీఐ అవార్డులు

ఐటీ, ఐటీ ఆధారిత రంగంలో దూసుకెళ్తున్న పలు సంస్థలకు ఎస్‌టీపీఐ అవార్డులను అందచేసింది. వివిధ విభాగాల్లో 20 సంస్థలకు సదస్సు సందర్భంగా అవార్డులను ప్రదానం చేశారు. టాప్ ఐటీ, ఐటీఏపీ ఎక్స్‌పోర్టర్స్ స్టేట్ ఆఫ్ ఏపీ అవార్డును చెగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సొంతం చేసుకుంది.

జీవో నం1పై 23న హైకోర్టు సీజే విచారించాలి

సాక్షి, న్యూఢిల్లీ : నియంత్రణ లేని రాజకీయ పార్టీల ర్యాలీల వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 1పై ఈ నెల 23న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ జరపాలని ఏపీ హైకోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. జీవో నంబర్ 1 అమలుపై స్టే విధిస్తూ ఏపీ హైకోర్టు వెకేషన్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహతో కూడిన ధర్మాసనం విచారించింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయాలపై విచారించే పరిధి వెకేషన్ బెంచ్‌కు లేదని తెలిపారు. తనకు లేని పరిధిలో వెకేషన్ బెంచ్ తీర్పు చెప్పిందన్నారు. ఉదయం 10.30 గంటలకు మెన్షన్ చేసిన అంశాన్ని ప్రతివాదుల వాదనలు వినకుండానే అదే రోజున తీర్పు చెప్పేసిందని అన్నారు. వాదనలు విన్న అనంతరం సీజేఐ ధర్మాసనం ఉత్తర్వులు వెలువరించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ అంశంపై జోక్యం చేసుకోలేమని పేర్కొంది. కేసు మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని తెలిపింది. ఏపీ ప్రభుత్వ వాదనను ధర్మాసనం తన ఉత్తర్వుల్లో రికార్డు చేసింది. ఈ కేసును ఈ నెల 23న ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) ధర్మాసనం విచారించాలని సూచించింది. వాద ప్రతివాదులిద్దరూ హైకోర్టు ముందు వాదనలు వినిపించుకోవచ్చని, అన్ని అంశాలూ ఓపెన్‌గా ఉంచుతున్నామని తెలిపింది. సుప్రీంకోర్టులో విచారణ ముగిస్తున్నట్లు పేర్కొంది.

ఏపీ ప్రభుత్వ పిటిషన్‌లో ముఖ్యాంశాలు..

బహిరంగ సభలను నిషేధిస్తున్నట్లు జీవోలో ఎక్కడా ఒక్క పదం కూడా లేదని సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో ఏపీ ప్రభుత్వం పేర్కొంది. టీడీపీ అధినేత చంద్రబాబు అడ్డగోలుగా సభలు నిర్వహించారని, ఆ సభల్లో 11 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపింది. ప్రజలు ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని పేర్కొంది. సభలపై అవసరమైన మేరకు మాత్రమే నియంత్రణ విధించామని తెలిపింది. జాతీయ, రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీ రహదారుల్లో బహిరంగ సభలు పెట్టొద్దని కోరామని చెప్పింది. ప్రత్యామ్నాయ ప్రాంతాలు, స్థలాల్లో సభలు పెట్టుకోవాలని కోరినట్లు ఆ పిటిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా పేర్కొంది.

ఆ సంఘం గుర్తింపు రద్దు చేయాలి



మాట్లాడుతున్న బండి శ్రీనివాసరావు. పక్కన ఏపీఎన్జీవో నాయకులు

▶ మొదటి పేజీ తరువాయి

విమర్శించారు. ఆయన ఉద్యోగ సంఘాలను చులకన చేసి ప్రభుత్వం వద్ద ఉద్యోగుల పరువు తీయడం ఇప్పటికైనా మానుకోవాలన్నారు. ఉద్యోగుల్లో అయోమయం సృష్టించేందుకే ఆయన గవర్నర్‌ను కలిశారు తప్ప ఉద్యోగుల ప్రయోజనాల కోసం కాదన్నారు. నిజంగా ఉద్యోగుల పట్ల ప్రేమ ఉంటే ప్రభుత్వంతోనే తేల్చుకోవాలని, అది చేతకాక ప్రచారం కోసం బురద జల్లే మాటలు మానుకోవాలని హెచ్చరించారు. సూర్యనారాయణది నిజంగా పెద్ద సంఘమైతే వెంటనే ఉద్యమ కార్యాచరణ ప్రకటించి, చేతల్లో చూపాలన్నారు. సూర్యనారాయణ అరాచకాలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడం, తాను ఉద్యోగం చేస్తున్న వాణిజ్య పన్నుల శాఖలోనూ అనేక ఆరోపణలు రావడం, వాటిపై విచారణ జరుగుతుండడంతో దిక్కుతోచక ఇష్టానుసారం మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఉద్యోగంలో చేరిన తర్వాత ఏపీ ఎన్జీఓ సంఘంలో చేరి ఓనమాలు దిద్దుకుని ఆశించిన పదవి దక్కకపోవడం వల్లే వేరే సంఘం పెట్టుకున్నారని విమర్శించారు. ఏపీ ఎన్జీఓ సంఘం సాధించిన కారుణ్య నియామకాల ఉత్తర్వు ద్వారానే సూర్యనారాయణకు ఉద్యోగం వచ్చిందని తెలిపారు. ఆయన చరిత్ర అందరికీ తెలుసని, అలాంటి ఆయన తమపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉద్యోగుల ప్రయోజనాలు కోసమే తమ సంఘం పోరాడుతోందని తెలిపారు. ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని, జీతాల కంటే ముందుగా పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు.

గవర్నర్ వద్దకు ప్రచారం కోసమే..

పబ్లిసిటీ కోసమే కొంత మంది ఉద్యోగ సంఘాల నాయకులు గవర్నర్‌ను కలిశారని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. వారం కిందటే అన్ని ఉద్యోగ సంఘాల నేతలు సీఎం జగన్‌ను కలిసి సమస్యలు విన్నవించగా, వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని స్పష్టంగా చెప్పారన్నారు. అయినా కూడా గవర్నర్‌ను కలవడం అంటే కేవలం ప్రచారం కోసమేనన్నారు. గతంలో వీరు ఏ ఒక్క ఉద్యోగి గురించి పోరాడలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అవకాశవాద రాజకీయాలతో ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలనే ఆలోచన దారుణం అని మండిపడ్డారు. కొన్ని ఉద్యోగ సంఘాల ఎన్నికల విధానం సరిగా లేదని, ఒకసారి ఎన్నికైతే వారే కుర్చీని పట్టుకుని వేలాడుతున్నారని.. ఈ విధానాన్ని ప్రభుత్వం సరిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

స్వార్థంతోనే గవర్నర్‌ను కలిశారు

విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి, అమరావతి : 'మాది ఉద్యోగస్తుల ఫ్రెండ్లీ ప్రభుత్వం. వారంతా మా ప్రభుత్వంలో కుటుంబ సభ్యులు. మా దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. ఇలాంటి తరుణంలో వారు గవర్నర్‌ను కలవడం సరికాదు. ఇది ముమ్మాటికి చట్టవిరుద్ధం. క్షమించరాని విషయం' అని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు సూర్యనారాయణ గవర్నర్‌ను కలిసిన విషయమై శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. '35 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాను. ఎప్పుడూ ఇలాంటి ఘటన జరగలేదు. వారు చెబుతున్న సమస్యలు ఇప్పుడేమైనా పుట్టుకొచ్చాయా? ప్రభుత్వమేమైన కొత్తగా క్రియేట్ చేసినవా? రాజ్యాంగ బద్ధంగా గవర్నర్ పరిష్కరించే అవకాశం ఉందా? ఏ సమస్య అయినా సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప.. రాజకీయ ఆలోచన, దుర్బుద్ధితో ఎవరికో మేలు చేసేందుకు ఉద్యోగుల గౌరవానికి, ప్రభుత్వ పరువు, ప్రతిష్టలకు భంగం వాటిల్లేలా ప్రవర్తించడం సరికాదు' అన్నారు. 'గవర్నర్ దగ్గరకు వెళ్తారో? ప్రధాని దగ్గరకు వెళ్తారో? రాష్ట్రపతిని కలుస్తారో వాళ్ల ఇష్టం. కానీ కోడ్ ఆఫ్ కాండక్టు ప్రకారం వాళ్లు చేసింది ముమ్మాటికీ తప్పు. ఉద్యోగులకు మరణ శిక్ష వేశారా? ఏదైనా కొత్త యాక్టు తీసుకొచ్చి ఇబ్బంది పెడుతున్నామా? నాలుగు రోజుల క్రితమే సీఎం వైఎస్ జగన్‌ను కలిశారు కదా.. ఆయన ఎంత ఫ్రెండ్లీగా మాట్లాడారో చూశారు కదా.. అన్ని విషయాలు ఆయనతో చెప్పుకున్నారు కదా? ఎందుకీ కార్యాచరణలు? ఎవరి కోసం ఇలా చేస్తున్నారనేది అర్థమవుతోంది. ఈ ప్రభుత్వ హయాంలో మాత్రమే టీఏ, డీఏ బకాయిలు పెట్టినట్టుగా మాట్లాడడం సరికాదు. గతంలో ఏ ప్రభుత్వ హయాంలో బకాయిలు పెట్టలేదు? మాకు స్వార్థపూరిత ఆలోచనలు లేవు కాబట్టే మీ యూనియన్లకు గుర్తింపు ఇచ్చాం. చేసిన తప్పుపై ఆత్మపరిశీలన చేసుకొని పశ్చాత్తాపపడాలి. ఎప్పుడు వచ్చినా చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుంది.' అని బొత్స చెప్పారు.

రెండోరోజు ముగిసిన ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ


సాక్షి, విశాఖపట్నం: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన ఏఆర్ఆర్ నివేదికపై ప్రజాభిప్రాయ సేకరణ శుక్రవారం రెండోరోజు ముగిసింది. రెండురోజులు 32 మంది వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ అభిప్రాయాలు తెలిపారు. చివరిరోజు శనివారం 24 మంది తమ అభిప్రాయాలు చెప్పనున్నారు. డిస్కంల టారిఫ్‌లు, వార్షిక అవసరాలకు సంబంధించిన ప్రతిపాదనలపై ప్రతి అభ్యంతరాన్ని పరిగణనలోకి తీసుకుని పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి స్పష్టం చేశారు.

సచివాలయాల్లోనే 'స్థానికత' సర్టిఫికెట్లు

సాక్షి, అమరావతి : రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు పూర్తిస్థాయిలో నివాసం మార్చుకునే వారికి ప్రత్యేకంగా అందజేసే స్థానికత సర్టిఫికెట్లను గ్రామ, వార్డు సచివాలయాల్లోనే జారీ చేయనున్నారు. ప్రభుత్వం ఈ సేవను శుక్రవారం నుంచి ప్రారంభించింది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ నుంచి ఏపీకి వచ్చే వారికి స్థానికత సర్టిఫికెట్ల జారీ గడువును రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే 2024 జూన్ ఒకటో తేదీ వరకు పొడిగించింది. 2014 జూన్ 2వ తేదీ తర్వాత తెలంగాణ నుంచి ఏపీకి పూర్తిస్థాయిలో నివాసం మార్చుకున్న వారందరూ ఆంధ్రప్రదేశ్‌లో కూడా స్థానికత పొందేందుకు అర్హులవుతారు. సర్టిఫికెట్లను సచివాలయాల ద్వారానే అందజేస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన యూజర్ మాన్యువల్‌ను గ్రామ, వార్డు సచివాలయ శాఖ శుక్రవారమే అన్ని సచివాలయాలకు అందజేసింది. దరఖాస్తు ఫారాన్ని సచివాలయాల్లో అందజేస్తే గరిష్ఠంగా ఏడు రోజుల్లో సచివాలయాల ద్వారానే సర్టిఫికెట్లను జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దరఖాస్తుదారుడు ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఓటర్ ఐడీలలో ఏదో ఒక దానితో రెండు పాస్‌పోర్టు ఫొటోలను దరఖాస్తుతో అందజేయాలి. వాటిని డిజిటల్ అసిస్టెంట్లు ఏపీ సేవా పోర్టల్‌లో నమోదు చేసి, తుది ఆమోదానికి తహసీల్దార్లకు ఆన్‌లైన్‌లో పంపుతారు. నిబంధనల ప్రకారం ఉన్నవారికి ఆన్‌లైన్‌లోనే తహసీల్దార్ ఆమోదం తెలుపుతారు. అనంతరం సచివాలయాల్లో సర్టిఫికెట్లు అందిస్తారు.

మెరుగైన వైద్య సేవలందేలా పర్యవేక్షణ

- ఆస్పత్రుల్లో ఎక్కడా వైద్యులు, సిబ్బంది కొరత ఉండకూడదు
- ఫ్యామిలీ డాక్టర్ యాప్‌లో పక్కాగా డేటా ఎంట్రీ
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



సాక్షి, అమరావతి : ఖర్చుకు వెరవక ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక సౌకర్యాల కల్పనతో పాటు తగినంతగా వైద్యులు, సిబ్బందిని నియమించిన నేపథ్యంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత ఆయా విభాగాధిపతులపై ఉందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది నియామకం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త చరిత్ర సృష్టించిందని చెప్పారు. నాడు–నేడు ద్వారా వైద్య రంగం రూపురేఖలను మారుస్తున్నామని అన్నారు. వైద్య శాఖలోని అన్ని విభాగాల అధిపతులతో మంగళగిరిలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం పూర్తి ఉచితంగా, వేగంగా అందించేందుకు సీఎం జగన్ చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ సమీక్షలో మంత్రి ఇంకా ఏమన్నారంటే..

రోగులకు నాణ్యమైన భోజనం

- ▲ స్పెషలిస్ట్ వైద్యులకు రూ.3 లక్షలకు పైగా వేతనాలు చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ క్రమంలో వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది. ఫ్యామిలీ డాక్టర్ విధానం కోసం అభివృద్ధి చేసిన యాప్‌లలో డేటా ఎంట్రీ పక్కాగా ఉండాలి. వైద్యులు.. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించాలి.
- ▲ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో రోగులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలి. గతంలో కేవలం రూ.40 మాత్రమే చెల్లించేవారు. ఇప్పుడు రూ.100 వరకు ఇస్తున్నాం. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అమలవుతున్న అన్ని ఆస్పత్రుల్లో కియోస్క్‌లు కచ్చితంగా ఉండేలా చొరవ చూపాలి.
- ▲ ఈ ఏడాది ఎన్ఎంసీ పర్యటించనున్న నూతన వైద్య కళాశాలలకు సంబంధించి అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలి. పీఈబీ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి. ఇప్పటికే అన్ని కళాశాలల కోసం సిబ్బంది నియామకాలు కూడా పూర్తయ్యాయి. విజయవాడలో సెంట్రల్ డ్రగ్ టెస్టింగ్ లేబొరేటరీ వినియోగానికి సంబంధించి అన్ని సమస్యలను పరిష్కరించాలి.

డీఎంఈలో పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం

సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)లో అసోసియేట్ ప్రొఫెసర్‌లకు 2022–23 ప్యానల్ ఇయర్‌కు పదోన్నతులు కల్పించడం ద్వారా 190 ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు ప్రమోషన్ కల్పించడం ద్వారా 268 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ప్రొఫెసర్ ప్రమోషన్లకు సంబంధించి తుది సీనియారిటీ, అసోసియేట్ ప్రొఫెసర్ ప్రమోషన్‌కు సంబంధించి ప్రాథమిక మెరిట్ జాబితాలు విడుదల చేశారు. మరోవైపు ప్రమోషన్‌ల ప్రక్రియ పూర్తయిన అనంతరం ఖాళీ అయ్యే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఇప్పటికే చర్యలు చేపట్టారు. ప్రమోషన్‌ల తర్వాత ఖాళీ అయ్యే పోస్టులను ముందే నోటిఫై చేసి గత ఏడాదిలోనే నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి తుది మెరిట్ జాబితాలను సిద్ధం చేశారు. ప్రమోషన్‌ల తర్వాత ఖాళీ అయిన మేరకు అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇస్తారు.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
శనివారం ॥ 21-1-2023

● పేరెంటింగ్

'పిల్లలతో స్నేహంగా ఉండండి. వాళ్లు తల్లిదండ్రులకు భయపడేలా ఉంచకండి. వాళ్ల నుంచి నేర్చుకోవాల్సిన విషయాలు చాలా ఉంటాయి' అంటున్నారు సుధామూర్తి. 15 ఏళ్ల వయసున్నప్పుడు 45 ఏళ్లు ఉన్న తనకు తన కూతురు అక్షత నేర్పిన పాఠం వల్ల తాను ఈ రోజు సామాజిక సేవ చేస్తున్నానని అన్నారు. 'పిల్లలకు తమ మీద తాము ఆధారపడటం నేర్పాలి. ఆనందం పొందడం నేర్పించాలి. నా తల్లిదండ్రుల నుంచి అదే నేర్చుకున్నాను. నా పిల్లలకూ అదే నేర్పాను' అన్నారు సుధామూర్తి. జైపూర్‌లో జరుగుతున్న లిటరేచర్ ఫెస్టివల్‌లో పాల్గొని తల్లిదండ్రులను, యువతను ఉద్దేశించి తన పుస్తకాల నేపథ్యంలో మాట్లాడారు.


జైపూర్‌లో లిటరేచర్ ఫెస్టివల్‌లో మాట్లాడుతున్న సుధామూర్తి

కూతురు నేర్పిన పాఠం

'పిల్లల నుంచి తల్లిదండ్రులు... తల్లిదండ్రుల నుంచి పిల్లలు నేర్చుకుంటూనే ఉండాలి. అలా జరగాలంటే ఇద్దరి మధ్య భయం లేని సంభాషణ జరిగే వాతావరణం ఉండాలి. తల్లిదండ్రులను చూసి పిల్లలు భయపడేలా ఉంటే తమ మనసులోది చెప్పకుండా ఉంటారు. అప్పుడు ఇరుపక్షాలకూ నష్టం జరుగుతుంది' అన్నారు సుధామూర్తి.

తొలికాలపు మహిళా ఇంజినీర్‌గా, ఇన్ఫోసిస్ దిగ్గజంగా తనకు ఉన్న గుర్తింపు కంటే పుస్తకాలు రాయడం ద్వారా 'దేశానికి అమ్మమ్మ'గా తనకు వస్తున్న గుర్తింపు, తన రాతలూ మాటలూ నవతరం వింటున్న తీరు తనకు ఎంతో ఆనందం కలిగిస్తోందని అన్నారామె. జైపూర్‌లో జరుగుతున్న లిటరేచర్ ఫెస్టివల్‌లో శుక్రవారం క్రిక్కిరిసిన పాఠకుల మధ్య 'మై బుక్స్ అండ్ బిలీఫ్స్' అనే అంశం మీద మాట్లాడారు.

■ **ఆడపిల్ల గొప్పతనం**

'ఆడపిల్ల దేనిలోనూ తక్కువ కాదని నేను నిరూపించదల్చుకున్నాను. మా నాన్న డాక్టర్. నేను డాక్టరైతే బాగుంటుందని అనుకున్నాడు. మా అమ్మ లెక్కల టీచర్. నేను కూడా లెక్కలు టీచరు అయితే సరిపోతుందని భావించింది. కాని నేను అప్లయిడ్ సైన్స్‌లో ఇంజినీరింగ్ చేద్దామని నిశ్చయించుకున్నాను. ఇంజినీరింగ్ మగవారి విద్య అని అప్పటివరకూ భావన. మా నానమ్మ నేను ఇంజినీరింగ్ చదివితే తమ ఇళ్లల్లో కుర్రాళ్లు ఎవరు పెళ్లి చేసుకుంటారని హడలిపోయింది. ఆడపిల్లలు ఇంజినీరింగ్ చేస్తారని తెలియక నేను చదివిన కాలేజీలో లేడీస్ టాయిలెట్ కట్టలేదు. నేను చేరాక కూడా ఈ సెమిస్టర్ అయ్యాక మానేస్తుంది వచ్చే సెమిస్టర్‌లో మానేస్తుంది అని కట్టలేదు. నేను మానలేదు. పట్టుదలగా ఇంజినీరింగ్ పూర్తి చేశాను. జ్ఞానం ఏ ఒక్కరి సొంతం కాదు... అందరిది... అదే నేను నిరూపించాను. ఏ ఇంటి అమ్మాయిలైనా ఇలాంటి పట్టుదలతో ఉండాలి. మీ మీద మీరు ఆధారపడి ముందుకు పోవాలి' అందామె.

■ **కూతురి పాఠం**

'ఇంజినీరింగ్ పూర్తయ్యాక నేను మంచి ఇంజనీర్‌ని అనిపించుకోవాలని... మగవాళ్ల కంటే బాగా పని చెయ్యాలని ఉద్యోగంలో విపరీతంగా కష్టపడేదాన్ని. (భర్త నారాయణమూర్తితో) ఇన్ఫోసిస్ స్థాపించాక లాభాల గురించి పత్రికల్లో వార్తలు వచ్చినా పిల్లలకు అది పెద్ద విషయంగా చూపేదాన్ని కాదు. అంతేకాదు, పది రూపాయలు పిల్లలకు ఇచ్చినా లెక్క అడిగే దాన్ని. ఇలా ఉండగా నా కూతురు అక్షత, అప్పుడు 15 ఏళ్లు ఉంటాయి, తనకు తెలిసిన ఒక పేద పిల్లాడికి కాలేజీలో సీటు వచ్చిందని, ఆ అబ్బాయిని స్పాన్సర్ చేయమని నన్ను అడిగింది. నేను నా పని హడావిడిలో ఆ మాట విని– నువ్వు స్పాన్సర్ చెయ్ అనేశాను తేలిగ్గా. దానికి నా కూతురు భయపడకుండా– అమ్మా... నీకు 45 ఏళ్లు వచ్చాయి. మంచి స్థితిలో ఉన్నావు. ఆదాయం ఉంది. ఒకరికి సాయం చేయగలవు. నాకు నువ్వు పాకెట్ మనీ కూడా ఇవ్వవు. కాని సాయం చేయమనేసరికి నన్ను చేయమంటున్నావు. చేయగలిగిన స్థితిలో ఉండి నువ్వు చేయలేనప్పుడు ఇంకొకరు సాయం చేయాలని ఆశించకు అంది. ఆ రోజు ఆఫీస్‌కు వెళ్లి అలా కూర్చుండిపోయాను. రెండు రోజులు ఆ మాటలు వెంటాడాయి. దాని నుంచే నా ఫౌండేషన్ పుట్టింది. ఫలితం? ఎందరో పేదలకు సాయం చేస్తున్నాను. ఎదుటివాళ్లకు సాయం చేయడంలోని ఆనందం నా కూతురి వల్లే పొందడం నేను నేర్చుకున్నాను' అందామె.


> 'నీ మంచి మిత్రుడివి నీవే...
> చెడిపోవాలంటే నిన్ను
> చెడగొట్టుకునేది నీవే...
> నీలోని మంచి మిత్రుడిని
> కాపాడుకో' అని చెప్పాలి.
> – సుధామూర్తి

■ **పోల్చి చూసుకోవద్దు**

'పిల్లలకు ఇంకొకరితో పోల్చి చూసుకోవడం నేర్పించవద్దు. నా కొడుక్కు నాలుగో ర్యాంకు వస్తే ఫస్ట్ ర్యాంక్ వచ్చిన పిల్లాణ్ణి కంగ్రాచ్యులేట్ చేయమన్నాను. నేను చేయను... వాడు నాకు పోటీ అన్నాడు. మన కంటే బాగా పని చేసేవారు ఎప్పుడూ ఉంటారు... మన కంటే ప్రతిభ ఉన్నవారిని చూసి ఈర్ష్య పడటం మంచి అలవాటు కాదు అని నేర్పించాను. పిల్లలకు తమతో మాత్రమే తాము పోల్చుకుని చూసుకోవాలని చెప్పాలి. నిన్నటి కంటే ఇవాళ మెరుగ్గా ఉన్నానా అని చెక్ చేసుకుని ఎదిగేలా వారికి తర్ఫీదు ఇవ్వాలి. నీ మంచి మిత్రుడివి నీవే... చెడిపోవాలంటే నిన్ను చెడగొట్టుకునేది నీవే... నీలోని మంచి మిత్రుడిని కాపాడుకో అని చెప్పాలి' అన్నారామె.

'తల్లిదండ్రులు పిల్లలకు దేశం తిప్పి చూపించాలి. మన దేశాన్ని అర్థం చేయిస్తే వారు తాము తెలుసుకోవాల్సింది తెలుసుకుంటారు. ఒంటి మీద చొక్కాలేని పేదలే ఈ దేశాన్ని నిజంగా అర్థం చేయిస్తారు అనే మాట పిల్లలకు చెప్తే దేశం కోసం వాళ్లు ఏం చేయాలో తోటివారికి ఎలా సాయం చేయాలో తెలుసుకుంటారు' అని ముగించారామె.

– జైపూర్ నుంచి సాక్షి ప్రతినిధి


జావేద్ అఖ్తర్

కథలన్నీ సలీమ్‌వి... సంభాషణలు నావి

మొదటిసారి తేటతెల్లం చేసిన జావేద్ అఖ్తర్

(జైపూర్ నుంచి సాక్షి ప్రతినిధి)

బాలీవుడ్ స్టార్ రచయితలు సలీమ్ జావేద్ విడిపోయి ఇంతకాలం అయినా వారు ఇరువురూ ఏనాడూ తాము పని విభజన ఎలా చేసుకున్నారో చెప్పలేదు. ఎన్ని ఇంటర్వ్యూలలో ఆ ప్రశ్న వేసినా సమాధానం దాట వేసేవారు. కాని జైపూర్‌లో జరుగుతున్న లిటరేచర్ ఫెస్టివల్‌లో శుక్రవారం తన పుస్తకం 'టాకింగ్ లైఫ్' విడుదల సందర్భంగా జావేద్ మాట్లాడుతూ 'మేమిద్దరం (సలీం జావేద్) రాసిన సినిమాలన్నింటిలో ప్రతి కథా సలీం నుంచి వచ్చేది. సంభాషణలు నేను రాసేవాణ్ణి. స్క్రీన్‌ప్లే ఇద్దరం సమకూర్చేవాళ్లం' అని తేటతెల్లం చేశాడు. ఈ ఇద్దరి జంట రచనలో జంజీర్, యాదోంకి బారాత్, డాన్, షోలే, దీవార్, శక్తి వంటి సూపర్‌హిట్ బాలీవుడ్ సినిమాలు రూపుదిద్దుకున్నాయి. రచయితలకు సినిమా రంగంలో స్టార్‌డమ్ తెచ్చిన జోడి వీరు. 'మేమిద్దరం అనుకోకుండా కలిశాం. దర్శకుడు రమేష్ సిప్పీ వాళ్ల నాన్న దగ్గర నెలకు 750 రూపాయల జీతానికి చేరాం. రాజేష్ ఖన్నా హీరోగా అందాజ్, హాథీ మేరి సాథి రాయడంతో స్థిరపడ్డాం' అన్నాడాయన. బాలీవుడ్‌లో యాంగ్రీ యంగ్‌మేన్ ఇమేజ్‌ను హీరోకు సృష్టించిన ఈ జంట అనిల్ కపూర్ హీరోగా 'మిస్టర్ ఇండియా' (1987) రాశాక విడిపోయారు.

* కృషి

ఉద్యోగం మానేశానని ఇంట్లోవాళ్లు మాట్లాడలేదు..

సొంతంగా ఏదైనా సాధించాలనే కల అందరిలోనూ ఉంటుంది. ఆ కల కోసం నిరంతరం శ్రమిస్తేనే అనుకున్న ఫలితాలను అందుకోగలం. కానీ, కుటుంబ బాధ్యతలలో చాలా వరకు కలలు కల్లలుగానే ఉండిపోతాయి. ఉద్యోగం చేస్తున్న రుచివర్మ పరిస్థితి మొదట్లో అలాగే ఉండేది. వ్యాపారం వద్దని అడ్డుకున్న కుటుంబాన్ని మెప్పించింది. కాబోయే తల్లులకు డ్రెస్ డిజైన్స్ పేరుతో రెండున్నర లక్షలతో మొదలు వ్యాపారం మొదలుపెట్టి, రెండేళ్లలో ఏడాదికి 5 కోట్ల టర్నోవర్ చేరుకునేలా కృషి చేసింది. ఉద్యోగం వదులుకున్న పరిస్థితి నుంచి నలుగురికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగిన తన తపన నేడు ఎంతో మందికి స్ఫూర్తినిస్తోంది.


రుచివర్మ

''మాది బీహార్‌లోని దర్భంగా పట్టణం. మాది మధ్యతరగతి కుటుంబం. నాన్న బ్యాంకు ఉద్యోగి, అమ్మ గృహిణి. ముగ్గురు అక్కచెల్లెళ్లం. దర్భంగా నుండి ముంబైకి ఫ్యాషన్ డిజైనర్‌గా నా ప్రయాణం సాగింది.

■ **అమ్మ కోరుకున్నదని..**

ప్రతి తల్లిదండ్రిలాగే మా అమ్మ కూడా మేం ముగ్గురం అక్కాచెల్లెళ్లం ఇంజనీర్లు కావాలని కోరుకునేది. ఆమె కల నెరవేర్చడానికి చాలా ప్రయత్నించాను. కానీ, ఆ కోచింగ్ ఖర్చు భరించడం పెద్ద విషయంగా అనిపించింది. అమ్మనాన్నల గురించి ఆలోచించినప్పుడు నా మనసులో చాలా గందరగోళం ఏర్పడింది. ఇవన్నీ ఆలోచించి నా శక్తి మేరకు ప్రయత్నించి, ఆ కోచింగ్ నుంచి ఆరు నెలల్లో తిరిగి వచ్చేశాను.

■ **ఫ్యాషన్ పరిశ్రమ వైపు మనసు**

దర్భంగా భూమి కళలకు ప్రసిద్ధి. మా ఇంటి పక్కన టైలర్‌గా పనిచేసే ఆమె వర్క్ నన్ను బాగా ఆకట్టుకునేది. ఈ విషయం ఇంట్లో చెప్పలేకపోయాను. ధైర్యం తెచ్చుకుని నాకు ఆర్ట్స్ అంటే ఆసక్తి ఉందని, ఇంజినీరింగ్ చదవలేనని నాన్నకు చెప్పాను. నాన్న అంతా గ్రహించి, ఏ చదువు కావాలో దానినే ఎంచుకోమన్నారు. దీంతో నేను నిఫ్ట్‌లో చేరాను.

■ **ప్రతి నిర్ణయమూ కష్టమే**

నిఫ్ట్ పరీక్షలో పాసయ్యాక ముంబైకి వెళ్లాలనే నిర్ణయం కష్టమే అయ్యింది. ఒంటరిగానా?! అని భయపడ్డారు. కానీ, కొన్ని రోజుల ప్రయత్నంలో నా ఇష్టమే గెలిచింది. అది నా జీవితాన్ని మార్చింది. కాలేజీ నుంచి వెళ్లి ఓ ఎక్స్‌పోర్ట్ హౌజ్‌లో జాయిన్ అయ్యాను. అక్కడ మెటర్నిటీ వేర్ డిజైన్ చేసే అవకాశం వచ్చింది. మూడేళ్లపాటు ఆ ఎక్స్‌పోర్ట్ హౌస్‌లో పనిచేసి చాలా నేర్చుకున్నాను. ఆఫీసు, ఫ్యాక్టరీ ఒకే చోట ఉండడం వల్ల డిజైనింగ్ కాకుండా ప్రింటింగ్, స్టిచింగ్, శాంపిల్, ప్రొడక్షన్ నేర్చుకున్నాను. ఆ వర్క్ నాకు చాలా ఉపయోగపడింది.

■ **ఎక్కడో ఏదో లోటు.**

2012 లో మొదటి ఉద్యోగం వస్తే 2019 నాటికి, నేను నాలుగు కంపెనీలలో డిజైనర్ నుండి సీనియర్ డిజైనర్ స్థానానికి చేరుకున్నాను. ఉద్యోగం చేస్తున్నాను కానీ సంతృప్తి మాత్రం లభించలేదు. పని పెరుగుతూ వచ్చింది. స్థిర జీతం అలవాటుగా మారింది. కానీ ఎప్పుడూ ఏదో మిస్ అవుతున్నట్లు అనిపిస్తుంది. బాల్యంలో టైలర్ ఆంటీని స్ఫూర్తిగా తీసుకుంటే టెన్త్ క్లాస్ వచ్చేనాటికి ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా నా ఆదర్శంగా ఉండేవారు. 'నేను కూడా నా సొంత బ్రాండ్‌ని ప్రారంభించాలనుండేది. నేను ఉద్యోగం కోసమే ఈ కోర్సు ఎంచుకోలేదు.. ఎలా?' అనే ఆలోచనలు నన్ను కుదురుగా ఉండనిచ్చేవి కావు.

■ **ఇంట్లో వాళ్లు మాట్లాడలేదు...**

2019లో ఉద్యోగం మానేయాలని నిర్ణయించుకున్నాను. ఉద్యోగం మానేసినట్లు తల్లిదండ్రులు, భర్తకు చెప్పినప్పుడు వారు సంతోషించలేదు. మొదట నా భర్త చాలా నిరాకరించాడు. తరువాత నా తల్లిదండ్రులు కూడా సెటిల్డ్ లైఫ్ ను ఎందుకు వదిలేయాలి అనే మాటలే. ఇంట్లో ఉన్నవాళ్లంతా బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన వాళ్లే కాబట్టి వాళ్లకు నా బాధ అర్థం కాకుండాపోయింది. నేనే ఓ రోజు నిర్ణయం తీసుకుని ఉద్యోగం వదిలేశాను. ఉద్యోగం మానేసినందుకు నా భర్త కొన్ని రోజులు మాట్లాడలేదు. రీసెర్చ్ వర్క్ చేశాక, వచ్చే 34 నెలల ప్లానింగ్‌ని మా అమ్మ నాన్నలకు చెప్పాను, అప్పుడు వాళ్ళు కొద్దిగా కన్విన్స్ అయ్యారు. నేను రంగంలోకి దిగగానే అసలు గొడవ మొదలైంది.

■ **చులకనగా మాట్లాడేవారు..**

ఈ రంగంలోకి రాకముందే చాలా పరిశోధనలు మొదలుపెట్టాను. మార్కెట్‌లో ఏ సెక్షన్‌కు డిమాండ్ పెరుగుతుందో కనిపించింది. కాబోయే తల్లుల దుస్తుల విషయంలో చాలా లోటు కనిపించింది. ఇంతకు ముందు ఇదే రంగంలో పనిచేశాను కాబట్టి కొంచెం ఆత్మవిశ్వాసం వచ్చి ఈ ప్రొడక్ట్‌ని ఎంచుకున్నాను. అయితే, రంగంలోకి దిగగానే అసలు గొడవ మొదలైంది. వన్ మ్యాన్ ఆర్మీలా అన్నీ నేనే చేయాల్సి వచ్చింది. ఇప్పటి వరకు కేవలం డిజైనింగ్ వర్క్ మాత్రమే చేశాను. కానీ ఇప్పుడు ప్రొడక్షన్ లైన్, లోగో డిజైనింగ్, ప్యాకేజింగ్, డెలివరీ ఫైనాన్స్ లాంటివన్నీ చేశాను. ఎందుకంటే నా దగ్గర బడ్జెట్ తక్కువగా ఉంది, కాబట్టి ఇక్కడ అతిపెద్ద సమస్య ఏర్పడింది. నా అవస్థ చూసి ఎగతాళి చేసినవారున్నారు. చులకనగా మాట్లాడినవారున్నారు. 'ప్రెగ్నెన్సీలో ఉన్న వాళ్లకు డ్రెస్ డిజైన్స్ ఏంటి?!' అని నాతో పని చేయడానికి వర్కర్స్ నిరాకరించేవారు. దీంతో పెద్ద ఇబ్బందిని ఎదుర్కొన్నాను. కానీ, నా పట్టుదలను వదిలిపెట్టలేదు.


రెండేళ్లలో 2.5 లక్షల వ్యాపారం కోట్లకు

కోవిడ్ కాలం అందరికీ కష్టంగా ఉండేది. దీంతో ఆఫ్‌లైన్ పనులు ప్రారంభం కాలేదు. అప్పుడు నా వ్యాపారం ఆఫ్‌లైన్‌లో మాత్రమే చేయాలని ఆలోచించాను. ఇది నాకు ప్రయోజనకరంగా మారింది. కొన్ని ఆన్‌లైన్ మార్కెటింగ్ సైట్స్‌తో మాట్లాడాను. ముందు నా ప్రతిపాదనను వాళ్లు అంగీకరించలేదు. దీంతో నా సొంత సైట్‌లో 'ఆరుమి'పేరుతో కాబోయే తల్లుల కోసం చేసిన నా డిజైన్స్ పెట్టాను. ప్రారంభించిన 24 గంటల్లోనే ఆర్డర్‌లు రావడం మొదలయింది. ఈ రోజు నా బ్రాండ్ అన్ని ఆన్‌లైన్ మార్కెట్ లోనూ సేల్ అవుతోంది'' అని వివరించే రుచివర్మ ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తినిస్తుంది.


రుచివర్మ రూపొందించిన డ్రెస్‌లో మోడల్

కిచెన్ టిప్స్

- మినప గారెలు చేసేటప్పుడు ఆ పిండిలో కొంచెం బొంబాయి రవ్వ లేదా బియ్యం పిండి కలిపితే హోటల్ లో చేసే విధంగా క్రిస్పీగా వస్తాయి.
- చపాతీలు మృదువుగా రావాలంటే చపాతీ పిండి కలిపేటప్పుడు రెండు స్పూన్ల నూనెను కలపాలి. ఇలా నూనె వేసి కలపటం వల్ల చపాతీ కాల్చే సమయంలో నూనె వేయవలసిన అవసరం ఉండదు.



- పూరీలు చేసినప్పుడు అరకేజీ గోధుమ పిండిలో ఒక గరిట మైదా పిండిని కలిపితే పూరీలు బాగా పొంగటమే కాకుండా క్రిస్పీగా వస్తాయి.
- ధనియాలను వేయించి చల్లార్చి డబ్బాలో నిల్వ చేస్తే పురుగు పట్టకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి.
- రసం పిండేసిన నిమ్మ బద్దలను పాడేయకుండా ఫ్రిజ్ లో ఒక మూల పెడితే ఫ్రిజ్ లో దుర్వాసనలు రావు. అలాగే ఫ్రిజ్ ఓపెన్ చేసినప్పుడు తాజా వాసన వస్తుంది.

బ్యూటిప్

జుట్టుకు జింజర్ ఆయిల్

అల్లంలో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. కాబట్టి జుట్టుకు అల్లం రసాన్ని ఉపయోగించడం వల్ల అనేక జుట్టు సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవచ్చు. ముఖ్యంగా తలలో దురద, తీవ్రమైన చుండ్రు సమస్యలకు చికిత్స చేయడంలో అల్లం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అల్లం జుట్టు కుదుళ్లకు రక్త ప్రసరణను పెంచుతుంది. తద్వారా వెంట్రుకల కుదుళ్ల ఉత్తేజితమై జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తాయి. అల్లంలో జింజరోల్, విటమిన్లు, ఖనిజాలు, కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉన్నాయి. అందువల్ల జుట్టు రాలడాన్ని నివారించడంతోబాటు జుట్టు కుదుళ్ళను బలంగా చేస్తుంది. ఇందుకోసం మార్కెట్‌లో దొరికే జింజర్ ఆయిల్‌ను వాడవచ్చు.

మీ షాంపూతో అల్లం రసం కలపవచ్చు. లేదా అల్లం ఆధారిత షాంపూని ఉపయోగించవచ్చు. నూనెతో పాటు అల్లం రసాన్ని కూడా ఉపయోగించవచ్చు. మీ హెయిర్ మాస్క్‌లకు అల్లం కూడా జోడించవచ్చు.



● డిజిటల్ డీ-టాక్సిఫికేషన్!

డిజిటల్ సర్పం.. విషానికి విరుగుడు



పదిమంది గుమిగూడే స్థలం... అంటే బస్టాప్, రైల్వేస్టేషన్, ఆఖరికి పార్కులకు వచ్చేవారిలో కూడా చాలామంది మొబైల్‌లోనో, ట్యాబ్‌లోనో తలలు దూర్చి కనిపిస్తారు. అవసరం మేరకు ఉపయోగించడానికి బదులుగా, అంతకంటే ఎక్కువగా ఎప్పుడూ స్క్రీన్‌కు అతుక్కుపోవడాన్ని 'డిజిటల్ అడిక్షన్'గా మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. ఇది విషపదార్థాలను మెదడులోకి నింపుకోవడమేననీ, చిన్న చిన్న టెక్నిక్స్ ఉపయోగించి వాటిని శుభ్రం చేయవచ్చని చెబుతున్నారు మానసిక నిపుణులు. ఆ వివరాలివి...

పిల్లలతో పాటు పెద్దలు సైతం మొబైల్స్‌నూ, ల్యాప్‌టాప్స్, ట్యాబ్స్ వంటి వాటిని వాడుతుంటారు. అయితే వారు పెద్దవాళ్లు కావడంతో కుటుంబ బాధ్యతలకూ, ఆఫీసు పనుల కోసం స్క్రీన్ నుంచి ముఖం తప్పించడం తప్పదు.

■ **స్క్రీన్‌కు అతుక్కుపోవడం టీన్స్‌లో ఎక్కువ...**

పిల్లల్లో అందునా టీనేజీ పిల్లల్లో 'స్క్రీన్' పట్ల అడిక్షన్ ఎక్కువ. తమ చదువుల కోసం, కాలేజీల్లో ఇచ్చే టాస్కులు, ప్రాజెక్టుల కంటే ఎక్కువగా సరదా అంశాలూ, సినిమాలు, గాసిప్స్ కోసమే స్క్రీన్ టైమ్‌ను వెచ్చిస్తుంటారు.

■ **అంతకంటే చిన్న పిల్లల్లోనూ...**

ఇక టీన్స్‌లోకి రాని ఎనిమిది, తొమ్మిది నుంచి పన్నెండేళ్ల పిల్లలు సైతం డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్‌ల్లో తలను ముంచేస్తారు. ఆఖరికి బయటికి వచ్చినప్పుడు కూడా మొబైల్‌లో ఎన్నో రకాల గేమ్స్ ఆడుతూ ఉంటారు. ఒక్కోసారి పిల్లల్ని బయటకు తీసుకొచ్చినప్పుడు వాళ్లు అల్లరి చేయకుండా ఉండేందుకు తల్లిదండ్రులే 'మొబైల్స్'ను వాళ్ల చేతికి అందిస్తుంటారు. అదే అలవాటు వాళ్లు టీన్స్‌లోకి వచ్చాక మరీ ముదిరిపోతుంది. ఓ వయసుకు చేరేనాటికి అది 'డిజిటల్ అడిక్షన్'గా మారిపోతుంది. దీని వల్ల వచ్చే మానసిక సమస్యల విశ్వరూపాల్ని మనం చాలా సందర్భాల్లో చూస్తూనే ఉంటాం. మొబైల్‌లో గేమ్స్ ఆడవద్దన్నందుకు తల్లిదండ్రులతో పోట్లాటలు దగ్గర్నుంచి ఆత్మహత్యల వరకు ఈ దుష్పరిణామాలెన్నో.

■ **డిజిటల్ అడిక్షన్‌ను గుర్తించడమెలా?**

- **స్క్రీన్ ముందు చాలాసేపు గడపడం :** సోషల్ మీడియాలో బ్రౌజింగ్ చేస్తూ, గేమ్స్ ఆడుతూ, సినిమాలు చూస్తే చాలాసేపు గడపడం. దాంతో చదువూ, హోమ్‌వర్క్, వ్యాయామం, ఫ్రెండ్స్‌తో కలవడం వంటి కార్యకలాపాలకు దూరమవుతుంటారు.
- **స్క్రీన్ ముందు నుంచి తప్పించడం చాలా కష్టం కావడం :** పిల్లల చేతుల్లోంచి స్మార్ట్‌ఫోన్ లాగేసుకున్నా లేదా కంప్యూటర్ ఆఫ్ చేయమన్నా వాళ్లకు ఇరిటేషన్ వచ్చేస్తుంది. బలవంతంగా మొబైల్ లాగేసినా లేదా కంప్యూటర్ ఆఫ్ చేసినా కోపం రగిలిపోవడంతో పాటు చేతుల్లో ఉన్న వస్తువుల్ని విసిరేసి, వైల్డ్‌గా ప్రవర్తిస్తుంటారు.
- **రోజువారీ పనుల్ని పూర్తి చేయకపోవడం :** తాము రోజూ చేయాల్సిన క్లాస్‌వర్క్‌గానీ లేదా హోమ్‌వర్క్‌గానీ చేయకుండా వదిలేస్తారు. ఈ పెండింగ్‌వర్క్‌ను తప్పనిసరిగా చేయాల్సి వచ్చినప్పుడు అతిగా ఆందోళనపడుతుంటారు.
- **ఒంటరిగా ఉండటం :** వీరు స్మార్ట్‌ఫోన్‌లోని యాప్స్‌తో తప్ప ఇతరులతో కమ్యూనికేషన్‌లో ఉండరు. ఒంటరిగా ఉండటానికే ఎక్కువగా ఇష్టపడుతుంటారు. దేనిపట్లా ఆసక్తితో ఉండరు సరికదా... గతంలో వారికి ఇష్టమైన పెయింటింగ్ లాంటి అభిరుచులకు దూరంగానూ, అనాసక్తితో ఉంటారు.
- **మూడ్ స్వింగ్స్ :** తాము చేసే పని పట్ల ఏకాగ్రత కోల్పోతుండటం, దేని పట్లా దృష్టి కేంద్రీకరించలేకపోవడంతో పాటు త్వరత్వరగా వారి మూడ్స్ మారిపోతుండటం చాలా సాధారణంగా జరుగుతుంటుంది. అంతేకాదు... వారి ప్రవర్తన గమనించి పెద్దవాళ్లు ఫోన్ తీసుకోబోతుంటే దాన్ని దాచుకోవడం, అబద్ధాలు చెప్పడం వంటివీ చేస్తారు.

■ **చక్కదిద్దడానికి చిట్కాలివి...**

పిల్లలు అవసరానికి మించి 'స్క్రీన్'ను వాడటాన్ని తగ్గించేలా చేయడం ఎలాగో మానసిక నిపుణులు అందిస్తున్న కొన్ని సూచనలివి...

- **ముందు మారాల్సింది పేరెంట్సే :** చాలా మంది తల్లిదండ్రులు స్మార్ట్‌ఫోన్‌తో చాలా సేపు గడుపుతూ... తమ పిల్లలు మాత్రం వాటికి దూరంగా, క్రమశిక్షణతో ఉండాలనుకుంటారు. ఈ విషయంలో ముందుగా మారాల్సిందీ, పిల్లలకు ఆదర్శంగా ఉండాల్సిందే తల్లిదండ్రులే.
- **ఒకేసారి లాగేయకండి :** అడిక్షన్‌కు లోనైన పిల్లల నుంచి స్మార్ట్‌ఫోన్ /ల్యాప్‌టాప్‌ను ఒకేసారి లాగేయకండి. స్విచ్‌నొక్కినట్టుగా పిల్లలు మారిపోరు. వారు రోజూ డిజిటల్ డివైజ్‌తో ఎంత టైమ్‌ను గడపదలచుకున్నారో వారినే నిర్ణయించుకొమ్మని సూచించండి. నిర్దిష్టంగా ఆ టైమ్‌లో వాళ్లను స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్‌తో ఆడుకోనివ్వండి. క్రమంగా ఆ టైమ్‌ను తగ్గిస్తూ రావాలి తప్ప ఠక్కున మారిపోవడం అంటూ జరగదు. పైగా అలా చేయడం ఇంకా మరికొన్ని దుష్పరిణామాలు దారితీస్తుంది.
- **స్నేహితుల్ని వ్యక్తిగతంగా కలవమనడం:** స్నేహితుల్ని ఫోన్‌లో లేదా వాట్సాప్‌లో పలకరించడానికి బదులు వ్యక్తిగతంగా కలిసి రమ్మనీ, కలిసి ఆడుకొమ్మని ప్రోత్సహించాలి. అంతేకాదు... పెళ్లిళ్లు, పండుగల వంటి సమయాల్లో వ్యక్తుల్ని, బంధువుల్ని ప్రత్యక్షంగా కలవమని, సామాజిక బంధాల్ని బలోపేతం చేసుకోవడం ఎంత అవసరమో చెప్పాలి.

వారీ అలవాటు నుంచి బయటకు వచ్చాక... డిజిటల్ ఉపకరణాలవల్ల వారు కోల్పోయిన అంశాలు, వాటి వల్ల కలిగిన నష్టాలతో పాటు... డీ–టాక్సికేషన్ తర్వాత ఇప్పుడు వారికి ఒనగూరిన/ఒనగూరుతున్న ప్రయోజనాలను వివరించవచ్చు. అప్పుడు వారు డిజిటల్ ఉపకరణాలను మరింత సమర్థంగా ఎలా వాడాలో తెలుసుకుంటారు. అనవసరమైన వాటికి దూరంగా ఉంటూ స్వీయనియంత్రణ పాటిస్తారు.

డిజిటల్ ఉపకరణాల దుష్ప్రభావాలు

నిద్రలేమి, తరచు నిద్రాభంగం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం (లో సెల్ఫ్ ఎస్టీమ్), తరచు తలనొప్పులు, ఒకేచోట కూర్చుని అదేపనిగా గేమ్స్ ఆడుతుండటం వల్ల ఒబేసిటీ, కీళ్లనొప్పులు వంటి అనేక రూపాల్లో కనిపిస్తాయి. అందుకే వీటిని మనకు ఉపయోగపడే మేరకే విచక్షణతో, తెలివిగా వాడుతూ... వీటికి అడిక్ట్ కావడం నుంచి క్రమంగా బయటపడాలి.


డాక్టర్ చరణ్‌తేజ కోగంటి
సీనియర్ సైకియాట్రిస్ట్

మెడనొప్పి నివారణ ఉపశమనం



ఇటీవలి కాలంలో మెడనొప్పి సమస్య చాలా మందిని వేధిస్తోంది. మెడనొప్పి ఉంటే ఏ పనులూ సరిగ్గా చేయలేం. ఈ మెడనొప్పికి కారణాలు చాలానే ఉన్నాయి. ముందుగా కారణాన్ని తెలుసుకుని, అందుకు తగ్గ చికిత్సను తీసుకుంటే మెడ నొప్పిని సులువుగా తగ్గించుకోవచ్చు.

ఆఫీసులో లేదా వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఉన్న వారు గంటల తరబడి కూర్చుని లాప్‌టాప్ లేదా కంప్యూటర్ మీద పనిచేయడం వల్ల మెడనొప్పి వస్తుంది. సాధారణంగా మనం కూర్చునే విధానం సరిగ్గా లేకుంటేనే మెడ నొప్పి వస్తుంది. చిన్న సమస్యే అని తేలిగ్గా తీసేస్తే సమస్య మరింత పెద్దదయ్యే ప్రమాదం ఉంది. అయితే కొన్ని చిట్కాలను అనుసరించడం వల్ల ఈ నొప్పిని తగ్గించుకోవచ్చు. అవేంటంటే..

మెడ నొప్పికి కారణాలు

సరిగ్గా కూర్చోకపోవడం: కంప్యూటర్ లేదా స్మార్ట్ ఫోన్‌లను ఎక్కువ సేపు ఉపయోగించేటప్పుడు సరిగ్గా కూర్చోకపోవడం వల్ల దీనివల్ల కండరాలకు ఒత్తిడి కలుగుతుంది. మంచం మీద పడుకుని లేదా కూర్చొని చదవడం వల్ల కూడా ఒత్తిడికి దారితీస్తాయి. ఇది మెడనొప్పికి కారణమవుతుంది.

గాయాలు: తల అకస్మాత్తుగా వెనుకకు, తరువాత ముందుకు కదిలినప్పుడు, నరాలు ఒత్తుకుపోవడం... వల్ల కూడా మెడనొప్పి వస్తుంది.

కీళ్ళు అరిగిపోవడం: శరీరంలోని ఇతర కీళ్ళ మాదిరిగానే మెడ కీళ్లు కూడా వయస్సు వచ్చే కొద్దీ అరుగుతాయి. ఈ అరుగుదల వల్ల మెడ కదలికలు ప్రభావితం అవుతాయి. దీనివల్ల మెడనొప్పి వస్తుంది.

మెడ నొప్పిని తగ్గించే చిట్కాలు



సరైన భంగిమ: కూర్చున్నప్పుడు లేదా నిలబడినప్పుడు భుజాలు తుంటిపై సమానమైన వాలులో ఉన్నాయని నిర్ధారించుకోండి. అలాగే మీ చెవులు నేరుగా మీ భుజాలకు సమకోణంలో ఉండేట్టు చూసుకోవాలి. సెల్ ఫోన్లు, టాబ్లెట్లు లేదా ఇతర చిన్న స్క్రీన్లు వంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఉపయోగిస్తున్నప్పుడు మెడను వంచకూడదు. అలా వంచకూడదంటే ఈ వస్తువులు మీ తలకు అనుగుణంగా కాస్త ఎత్తులో పెట్టాలి. అలాగే మీ వర్క్ టేబుల్, కంప్యూటర్, కుర్చీని సౌకర్యంగా ఉండేలా చూసుకోవాలి.

విరామం అవసరం: ఎక్కువసేపు డ్రైవ్ చేయాల్సి వచ్చినా.. లేదా స్క్రీన్ ముందు గంటల తరబడి పని చేయాల్సి వచ్చినా.. మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవాలి. ముఖ్యంగా మెడను, భుజాలను బాగా కదిలించండి. అలాగే మీ శరీరాన్ని సాగదీయండి.


భుజాలపై ఎక్కువ బరువును వేయద్దు: మీ భుజాలు, చేతులపై ఎక్కువ బరువుండే బ్యాక్ ప్యాక్‌లను మోయకండి. ఎందుకంటే ఇవి మీ భుజాలపై ఒత్తిడిని కలిగిస్తాయి. తద్వారా. మెడ నొప్పి వస్తుంది.

సౌకర్యంగా పడుకోవాలి: మీ తల, మెడ.. మీ శరీరంలోని మిగిలిన భాగాలకు అనుగుణంగా ఉండాలి. మీ తల కింద పెద్ద సైజు దిళ్లను అసలే ఉపయోగించకండి. దిండు లేకుండా ఉండలేమనుకుంటే చిన్న దిండును మాత్రమే ఉపయోగించండి. కాళ్ల కింద దిండును వేసుకుంటే మంచిది. దీనివల్ల వెన్నెముక కండరాలు రిలాక్స్ అవుతాయి.

జీవన శైలిలో మార్పులు: ఒకేచోట ఎక్కువ సేపు కూర్చోవద్దు. ఎక్కువగా తిరగండి. నడవండి. ధూమపానం అలవాటుంటే వెంటనే మానుకోండి. ఎందుకంటే ఇది మెడ నొప్పి వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది.




స్ట్రెచింగ్ ఎక్సర్‌సైజులు: ఇంటి నుంచి పని చేయడం లేదా ల్యాప్ టాప్‌ల ముందు గంటల తరబడి కూర్చోవడం వల్ల మెడ నొప్పి వస్తుంది. అయితే శరీరాన్ని సాగదీసే స్ట్రెచింగ్ వ్యాయామాల వల్ల మెడ నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది. అదేవిధంగా వైద్యులు లేదా ఫిజియో థెరపిస్టులు చెప్పే కొన్ని చిట్కాలను అనుసరించడం వల్ల మెడనొప్పి తొందరగా తగ్గుతుంది.



కాపడం: మెడ నొప్పి నుంచి ఉపశమనం పొందడానికి, వాపు లేదా మంటను తగ్గించడానికి చల్లని లేదా హీట్ కంప్రెస్ రెండింటినీ ఉపయోగించొచ్చు. ఇది కండరాల సడలింపునకు సహాయపడుతుంది. నొప్పిని తగ్గిస్తుంది. అయితే ఈ టెక్నిక్ ను 20 నిమిషాల కంటే ఎక్కువ సార్లు ఉపయోగించకూడదు.

మసాజ్: మెడ నొప్పికి మసాజ్ థెరపీ వల్ల కండరాలను సడలించవచ్చు. తీవ్రమైన మెడ నొప్పిని తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. అలాగే ఇది రక్త ప్రవాహాన్ని పెంచుతుంది. ఒత్తిడి, ఆందోళన వంటి లక్షణాలను తగ్గిస్తుంది.

మెడనొప్పి తగ్గడానికి నొప్పి నివారణ మందులు ఉంటాయి. అయితే అలా మందులు వాడటం వల్ల సైడ్ ఎఫెక్టులు తప్పవు. అందువల్ల మందులకు బదులు కొన్ని నొప్పి నివారణ చర్యలు, ఉపశమన చర్యలను పాటించడం మంచిది.



రక్తం వృద్ధి అవడానికి...



కొంత మంది కొన్ని విటమిన్ల లోపం వల్ల రక్తలేమితో బాధపడుతుంటారు. రక్తలేమి వల్ల నీరసం, శ్వాస ఆడకపోవడం, కళ్లు తిరగటం, నిస్సత్తువగా ఉండటంతోపాటు అనేకరకాల సమస్యలు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా వృద్ధులకు, గర్భిణులకు రక్తహీనత సమస్య ఎక్కువగా ఎదురయ్యే సమస్య. సాధారణంగా రక్తలేమికి కొన్ని విటమిన్ టాబ్లెట్లు వాడమని వైద్యులు సూచిస్తుంటారు. అయితే అలా మందులు వాడటం వల్ల కొన్ని దుష్ఫలితాలు తలెత్తే అవకాశం ఉందని, అందువల్ల సహజంగానే రక్తం పట్టే ఆహారం తీసుకోమని కూడా చెబుతారు. అలాంటి వాటిలో కొన్ని చిట్కాలు మీకోసం...

- సపోటా జ్యూస్ తాగటం లేదా సపోటా పండ్లు తినడం వల్ల శరీరానికి తొందరగా రక్తం పడుతుంది.
- దానిమ్మ రసం తాగడం, దానిమ్మ పండ్లు తినడం కూడా చాలా మంచిది.
- బూడిద గుమ్మడి శరీర ఆరోగ్యానికి చాలా మంచిది. రోజుకు కప్పు బూడిద గుమ్మడి రసాన్ని తాగుతూ ఉంటే శరీరంలో మంచి రక్తం వృద్ధి అవుతుంది. బూడిద గుమ్మడి కాయ గుజ్జు తీసి దానిని దళసరి గుడ్డలో వేసి బాగా పిండితే వచ్చే రసాన్ని కప్పులో పోసుకుని తాగాలి.
- కిస్‌మిస్ లేదా ద్రాక్షపండ్లు బాగా తింటూ ఉంటే రక్తం వృద్ధి అవుతుంది. పచ్చివి దొరకనప్పుడు ఎండువి తినవచ్చు.
- రాత్రులు గుప్పెడు ఎండు ద్రాక్ష పళ్ళు గ్లాసెడు నీటిలో నానవేసి ఉదయం వాటిని బాగా పిసికి ఆ పిప్పిని పారవేసి ఆ నీటిని తాగాలి. అలా రోజూ తాగుతుంటే ఒక నెలలోనే రక్తం వృద్ధి అవుతుంది.
- ఎండు ఖర్జూరాలతో కూడా పైన చెప్పిన విధంగా చేసి ఆ నీటిని తాగుతుంటే రక్తం వృద్ధి అవుతుంది.
- రాత్రిపూట గుప్పెడు శనగలు నీటిలో నానవేసి ఉదయం తింటూ ఉంటే రక్తం వృద్ధి అయ్యి శరీరం పుష్టిగా అవుతుంది. వ్యాయామం చేసేవారికి ఈ విధానం చాలా మంచిది.
- అంజీర్ పండ్లు తింటున్నా రక్తం వృద్ధి అవుతుంది.
- లేత కొబ్బరి నీరు, లేత కొబ్బరి తింటూ ఉంటే శరీరంలో రక్తం బాగా వృద్ధి అవుతుంది.

వీటిలో మీ శరీర తత్త్వాన్ని, మీకున్న ఇతర ఆరోగ్య సమస్యలను కూడా దృష్టిలో ఉంచుకుని మీకు ఏవి బాగా సరిపడతాయో, ఏది సులభమో వాటిని అనుసరిస్తే సరి.

పెరటి వైద్యం

తులసి ఇంత ఆరోగ్యం అంత



- ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్న తులసి ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. తులసిలో ఆల్సోలిక్ యాసిడ్, యూజినాల్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది జలుబు, జ్వరం వంటి అనేక సమస్యల నుండి ఉపశమనం అందిస్తుంది. అందువల్ల మీకు యూరిక్ యాసిడ్ సమస్య ఉన్నట్లయితే తులసి మీకు ఉత్తమమైనది.
- చక్కెర వ్యాధిగ్రస్తులకు తులసి దివ్యౌషధం. తులసి ఆకులు హైపోగ్లైసీమిక్ స్థాయి నియంత్రణ లక్షణాలను కలిగి ఉంటాయి, ఇవి రక్తంలో చక్కెర స్థాయులను తగ్గించడంలో సహాయపడతాయి. దీని కోసం మీరు గుప్పెడు తులసి ఆకులను తీసుకొని రాత్రంతా ఒక గ్లాసు నీటిలో నానబెట్టండి. తర్వాత ఉదయం ఖాళీ కడుపుతో ఆకులు నములుతూ నీళ్లు తాగేసెయ్యండి. ఇలా చేయడం వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయి.
- తులసిలో విటమిన్ ఎ, విటమిన్ డి, ఐరన్, ఫైబర్ వంటి పోషకాలు ఉన్నాయి. ఈ అంశాలన్నీ జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. జీర్ణక్రియను బలోపేతం చేయడానికి కూడా తులసి బాగా పనిచేస్తుంది. తులసి ఆకులలో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఏజింగ్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. తులసి ఆకుల కషాయాన్ని రోజూ తాగడం వల్ల రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది.

హెల్త్ టిప్స్



- బరువు తగ్గాలనుకున్న వాళ్లు రోజువారీ ఆహారంలో కనీసం ఐదుసార్లు పచ్చికూరగాయలు, పండ్లు తీసుకోవాలి. వాటిలో శరీరానికి అవసరమైన విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ సమృద్ధిగానూ కేలరీలు తక్కువగానూ వుంటాయి.
- భరించరానంత తలనొప్పి తగ్గాలంటే పది తులసి ఆకులు, పది నల్ల మిరియాలను నూరి అందులో టీ స్పూను తేనె కలిపి రోజుకు మూడు సార్లు తినాలి.
- బాదం, గసగసాలు కలిపి తింటే రక్తం శుద్ధి అవుతుంది.
- బాగా నమిలి తినాల్సిన ఆహారాన్ని తీసుకునే వారిలో చర్మం త్వరగా ముడతలు పడకపోవడాన్ని చూస్తుంటాం. ఎక్కువ సేపు నమలడం ద్వారా చర్మపు మెటబాలిజమ్ మెరుగై చర్మం ముడతలు పడదు.
- పెరుగులో బెల్లం, మిరియాల పొడి కలిపిన మిశ్రమాన్ని తీసుకుంటే జలుబు తగ్గుతుంది.
- బొప్పాయి కాయ లేదా, ఆకుని మెత్తగా కాటుకలా నూరి ఆ ముద్దని అరికాళ్ళ ఆనెల మీద పెట్టి, కట్టుకడితే అవి మెత్తబడతాయి.
- గ్లాసు మజ్జిగలో తురిమిన అల్లం లేదా శొంఠి పొడిని, ఉప్పుని కలిపి తీసుకుంటే విరేచనాలు తగ్గుతాయి.
- మూడు టీ స్పూన్ల ఆలివ్ ఆయిల్, రెండు టీ స్పూన్ల యూకలిప్టస్ ఆయిల్‌ను షాంపూలో కలుపుకొని తలస్నానం చేస్తే పేలు పోతాయి..

సినిమా

ఆ విషయంలో నిరాశపడ్డాను!


రాజమౌళి

'ఆర్ఆర్ఆర్' చిత్రం 95వ ఆస్కార్ అవార్డ్స్‌కు ఇండియా తరఫున అఫీషియల్ ఎంట్రీగా ఎంపిక కాకపోవడం అనేది కాస్త నిరుత్సాహపరిచిందని దర్శకుడు రాజమౌళి పేర్కొన్నారు. ఓ ఆంగ్ల ఆన్‌లైన్ పోర్టల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజమౌళి ఈ విధంగా స్పందించారు. ''మన దేశం తరఫున 'ఆర్ఆర్ఆర్' సినిమాకు అధికారిక ఎంట్రీ లభించకపోవడంతో నిరాశ చెందాను. 'ఆర్ఆర్ఆర్'కు అఫీషియల్ ఎంట్రీ లభిస్తే బాగుండేదన్నట్లుగా విదేశీయులు సైతం అనుకుంటున్నారు. అయితే మా సినిమాకు ఎందుకు అధికారిక ఎంట్రీ లభించలేదు? అని పదే పదే ఆలోచిస్తూ ఉండే మనస్తత్వాలు కావు మావి. జరిగిందేదో జరిగిపోయింది. మనం ముందుకు సాగిపోవాలి. అయినా ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎఫ్ఐ) కమిటీ నియమ, నిబంధనలు, మార్గదర్శకాలు వంటి అంశాల గురించి నాకు తెలియదు కాబట్టి నేను ఈ విషయంపై కామెంట్ చేయాలనుకోవడం లేదు. ఇక దేశం తరఫున అఫీషియల్ ఎంట్రీగా పంపిన 'ఛెల్లో షో' (గుజరాతీ ఫిల్మ్, ఇంగ్లిష్‌లో 'లాస్ట్ ఫిల్మ్ షో) చిత్రానికి ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో స్థానం లభించినందుకు నాకు సంతోషంగా ఉంది. ఎందుకంటే ఇది కూడా ఇండియన్ సినిమాయే'' అని చెప్పుకొచ్చారు రాజమౌళి. కాగా 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటునాటు' సాంగ్‌కు ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో స్థానం లభించింది. ఇక గుజరాతీ ఫిల్మ్ 'ఛెల్లో షో' ఇండియా తరఫున అధికారిక ఎంట్రీగా బెస్ట్ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ విభాగంలో షార్ట్‌లిస్ట్ కాగా, 'ఆర్ఆర్ఆర్'తో పాటు మరో ఎనిమిది ఇండియన్ చిత్రాలు 'ఆస్కార్ రిమైండర్ లిస్ట్'లో ఉన్న సంగతి తెలిసిందే. ఇక 95వ ఆస్కార్ అవార్డ్స్‌కు సంబంధించిన నామినేషన్స్ ఈ నెల 24న వెల్లడికానున్నాయి. అవార్డ్ ఫంక్షన్ మార్చిలో జరగనుంది. 'ఆర్ఆర్ఆర్' విషయానికి వస్తే.. ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన విషయం తెలిసిందే.


డబ్బు కోసమే... డబ్బు, ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకునే ఓ దర్శకుడిగా నేను సినిమాలు తీస్తాను. విమర్శకుల ప్రసంశల గురించి పెద్దగా ఆలోచించను. 'ఆర్ఆర్ఆర్' ఓ కమర్షియల్ ఫిల్మ్. బాక్సాఫీస్ వద్ద నా సినిమా కమర్షియల్‌గా సక్సెస్ అయితే నేను హ్యాపీ. అవార్డ్స్‌ను బోనస్‌లా భావిస్తాను. అయితే ఓ సినిమా కోసం పడిన కష్టానికి గుర్తింపు లభిస్తే నాకు, నా చిత్రబృందానికి సంతోషం అనిపిస్తుంది'' అని కూడా పేర్కొన్నారు రాజమౌళి. ఇక మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి తర్వాతి సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే.

ముగ్గురూ ఒక్కరే!

నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'అమిగోస్'. రాజేంద్ర రెడ్డి దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శాండిల్‌వుడ్ బ్యూటీ ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా ఈ చిత్రంలోని 'యెక యెక..' అనే లిరికల్ సాంగ్‌ని శుక్రవారం విడుదల చేశారు. జిబ్రాన్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా అనురాగ్ కులకర్ణి పాడారు. ఒకరికొకరు సంబంధం లేని ముగ్గురు వ్యక్తులు మంజునాథ్, సిద్ధార్థ్, మైఖేల్ మధ్య ఉన్న అనుబంధాన్ని తెలియజేసే పాట ఇది. ఈ మూడు పాత్రలనూ కల్యాణ్ రామే చేశారు. ఫిబ్రవరి 10న ఈ చిత్రం విడుదల కానుంది.


కల్యాణ్‌రామ్

తిరుపతిలో భారతీయుడు


కమల్‌హాసన్

హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్' ('భారతీయుడు') బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు 25 సంవత్సరాల తర్వాత 'ఇండియన్'కు సీక్వెల్‌గా 'ఇండియన్ 2'ని రూపొందిస్తున్నారు. కమల్–శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న ఈ చిత్రం కీలక షెడ్యూల్ ఇటీవల చెన్నైలో జరిగింది. తదుపరి షెడ్యూల్ చిత్రీకరణ తిరుపతిలో ప్రారంభం కానుందని తెలిసింది. ఈ షెడ్యూల్‌లో ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, రకుల్ ప్రీత్‌సింగ్, ప్రియా భవానీశంకర్, బాబీ సింహా కీలక పాత్రలు చేస్తున్నారు. 'ఇండియన్ 2' సినిమాను ఈ ఏడాదిలోనే రిలీజ్ చేయాలనుకుంటున్నారు.


మనం మనం బరంపురం


మంచు మనోజ్

కొంత విరామం తర్వాత 'వాట్ ది ఫిష్' అనే కొత్త సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు హీరో మంచు మనోజ్. 'మనం మనం బరంపురం' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతో పాటు, కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు వరుణ్ కోరుకొండ. సిక్స్‌ఐఎక్స్, ఏ ఫిల్మ్ బై వి బ్యానర్స్ నిర్మించనున్న ఈ చిత్రం త్వరలోనే ప్రారంభం కానుంది. ''భారతీయ సాంస్కృతిక కంటెంట్‌ను అంతర్జాతీయంగా చూపించాలనే ఆలోచనతో ఈ సినిమా చేస్తున్నాను'' అన్నారు వరుణ్. ''డార్క్ కామెడీ, హై–ఆక్టేన్ థ్రిల్లింగ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుంది. టొరంటో, కెనాడా లొకేషన్స్‌లో దాదాపు 75 రోజులు ఈ సినిమా షూటింగ్ ప్లాన్ చేశాం. వివిధ భాషల్లో రూపొందించనున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేసేలా సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సీనియర్ నిర్మాత సూర్యనారాయణ మృతి

సీనియర్ నిర్మాత ఆరువిల్లి సూర్యనారాయణ (83) శుక్రవారం కన్ను మూశారు. హైదరాబాద్‌లోని తన స్వగృహంలో మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో ఉన్నట్టుండి పడిపోయారట. హాస్పిటల్‌కి తరలించగా అప్పటికే తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు నిర్ధారించారని సూర్యనారాయణ కుటుంబ సభ్యులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ నాగులంకలో పేర్రాజు, లక్ష్మీదేవి దంపతులకు 1939 డిసెంబరు 10న జన్మించారు సూర్యనారాయణ. ఆయనకు నిర్మాత నెక్కంటి సత్యనారాయణ దగ్గరి బంధువు. ఇద్దరూ కలిసి వైజాగ్‌లో పలు వ్యాపారాలు చేశారు. కావలిపాటి విజయలక్ష్మి రాసిన 'విధి విన్యాసాలు' నవల బాగా నచ్చడంతో దాని ఆధారంగా సినిమా తీయాలనుకున్నారు సూర్యనారాయణ. దర్శక–నిర్మాత కేఎస్ ప్రకాశరావును కలిసి 'విధి విన్యాసాలు' నవల ఇచ్చి, దర్శకత్వం చేయమని కోరారు. ఆ నవలనే శోభన్‌బాబు, జమునలతో సత్య చిత్ర పతాకంపై 'తాసిల్దార్‌గారి అమ్మాయి' (1971) సినిమాగా తీశారు. ఆ తర్వాత శోభన్‌బాబు, వాణిశ్రీలతో కె. విశ్వనాథ్ దర్శకత్వంలో 'ప్రేమబంధం' (1976) సినిమా నిర్మించారు సూర్యనారాయణ. 'గంధదగుడి' అనే కన్నడ చిత్రం చూసి కె. రాఘవేంద్ర రావు దర్శకత్వంలో ఎన్టీఆర్‌తో 'అడవి రాముడు'(1977) నిర్మించారాయన. ఆ తర్వాత కృష్ణతో 'కుమార రాజా' (1978), 'కొత్త అల్లుడు'(1979) వంటి సినిమాలు నిర్మించారు. బాపు దర్శకత్వంలో 'ఏది ధర్మం? ఏది న్యాయం' (1982) సినిమా తీశారు. బాలకృష్ణతో 'భలే తమ్ముడు'(1985) నిర్మించారు. అమితాబ్ బచ్చన్‌తో 'మహాన్'(1983) అనే హిందీ సినిమా తీశారాయన. అప్పటివరకూ నెక్కంటి సత్యనారాయణతో కలిసి సినిమాలు నిర్మించారాయన. అయితే 1988లో సత్యనారాయణ మృతి చెందారు. ఆ తర్వాత సొంతంగా జంధ్యాల దర్శకత్వంలో 'విచిత్ర ప్రేమ'(1991), భరద్వాజ డైరెక్షన్‌లో 'అత్తా నీ కొడుకు జాగ్రత్త' (2003) సినిమాలు నిర్మించారు సూర్యనారాయణ. ఆయనకు భార్య లక్ష్మి, కుమార్తెలు శ్రీదేవి, అరుణ, పద్మ ఉన్నారు. సూర్యనారాయణ మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. మహాప్రస్థానంలో శనివారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



పోరాటం అనే పదం నచ్చదు


రకుల్

నార్త్ నుంచి వచ్చి ముందు సౌత్‌లో స్టార్ హీరోయిన్ అయ్యారు రకుల్ ప్రీత్ సింగ్. తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలతో దూసుకెళుతున్న ఈ బ్యూటీ ప్రస్తుతం తమిళంలో 'ఇండియన్ 2', 'అయలాన్'లో నటిస్తున్నారు. కాగా హిందీలో ఆమె నటించిన 'ఛత్రీవాలీ' చిత్రం ఓటీటీలో విడుదలైంది. ఈ చిత్రంలో రకుల్ సురక్షితమైన శృంగారం గురించి పాఠాలు చెప్పే కెమిస్ట్రీ టీచర్‌గా నటించారు. ''కొన్ని విషయాలను బహిరంగంగా మాట్లాడటానికి ఇష్టపడం. అయితే మారుతున్న కాలానికి తగ్గట్టు మనం మారాలి. పిల్లలకు అవగాహన కల్పించాలి. అందుకే ఈ సినిమా చేశాను'' అన్నారు. ఇక.. కెరీర్ ఆరంభంలో తనకు ఎదురైన అనుభవాల గురించి రకుల్ చెబుతూ – ''ఇండస్ట్రీలో నాకు బ్యాక్‌గ్రౌండ్ లేదు. ముంబైలో నేను కాండీవాలీలో ఉండేదాన్ని. కానీ నా ట్రైనర్‌తో కలిసి బాంద్రాలో ఒక కేఫ్‌లో కూర్చుని, ఏయే ఆఫీస్‌కి వెళ్లాలి? ఎన్ని ఆడిషన్స్ ఇవ్వాలి? అని ప్లాన్ చేసేదాన్ని. బాంద్రా, అంథేరీల్లో ఏమైనా ఆడిషన్స్ ఉంటే వెళ్లొచ్చని ఆ కేఫ్‌కి వెళ్లేదాన్ని. బ్యాగులో కొన్ని డ్రెస్సులు పెట్టుకుని, కారులోనే మార్చుకునేదాన్ని. చాన్స్ వచ్చినట్లే వచ్చి చేజారేది. ఒక్కోసారి నాతో షూటింగ్ చేసి, వేరే హీరోయిన్‌ని తీసుకునేవారు. ఇదంతా నేను పోరాటం అనుకోలేదు. ఎందుకంటే కష్టపడకుండా ఈజీగా దక్కాలనుకునే మనస్తత్వం కాదు నాది. అందుకే 'పోరాటం' అనే పదం నాకు నచ్చదు. ఆ రోజు ఆత్మవిశ్వాసంతో అడుగులు వేశాను కాబట్టే ఈరోజు ఈ స్థాయికి చేరుకోగలిగాను'' అన్నారు.

మావా బ్రో..

విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న తొలి పాన్ ఇండియా చిత్రం 'దాస్ కా ధమ్కీ'. నివేదా పేతురాజ్ హీరోయిన్. విశ్వక్ సేన్ దర్శకత్వంలో వన్మయే క్రియేషన్స్, విశ్వక్ సేన్ సినిమాస్‌పై కరాటే రాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని 'మావా బ్రో...' అంటూ సాగే రెండో పాట లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. రామ్ మిరియాల స్వరపరచి, పాడిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. ''ప్రతి సామాన్యునికి కనెక్ట్ అయ్యేలా ఈ పాట ఉంటుంది. విశ్వక్ డ్యాన్స్ విజువల్ ట్రీట్‌లా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది. తెలుగు, తమిళ, మలయాళం, హిందీ భాషల్లో ఫిబ్రవరి 17న విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, కెమెరా: దినేష్ కె. బాబు.


విశ్వక్ సేన్

ఆమె నటన హార్ట్ టచింగ్
– అడివి శేష్

సుహాస్, టీనా శిల్పరాజ్ హీరో హీరోయిన్లుగా షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రైటర్ పద్మభూషణ్'. జి. మనోహరన్ సమర్పణలో అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం విలేకర్ల సమావేశానికి ఓ ముఖ్య అతిథిగా హాజరై, ట్రైలర్‌ను రిలీజ్ చేసిన అడివి శేష్ మాట్లాడుతూ –''సుహాస్ టెర్రిఫిక్ యాక్టర్. ఇందులో రోహిణిగారి నటన హార్ట్ టచింగ్‌గా అనిపించింది. ఈ సినిమా విజయం సాధించాలి''అన్నారు. ''రైటర్ పద్మభూషణ్ వంటి మంచి చిత్రాన్ని నా దగ్గరకు తీసుకొచ్చిన ప్రశాంత్‌కు, నాకు అండగా ఉంటున్న శరత్, అనురాగ్, చంద్రుగార్లకు కృతజ్ఞతలు'' అన్నారు సుహాస్. ''కలర్‌ఫోటో'కు సహదర్శకుడిగా చేసిన నేను ఇప్పుడు 'రైటర్ పద్మభూషణ్'కు దర్శకత్వం వహించాను'' అన్నారు ప్రశాంత్. ''రైటర్ పద్మభూషణ్'తో పాటు కొత్తవారితో మరో నాలుగు సినిమాలు చేస్తున్నాం'' అన్నారు అనురాగ్, శరత్. ''లహరి మ్యూజిక్ 35ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉంది. చాయ్ బిస్కెట్ వారితో అసోసియేట్ కావడం హ్యాపీ'' అన్నారు చంద్రు. దర్శకులు హరీష్ శంకర్, హను రాఘవపూడి, శివ నిర్వాణ, శశి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


సుహాస్, అడివి శేష్

సాక్షి బిజినెస్
శనివారం
21-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
237	80
60,622	18,028

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,017	▽	165
డోజోన్స్	33,136	▽	11
ఎఫ్‌టీఎస్ఈ 100	7,771	△	23
డాక్స్	15,034	△	113
షాంఘై	3,265	△	25
నికాయ్	26,554	△	148

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
57,050	△	380
బంగారం (99.5 స్వచ్ఛత)		
56,822	△	379
వెండి (కిలో)		
68,453	▽	1,009

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	80.45	82.12
£	బ్రిటన్ పౌండ్	[illegible]	86.55	89.59
€	యూరో	[illegible]	98.98	102.32
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	62.11	64.16
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	55.14	57.53
S$	సింగపూర్ డాలర్	[illegible]	60.46	62.45
SAR	సౌదీ రియాల్	[illegible]	20.64	22.31
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.19	22.98
¥	చైనా యువాన్	[illegible]	10.84	12.92

బెంట్లే రూ. 6 కోట్ల కారు



న్యూఢిల్లీ: అల్ట్రా లగ్జరీ కార్ల తయారీ దిగ్గజం బెంట్లే తాజాగా భారత్‌లో సరికొత్త బెంటేగా ఎక్స్‌టెండెడ్ వీల్‌బేస్ ఎస్‌యూవీ మోడల్‌ను ప్రవేశపెట్టింది. ఢిల్లీ ఎక్స్‌షోరూంలో ధర రూ.6 కోట్లు. 4.0 లీటర్ 550 పీఎస్ వీ8 పెట్రోల్ ఇంజిన్ పొందుపరిచారు. రెండవ తరం బెంటేగా ఆధారంగా రూపుదిద్దుకుంది. వీల్‌బేస్, రేర్ క్యాబిన్ స్థలం 180 మిల్లీమీటర్లు అదనంగా విస్తరించింది. కారు డెలివరీకి 7–8 నెలల సమయం పడుతుంది. 2023లో అమ్మకాల్లో 40 శాతం వృద్ధి ఆశిస్తున్నట్టు బెంట్లే భారత డీలర్‌గా వ్యవహరిస్తున్న ఎక్స్‌క్లూజివ్ మోటార్స్ తెలిపింది. 2022లో దేశంలో కంపెనీ 40 యూనిట్లు విక్రయించిందని ఎక్స్‌క్లూజివ్ మోటార్స్ ఎండీ సత్య బగ్లా వెల్లడించారు. 'అల్ట్రా లగ్జరీ కార్ల విభాగం దేశంలో పెరుగుతోంది. అధిక దిగుమతి సుంకాలే ఈ విభాగానికి ఉన్న ఏకైక సమస్య. దిగుమతి సుంకాలను క్రమంగా ప్రభుత్వం మరింత హేతుబద్ధం చేస్తుందని ఆశిస్తున్నాం' అన్నారు.

గూగుల్‌లో 12 వేల ఉద్యోగాలు కట్..

న్యూయార్క్ / న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ఆర్థిక మందగమన భయాల నేపథ్యంలో టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. గూగుల్ కూడా మెటా (ఫేస్‌బుక్ మాతృసంస్థ), మైక్రోసాఫ్ట్, అమెజాన్‌ల బాట పట్టింది. ప్రపంచవ్యాప్తంగా 12,000 ఉద్యోగాల్లో కోత విధిస్తున్నట్లు కంపెనీ సీఈవో సుందర్ పిచాయ్ శుక్రవారం వెల్లడించారు. కార్యకలాపాలను అత్యంత కఠినంగా సమీక్షించుకున్న అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉద్యోగులకు రాసిన ఈమెయిల్‌లో ఆయన తెలిపారు. ప్రాంతాలు, హోదాలకు అతీతంగా ఆల్ఫాబెట్‌వ్యాప్తంగా (గూగుల్ మాతృసంస్థ) తీసివేతలు ఉంటాయని పిచాయ్ పేర్కొన్నారు.

ఉద్యోగులకు సీఈవో సుందర్ ఈమెయిల్



గత రెండేళ్లుగా వ్యాపారం నాటకీయంగా వృద్ధి చెందిందని, దానికి అనుగుణంగానే గణనీయంగా రిక్రూట్ చేసుకున్నామని ఆయన వివరించారు. కానీ ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయని పిచాయ్ పేర్కొన్నారు. అమెరికాలో ఉద్వాసనకు గురయ్యే ఉద్యోగులకు విడిగా ఇప్పటికే ఈమెయిల్స్ పంపామని, మిగతా దేశాల్లో పాటించాల్సిన పాలసీలు.. చట్టాల కారణంగా ఈ ప్రక్రియలో కొంత ఆలస్యం జరగవచ్చని చెప్పారు. 'ఈ పరిణామాలపై తీవ్రంగా చింతిస్తున్నాను. ఈ మార్పుల వల్ల గూగ్లర్స్ జీవితాలపై ప్రతికూల ప్రభావం పడనుండటం నాకు బాధ కలిగిస్తోంది. ఈ నిర్ణయాలకు పూర్తి బాధ్యత నాదే' అని పిచాయ్ పేర్కొన్నారు. ఇప్పటికే మైక్రోసాఫ్ట్ 10,000, అమెజాన్ 18,000, మెటా 11,000 మంది ఉద్యోగులను తీసివేయనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.

స్విగ్గీలో 380 మందికి ఉద్వాసన

ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ కూడా 380 మంది ఉద్యోగులను తీసివేస్తున్నట్లు ప్రకటించింది. స్థూల ఆర్థిక పరిస్థితులు సంక్లిష్టంగా మారిన నేపథ్యంలో వ్యాపార పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ సీఈవో శ్రీహర్ష మాజేటి తెలిపారు. అలాగే త్వరలోనే మీట్ మార్కెట్‌ప్లేస్‌ను కూడా మూసివేయనున్నట్లు కంపెనీ అంతర్గత ఈమెయిల్‌లో ఆయన పేర్కొన్నారు. సరిగ్గా అంచనా వేయలేకపోవడం వల్లే అవసరమైన దానికన్నా ఎక్కువగా హైరింగ్ చేసుకున్నామని, ఆ విషయంలో తాను మరింత మెరుగ్గా వ్యవహరించి ఉండాల్సిందన్నారు.

యూనియన్ బ్యాంక్ లాభం రెండింతలు

ముంబై: ప్రభుత్వరంగ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) డిసెంబర్ త్రైమాసికానికి పటిష్టమైన పనితీరు చూపించింది. నికర లాభం రెండింతలై రూ.2,245 కోట్లుగా నమోదైంది. గతంలో మాఫీ చేసిన రుణాలు వసూలు కావడం లాభాల వృద్ధికి దోహదపడింది. నికర వడ్డీ ఆదాయం 20 శాతం పెరిగి రూ.8,628 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.19,454 కోట్ల నుంచి 20 శాతానికి పైగా పెరిగి రూ.24,154 కోట్లకు చేరింది. స్థూల ఎన్‌పీఏలు క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఉన్న 11. 62 శాతం నుంచి 7.93 శాతానికి మెరుగుపడ్డాయి. సెప్టెంబర్ త్రైమాసికంలో ఇవి 8.45 శాతంగా ఉన్నాయి.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-1-2023	
విశాఖ	575–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	84.00
20-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	530–00
వరంగల్	532–00
రిటైల్ ధర	5.90

రిలయన్స్ లాభం 15,792 కోట్లు

- క్యూ3లో 15 శాతం డౌన్...
- అధిక వడ్డీ వ్యయాల ప్రభావం
- ఆదాయం రూ.2,20,592 కోట్లు; 15 శాతం అప్
- జియో, రిటైల్ లాభాల జోరు...

న్యూఢిల్లీ: దేశీ కార్పొరేట్ అగ్రగామి రిలయన్స్ ఇండస్ట్రీస్ కన్సాలిడేటెడ్ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (2022–23, క్యూ3)లో 15 శాతం క్షీణించి రూ.15,792 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.18,549 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఆదాయం మాత్రం 15.3% ఎగసి, రూ.1,91,271 కోట్ల నుంచి రూ.2,20,592 కోట్లకు చేరింది. నిర్వహణ పనితీరు పటిష్టంగానే ఉన్నప్పటికీ, అధిక వడ్డీ వ్యయాలు, తరుగుదల (డిప్రిషియేషన్) కంపెనీ లాభాలపై ప్రతికూల ప్రభావం చూపాయి.

రుణభారం పైపైకి...

పర్యావరణానుకూల ఇంధనం (గ్రీన్ ఎనర్జీ)పై భారీ స్థాయిలో పెట్టుబడులు పెడుతున్న రిలయన్స్.. ఇందుకోసం రుణాలను కూడా పెద్ద మొత్తంలో సమీకరిస్తోంది. దీంతో గతేడాది మూడో త్రైమాసికంతో పోలిస్తే కంపెనీ రుణ భారం ఏకంగా రూ.59,000 కోట్లు ఎగబాకి, ఈ క్యూ3 నాటికి రూ.3,03,530 కోట్లకు చేరింది. ఫలితంగా కంపెనీ వడ్డీ వ్యయాలు ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్‌లో 36.4 శాతం పెరిగి, రూ.5,201 కోట్లుగా నమోదయ్యాయి. ఇతర వ్యయాలు సైతం రూ.5,421 కోట్లకు పెరిగిపోయాయి. ఇక తరుగుదల కూడా 32.6 శాతం ఎగసి రూ.10,187 కోట్లుగా నమోదైంది. అన్ని వ్యాపార విభాగాల్లో అసెట్ బేస్ పెరగడం, డిజిటల్ సేవల వ్యాపారంలో అధిక నెట్‌వర్క్ వినియోగం ఈ పెరుగుదలకు కారణమని కంపెనీ పేర్కొంది. కాగా, క్యూ3 నాటికి కంపెనీ వద్ద రూ.1,93,282 కోట్ల నగదు, తత్సంబంధ నిల్వలు ఉన్నాయి.



కన్సాలిడేటెడ్ ఎబిటా పటిష్టమైన వృద్ధికి అన్ని వ్యాపార విభాగాల జోరు కారణం. యూజర్ల వృద్ధి ఇంకా డేటా వినియోగం భారీగా పెరగడంతో జియో రికార్డు ఆదాయాలు, ఎబిటాను సాధించింది. ఈ ఏడాదిలోనే మేము 5జీ సర్వీసులను ప్రారంభించాం. ప్రస్తుతం 134 నగరాలు, పట్టణాల్లో కస్టమర్లకు భవిష్యత్తు తరం సర్వీసులను అందిస్తున్నాం. కేజీ డీ6 బ్లాక్‌లో గ్యాస్ ఉత్పత్తి గణనీయంగా పుంజుకుంటోంది. 2023–24లో రోజుకు 30 ఎంఎస్‌సీఎండీలకు చేరుకోనుంది.

– ముకేశ్ అంబానీ, రిలయన్స్ సీఎండీ

ఫలితాల్లో ముఖ్యాంశాలు...

- కన్జూమర్ వ్యాపారం, అధిక చమురు–గ్యాస్ ధరల నేపథ్యంలో కంపెనీ స్థూల లాభం (ఎబిటా) క్యూ3లో 13.5 శాతం పెరుగుదలతో రూ.38,460 కోట్లుగా నమోదైంది.
- టెలికంతో సహా డిజిటల్ సేవల ఎబిటా 26 శాతం అధికంగా రూ.12,900 కోట్లకు చేరింది. రిటైల్ ఎబిటా 25 శాతం వృద్ధితో రూ.4,786 కోట్లకు, చమురు–గ్యాస్ విభాగం ఎబిటా రెట్టింపు స్థాయిలో రూ.3,880 కోట్లకు చేరాయి.
- అయితే, ప్రధానమైన చమురు రిఫైనింగ్, పెట్రోకెమికల్స్ వ్యాపారం (ఓ2సీ) ఎబిటా మాత్రం నామమాత్రంగా 3 శాతం వృద్ధి చెంది రూ.13,926 కోట్లకు పరిమితమైంది.
- రిలయన్స్ రిటైల్ నికర లాభం క్యూ3లో 6.2% పెరిగి రూ.2,400 కోట్లను తాకింది. కొత్తగా 789 స్టోర్లను కంపెనీ జతచేసింది.

జియో జోష్...



రిలయన్స్ టెలికం అనుబంధ సంస్థ జియో జోరు కొనసాగుతోంది. డిసెంబర్ క్వార్టర్‌లో కంపెనీ నికర లాభం 28.3 శాతం ఎగబాకి రూ.4,638 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే క్వార్టర్‌లో లాభం రూ.3,671 కోట్లుగా ఉంది. కాగా, మొత్తం ఆదాయం రూ. 19,347 కోట్ల నుంచి రూ. 22,993 కోట్లకు వృద్ధి చెందింది. ఇక మొత్తం కస్టమర్ల సంఖ్య 43.3 కోట్లకు చేరుకుంది. ఇక ఒక్కో యూజర్ నుంచి ఆదాయం (ఏఆర్‌పీయూ) క్యూ3లో 178.2కు చేరింది. క్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో ఇది రూ.151.6గా ఉంది.

రిలయన్స్ షేరు శుక్రవారం 1 శాతం మేర నష్టంతో రూ.2,443 వద్ద ముగిసింది. మార్కెట్లు ముగిసిన తర్వాత కంపెనీ ఫలితాలు వెలువడ్డాయి.

మార్కెట్ రెండో రోజూ డీలా

- అధిక వెయిటేజీ షేర్ల పతనం
- ప్రపంచ ప్రతికూలతల ప్రభావం



ముంబై: అధిక వెయిటేజీ షేర్ల పతనంతో పాటు అంతర్జాతీయ ఆర్థిక మందగమన ఆందోళనలతో దేశీయ స్టాక్ సూచీలు వరుసగా రెండోరోజూ డీలా పడ్డాయి. ఉదయం స్వల్ప లాభాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించిన సూచీలు కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడే ట్రేడింగ్‌లో తీవ్ర ఒడిదుడుకులతో కదలాడాయి. రిలయన్స్ ఒకశాతం, హెచ్‌యూఎల్ 4%, ఏషియన్ పెయింట్స్ 3%, ఇన్ఫోసిస్ ఒక శాతం పతనంతో ఆఖరికి సెన్సెక్స్ 237 పాయింట్లు నష్టపోయి 60,622 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 80 పాయింట్లు పతనమై 18,028 వద్ద నిలిచింది. లార్జ్‌క్యాప్ షేర్లతో పాటు మధ్య, చిన్న తరహా షేర్లలో విస్తృతంగా విక్రయాలు జరగడంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు 0.70% నష్టపోయాయి. మెటల్స్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా, రియల్టీ, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాకులకు కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,002 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,510 కోట్ల షేర్లను కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 360 పాయింట్లు, నిఫ్టీ 71 పాయింట్లు లాభపడ్డాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 19 పైసలు బలపడి 81.17 స్థాయి వద్ద స్థిరపడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. సెన్సెక్స్ 237 పాయింట్ల పతనంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.57 లక్షల కోట్లు ఆవిరయ్యాయి.

- క్వార్టర్ ఆర్థిక ఫలితాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడంతో ప్రైవేట్ రంగ దిగ్గజం రిలయన్స్ షేరు ఒకశాతానికి పైగా నష్టపోయి రూ.2,443 స్థిరపడింది.

హెచ్‌యూఎల్‌కు షేరు 4% డౌన్

మాతృ సంస్థ యూనిలీవర్ గ్రూప్‌నకు చెల్లించే రాయల్టీ, ఇతర సెంట్రల్ సర్వీసుల ఫీజును పెంచేందుకు బోర్డు ఆమోదం తెలపడంతో హెచ్‌యూఎల్ షేరు 4% నష్టపోయి రూ.2,548 వద్ద స్థిరపడింది. దీంతో ఒక్క రోజులోనే కంపెనీ మార్కెట్ వాల్యుయేషన్ రూ.23,941 కోట్లు ఆవిరైంది.

జీఆర్‌టీ జ్యూవెలర్స్‌కు ఐజే అవార్డు

హైదరాబాద్: బంగారం వజ్రాభరణాల తయారీ, విక్రయ సంస్థ జీఆర్‌టీ జ్యువెలర్స్ ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ జ్యువెలరీ డిజైన్ ఎక్సలెన్స్ అవార్డును దక్కించుకుంది. ఐజే నిర్వహించిన 12వ ఎడిషన్ పోటీల్లో ఉత్తమ డిజైన్ బ్రాస్‌లెట్ అవార్డును సొంతం చేసుకుంది. జీఆర్‌టీ హస్తకళా నైపుణ్యానికి ఈ అవార్డు ప్రతీక అని కంపెనీ ఎండీ ఆనంద్ అనంతపద్మనాభమ్ తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్



మనిక ఖాతాలో రెండు కాంస్యాలు

వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) దోహా కంటెండర్ టోర్నమెంట్‌లో భారత స్టార్ ప్లేయర్ మనిక బత్రా రెండు కాంస్య పతకాలు సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సత్యన్ జ్ఞానశేఖరన్‌తో కలిసి కాంస్యం నెగ్గిన ఈ ఢిల్లీ అమ్మాయి మహిళల సింగిల్స్‌లోనూ కాంస్య పతకం కైవసం చేసుకుంది. దోహాలో శుక్రవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్లో సత్యన్-మనిక ద్వయం 6–11, 11–9, 7–11, 8–11తో షిన్ యుబిన్–లిమ్ జాంగ్‌హూన్ (దక్షిణ కొరియా) జోడీ చేతిలో ఓడిపోయింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో మనిక 6–11, 11–2, 4–11, 2–11తో జాంగ్ రుయ్ (చైనా) చేతిలో ఓడింది.

తొలి టి20లో భారత్ గెలుపు

దక్షిణాఫ్రికా మహిళల జట్టుతో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో భారత్ 27 పరుగులతో నెగ్గింది. ముందుగా భారత్ 6 వికెట్లకు 147 పరుగులు చేసింది. అమన్‌జోత్ కౌర్ (41 నాటౌట్: 7 ఫోర్లు) టాప్ స్కోరర్. దక్షిణాఫ్రికా 9 వికెట్లకు 120 పరుగులు చేసి ఓడిపోయింది.

మరో హోరాహోరీకి రె'ఢీ'

రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్‌నారాయణ్ సింగ్ స్టేడియం... 60 వేలకు పైగా సామర్థ్యంతో దేశంలోని మూడో అతి పెద్ద క్రికెట్ మైదానం... ఇప్పుడు తొలి అంతర్జాతీయ మ్యాచ్‌కు సిద్ధమైంది. అయితే భారత్, న్యూజిలాండ్ రెండో వన్డేపై ఆసక్తి పెరిగేందుకు ఇది మాత్రమే కారణం కాదు. బుధవారం హైదరాబాద్ మ్యాచ్ అందించిన వినోదం ఈ సిరీస్‌ను ఒక్కసారిగా ఆసక్తికరంగా మార్చేసింది. భారత్ ఏకపక్ష విజయం సాధించి ఉంటే... కివీస్ 131/6 నుంచి గెలుపు అంచుల దాకా వెళ్లకుండా ఉంటే ఈ మ్యాచ్‌కు ఇంత ఆకర్షణ వచ్చి ఉండేది కాదేమో! ఈ నేపథ్యంలో మరోసారి ఇరు జట్ల మధ్య మ్యాచ్‌లో అదే తరహాలో పరుగుల వరద పారుతుందా అనేది చూడాలి.

- నేడు భారత్, న్యూజిలాండ్ రెండో వన్డే
- ఆత్మవిశ్వాసంతో ఇరు జట్లు
- సిరీస్ గెలిచే లక్ష్యంతో టీమిండియా
- మధ్యాహ్నం గం.1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం



లాథమ్



రోహిత్ శర్మ

రాయ్‌పూర్: సొంతగడ్డపై మరో వన్డే సిరీస్‌ను గెలుచుకునే లక్ష్యంతో భారత జట్టు తమ అస్త్రశస్త్రాలతో సిద్ధమైంది. శనివారం న్యూజిలాండ్‌తో జరిగే రెండో వన్డేలో గెలిస్తే సిరీస్ టీమిండియా ఖాతాలో చేరుతుంది. మరోవైపు పట్టుదలకు మారుపేరైన కివీస్ గత మ్యాచ్‌లో చేజారిన విజయాన్ని అందుకొని సిరీస్ సమం చేయాలని భావిస్తోంది. తొలి వన్డేలో ఇరు జట్ల ఆట, బలాబలాలను చూస్తే హోరాహోరీ పోరు ఖాయం.

ఉమ్రాన్‌కు చాన్స్!

ఒకరు కాదు, ఇద్దరు కాదు... ఒకేసారి ముగ్గురు 'డబుల్ సెంచూరియన్'లు భారత తుది జట్టులో ఆడబోతుండటం విశేషం. ఇది భారత బ్యాటింగ్ బలాన్ని చూపిస్తోంది. రోహిత్, గిల్ ఓపెనర్లుగా మెరుపు ఆరంభం అందిస్తే టీమిండియాకు తిరుగుండదు. గత మ్యాచ్‌లో విఫలమైనా... కోహ్లి ఎప్పుడైనా చెలరేగిపోగలడు కాబట్టి సమస్య లేదు. మిడిలార్డర్‌లో ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్ బాగా ఆడటం జట్టుకు కీలకం. ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యా గత కొంత కాలంగా తగిన న్యాయం చేయలేకపోతున్నాడు. బౌలింగ్‌లో సిరాజ్ మినహా మిగతా వారంతా విఫలమవుతున్నారు. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు పనికొస్తాడని తొలి వన్డేలో శార్దుల్‌ను తీసుకున్నారు. అయితే అది పెద్దగా ఫలితం చూపలేదు. దానికంటే రెగ్యులర్ బౌలర్‌కే అవకాశం ఇవ్వడం మంచిదని భావిస్తే మూడో పేసర్‌గా ఉమ్రాన్ జట్టులోకి తిరిగొస్తాడు.

సోధి ఆడతాడా!

న్యూజిలాండ్ పోరాటపటిమ ఏమిటో తొలి వన్డేలోనే కనిపించింది. ప్రధాన బ్యాటర్లంతా విఫలమైనా... అనామకుడు అనుకున్న మైకేల్ బ్రేస్‌వెల్ తన విధ్వంసకర బ్యాటింగ్‌ను చూపించాడు. స్పిన్నర్ సాన్‌ట్నర్ కూడా బ్యాటింగ్‌తో జట్టుకు ఉపయోగపడగలనని నిరూపించుకున్నాడు. ఇదే ఆర్డర్‌ను చూసుకుంటే ఎనిమిదో స్థానం వరకు ఆ జట్టులో బ్యాటర్లకు కొదవ లేదు. గత మ్యాచ్‌లో విఫలమైనా... అలెన్, ఫిలిప్స్ మెరుపు షాట్లతో చెలరేగిపోగల సమర్థులు. కాన్వే, కెప్టెన్ టామ్ లాథమ్ కూడా తమ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిస్తే న్యూజిలాండ్ గట్టి పోటీనివ్వగలదు. ఫాస్టెస్ట్ బౌలర్లలో ఒకడైన ఫెర్గూసన్‌ను గిల్ చితక్కొట్టాడు. ఇలాంటి స్థితిలో లెగ్‌స్పిన్నర్ ఇష్ సోధి గాయం నుంచి కోలుకోవాలని జట్టు ఆశిస్తోంది.

పిచ్, వాతావరణం

స్టేడియంలో ఇదే తొలి అంతర్జాతీయ మ్యాచ్. పిచ్‌పై బౌన్స్ కొంత ఎక్కువగా కనిపిస్తోంది. అటు బ్యాటర్లు, ఇటు బౌలింగ్‌కూ అనుకూలం. వర్ష సూచన లేదు.

భారత జట్టుకు జరిమానా

న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో స్లో ఓవర్ రేట్ కారణంగా భారత జట్టుకు ఐసీసీ భారీ జరిమానా విధించింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా నిర్ణీత సమయంలో మూడు ఓవర్లు తక్కువగా వేసింది. దాంతో ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 60 శాతం కోత విధిస్తున్నట్లు రిఫరీ జవగల్ శ్రీనాథ్ ప్రకటించారు.

లలిత్ మాయాజాలం ఆంధ్ర ఘనవిజయం



లలిత్

న్యూఢిల్లీ: స్పిన్నర్లు లలిత్ మోహన్ (6/58), షోయబ్ ఖాన్ (3/54)ల బౌలింగ్ ప్రదర్శనతో ఆంధ్ర జట్టు గ్రూప్ 'బి' టాపర్ సౌరాష్ట్రను ఓడించింది. రంజీ ట్రోఫీలో ఆరో మ్యాచ్ ఆడిన ఆంధ్ర 150 పరుగుల తేడాతో సౌరాష్ట్రపై ఘనవిజయం సాధించింది. ఆంధ్రకిది మూడో గెలుపు. శుక్రవారం 343 పరుగుల లక్ష్యంతో 10/1 ఓవర్‌నైట్ స్కోరు వద్ద రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర 56.2 ఓవర్లలో 192 పరుగులకే ఆలౌటైంది. విశేష అనుభవజ్ఞుడైన చతేశ్వర్ పుజారా (91; 11 ఫోర్లు) మాత్రమే ఆంధ్ర స్పిన్నర్లను ఎదుర్కొన్నాడు. అయితే అవతలివైపు మరో బ్యాటర్‌ను నిలదొక్కుకోకుండా లలిత్, షోయబ్ పట్టుబిగించడంతో సౌరాష్ట్ర 200 పరుగులైనా చేయలేకపోయింది. 192 వద్ద పుజారా తొమ్మిదో వికెట్‌గా అవుట్ కాగానే అదేస్కోరు వద్ద ధర్మేంద్రసింగ్ (4)ను లలిత్ మోహన్ బౌల్డ్ చేయడంతో సౌరాష్ట్ర కథ ముగిసింది. ఈ మ్యాచ్‌లో లలిత్ మొత్తం 11 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో లలిత్‌కు ఐదు వికెట్లు లభించాయి.

5 గంటల 45 నిమిషాల్లో...

ముర్రే అసాధారణ విజయం



మెల్‌బోర్న్: ప్రపంచ మాజీ నంబర్‌వన్, బ్రిటన్ టెన్నిస్ స్టార్ ఆండీ ముర్రే ఏకంగా 5 గంటల 45 నిమిషాలపాటు పోరాడి ... ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రెండో రౌండ్ అడ్డంకిని దాటాడు. కొకినాకిస్ (ఆస్ట్రేలియా)తో జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ముర్రే 4–6, 6–7 (4/7), 7–6 (7/5), 6–3, 7–5తో గెలుపొంది మూడో రౌండ్‌లోకి చేరాడు. రెండు సెట్లు కోల్పోయి మూడో సెట్‌లో 2–5తో వెనుకబడిన దశ నుంచి ముర్రే అసాధారణరీతిలో పుంజుకొని గెలుపొందాడు. మెల్‌బోర్న్ సమయం ప్రకారం ఈ మ్యాచ్ గురువారం రాత్రి 10 గంటల 20 నిమిషాలకు మొదలై శుక్రవారం తెల్లవారుజాము 4 గంటల 5 నిమిషాలకు ముగియడం గమనార్హం. జొకోవిచ్, రాఫెల్ నాదల్ మధ్య 2012 ఫైనల్ (5 గంటల 53 నిమిషాలు) తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సుదీర్ఘంగా సాగిన రెండో మ్యాచ్ ఇదే కావడం విశేషం. తొలి రెండు సెట్లు కోల్పోయి ఆ తర్వాత వరుసగా మూడు సెట్లు నెగ్గి విజయం సాధించడం ముర్రేకిది 11వసారి కావడం మరో విశేషం. టెన్నిస్‌లో ఆ ఘనత సాధించిన తొలి ప్లేయర్‌గా ముర్రే నిలిచాడు.


మెద్వెదెవ్ అవుట్...



పురుషుల సింగిల్స్ విభాగంలో ఏడో సీడ్, 2021, 2022 రన్నరప్ మెద్వెదెవ్ (రష్యా) మూడో రౌండ్‌లోనే నిష్క్రమించారు. సెబాస్టియన్ కోర్డా (అమెరికా) 7–6 (9/7), 6–3, 7–6 (7/4)తో మెద్వెదెవ్‌ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరాడు. మూడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), ఆరోసీడ్ ఫీలిక్స్ అలియాసిమ్ (కెనడా) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. మహిళల సింగిల్స్ విభాగంలో ఆరో సీడ్ మరియా సాకరి (గ్రీస్), పదో సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా), 13వ సీడ్ డానియెలా కొలిన్స్ (అమెరికా) మూడో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్), మూడో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా), ఏడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 3–6, 5–7తో అలెగ్జాండర్ ఎర్లెర్–లుకాస్ మిడ్లెర్ (ఆస్ట్రియా) ద్వయం చేతిలో ఓడిపోయింది.

తగ్గేదేలే!

- ఢిల్లీలో కొనసాగుతున్న రెజ్లర్ల ధర్నా
- ఏడుగురు సభ్యులతో ఐఓఏ విచారణ కమిటీ ఏర్పాటు
- అధ్యక్ష పదవి నుంచి దిగిపోనన్న బ్రిజ్‌భూషణ్



బజరంగ్ / వినేశ్

న్యూఢిల్లీ: 'దంగల్'లో దిగితే ప్రత్యర్థుల పట్టుపట్టే రెజ్లర్లు ఇప్పుడదే పట్టుదలతో ధర్నా కొనసాగిస్తున్నారు. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)లో ఏళ్ల తరబడి తిష్టవేసుకొని లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను గద్దె దించేదాకా ధర్నా విరమించబోమని స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్, రవి దహియా, బజరంగ్ పూనియా, దీపక్ పూనియా స్పష్టం చేశారు. తమ ప్రాణాలకు ముప్పున్నా వెరువమని, అన్నింటికి సిద్ధపడే న్యాయ పోరాటానికి దిగామని చెప్పారు. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిని తొలగించడంతో పాటు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని వారంతా పట్టుబడుతున్నారు. కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌తో రెండు రోజులుగా పలు దఫాలుగా సాగుతున్న రెజ్లర్ల చర్చలు అసంపూర్తిగానే ముగిశాయి. గురువారం తెల్లవారుజాము వరకు మంత్రితో భేటీ అయిన రెజ్లర్ల బృందం శుక్రవారం రాత్రి కూడా సమావేశమైంది. అయితే బ్రిజ్‌భూషణ్‌పై తక్షణ చర్యల విషయంలో క్రీడాశాఖ, ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటంతో రెజ్లర్లంతా అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ప్రత్యేక కమిటీ వేసి విచారణ జరపాలన్న రెజ్లర్ల డిమాండ్‌కు అనుగుణంగా ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష వ్యవహరించారు. అత్యవసర భేటీ నిర్వహించి ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి న్యాయం చేస్తానని ఉష హామీ ఇచ్చారు. బీజింగ్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, మేటి బాక్సర్ విజేందర్ సింగ్ రెజ్లర్లు ధర్నా చేస్తున్న శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపాడు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దేశానికి పతకం తెచ్చిన రెజ్లర్లు లైంగిక వేధింపులకు గురవడం, న్యాయం కోసం రోడ్డెక్కటం సిగ్గుచేటని అన్నారు. ఇంతటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి (బ్రిజ్‌భూషణ్)పై ఇంకా చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని అన్నారు.

మేరీకోమ్ నేతృత్వంలో కమిటీ...

లైంగిక ఆరోపణల వ్యవహారంపై దర్యాప్తు చేయాలన్న స్టార్ రెజ్లర్ల డిమాండ్‌పై భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) స్పందించింది. అథ్లెట్ దిగ్గజం పీటీ ఉష నేతృత్వంలోని ఐఓఏ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సభ్యులు శుక్రవారం సాయంత్రం అత్యవసరంగా సమావేశమయ్యారు. ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉషతో పాటు ఈసీ సభ్యులైన మాజీ షూటర్ అభినవ్ బింద్రా, యోగేశ్వర్ దత్, సంయుక్త కార్యదర్శి కల్యాణ్ చౌబే, ప్రత్యేక ఆహ్వానితులుగా శివ కేశవన్ ఈ ఉన్నతస్థాయి భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా రెజ్లర్లు చేస్తున్నవి తీవ్రమైన ఆరోపణలు కావడంతో వీటిపై నిగ్గు తేల్చేందుకు దిగ్గజ మహిళా బాక్సర్ మేరీకోమ్ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఐఓఏ ప్రకటించింది. ఈ కమిటీలో లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, రెజ్లర్ యోగేశ్వర్ దత్, ఆర్చర్ డోలా బెనర్జీ, వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య అధ్యక్షుడు సహదేవ్ యాదవ్, ఇద్దరు న్యాయవాదులు తలీశ్ రే, శ్లోక్ చంద్రలతోపాటు మాజీ షట్లర్ అలక్‌నందా అశోక్ ఉన్నారు.

ఏజీఎం తర్వాతే బ్రిజ్‌భూషణ్ స్పందన



గోండా (ఉత్తర ప్రదేశ్): తీవ్రస్థాయిలో లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్‌భూషణ్ త్వరలోనే ఈ వ్యవహారంపై స్పందిస్తారని ఆయన కుమారుడు, గోండా నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే ప్రతీక్ భూషణ్ సింగ్ శుక్రవారం మీడియాతో అన్నారు. ప్రతీక్ మాట్లాడుతూ 'ఈ నెల 22న డబ్ల్యూఎఫ్ఐ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) జరుగుతుంది. ఇది ముగియగానే అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ తనపై వచ్చిన ఆరోపణలపై లిఖితపూర్వక ప్రకటన విడుదల చేస్తారు. ముందుగా ఈ వ్యవహారంపై డబ్ల్యూఎఫ్ఐ అనుబంధ రాష్ట్ర సంఘాలతో చర్చించాల్సి ఉంది. ఇందులో ఏ నిర్ణయం తీసుకున్నా... మీడియాకు తెలియజేస్తాం' అని అన్నారు.

క్లుప్తంగా...

న్యాక్ 'ఏ' గ్రేడ్‌తో పెరిగిన కీర్తిప్రతిష్టలు

వైవీయూ వీసీ ఆచార్య రంగా జనార్ధన



న్యాక్ అక్రెడిటేషన్ ధ్రువపత్రాలను ఐక్యూఏసీ సెల్ ప్రతినిధులకు అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం ఇటీవల సాధించిన న్యాక్ 'ఏ' గ్రేడ్‌తో విశ్వవిద్యాలయం కీర్తి ప్రతిష్టలు మరింత పెరిగాయని విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగా జనార్ధన పేర్కొన్నారు. న్యాక్ పంపిన ఇన్‌స్టిట్యూషనల్ గ్రేడ్, అలాగే అక్రెడిటేషన్ ధ్రువపత్రాలను రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్యతో కలిసి ఆయన ఐక్యూఏసీ సంచాలకులు డాక్టర్ ఎల్.సుబ్రహ్మణ్యం శర్మకు అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి న్యాక్ ఏ గ్రేడ్ రావడంలో కృషి చేసిన పూర్వపు వీసీ ఆచార్య మునగల సూర్యకళావతి, పూర్వపు రిజిస్ట్రార్ ఆచార్య డి.విజయ రాఘవప్రసాద్, పూర్వపు ఐక్యూఏసీ డైరెక్టర్ ఆచార్య ఎం.వి.శంకర్ తదితరుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శ్రీనివాస్, పాలకమండలి సభ్యురాలు ఆచార్య పుత్తా పద్మ, అకడమిక్ డీన్ ఆచార్య ఏజీ దాము, హ్యుమానిటీస్ డీన్ ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి, ప్రవేశాల సంచాలకులు ఆచార్య కె.గంగయ్య పాల్గొన్నారు.

యువతలో దేశం రూపురేఖలు మార్చే శక్తి

రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ స్వామీజీ సక్యతానంద మహర్షి



మాట్లాడుతున్న సక్యతానంద మహర్షి

కర్నూలు(సెంట్రల్): భారతదేశం రూపురేఖలు మార్చే శక్తి యువతకే ఉందని రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ స్వామీజీ సక్యతానంద మహర్షి అన్నారు. యువతీ, యువకులు బాధ్యతగా దేశ సేవలో పాల్గొనాలని, వివేకానందుడి భావాలు, ఆదర్శాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. శుక్రవారం కర్నూలులోని వెంకటరమణ కాలనీ వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ రాయలసీమ విభాగం ఆధ్వర్యంలో ఐదో భక్తి సమ్మేళనం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని సక్యతానంద, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్వామీజీ సక్యతానంద మాట్లాడుతూ 125 సంవత్సరాల కిందట ప్రారంభమైన రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్ దేశంలో భక్తి భావాన్ని పెంపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి కార్యక్రమానికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని టీజీ వెంకటేశ్ తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల హాల్ టికెట్లు సిద్ధం

సాక్షి, అమరావతి: జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)–2022–23 ఫిబ్రవరి 5న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి శుక్రవారం తెలిపారు. హాల్ టికెట్లను 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్'లో స్కూల్ లాగిన్లో అందుబాటులో ఉంచామన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు యూడైస్ కోడ్‌తో లాగిన్ అయి విద్యార్థుల హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసి వారికి అందించాలన్నారు.

'కృష్ణా జలాల'పై విచారణ మార్చి 14కు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా జలాల వాటాల పంపకం గురించి దాఖలైన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు మార్చి 14వ తేదీకి వాయిదా వేసింది. ఈ పిటిషన్లు శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి.రామసుబ్రమణియన్‌తో కూడిన ధర్మాసనం ముందుకువచ్చాయి. ఇతర పిటిషన్ల విచారణ సందర్భంగా ఈ అంశంపై తర్వాత విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది. ఏళ్ల తరబడి ఈ అంశం పెండింగ్‌లో ఉందని, విచారణ త్వరగా పూర్తిచేయాలని కర్ణాటక, మహారాష్ట్ర తరపు సీనియర్ న్యాయవాదులు శ్యామ్ దివాన్, నాఫడే కోరారు. మార్చి 14న కర్ణాటక దాఖలు చేసిన ఇంటర్‌లొకేటరీ అప్లికేషన్‌తోపాటు ఒరిజినల్ పిటిషన్‌లు అన్నింటినీ విచారిస్తామని ధర్మాసనం స్పష్టంచేసింది.

'బోగస్ ఓట్లపై చర్యలు తీసుకోండి'

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలోని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గం (ఎమ్మెల్సీ) ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లు అనేకం చేరాయని వాటిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు అన్నమయ్య జిల్లాకు చెందిన బి.మదన్‌మోహన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఎన్నికల కమిషన్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పీఎం గ్రీవెన్స్ పోర్టల్‌కు ప్రతిని పంపినట్లు తెలిపారు.

'సాఫ్ట్'గా పంటల మార్కెటింగ్

ప్రకృతి సాగు చేస్తూ 'గూగుల్ ఫామ్స్' ద్వారా మార్కెటింగ్ చేస్తున్న టెకీ





- కోతకు ముందే పంటలు, ధరల వివరాలు
- వినియోగదారులు బుక్ చేసుకున్న తరువాత డోర్ డెలివరీ
- 20కి పైగా కూరగాయలు, ఆకు కూరలు.. 10 రకాలకు పైగా పండ్ల సాగు

సాక్షి, అమరావతి: కర్నూలు జిల్లా జొహరాపురానికి చెందిన బాలభాస్కరశర్మ పదేళ్ల పాటు సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేశారు. తండ్రి మరణంతో కర్నూలు వచ్చేసిన ఆయన బెంగళూరు కేంద్రంగా ఉన్న ఓ కంపెనీలో ఇంటి నుంచే పని చేస్తున్నారు. కొలువును కొనసాగిస్తూనే.. కల్లూరు మండలం నాయకల్లు గ్రామంలో తనకున్న 8.50 ఎకరాల్లో 20 రకాల కూరగాయలు, ఆకు కూరలతో పాటు 10కి పైగా పండ్లను సాగు చేస్తూ వినూత్న రీతిలో మార్కెటింగ్ చేస్తున్నారు. ఎర్ర బెండ, నల్ల పసుపు, మామిడి అల్లం వంటి విభిన్న పంటలతో పాటు నిమ్మ, జామ, సీతాఫలం, మామిడి, అంజూర, నేరేడు, అరటి, మునగ, పాల సపోట, చెర్రీ, టమాటా, చెన్నంగి కొబ్బరి, ముల్లంగి, ఆకు కూరలను సాగు చేస్తున్నాడు. మధురై నుంచి ఎర్ర బెండ సీడ్‌ను, ఆయుర్వేద మందుల్లో ఎక్కువగా ఉపయోగించే నల్ల పసుపును మేఘాలయ నుంచి తెప్పించి నాటారు.

గూగుల్ ఫామ్స్ ద్వారా బుకింగ్

బాలభాస్కరశర్మ పండించిన పంటలన్నిటినీ గూగుల్ ఫామ్స్ ద్వారా మార్కెటింగ్ చేస్తున్నారు. వారానికి రెండుసార్లు కూరగాయలు, ఆకు కూరలు కోతకు వస్తుండగా.. కోతకొచ్చే రెండ్రోజుల ముందుగానే గూగుల్ ఫామ్స్‌లో తాను పండించే పంటలు, వాటి ధరల వివరాలను వినియోగదారులకు లింక్ ద్వారా పంపిస్తున్నారు. తమకు అవసరమైన వాటిని ఏ మేరకు కావాలో ఎంచుకొని.. ఆ వివరాలను వినియోగదారులు సబ్మిట్ చేయగానే బాలభాస్కరశర్మకు మెయిల్ మెసేజి వస్తుంది. ఆ వివరాలను ఎక్సెల్ షీట్‌లో క్రోడీకరించుకుని కోతలు పూర్తి కాగానే వాటి నాణ్యత కోల్పోకుండా ప్యాకింగ్ చేసి స్వయంగా డోర్ డెలివరీ చేస్తున్నారు. ఇలా కర్నూలులోని 3 అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్న వారికి తన పంటలను విక్రయిస్తున్నారు.

సాగులో ఆధునికత

కూరగాయలు, ఆకు కూరలను మల్చింగ్ విధానంలో భాస్కరశర్మ సాగు చేస్తున్నారు. మల్చింగ్ వల్ల భూమిలో తేమ ఆరిపోకుండా ఉండటమే కాకుండా నీరు ఆదా అవుతుంది. చీడపీడల బెడద కూడా ఉండదు. కూరగాయలు, ఆకు కూరలు మంచి నాణ్యతతో ఉంటాయి. మామిడి, ఇతర పండ్ల తోటలకు వేరుశనగ పొట్టుతో మల్చింగ్ చేస్తున్నారు. సాగులో ఎరువులు, పురుగుల మందులు వాడరు. పూర్తిగా గో ఆధారిత వ్యవసాయం కోసం 5 దేశీవాళీ ఆవులను పోషిస్తున్నారు. వాటిద్వారా వచ్చే జీవామృతం మొక్కలకు వేస్తారు. రసం పీల్చే పురుగుల నివారణకు వావిలాకు కషాయం, గొంగళి పురుగుల నివారణకు అగ్ని అస్త్రం, దశపర్ణి కషాయం, పుల్లటి మజ్జిగ, చీడపీడలకు నీమాస్త్రం, వేప, సీతాఫలం నూనెలు వాడుతున్నారు. పండ్ల తోటలకు నష్టం కలిగించే పండు ఈగల నివారణకు సోలార్ ట్రాప్స్, తెలుపు, పసుపు జిగురు అట్టలు ట్రాప్స్‌ను ఉపయోగిస్తున్నారు.

రసాయన అవశేషాలు లేని పంటల సాగే లక్ష్యం



రసాయన అవశేషాలు లేకుండా పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్నాను. వారానికి ఐదు రోజులు వ్యవసాయ క్షేత్రంలోనే ఉంటాను. క్షేత్రంలో ఓ కుటుంబానికి ఉపాధి కల్పిస్తున్నాను. మొదట్లో పండ్ల మొక్కలు నాటాను. ఆరు నెలలుగా కూరగాయలు, ఆకు కూరలు సాగు చేస్తున్నాను. వారానికి రెండుసార్లు అపార్ట్‌మెంట్స్‌లో విక్రయిస్తున్నాను. మంచి ఆదరణ లభిస్తోంది. పెట్టుబడికి తగినట్టుగా ఆదాయం వస్తుంది. – బాలభాస్కరశర్మ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, కర్నూలు

గూగుల్ ఫామ్స్‌ను వినియోగించడం వల్ల సొంత వెబ్‌సైట్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ అవసరం లేకుండా, ఒక్క పైసా కూడా ఖర్చు లేకుండా మొత్తం పంటల్ని విక్రయిస్తున్నారు.

మే మొదటి వారంలో పది ఫలితాలు!

▶ మొదటి పేజీ తరువాయి

రాయాల్సి ఉంటుంది. అనంతరం జీవశాస్త్రం ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.

మొత్తం 6.6 లక్షల మంది విద్యార్థులు

కాగా పదో తరగతి పరీక్షలకు ఇప్పటికే 6.6 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. వీరు రాసే సమాధానాల పత్రాలు 50 లక్షల వరకు ఉండనున్నాయి. ఈ నేపథ్యంలో ఏజెన్సీ జిల్లాలను మినహాయించి తక్కిన 23 జిల్లాల్లో మూల్యాంకన కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఒక్కో కేంద్రానికి కేటాయించే పరీక్షల సమాధాన పత్రాల సంఖ్య 2 లక్షల నుంచి 2.5 లక్షల వరకు మాత్రమే ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. గతంలో 13 జిల్లాల్లో మాత్రమే మూల్యాంకన కేంద్రాలు ఉండేవి. దీనివల్ల ఒక్కో జిల్లా కేంద్రంలో 4.5 లక్షల సమాధానాల పత్రాలను మూల్యాంకనం చేయాల్సి వచ్చేది. దీంతో భారీ ఎత్తున టీచర్లు అవసరమయ్యేవారు. అలాగే ఫలితాల వెల్లడిలోనూ ఆలస్యమయ్యేది. కేంద్రాల పెంపు వల్ల మూల్యాంకనాన్ని త్వరగా ముగించొచ్చని అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ 18న పదో తరగతి పరీక్షలు ముగియగానే అదే నెల 19 నుంచి 26 వరకు ఈ మూల్యాంకనాన్ని నిర్వహించేలా ఎస్ఎస్‌సీ బోర్డు షెడ్యూల్ విడుదల చేసింది. ఏప్రిల్ 22న రంజాన్ ఉండటంతో ఆ రోజు మూల్యాంకనం నుంచి ముస్లిం సిబ్బందికి మినహాయింపు ఇవ్వనున్నారు. మూల్యాంకనాన్ని 26న ముగించాక రెండు వారాల్లో వాటిని కంప్యూటరీకరించి ఫలితాల విడుదలకు చర్యలు చేపట్టనున్నారు.

తత్కాల్ ఫీజుతో పరీక్ష దరఖాస్తుకు అవకాశం..

పదో తరగతి పరీక్షలకు తత్కాల్ స్కీమ్ కింద పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పిస్తున్నామని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి తెలిపారు. ఈ నెల 23 నుంచి 26 వరకు తత్కాల్ స్కీమ్ కింద రూ.500 అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే రూ.1,000 అపరాధ రుసుముతో ఈ నెల 27 నుంచి 31 వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇదే చివరి అవకాశమని మరోసారి పొడిగింపు ఉండదని స్పష్టం చేశారు. ఏప్రిల్‌లో పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే వారికి మాత్రమే ఆ తర్వాత నిర్వహించే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అవకాశం ఉంటుందని వివరించారు.

జేఈఈ మెయిన్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పు

24 నుంచి ఫిబ్రవరి 1 వరకు కొనసాగింపు..
28న బీఆర్క్, బీప్లానింగ్ పరీక్ష

సాక్షి, అమరావతి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లు, తదితర జాతీయ విద్యా సంస్థల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్–2023 తొలివిడత పరీక్షల షెడ్యూల్‌లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) స్వల్ప మార్పులు చేసింది. ఈ పరీక్షలను జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహిస్తామని ప్రకటించింది. ముందుగా ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం జనవరి 24 నుంచి 31 వరకు జేఈఈ మెయిన్‌ను నిర్వహించనున్నట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే. తాజాగా సవరించిన షెడ్యూల్ ప్రకారం.. జనవరి 24, 25, 26, 27, 29, 30, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో జేఈఈ మెయిన్ నిర్వహిస్తారు. పేపర్–1 పరీక్షలు ఈ తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం జరుగుతాయి. జనవరి 28 మధ్యాహ్నం బీఆర్కిటెక్చర్, బీప్లానింగ్ కోర్సులకు పేపర్–2ఏ, పేపర్–2బీ నిర్వహిస్తారు.

పరీక్ష కేంద్రాల సమాచారం విడుదల..

కాగా జేఈఈ మెయిన్ తొలివిడత పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఏ పట్టణంలో పరీక్ష రాయాల్సి ఉంటుందో తెలియజేసే ముందస్తు సిటీ ఇంటిమేషన్ స్లిప్‌లను ఎన్‌టీఏ శుక్రవారం విడుదల చేసింది. అభ్యర్థులు ఏ పట్టణంలో పరీక్ష రాయాలో ముందుగా తెలుసుకునేందుకు మాత్రమే ఈ వివరాలు వెల్లడించింది. ఆయా పట్టణాల్లో ఏ పరీక్ష కేంద్రంలో, ఏ షిఫ్టులో పరీక్ష ఉంటుందో అడ్మిట్ కార్డుల్లో పొందుపర్చనున్నట్లు తెలిపింది. ఈ మేరకు అడ్మిట్ కార్డులను త్వరలో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. జేఈఈ మెయిన్ తొలివిడత పరీక్షలను దేశవ్యాప్తంగా 290 పట్టణాల్లో, విదేశాల్లో 25 నగరాల్లో నిర్వహించనున్నారు.

పోటీ ప్రపంచంలో నిలబడేందుకు సిద్ధమవ్వాలి..

- గిరిజనులకు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పిలుపు
- ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని ఎదగాలి
- గిరిజనుల విద్య, వైద్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



నెరవాడ వద్ద ట్రైబల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

సాక్షి ప్రతినిధి కర్నూలు: 'గిరిజనులు ఉన్నత విద్యనభ్యసించి, నైపుణ్యాలను మెరుగుపరుచుకుని పోటీ ప్రపంచంలో నిలబడేందుకు సిద్ధంగా ఉండాలి. స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ తీసుకోవాలి. గిరిజన విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. వీటిని వినియోగించుకుని గిరిజన యువత వృద్ధిలోకి రావాలి' అంటూ రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఆకాంక్షించారు. నంద్యాల జిల్లా పాణ్యం మండలంలోని నెరవాడ గిరిజన సంక్షేమ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. గిరిజనులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఆపై గిరిజనులతో ముఖాముఖి నిర్వహించి ప్రసంగించారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు వేల ఏళ్లుగా అభివృద్ధి చెందుతున్నాయని గవర్నర్ చెప్పారు. గిరిజన జీవన విధానం నుంచి సుస్థిరతను నేర్చుకోవచ్చన్నారు. ఆధునిక జీవన విధానాన్ని వారికి పరిచయం చేస్తూనే.. వారి సంప్రదాయ, సాంస్కృతిక విశిష్టతలు, పద్ధతులను సంరక్షిస్తూ, రెంటి మధ్యా సమానత్వాన్ని చూపించడం ప్రభుత్వం ముందున్న అతి పెద్ద సవాల్ అని చెప్పారు.

గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, రోడ్లు, విద్యుత్, చిన్న నీటి పారుదలశాఖను మెరుగుపరచడం తదితర చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటోందని గవర్నర్ చెప్పారు. అటవీ ఉత్పత్తులతో వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి మార్కెటింగ్ చేసి వారికి ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. గిరిజనులకు ప్రత్యేకంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మిస్తోందని, మెడికల్ కాలేజీలను తీసుకొస్తోందని, అలాగే ఆశ్రమ, గిరిజన, రెసిడెన్సియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి గిరిజనులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన నిధులతో గిరిజన ఆవాసాలకు రోడ్డు వేయడాన్ని గిరిజన సంక్షేమశాఖ ప్రాధాన్యతాంశంగా భావించాలని గవర్నర్ సూచించారు. ఆర్‌ఓఎఫ్ఆర్ ద్వారా అర్హులైన గిరిజనులకు పట్టాలివ్వాలన్నారు. వీరి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి.. అవసరమైతే కేంద్రానికి సలహాలు, సూచనలివ్వడం తన బాధ్యతగా గవర్నర్ హరిచందన్ చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంలు అంజాద్‌బాషా, రాజన్నదొర, ఎమ్మెల్సీ విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, ఆర్థర్, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, గిరిజన సంక్షేమశాఖ సెక్రటరీ కాంతిలాల్‌దండే, డైరెక్టర్ జాహ్నవి, కలెక్టర్ మనజీర్ జిలాన్ సామూన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో అభివృద్ధి

ప్రభుత్వ ప్రోత్సాహంతో పిల్లలను చదివించుకుంటున్నాం. నవరత్నాలతో ఆర్థికంగా బలపడుతున్నాం.. అంటూ నంద్యాల గిరిజన మహిళలు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌తో చెప్పారు. నంద్యాల జిల్లా నెరవాడ గిరిజన సంక్షేమ పాఠశాలలో ఆయన గిరిజనులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు ఆయనతో ముచ్చటించారు.

పిల్లలను బాగా చదివించుకుంటున్నాం..



మాది సుగాలీ తెగ. కొండలు, గుట్టల్లో ఆవులు, మేకలు కాస్తూ, కట్టెలు కొట్టుకుని జీవనం సాగించేవాళ్లం. ప్రభుత్వం గుర్తించి ఇళ్లు నిర్మించింది. పొలాలిచ్చింది. సంతోషంగా బతుకుతున్నాం. డ్వాక్రా గ్రూపుల్లో రూపాయి రూపాయి పొదుపు చేసుకుంటూ పిల్లలను ప్రభుత్వ బడుల్లో మంచిగా చదివించుకుంటున్నాం. – కాట్రావత్ సుగుణబాయి, పాణ్యం

ప్రభుత్వం మాకు అన్నీ ఇస్తోంది..



అయ్యా! మా పూర్వీకులు పంట పొలాలను నాశనం చేస్తున్న ఎలుకలు, పాములను పట్టేవాళ్లు. పాముల చర్మాలను తీసి వాటిని విక్రయించి జీవనం సాగించేవాళ్లు. ఆపై ప్రభుత్వం మాకు ఇళ్లు ఇచ్చింది. చదువులు చెప్పిస్తోంది. అమ్మ ఒడి, పింఛన్లు, రైతు భరోసా, చేయూత, ఆసరా, ఉచిత విద్యుత్ పథకాలతో పాటు తాగునీటినీ అందిస్తోంది. ఏ సమస్య వచ్చిన వలంటీర్ల ద్వారానే సమస్యను పరిష్కరించుకునే అవకాశం ఇచ్చింది. – ఇండ్ల ఉషారాణి, నంద్యాల

చెంచులను ప్రభుత్వం గుర్తించింది..



మేం చెంచులం. మా పెద్దలు నల్లమల కొండల్లో నివాసం ఉండేవారు. అప్పటితో పోల్చితే మేం చాలా అభివృద్ధి చెందినాం. దీనికి నవరత్నాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలే కారణం. గతంలో కొన్ని ఇళ్లు నిర్మించారు. కుటుంబాలు పెరుగుతున్నందున మాకు మరిన్ని ఇళ్లు కావాలి. చెంచులం ఉన్నామని ప్రభుత్వం గుర్తించింది. అందుకే నేను పాణ్యం మేజర్ పంచాయతీ సర్పంచ్‌నయ్యా. – మేకల పల్లవి, పాణ్యం

గిరిజనుల కమిషన్ ఏర్పాటు సంతోషకరం



ఎరుకుల జాతి బిడ్డను. మా పూర్వీకులు బుట్టలు అమ్ముకుంటూ, ఎరుక చెప్పుకుంటూ బతికేవాళ్లు. అమ్మ ఒడి, రైతుభరోసా, చేయూత, ఆసరా, పింఛన్లు మా గిరిజనుల అభివృద్ధికి బాగా ఉపయోగపడుతున్నాయి. ప్రత్యేకంగా గిరిజనుల కోసం కమిషన్ ఏర్పాటుచేశారు. ఇది మా అభివృద్ధికి దోహదపడుతుంది. – బైరి పావని, పసలపాడు, ఆళ్లగడ్డ నియోజకవర్గం



మెడ.. ఎంత పొడవో!

కృష్ణాజిల్లా కంకిపాడు మండలం ఈడ్పుగల్లు గ్రామ సమీపంలోని ఓ చెరువులో కనిపించింది ఈ అరుదైన కొంగ. పొడవాటి మెడతో ఉన్న ఈ కొంగను అటుగా వెలుతున్న వారంతా ఆసక్తిగా తిలకించారు.
– ఫొటో కందుల చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అయ్యన్న క్షమాపణలు చెప్పాలి

ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసులు



మాట్లాడుతున్న జనకుల శ్రీనివాసులు

నెల్లూరు (క్రైమ్): పోలీసులపై టీడీపీ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని, ఆయన వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నెల్లూరులో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జయంతి ఉత్సవాల సందర్భంగా టీడీపీ అధికారంలోకి వస్తే తాను హోం మినిస్టర్ అయితే షూట్ ఎట్ సైట్‌తో పోలీసుల సంగతి తేలుస్తానని అయ్యన్న మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రాజ్యాంగ వ్యవస్థలపై ఏ మాత్రం గౌరవం లేని ఇలాంటి వ్యక్తులను ఎమ్మెల్యేలుగా గెలిపిస్తే ప్రజల భద్రతకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందన్నారు. పోలీసుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మరో మారు వ్యవహరిస్తే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సంఘం గౌరవ సలహాదారు వై. శ్రీహరి మాట్లాడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న అయ్యన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్ల ముఖ్యమంత్రి అని చెప్పుకొనే మాజీ సీఎం చంద్రబాబునాయుడు కందుకూరు, గుంటూరు సభల్లో జరిగిన తొక్కిసలాటలో వాస్తవాలను దాచి పోలీసులను బాధ్యులను చేస్తూ మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ రెండు ఘటనలపై న్యాయవిచారణ జరుగుతోందని, త్వరలోనే వాస్తవాలు తెలుస్తాయని చెప్పారు. అప్పుడు చంద్రబాబు ఏమి సమాధానం చెబుతాడో చూడాలన్నారు. సంఘం కోశాధికారి సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అయ్యన్న పద్ధతి మార్చుకోకపోతే న్యాయపోరాటానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. నోరు అదుపులోకి పెట్టుకోకపోతే పోలీసు పవర్ చూపిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం లీగల్ అడ్వైజర్ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సైకోలా అయ్యన్న తీరు

ఆయన్ను పిచ్చాసుపత్రిలో చేర్చాలి: డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



సాక్షి, విశాఖపట్నం: టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు మానసిక వ్యాధితో సైకోలా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మండిపడ్డారు. అయ్యన్న కుటుంబ సభ్యులు ఆయన్ను ఏదైనా పిచ్చి ఆసుపత్రిలో చేర్చి వైద్యం చేయించాలని సూచించారు. టీడీపీ అధికారంలోకి వచ్చినట్లుగా, తనకు హోంమంత్రి పదవి ఇచ్చినట్లుగా ఊహించుకుంటూ పోలీసులపై చర్యలుంటాయని అయ్యన్న హాస్యాస్పదంగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. పోలీసులనే బెదిరిస్తున్నారంటే నిజంగా వారికి అధికారం వస్తే సామాన్యులను బతకనివ్వరని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి పదవిని గౌరవించాలని, నోరు అదుపులో పెట్టుకోకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం విశాఖలోని సర్క్యూట్ హౌస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

నిద్ర కరువై నోటికొచ్చినట్లు..

నర్సీపట్నంలో సీఎం సభకు వచ్చిన జనాలను చూసినప్పటి నుంచి అయ్యన్నకు నిద్ర పట్టక నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. అయ్యన్నకు మరోసారి దారుణ పరాభవం తప్పదు. వలంటీర్ల వ్యవస్థను టీడీపీ నేతలు విమర్శించడం సరికాదు. పార్టీలకతీతంగా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇవ్వడం తప్పా? లంచాల మాట వినబడకుండా వివక్ష లేకుండా అర్హత ప్రకారం సంక్షేమ కార్యక్రమాలు అందించడం తప్పా? సర్పంచ్‌ల అధికారాలకు జన్మభూమి కమిటీల ద్వారా చంద్రబాబు చెక్ పెట్టిన విషయం మరిచిపోయారా? భారతి సిమెంట్ గురించి మాట్లాడుతున్న అయ్యన్న హెరిటేజ్ గురించి ఎందుకు మాట్లాడటం లేదు?

ఎఫ్‌డీఆర్ టెక్నాలజీ రోడ్డు నిర్మాణంపై విషం చిమ్ముతున్న ఎల్లో మీడియా

ఏపీఆర్డీసీ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో నిర్మించిన గజ్జారం–హుకుంపేట రహదారిపై ఎల్లో మీడియా అవాస్తవాలను ప్రచారం చేస్తోందని ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్డీసీ) చైర్మన్ కనుమూరి సుబ్బరాజు దుయ్యబట్టారు. ఆయన శుక్రవారం కృష్ణాజిల్లా హనుమాన్‌జంక్షన్‌లో మాట్లాడుతూ 'నీళ్లా..? రసాయనమా..?' శీర్షికతో ఓ దినపత్రికలో ప్రచురించిన కథనాన్ని తీవ్రంగా ఖండించారు. నదీపరివాహక, సముద్రతీర ప్రాంతాల్లో తరచూ దెబ్బతింటున్న రోడ్లు దీర్ఘకాలం మన్నికగా ఉండేందుకు ఆధునిక ఫుల్ డెప్త్ రీసైకిలింగ్ (ఎఫ్‌డీఆర్) టెక్నాలజీతో రాష్ట్రంలో తొలిదశలో వెయ్యి కిలోమీటర్ల మేర రహదారులు అభివృద్ధి చేయాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ప్రయోగాత్మకంగా తూర్పుగోదావరి జిల్లాలో గజ్జారం–హుకుంపేట రోడ్డును గతేడాది నవంబర్‌లో ఏడుకిలోమీటర్ల మేర ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో నిర్మించామన్నారు. రోడ్ల నిర్మాణం, నాణ్యతను నిర్ధారించటంలో దేశంలోనే అతి పెద్ద సంస్థ సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (న్యూఢిల్లీ)కి చెందిన ప్రిన్సిపల్ శాస్త్రవేత్త అంబికా బెల్ సారథ్యంలోని నిపుణుల బృందం గజ్జారం–హుకుంపేట రోడ్డు నాణ్యతను పరిశీలించి అభినందించారని తెలిపారు. ఎఫ్‌డీఆర్ టెక్నాలజీలో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు వినియోగించిన రసాయనాల తయారీ సంస్థ కూడా సీఆర్ఆర్ఐ సర్టిఫైడ్ కంపెనీ అని చెప్పారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పలుచోట్ల పంచాయతీరాజ్ రోడ్లను ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో నిర్మించి పూర్తిగా విఫలమైందని, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధుల కక్కుర్తి, నాణ్యతప్రమాణాల వైఫల్యంతో పూర్తిగా అటకెక్కిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆధునిక ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో లిక్విడ్ కెమికల్ వినియోగించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన గజ్జారం–హుకుంపేట రోడ్డుకు సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రశంసలు లభించటంతో ఓర్వలేక ఎల్లోమీడియాను అడ్డుపెట్టుకుని అసత్యాలను ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ రహదారి నిర్మాణం కోసం న్యూఢిల్లీ నుంచి ప్రత్యేకంగా యంత్రాలను తెప్పించామని, దాదాపు రూ.1.20 కోట్ల సొంత నిధులు వెచ్చించానని ఆయన చెప్పారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at MNS Printers Private Limited, Survey No 76/1 Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943